సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 150

బుధవారం 20-8-2025




'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



**వైస్ కెప్టెన్‌గా గిల్**

ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టు ప్రకటన -14లో



**షఫాలీకి దక్కని చోటు**

మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీలో పాల్గొనే టీమిండియా ప్రకటన -14లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**బలపడుతున్న బంధం**

పరస్పర సహకారం, అభివృద్ధే లక్ష్యంగా 12 అంశాలపై ఉమ్మడిగా ముందుకెళ్లాలని భారత్, చైనా నిర్ణయించాయి.

- వివరాలు 6లో▶



**ఒక్కరోజే 30 సెం.మీ. వాన**

ముంబై వరుసగా రెండో రోజూ మునిగింది. మంగళవారం రికార్డు స్థాయిలో 30 సెంటీ మీటర్ల వర్షం కురిసింది.

- వివరాలు 6లో▶




**6 వేల విద్యార్థి వీసాలు రద్దు**

వివిధ నేరాలకు పాల్పడినందుకు శిక్షగా ఇప్పటిదాకా 6 వేల మంది విదేశీ విద్యార్థుల వీసాలను అమెరికా రద్దు చేసింది.

- వివరాలు 6లో▶



**అందాల 'మణి'క**

నవంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొనే భారత సుందరిగా మనిక విశ్వకర్మ ఎంపికైంది.

- వివరాలు 13లో▶

## న్యూస్‌రీల్

### విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తొలగించండి



విద్యుత్ స్తంభాలపై ప్రమాదంగా మారిన కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి అధికారులను ఆదేశించారు. కేబుల్ ఆపరేటర్లు నోటీసులకు స్పందించకపోవడంపై మండిపడ్డారు.

- వివరాలు 2లో▶

### దక్షిణ 'మహిళా' రైల్వే



దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధిలోని 11 ప్రధాన విభాగాలకుగాను ఐదు విభాగాలకు మహిళలే అధిపతులయ్యారు. ఇప్పటివరకు మూడు విభాగాలకు వారు నేతృత్వం వహిస్తుండగా తాజా బదిలీల్లో మరో రెండు విభాగాలను కూడా వారికే అప్పగించారు.

- వివరాలు 16లో▶

### ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం



ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలు అందించే ప్లాట్‌ఫాంలపై కేంద్రం నిషేధం విధించనుంది. ఈ మేరకు ఉద్దేశించిన 'రెగ్యులేషన్, ప్రమోషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్' బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

- వివరాలు 6లో▶

### శాఖల సమన్వయ లోపంతోనే సమస్యలు



రాష్ట్రంలో రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయ లోపంతోనే సమస్యలు వస్తున్నాయని.. వందల పిటిషన్లు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండటానికి వారే కారణమని హైకోర్టు మండిపడింది

- వివరాలు 2లో▶

# ఉపరాష్ట్రపతి బరిలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి




## ఇండియా కూటమి అభ్యర్థిగా ఎంపిక

### విపక్ష పార్టీల ఏకగ్రీవ నిర్ణయాన్ని ప్రకటించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

'ఏ రాజకీయ పార్టీతో నాకు సంబంధం లేదు. ఏ పార్టీలో నాకు సభ్యత్వం లేదు. రాజకీయాలతో సంబంధం లేని వారిని ఎన్నుకోవాలని వాళ్లు భావించినట్లుంది. రాబోయే రోజుల్లో అన్ని పార్టీల ఎంపీలను వ్యక్తిగతంగా కలిసి, నా అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని, ఓటు వేయాలని కోరతా. దేశ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడానికి నిరంతరం కృషి చేస్తా'. - ఢిల్లీలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

- ఈ ఎన్నిక 'సైద్ధాంతిక యుద్ధం' అంటూ అభివర్ణన
- ప్రజాస్వామ్యం సాధించిన గొప్ప విజయమని వ్యాఖ్య
- ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీ పడనున్న సుప్రీం మాజీ జస్టిస్
- నేడు నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు... సెప్టెంబర్ 9న ఎన్నికలు
- వ్యవసాయ కుటుంబంలో జన్మించి న్యాయ కోవిదుడిగా ఎదిగిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తాలూకా ఆకుల మైలారం ఆయన స్వగ్రామం

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అనూహ్య నిర్ణయం తీసుకుంది. విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బూచిరెడ్డి సుదర్శన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఇండియా కూటమి నేతలతో కలిసి ఈ మేరకు ప్రకటన చేశారు. దేశంలో రెండో అత్యున్నత పదవికి జరగనున్న ఈ ఎన్నికలను 'సైద్ధాంతిక యుద్ధం'గా ఖర్గే అభివర్ణించారు. అందుకే విపక్షాలన్నీ ఐక్యంగా పోటీ పడుతున్నాయన్నారు. కాగా అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పక్ష అభ్యర్థి, తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌తో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ పడనున్నారు. సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల కోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి, రాధాకృష్ణన్‌లు బుధవారం తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం మిగతా 3వ పేజీలో ▶




**రాజ్యాంగ పరిరక్షకులు, రాజ్యాంగ వ్యతిరేకుల మధ్య ఎన్నిక**

- తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పక్షాలన్నీ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి
- ఆత్మప్రబోధనానుసారం ఓటేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

3లో

మంగళవారం ఓయూలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్‌కు 50వ ఓయూ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్) డిగ్రీ పట్టాను అందచేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఓయూ వీసీ ప్రొ.కుమార్



# 40 అంతస్తులంత జంబో రాకెట్

## 75 టన్నుల పేలోడ్ మోసుకెళ్లగల సామర్థ్యం

- భారీ రాకెట్‌ను రూపొందిస్తున్నామన్న ఇస్రో చైర్మన్
- ఈ ఏడాది నావిక్ ఉపగ్రహం.. ఎ1 రాకెట్ ప్రయోగాలు
- మూడేళ్లలో స్పేస్‌లో మన రాకెట్లు మూడింతలు
- ఉపగ్రహాల తయారీలో బలమైన శక్తిగా భారత్
- ఓయూ 84వ స్నాతకోత్సవంలో డా.నారాయణన్ వెల్లడి
- నైపుణ్యాల కేంద్రం ఓయూ: గవర్నర్

ఉస్మానియా యూనివర్సిటీ/షాద్‌నగర్ రూరల్/ఖైరతాబాద్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 40 అంతస్తుల భవనమంత పొడవైన రాకెట్‌ను నిర్మిస్తోందని, అది 75 టన్నుల పేలోడ్‌ను తక్కువ ఎత్తులోని భూకక్ష్యలోకి మోసుకెళ్లగలదని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ తెలిపారు. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ ఏడాది ఇస్రో నావిక్ ఉపగ్రహం , ఎన్ 1 రాకెట్ వంటి ప్రయోగాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భారతీయ రాకెట్ ద్వారా 6,500 కిలోల బరువైన అమెరికన్ కమ్యూనికేషన్ మిగతా 2వ పేజీలో ▶

# పీసీ ఘోష్ నివేదిక నిలిపేయండి

## కాళేశ్వరంపై కమిషన్ నివేదిక ఏకపక్షం, చట్టవిరుద్ధం



- బీఆర్‌ఎస్ సర్కార్‌ను ముద్దాయిగా చూపే ప్రయత్నం
- నివేదిక కాపీ మాకివ్వమంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు
- ఆ కమిషన్‌కు విచారణార్హత లేదు.. నివేదికను కొట్టివేయాలి
- మాకు నోటీసులివ్వకుండా ఆదేశాలు జారీ చేయండి
- వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన మాజీ సీఎం, మాజీ మంత్రి
- నేడో రేపో సింగిల్ జడ్జి విచారణ చేపట్టే చాన్స్



- వివరాలు 2లో

# సర్కారీ ఉద్యోగుల జంగ్ సైరన్

## ప్రభుత్వం తీరును నిరసిస్తూ అక్టోబర్ 12న చలో హైదరాబాద్

- ఉద్యోగుల జేఏసీ నిర్ణయం
- సెప్టెంబర్‌లో బస్సు యాత్రలు.. లక్ష మంది ఉద్యోగుల సమీకరణ
- 63 డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ఖరారు
- వేచి చూశాం... ఓపిక నశించిందన్న జేఏసీ నేతలు



- వివరాలు 2లో

# నెహ్రూ వల్ల రెండుసార్లు దేశ విభజన


### సింధూ నది జలాల ఒప్పందంతో భారత్‌కు తీవ్ర నష్టం



- 80% జలాలను పాకిస్తాన్‌కు అప్పగించారు
- నెహ్రూ హయాంలో జరిగిన తప్పిదాలను సరి చేస్తున్నాం
- ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- సి.పి.రాధాకృష్ణన్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని విపక్షాలకు విజ్ఞప్తి

6లో

# జెలెన్‌స్కీతో స్వయంగా మాట్లాడతా



- ఉక్రెయిన్ అధ్యక్షుడితో నేరుగా చర్చలకు సిద్ధమైన రష్యా అధ్యక్షుడు పుతిన్
- వివరాలు వెల్లడించిన అమెరికా విదేశాంగ మంత్రి రూబియో
- జెలెన్‌స్కీ, పుతిన్ భేటీ తర్వాతే త్రైపాక్షిక సమావేశం: ట్రంప్
- ఇరువురు నేతలకు అనువైన నగరంలోనే తొలుత వారు సమావేశమవుతారని వెల్లడి

6లో



## ఇదండీ సంగతి




కంగారు పడక్కర్లేద్సార్! అది అమెరికాలో!!

# యూరియా... ఏదయా..!

## రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన డిమాండ్

- రోడ్డెక్కుతున్న రైతులు.. భారీ వర్షంలోనూ షాపుల ఎదుట క్యూలు
- సరిపడా యూరియా, మిగతా ఎరువులు ఉన్నాయంటున్న అధికారులు
- ప్రస్తుతం 50 వేల మెట్రిక్ టన్నులు కూడా నిల్వ లేదనే సమాచారం
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో తీవ్ర కొరత!.. సరఫరా తగ్గడం, ప్రైవేటు డీలర్లు పక్కదారి పట్టించడమే కారణం?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 14 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు. 7.4 లక్షల ఎకరాల్లో వరి, 5 లక్షల ఎకరాల్లో పత్తి, సుమారు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 50 వేల ఎకరాల్లో పప్పు దినుసులు, నూనె గింజలు, ఇతర పంటలు వేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఇందుకోసం జూలైలో 43,690 టన్నుల యూరియా అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకు 30,156 టన్నులే సరఫరా కావడంతో ఈ జిల్లాల్లో యూరియా కోసం నిత్యం పోరాటం సాగుతోంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ సీజన్ ముగిసేసరికి పత్తి, వరి, కంది, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు మొత్తం 18.92 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ఈ మేరకు 1,17,725 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటి వరకు 81,312 మెట్రిక్ టన్నులే సరఫరా అయ్యాయి,. ఇంకా 37,195 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉండగా రైతులు రోజూ దుకాణాల ఎదుట క్యూ కడుతున్నారు.

12లో



జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు పీఏసీఎస్ ఎదుట పాసుబుక్కులు క్యూలో పెట్టిన రైతులు

## క్లుప్తంగా...

### హరిచందన, చౌహాన్‌లపై చర్యలు తీసుకోండి

**కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు**



జితేంద్రసింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేశ్‌రెడ్డి, వద్దిరాజు, దాసోజు, ప్రవీణ్, సుమన్

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌లపై ఆల్ ఇండియా సర్వీస్ ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కేంద్రాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ.. ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పుదారి పట్టించేలా ఈ ఇద్దరు అధికారులు వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర సిబ్బంది, ప్రజావ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్‌తో బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్.సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ బాల్క సుమన్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు భేటీ అయ్యారు. ఈనెల 1న తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ చేపట్టిందని, ఆ కార్యక్రమంలో ఆ ఇద్దరు అధికారులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును విమర్శించారని కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశారు.

**యూరియా సమస్యను పరిష్కరించండి**

తెలంగాణలో నెలకొన్న ఎరువుల కొరతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. యూరియా కొరత కారణంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్, ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జే.పీ.నడ్డాను తమ పార్టీ ఎంపీలు కలిసి సమస్య తీవ్రతను వివరిస్తామని వద్దిరాజు చెప్పారు.

### ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయండి

**అఖిల భారత ఓసీ సంఘం డిమాండ్**

సాక్షి, న్యూఢిల్లీ: అగ్రవర్ణాల పేదల కోసం జాతీయస్థాయిలో ఈడబ్ల్యూఎస్ కమిషన్‌తో పాటు.. కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత ఓసీ సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించింది. ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందక.. అగ్రవర్ణాల్లోని పేదలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నారని విమర్శించారు. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెంజర్ల మహేందర్ రెడ్డి, ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు నీరుడు దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

### తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయండి

**కేంద్ర విద్యా మంత్రికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ లేఖ**



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. అసోంలోని గౌహతిలో కొత్త ఐఐఎం ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. దేశంలో ఇప్పటివరకు 22 ఐఐఎంలు ఉన్నా.. తెలంగాణలో ఒక్క ఐఐఎం కూడా లేదని ఆయన ఎత్తిచూపారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలోనే అప్పటి సీఎం కేసీఆర్, ప్రధాని నరేంద్రమోదీని కలిసి తెలంగాణలో ఐఐఎం ఏర్పాటుపై అభ్యర్థించారని గుర్తు చేశారు. తాను పార్లమెంట్‌లో ఈ అంశంపై పలుమార్లు లేవనెత్తానని పేర్కొన్నారు.



# పీసీ ఘోష్ నివేదిక నిలిపేయండి

## హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ నివేదికను నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. నివేదిక నేపథ్యంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోకుండా, అమలు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ కేసీఆర్‌తో పాటు మాజీమంత్రి హరీశ్‌రావు మంగళవారం వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం–1952 ప్రకారం ప్రభుత్వం తమకు నోటీసులు జారీ చేయకుండా ఆదేశాలివ్వాలని ఉన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. కమిషన్‌కు విచారణార్హత లేదని, నివేదికను కొట్టివేయాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ కార్యదర్శి, కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ ఘోష్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

**కాపీ ఇవ్వకుండా పదేపదే ఆరోపణలు**

'నివేదిక కాపీని మాకు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 8న లేఖ రాసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. నివేదిక మా పరువుకు నష్టం కలిగించేలా ఉందని ఈ నెల 4న మీడియా సమావేశంలో మంత్రి వెల్లడించిన విషయాల ద్వారా తెలుస్తోంది. మమ్మల్ని ముద్దాయిలుగా చిత్రీకరిస్తూ, కాపీని ఇవ్వకుండా.. పదేపదే మీడియా ముందు మా ప్రతిష్టను దిగజార్చేలా మంత్రులు ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వాన్ని, పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న నన్ను ఎటువంటి సమర్థనీయమైన ఆధారం లేకుండా అప్రతిష్టపాలు చేసే రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రతివాదులు జీవో 6ను జారీ చేశారు.

**నిబంధనల మేరకే బరాజ్‌లు.. అన్నీ పరిశీలించాకే కేంద్రం అనుమతులు**

ఏడు జిల్లాలకు తాగు, సాగునీటిని అందించడానికి 160 టీఎంసీల గోదావరి నీటిని వినియోగించి కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి నిబంధనల మేరకు రూపకల్పన చేసి నిర్మించాం. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేకపోవడంతో బరాజ్ నిర్మాణాన్ని మరో చోటికి మార్చాలనే నిర్ణయం సహా ప్రతి అంశంపై కేబినెట్ ఆమోదం తర్వాతే చర్యలు చేపట్టాం. 13 జిల్లాలకు నీరందించేలా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్ద బరాజ్‌లకు ప్రతిపాదనల నుంచి నిర్మాణం వరకు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కేంద్రం అనుమతి మంజూరు చేసింది' అని కేసీఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

**దురుద్దేశపూరితంగానే కమిషన్**

'ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటి నుంచే కాంగ్రెస్ కాళేశ్వరాన్ని అప్రతిష్టపాలు చేస్తూ వస్తోంది. అధిక వర్షపాతంతో మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగడం దురదృష్టకరం. దీనికి బరాజ్ రూపకల్పన, ఇంజనీరింగ్‌తో సంబంధం లేదు. అయినా బీఆర్ఎస్ సర్కార్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం ప్రారంభించింది. చట్ట విరుద్ధంగా, ఏకపక్షంగా, దురుద్దేశపూరితంగా న్యాయవిచారణ కమిషన్ నియమించింది. అయినా ప్రజాజీవితంలో సమగ్రత, నిజాయితీకి కట్టుబడి ఉన్నందున కమిషన్ ముందు హాజరయ్యాం. నివేదిక పూర్తయిన తర్వాత మాకు ఇవ్వకుండా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరుతో మీడియాకు విడుదల చేసింది. దీన్ని పరిశీలిస్తే.. నివేదిక ఏకపక్షమని వెల్లడవుతోంది. విచారణ కమిషన్ చట్టంలోని నిబంధనలనే కాకుండా, చట్టబద్ధత, ప్రాథమిక సూత్రాలను కమిషన్ ఉల్లంఘించింది.

**ఎన్నికల్లో లబ్ధి కోసం..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి మంత్రులు మా ప్రతిష్టను కించపరిచేలా మీడియా ద్వారా దాడి ప్రారంభించారు. 'పరిపాలనా అనుమతుల నుంచి నిర్మాణం వరకు అక్రమాలు జరిగాయి.. అవకతవకలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వారే బాధ్యులు.. ఇది ప్రభుత్వ నిర్ణయం కాదు, వ్యక్తుల నిర్ణయం.. నాటి సీఎం సూచన మేరకే బరాజ్ స్థలాలు ఎంపిక చేశారు.. నిపుణుల కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకోలేదు.. రూ.259 కోట్ల పరిపాలనా ఆమోదాన్ని కేబినెట్ ముందుంచలేదు.. సీఎం, హరీశ్ ఆదేశాల మేరకే జారీ చేశారు.. ఖజానాపై అదనపు భారం పడింది..' లాంటి వాక్యాలను నివేదికలో పేర్కొనడం పరిశీలిస్తే.. కమిషన్ కావాలనే మాకు వ్యతిరేకంగా విచారణ సాగించినట్లు తేటతెల్లం అవుతోంది. మాతో పాటు నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను బాధ్యుడిగా పేర్కొనడం హాస్యాస్పదం. నివేదికను పరిశీలిస్తే.. పిటిషనర్లపై తప్పుడు భావనతో, ముందస్తు ప్రణాళికతో కమిషన్ విచారణ జరిపినట్లు తెలుస్తోంది. విచారణకు హాజరైన నాటి మంత్రుల వాదనను కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. ఏకపక్ష నివేదికను రద్దు చేయాలి..'అని పిటిషన్లలో కేసీఆర్, హరీశ్ కోరారు.

### ఇదీ నేపథ్యం..

ప్రస్తుతం స్క్రూటినీ దశలో ఉన్న ఈ పిటిషన్లకు రిజిస్ట్రీ నంబర్ కేటాయించాల్సి ఉంది. ఒకట్రెండు రోజుల్లో ఇవి సింగిల్ జడ్జి వద్ద విచారణకొచ్చే అవకాశముంది. కాళేశ్వరంలో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో నిర్లక్ష్యం, లోపాలు, అవకతవకలపై న్యాయ విచారణ జరపాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం..2024 మార్చి 14న పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. జూలై 31న కమిషన్ నివేదిక సమర్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలకు.. కేసీఆర్, హరీశ్, ఈటల కారణమని నివేదిక తేల్చినట్లు మంత్రి ఉత్తమ్ ప్రకటించగా.. ఈ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చించిన తర్వాత ఏం చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# 40 అంతస్తులంత జంబో రాకెట్

▶ మొదటి పేజీ తరువాయి

ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. 'దివంగత మాజీరాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం తయారు చేసిన మొదటి లాంచర్ 17 టన్నుల బరువు ఉండేది. దాని ద్వారా 35 కిలోల పేలోడ్‌ను భూమి దిగువ కక్ష్యలోకి పంపారు. ఈ రోజు మనం 75 వేల కిలోల పేలోడ్‌ను పంపగల రాకెట్‌ను తయారు చేస్తున్నాం. ఈ సంవత్సరం ఇస్రో భారత నావికాదళం కోసం నిర్మించిన మిలిటరీ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీఎస్ఏటీ –7 ఆర్‌ను ప్రయోగించాలని ప్రయత్నిస్తున్నాం. ఇది ప్రస్తుత జీఎస్ఏటీ –7 (రుక్మిణి) ఉపగ్రహం స్థానంలో సేవలందిస్తుంది. ప్రస్తు తం అంతరిక్షంలో భారత్‌కు 55 ఉపగ్రహాలున్నాయి. రాబోయే నాలుగేళ్లలో ఆ సంఖ్య మూడు రెట్లు పెరుగుతుంది'అని వెల్లడించారు.

**ఉపగ్రహాల తయారీలో బలమైన శక్తిగా భారత్**

ఇతర దేశాల కోసం క్షిపణులు తయారు చేసే స్థాయికి భారత్ ఎదిగిందని నారాయణన్ తెలిపారు. అబ్దుల్ కలామ్ కృషి, పట్టుదల వల్ల ఉపగ్రహాల తయారీలో ఎంతో పురోగతి సాధించామన్నారు. తొలిసారి 1980లో ఎస్ఎల్వీ–3 క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్లు వివరించారు. నాటి నుంచి చంద్రయాన్–3 వరకు ఇస్రో ప్రయోగాలు విజయవంతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో చంద్రయాన్ –4 చేపట్టనున్నట్లు ప్రకటించారు. తన 41 సంవత్సరాల సర్వీసులో ఎన్నో ప్రయోగాలు చేసి టీం వర్క్‌తో అనేక విజయాలు సాధించినట్లు తెలిపారు. పరిశ్రమల కోసం ప్రపంచంలోనే తొలిసారిగా ఇస్రో శాటిలైట్‌ను ప్రయోగించనున్నట్లు వెల్లడించారు. అక్షరాస్యత, వైద్యం, విద్యుత్, ఆహార ఉత్పత్తులు, రైల్వేలు, విమానయాన సర్వీసులు, టెలిఫోన్, ఆర్థిక రంగంతోపాటు మౌలిక వసతులు, రవాణా తదితర రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించామని, ప్రధాని మోదీ నాయకత్వంలో 2035 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

**నైపుణ్యాలకు నెలవుగా ఓయూ: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

ప్రపంచవ్యాప్తంగా ఓయూ పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వించదగ్గ విషయమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. విజ్ఞానం, పరిశోధనలతోపాటు విభిన్న రంగాల్లో నైపుణ్యాలకు ఓయూ నెలవుగా ఉందని ప్రశంసించారు. భారతదేశ అంతరిక్ష కార్యక్రమానికి నారాయణన్ చేసిన కృషిని గవర్నర్ కొనియాడారు. స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. అనంతరం 121 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 1,261 మందికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలను అందచేశారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్నవారిలో ఉన్నారు.

**ఎన్ఆర్ఎస్సీని సందర్శించిన ఇస్రో చైర్మన్**

రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం శివారులో ఉన్న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌ను (ఎన్ఆర్ఎస్సీ) మంగళవారం సాయంత్రం ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ సందర్శించారు. సుమారు రెండు గంటలపాటు అధికారులు, శాస్త్రవేత్తలతో చర్చించారు. హైదరాబాద్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్‌ను కూడా ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

### 'ఇందిరమ్మ'తో ఉపాధి హామీ పథకం అనుసంధానం


**స్వచ్ఛభారత్ మిషన్ కూడా..**

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్‌తో ఇందిరమ్మ గ్రామీణ ఇళ్ల పథకాన్ని అనుసంధానిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఉపాధి హామీ జాబ్ కార్డు పొందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు.. ఆయా పథకాల కింద ఇప్పుడు ఆర్థికసాయం మంజూరవుతోంది. ఇందిరమ్మ పథకం కింద ఒక్కొక్క యూనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తుండగా, ఈ రెండు పథకాలతో అనుసంధానం వల్ల.. కేంద్రం నుంచి వచ్చే నిధులను రాష్ట్రం తన నిధులకు జోడించుకుంటుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద రాష్ట్రానికి మంజూరయ్యే ఇళ్ల సంఖ్యకు సరిపడా ఈ మొత్తం కూడా అందుతుంది. ఉపాధి హామీ కింద రూ.27 వేలు, స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.12 వేలు.. వెరసి రూ.39 వేలు ఒక్కొక్క ఇంటికి కేంద్రం నుంచి అందుతాయి. అంతమేర రాష్ట్రప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుంది. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుదారులకు ఈ మొత్తాన్ని.. 90 పనిదినాలకు వీలుగా విభజించి కేటాయిస్తారు. బేస్‌మెంట్ పూర్తయితే 40 ఉపాధి హామీ పథకం పనిదినాలుగా, రూఫ్ లెవల్ వరకు పూర్తయితే.. 50 పని దినాలుగా లెక్కించి.. ఒక్కొక్క పని దినానికి రూ.300 చొప్పున చెల్లిస్తారు.

# శాఖల సమన్వయ లోపంతోనే సమస్యలు

## రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు అసహనం

- సర్కార్‌లోని ఒక్కోశాఖ ఒక్కోలా వ్యవహరిస్తే ఎలా?
- దశాబ్దాలుగా భూ సమస్యలు తేలకుండా కోర్టు సమయం వృథా
- అధికారులపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయ లోపంతోనే సమస్యలు వస్తున్నాయని.. వందల పిటిషన్లు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండటానికి వారే కారణమని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వంలోని ఒక్కో శాఖ ఒక్కోలా వ్యవహరిస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాకు సంబంధించిన పిటిషన్లన్నింటినీ అనుమతించి.. అవసరమైతే భూ సేకరణ చేసుకోమని సర్కార్‌కు ఆదేశాలు జారీ చేస్తేనే సమస్యకు పరిష్కారం సాధ్యమవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. 'రెవెన్యూ అధికారులు పట్టాదార్ పాసుపుస్తకాలిస్తూ ఉంటారు.. మున్సిపల్ అధికారులు నిర్మాణాలకు అనుమతిస్తారు.. నీటిపారుదల అధికారులేమో నీటి ప్రవాహ మార్గమని, ఎఫ్‌టీఎల్ అని, బఫర్‌జోన్ అని చెబుతుంటారు. దశాబ్దాలు గడుస్తున్నా వివాదాలు మాత్రం పరిష్కారం కావడం లేదు'అని వ్యాఖ్యానించింది. చెరువు నీరు ప్రవహించే మార్గమైతే పాస్ పుస్తకాలు ఎలా జారీ చేశారని అడిగింది. జవహర్‌నగర్ కాంపౌండ్ వాల్ తొలగింపుపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. జవహర్‌నగర్ కాంపౌండ్ వాల్‌ను కూల్చివేసి డ్రైనేజీ, మురుగునీటిని తన భూమిలోకి అనుమతిస్తూ నీరుపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్ణయం తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ కాచిగూడకు చెందిన పల్లె నర్సింహారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి నిరాకరించారు. మునక నుంచి బయటపడేందుకు ప్రహరీ కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. సమస్యను తెలియజేస్తూ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించాలని పిటిషనర్‌కు సూచించారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

### పార్కింగ్ వసతి ఉంటేనే ఫ్లాట్ కొనండి

బిల్డర్లు 10 ఫ్లాట్లకు అనుమతి తీసుకుంటారు.. వీరికి పార్కింగ్ స్థలం ఉంటుంది.. అనధికారికంగా మరో 4 ఫ్లాట్లు నిర్మిస్తారు.. మరి వారికి పార్కింగ్ ఎలా ఇస్తారు? ప్రజలు ముందుగా పార్కింగ్ సదుపాయం చూసుకున్న తర్వాతే ఫ్లాట్లు కొనుగోలు చేయాలని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లో చాలా భవనాలకు పార్కింగ్ వసతి లేకపోవడం అతి పెద్ద సమస్యగా మారిందన్నారు.హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పార్కింగ్ సమస్యపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా వేశారు.

# సర్కారీ ఉద్యోగుల జంగ్ సైరన్

## ప్రభుత్వం తీరును నిరసిస్తూ అక్టోబర్ 12న చలో హైదరాబాద్

- ఉద్యోగుల జేఏసీ నిర్ణయం
- సెప్టెంబర్‌లో బస్సు యాత్రలు.. లక్ష మంది ఉద్యోగుల సమీకరణ
- 63 డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ఖరారు
- వేచి చూశాం... ఓపిక నశించిందన్న జేఏసీ నేతలు



విలేకరులతో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్. చిత్రంలో ఏలూరు శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగులు జంగ్ సైరన్ మోగించారు. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టబోతున్నట్టు ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రకటించింది. టీఎన్‌జీవో భవన్‌లో మంగళవారం జేఏసీ విస్తృత స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మిక, పెన్షనర్లకు చెందిన 206 సంఘాల నేతలు సమావేశంలో పాల్గొన్నారు. అక్టోబర్ 12న లక్ష మంది ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జేఏసీ సమావేశం తీర్మానించింది. సెప్టెంబర్ 1న విద్రోహ దినంగా మొదలయ్యే ఆందోళన, జిల్లాల్లో బస్సు యాత్రలు చేపట్టాలని, అంతిమంగా జంగ్ సైరన్‌తో చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని నిర్ణయించింది. 63 డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణను జేఏసీ ఖరారు చేసింది. సమావేశ వివరాలను జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు మీడియాకు వివరించారు.

**ప్రభుత్వంపై నమ్మకం పోయింది**

ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలిచ్చిన ప్రభుత్వం రెండేళ్లవుతున్నా ఉద్యోగుల సమస్యలపై ఏమాత్రం దృష్టి పెట్టలేదని మారం జగదీశ్వర్ అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేబినెట్ సబ్ కమిటీల చుట్టూ తిరిగినా ప్రయోజనం కన్పించలేదన్నారు. రెండేళ్లయినా పీఆర్సీ కమిటీ నివేదిక ఏమైందో తెలియదన్నారు. జేఏసీ నేతలు వెళ్లినా గుర్తుపట్టలేని స్థితిలో మంత్రులు ఉండటం దారుణమన్నారు. ప్రతి నెలా 1న వేతనం ఇవ్వడమే గొప్పగా చెబుతున్న ప్రభుత్వం, తాము కష్టపడి పనిచేస్తేనే జీతం ఇస్తున్నారనే వాస్తవాన్ని విస్మరించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు రాక, ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునే దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి అంటే పిల్లనివ్వడానికి వెనుకాడుతున్నారన్నారు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయి, ఓపిక నశించి, రాజకీయాలకు అతీతంగా ఉద్యమానికి సిద్ధమవుతున్నామని జగదీశ్వర్ తెలిపారు. లక్ష్యం నెరవేరే వరకూ ఎవరికీ భయపడేది లేదన్నారు.

**ఉద్యోగుల వాణి విన్పిస్తాం**

రాష్ట్రంలోని ఉద్యోగులందరినీ ఏకం చేస్తామని, తమ ఆగ్రహాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామని జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంటోందని, తాము కూడా వారి ఆగ్రహాన్ని కట్టడి చేయలేమన్నారు. సెప్టెంబర్ 1న పాత పెన్షన్ సాధన సదస్సును హైదరాబాద్‌లో చేపడతామని తెలిపారు. వచ్చేనెల 8 నుంచి జిల్లాల్లో బస్సు యాత్రలు చేపడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో పలు ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల, గెజిటెడ్ అధికారుల సంఘాలు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

### ప్రధాన డిమాండ్లు ఇవీ..

పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను తక్షణమే విడుదల చేయాలి. ఈహెచ్ఎస్ ఆరోగ్య పథకం నిబంధనలు రూపొందించాలి. కేబినెట్ సమావేశంలో ఆమోదించిన విధంగా నెలకు రూ.700 కోట్ల పెండింగ్ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించాలి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు ఆదేశాలివ్వాలి. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలి. గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టీఎన్జీవోలకు కేటాయించాలి. శాఖల్లో పదోన్నతుల కమిటీలను ఏర్పాటు చేసి ప్రమోషన్లు ఇవ్వాలి.

### సీఎంతో దర్శకుడు సుకుమార్ భేటీ



సీఎం రేవంత్‌తో సుకృతివేణి, సుకుమార్-తబిత దంపతులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లో ని ఆయన నివాసంలో.. మంగళవారం సినీ దర్శకుడు సుకుమార్ దంపతులు, నిర్మాత యలమంచిలి రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. 'గాంధీ తాత చెట్టు'సినిమాకు ఉత్తమ బాల నటిగా జాతీయ అవార్డు పొందిన సుకుమార్ కూతురు సుకృతివేణి.. ఈ సందర్భంగా సీఎం రేవంత్ సన్మానించి అభినందనలు తెలిపారు.

### విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తొలగించండి

**అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ స్తంభాలపై ప్రమాదంగా మారిన కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వైర్లను తొలగించాలని కేబుల్ ఆపరేటర్లకు ఏడాదిగా నోటీసులు ఇస్తున్నా స్పందించకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైర్ల వల్ల ప్రజల ప్రాణాలకే ప్రమాదం వాటిల్లడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. ఇక ఏమాత్రం ఉపేక్షించాల్సిన అవసరం లేదని, బలవంతంగా తొలగించే కార్యక్రమం చేపట్టాలని స్పష్టంచేశారు. అనుమతులు లేకుండా విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేసుకునేవారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడైనా విద్యుత్ కనెక్షన్ తీసుకునేవారు విద్యుత్ శాఖ సిబ్బంది సహాయంతోనే ఏర్పాటు చేసుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం లేని వ్యక్తుల ద్వారా కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. దీనిపై కన్సల్టెంట్ సంస్థ ఇచ్చిన నివేదికపై ఆయన చర్చించారు. సాగునీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో వివిధ ఎత్తిపోతల పథకాల కింద విద్యుత్ సరఫరా, వినియోగంపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సమీక్షలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీశ్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన రోడ్లతోనే అభివృద్ధి

- రోడ్ కనెక్టివిటీ పెరిగితేనే గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు
- ప్రభుత్వం రోడ్ల నిర్మాణ నిధుల కోసం వెనుకాడొద్దు
- మంత్రుల కమిటీ సమావేశంలో సభ్యుల అభిప్రాయం



మాట్లాడుతున్న కోమటిరెడ్డి. చిత్రంలో సీతక్క, శ్రీధర్‌బాబు, భట్టి, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రోడ్ల కోసం నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ఎక్కడా వెనుకాడొద్దని మంత్రుల కమిటీ అభిప్రాయపడింది. ప్రజలతో నిత్యం సంబంధం కలిగి ఉండే రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ద్వారా రోడ్ల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో 'మౌలిక వసతులు, అభివృద్ధి పనులు'అనే అంశంపై మంత్రుల కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబు, సీతక్కతోపాటు సీఎస్ రామకృష్ణారావు, వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో మంత్రులు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి జిల్లా, మండల కేంద్రాలకు సరైన రోడ్డు మార్గాలు ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతమవుతుందని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు హైదరాబాద్‌లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా దొరుకుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలని మంత్రులు సూచించారు. ఉద్యోగంతోపాటు పార్ట్ టైంలో వ్యవసాయం కూడా చూసుకునే వెసలుబాటు కల్పించేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు కీలకమని, వనరులను జాగ్రత్తగా వినియోగించుకుంటూ ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. గత పదేళ్లలో ఆదాయం, బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండా కొన్ని శాఖల్లో అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వటంతో నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయని విమర్శించారు. ఈ అనారోగ్యకర పరిస్థితులను ఆయా శాఖల కార్యదర్శులు సరిచేయాలని సూచించారు.

**హ్యామ్ విధానంలో రోడ్లు**

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టాల్సిన రోడ్ల పనులను వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను ఆదేశించారు. మూడేళ్లలో ప్రమాదాలకు ఆస్కారం లేని నాణ్యమైన రోడ్లు అందుబాటులోకి వస్తాయని, బిల్లుల చెల్లింపుల్లో కాంట్రాక్టర్లలో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

### ప్రపంచానికి భారత్ నాయకత్వం

**తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి**



కేయూ క్యాంపస్: శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం వేగంగా పురోగమిస్తోందని, భవిష్యత్‌లో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించబోతోందని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ జి. సతీష్‌రెడ్డి అన్నారు. దేశ అభివృద్ధి ప్రొఫెసర్లు, విద్యార్థులు, యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా కేయూ ఆడిటోరియంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్'ప్రారంభోత్సవ సభలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఫోకల్'అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచానికి భారత్ అవసరం ఎంతో ఉందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ టెక్నాలజీనే వాడినట్లు చెప్పారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం టెక్నాలజీ వంటి సరికొత్త టెక్నాలజీలపై విద్యార్థులు, ప్రొఫెసర్లు అధ్యయనం చేయాలని సూచించారు. జనాభాలో 40 శాతం కంటే ఎక్కువ మంది యువకులే ఉన్న దేశం ప్రపంచంలో భారత్ ఒక్కటేనని పేర్కొన్నారు. మన రాష్ట్రంలోని యూనివర్సిటీలు నాణ్యత ప్రమాణాలు పెంచుకోవాలని కోరారు. ప్రతి యూనివర్సిటీలో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలకు మంచి ఆలోచనా దృక్పథాలు పెంచుకోవాలని సూచించారు. కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు సీహెచ్.మోహన్‌రావు, ఓయూ మాజీ వీసీ ఎస్.సత్యనారాయణ, కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం, టాస్ ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్ఎంరెడ్డి, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బి.వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడారు.

## మహిళా భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి

### రూ.2,840 కోట్ల నిర్భయ నిధితో ప్రత్యేక సౌకర్యాల కల్పన

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరుసహా 8 నగరాల్లో సేఫ్ సిటీ ప్రాజెక్టు కింద మహిళల భద్రత కోసం పలు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద ఆయా రాష్ట్రాల్లో 33 వేల సీసీటీవీల ఏర్పాటుతోపాటు పింక్ టాయిలెట్లు, మహిళా పెట్రోల్ యూనిట్లు, కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం నిర్భయ నిధి కింద రూ.2,840 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఆయా సౌకర్యాలన్నింటినీ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మంగళవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో మహిళా భద్రతా విభాగం అధికారులతో సంజయ్ సమావేశమయ్యారు. క్రిమినల్ న్యాయవ్యవస్థలోని అన్ని ప్రధాన విభాగాల్లోని (పోలీస్, జైలు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, కోర్టులు) వ్యవస్థల పనితీరు, కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్నారు. హై–సెక్యూరిటీ జైళ్ల నిర్మాణం కోసం కేంద్రం రూ.950 కోట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. పేద ఖైదీల సంక్షేమ పథకం కింద ఏటా రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. యాసిడ్ అటాక్ బాధితులకు రూ.1 లక్ష ప్రత్యేక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 14,653 పోలీస్ స్టేషన్లలో మహిళా సహాయక డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు.

# ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

సంవిధాన్ సదన్ (పార్లమెంటు పాత భవనం)లో ఇండియా కూటమి సమావేశం జరగనుంది.

### ఏకగ్రీవ నిర్ణయం

మంగళవారం మధ్యాహ్నం ఖర్గే నివాసంలో, ఆయన అధ్యక్షతన జరిగిన ఇండియా కూటమి భేటీకి విపక్ష పార్టీల నేతలు శరద్‌పవార్, సంజయ్ రౌత్, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, డెరిక్ ఓబ్రియెన్, కనిమొళి, తిరుచ్చి శివ, జాన్ బ్రిట్టాస్, ధర్మేంద్ర యాదవ్, ప్రమోద్ తివారీ, రజని పాటిల్, అర్విండ్ సావంత్, ఎంఏ బేబీ తదితరులు హాజరయ్యారు. అంతా కలిసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును విపక్ష కూటమి అభ్యర్థిగా ఖరారు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఇండియా కూటమి నుంచి వైదొలగిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా ఈ నిర్ణయానికి మద్దతు ప్రకటించింది. ఈ సమావేశానంతరం ఖర్గే విపక్షాల సంయుక్త ప్రకటనను మీడియాకు చదివి విన్పించారు.

### పేదల పక్షపాతి

'సుదర్శన్‌రెడ్డి దీర్ఘకాలం పాటు న్యాయ సేవలందించారు. దేశంలోని ప్రఖ్యాత, ప్రగతిశీల న్యాయవేత్తలలో ఒకరు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విశిష్టమైన సేవలు అందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం పోరాడారు. ఆయన తీర్పుల్లో పేదల పక్షపాతం స్పష్టంగా కనిపిస్తుంది. రాజ్యాంగ పరిరక్షణ, ప్రాథమిక హక్కులు కాపాడేందుకు కృషి చేశారు. విపక్ష పార్టీలన్నీ ఒకే పేరుకు అంగీకారం తెలపడం సంతోషంగా ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇది ప్రజాస్వామ్యం సాధించిన గొప్ప విజయం. ఎప్పుడైతే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ముప్పు ఎదురవుతుందో అప్పుడు విపక్షాలన్నీ ఏకమై ఇందుకు వ్యతిరేకంగా పోరాడతాయి..'అని ఖర్గే పేర్కొన్నారు.



జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రఘురామిరెడ్డి, మల్లు రవి, బలరాం నాయక్‌లతో పాటు రాజీవ్ శుక్లా సహా ఇతర విపక్ష పార్టీల ఎంపీలు ఘనస్వాగతం పలికారు.

### దక్షిణాది వర్సెస్ దక్షిణాది!

జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో అనివార్యమైన ఉప రాష్ట్రపతి ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే చివరివరకు ప్రయత్నించింది. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలను రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరింది. ఏ కూటమిలోనూ లేని వైఎస్సార్‌సీపీ, బీజేడీ వంటి పార్టీల అధినేతలతో ఈ మేరకు బీజేపీ నేతలు చర్చలు జరిపారు. మంగళవారం సైతం రాధాకృష్ణన్ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బీజేపీ పిలుపునిచ్చింది. అయితే ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి దక్షిణాది రాష్ట్రానికే చెందిన రాజకీయేతర వ్యక్తిని బరిలో దింపాలని నిర్ణయించింది. ఊహించని విధంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. తద్వారా ఉప రాష్ట్రపతి ఎన్నికను దక్షిణాది వర్సెస్ దక్షిణాది అన్నట్టుగా మార్చివేసింది. ఎన్డీయే తమ అభ్యర్థిగా..తమిళనాడుకు చెందిన, ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కలిగిన మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపిన నేపథ్యంలో.. డీఎంకే ఆయన వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీఏకే బలం

ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి లోక్‌సభ, రాజ్యసభలలో కలిపి మొత్తం 782 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా గెలవాలంటే 394 ఓట్లు అవసరం. కాగా ఎన్డీఏకు లోక్‌సభలో 293 మంది, రాజ్యసభలో 129 మంది సభ్యుల (మొత్తం 422) మద్దతు ఉంది. ఇండియా కూటమికి లోక్‌సభలో 234 మంది, రాజ్యసభలో 96 మంది (మొత్తం 330) మద్దతు ఉంది. ఇక ఏ కూటమికీ చెందనివారు 30 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం ఎన్డీఏ ఆధిక్యం సుస్పష్టంగా ఉన్నప్పటికీ, ఎన్నిక ఏకగ్రీవం కాకుండా ప్రతిపక్షాలు తమ అభ్యర్థిని బరిలోకి దింపాయి.

### వ్యవసాయ కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి..

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 1946 జూలై 8న రంగారెడ్డి జిల్లా కందుకూరు రెవెన్యూ మండలం ఇబ్రహీంపట్నం తాలూకా ఆకుల మైలారం గ్రామంలో బూచిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, అనసూయమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. సుదర్శన్‌రెడ్డికి భార్య పద్మారెడ్డి, ఇద్దరు కుమారులు శశిధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, కుమార్తె సుమిత (ప్రస్తుతం అమెరికాలో) ఉన్నారు. ఆయన ఆకుల మైలారం గ్రామంతో పాటు యాచారం మండలం కుర్మిద్దలోని తన బంధువుల ఇంట్లో ఉంటూ ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆ తర్వాత పదో తరగతి వరకు హైదరాబాద్ శాలిబండలోని రిఫైన్ ఎయిడెడ్ స్కూల్‌లో చదివారు. నగరంలోని వివేకవర్ధిని కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్‌ఎల్‌బీ చదివారు. 1971లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. సిటీ సివిల్ కోర్టు (హైదరాబాద్), ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పలు కేసుల్లో సమర్థవంతమైన వాదనలు వినిపించారు. 1988 ఆగస్టు 8న హైకోర్టులో రెవెన్యూ శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది (1988–1990)గా నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా స్వల్పకాలం విధులు నిర్వర్తించారు. ఏవీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలకు కార్యదర్శిగా, కరస్పాండెంట్‌గా పనిచేశారు. 1993–94 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబర్ 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. 2007 జనవరి 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి.. 2011 జూలై 8న పదవీ విరమణ పొందారు. 2013లో లోక్‌పాల్, లోకాయుక్త చట్టం ఆమోదం పొందిన తర్వాత అదే ఏడాది గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. అయితే వ్యక్తిగత కారణాలతో అదే ఏడాది ఆ పదవి నుంచి వైదొలిగారు.

### ఆకుల మైలారంలో ఆనందోత్సాహాలు..

కందుకూరు: జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన స్వగ్రామమైన ఆకుల మైలారంలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక యువత బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. తమ గ్రామంలో పుట్టి పెరిగిన వ్యక్తి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికవడంతో ఆనందంగా ఉందని వారన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆయన.. గ్రామ పరిధిలోని మాలగూడ సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఓ ఇల్లు నిర్మించుకున్నారు. అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి వరి పంట, పండ్ల తోటలు పరిశీలించి వెళ్తుంటారు.

## క్లుప్తంగా...

### నేటి నుంచి సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు

#### గాజులరామారంలో 3 రోజులపాటు నిర్వహణ

సాక్షి,మేడ్చల్ జిల్లా: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర మహాసభలు బుధవారం నుంచి ఈ నెల 22వరకు జరగనున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలోని మహారాజా గార్డెన్స్‌లో ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. మహాసభల ఏర్పాట్లను మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆహ్వాన సంఘం ప్రతినిధులతో కలసి పరిశీలించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించే ఈ మహాసభల్లో 33 జిల్లాల నుంచి 743 మంది ప్రతినిధులు పాల్గొంటారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై డి.రాజా ప్రసంగిస్తారు. రెండో రోజు సభల్లో వివిధ అంశాలపై చర్చలు, తీర్మానాలు చేస్తారు. మూడో రోజు సభలో నూతన రాష్ట్ర సమితి ఎన్నిక, జాతీయ మహాసభలకు ప్రతినిధుల ఎన్నిక కార్యక్రమం ఉంటుంది.

### కేసీఆర్‌ను తిట్టడమే రేవంత్ ఎజెండా: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: సర్వాయి పాపన్న జయంతి రోజు.. సీఎం రేవంత్‌రెడ్డి కొన్ని మంచి మాటలు చెబుతారనుకున్నామని, ఎక్కడికి వెళ్లినా కేసీఆర్‌ను తిట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం తెలంగాణ భవన్‌లో.. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్‌ఎస్ నేత గౌతం ప్రసాద్‌లతో కలిసి మాట్లాడారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా.. రేవంత్‌రెడ్డి వృత్తి కులాలకు ఏవైనా వరాలు ప్రకటిస్తారని ఆశించామన్నారు. ఎన్నికల్లో గౌడలకు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటి అమలు గురించి మాట్లాడకుండా.. రేవంత్ వేరే విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరవై నెలల్లో 700 మంది గీత కార్మికులు వివిధ ప్రమాదాల్లో మరణించినా నష్టపరిహారం చెల్లించలేదన్నారు.

# రాజ్యాంగ పరిరక్షకులు, వ్యతిరేకుల మధ్య ఎన్నిక

- తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పక్షాలన్నీ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఆత్మప్రబోధనానుసారం ఓటేయాలని పిలుపు
- పీవీ నరసింహారావు తరువాత తెలంగాణ వ్యక్తికి మరో ఉన్నత హోదా అని వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి, పొన్నం, వివేక్, శ్రీహరి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉప రాష్ట్రపతి ఎన్నికను రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య జరుగుతున్న ఎన్నికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలనుకుంటున్న వారికి, ఏ పార్టీతో సంబంధం లేకుండా రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసిన తెలంగాణ రైతు బిడ్డ, న్యాయ కోవిదుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పక్షాలన్నీ సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు. ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు ప్రజలు ముఖ్యంగా తెలంగాణ ప్రజల గౌరవ ప్రతిష్టలను పెంచిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను కూడా దుర్వినియోగం చేసి, బతికున్న ఓటర్లను చనిపోయినట్లు, లేని ఓటర్లను ఉన్నవారిగా చూపిస్తూ.. ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఎన్డీయే ఒక పక్కన, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించే, రాజ్యాంగబద్ధ సంస్థలను పరిరక్షించే ఇండియా కూటమి మరోవైపు ఉన్నాయని అన్నారు, ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించిన తరువాత రేవంత్‌రెడ్డి తన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు.

### మనమంతా ఏకం కావాలి

ఇండియా కూటమి రాజకీయ పార్టీలకు అతీతంగా, వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ఎంపికచేసిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన, ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దిన పీవీ నరసింహారావు తరువాత తెలంగాణకు చెందిన వ్యక్తి రెండో అత్యున్నత పదవికి పోటీకి ప్రకటించడం మనందరికీ గర్వకారణం. తెలుగు ప్రజలుగా రాజకీయాలకు అతీతంగా ఆత్మప్రబోధనానుసారం ఓటు వేయాలి. ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిది. మొత్తం 42 మంది లోక్‌సభ సభ్యులు, 18 మంది రాజ్యసభ సభ్యులం ఒకతాటిపైకి వచ్చి మద్దతు ప్రకటించాలని కోరుతున్నా. టీడీపీ, బీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ, ఎంఐఎం, జనసేన పార్టీల నాయకులు చంద్రబాబు, కె.చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, పవన్ కళ్యాణ్‌ను తెలంగాణ ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేస్తున్నా. బీజేపీ పార్లమెంట్ సభ్యులను, ఉభయ కమ్యూనిస్టు పార్టీలను కూడా కోరుతున్నా. రాజకీయాలకు అతీతంగా మనం ఏకం కావాల్సిన సందర్భం ఇది'అని రేవంత్ చెప్పారు.

### తమిళ, తెలుగు రాష్ట్రాల మధ్య పోటీకాదు

'1991లో ప్రధాని రేసులో ఉన్న పీవీ నరసింహారావు నంద్యాల ఎంపీగా పోటీ చేసినపుడు.. కాంగ్రెస్, టీడీపీ సిద్ధాంతపరంగా పూర్తి వైరుధ్యం ఉన్నప్పటికీ ఎన్టీఆర్ ఆరోజు పీవీపై పోటీ పెట్టకుండా రాజకీయ విజ్ఞతను ప్రదర్శించారు. ఈరోజు ఒక తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతి అయ్యే అవకాశం, ఆ తరువాత రాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పార్టీలు విజ్ఞత ప్రదర్శించాలి'అని రేవంత్‌రెడ్డి చెప్పారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా మీరు ఉభయ రాష్ట్రాల్లోని పార్టీ నాయకులను వ్యక్తిగతంగా కలుస్తారా? అని అడిగిన ప్రశ్నకు సీఎం స్పందిస్తూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతునివ్వా లని బహిరంగంగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా అని బదులిచ్చారు. బీఆర్‌ఎస్‌ను ఎలా మద్దతు అడుగుతారని ప్రశ్నించగా.. 'జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కాదు. పార్టీ సభ్య త్వం లేదు. కాంగ్రెస్ ఎంపిక చేయలేదు. ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థి'అని అన్నారు. ఇది తమిళ, తెలుగు రాష్ట్రాల మధ్య పోటీ కాదని వ్యాఖ్యానించారు. ఓబీసీ బండారు దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వాలని డిమాండ్ చేసిన మీరు.. ఇప్పుడు ఓబీసీ వ్యక్తిని ఎన్డీయే నిలబెడితే ఎందుకు వ్యతిరేకిస్తున్నారన్న ప్రశ్నకు సీఎం స్పందిస్తూ 'జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బలహీన వర్గాలకు బలమైన గొంతుక. రాష్ట్రపతి వద్దనున్న బీసీల రిజర్వేషన్ల బిల్లును అడ్డుకుంటున్న ఎన్డీయే అభ్యర్థి, బలహీనవర్గాల వ్యక్తా.? బలహీనవర్గాలకు అండగా నిలబడాల్సిన వ్యక్తా' అని సీఎం ఎదురు ప్రశ్నించారు.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డినే ఎందుకు?

సాక్షి, హైదరాబాద్: ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడం వెనుక ఇండియా కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎక్కడకు వెళ్లినా.. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా రాజ్యాంగ సంస్థలను నాశనం చేస్తోందంటూ విస్తృత ప్రచారం చేస్తున్న నేపథ్యంలో హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సుదీర్ఘ అనుభవం, రాజ్యాంగం, న్యాయపరమైన అంశాలపై బాగా పట్టుండటం, ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా మరోసారి రాజ్యాంగంపై దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరగడానికి వీలుంటుందని ఇండియా కూటమి నేతలు భావించినట్లు చెబుతున్నారు. దానికితోడు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి బిల్లుల రూపకల్పనలో, ఆ బిల్లులు చట్టంగా మారిన తరువాత ఏ విధంగా అమలు చేయాలో సలహాలు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ చైర్మన్‌గా ఆయన చేసిన కృషిని కూటమి నాయకులు గుర్తించినట్లు భావిస్తున్నారు. అధికార ఎన్డీయే కూటమి దక్షిణాది నుంచి ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసిన నేపథ్యంలో ఇండియా కూటమి కూడా దక్షిణ భారత దేశానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయడం కూడా ఓ కారణంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకపోవడం, రాజ్యాంగ నిపుణుడిగా, న్యాయకోవిదుడిగా ఆయనకున్న విశేష అనుభవం కలిసి వస్తుందని కూటమి నేతలు భావించినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్లు, కులగణనకు సంబంధించి ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీలకు అవగాహన కల్పన సమావేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పాల్గొని వివరాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. దానికితోడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలోనూ ఆయన కీలకభూమిక పోషించడం గమనార్హం.

# శాంపిల్ కాదు... సాచ్యురేషన్

- అమలుచేస్తామని నమ్మకం ఉంటేనే పథకాలు ప్రారంభిస్తా
- మా పథకాలను పరిశీలిస్తే ఆ విషయం అర్థమైతది
- నాలుగు నెలలుగా రాష్ట్రపతి వద్దే బీసీ రిజర్వేషన్ల బిల్లులు
- సకాలంలో ఆమోదం రాకుంటే పార్టీల పరంగానే రిజర్వేషన్లు
- మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాంపిల్‌గా పథకాలు అమలు చేయడం తన పద్ధతి కాదని, ఏదైనా సాచ్యురేషన్ పద్ధతిలో చేయడం తనకు అలవాటని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏ పథకమైనా పూర్తిగా అమలు చేస్తామనే నమ్మకం కలిగితేనే అమలు ప్రారంభిస్తానని స్పష్టంచేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు.. ఇలా ఏ పథకాన్ని పరిశీలించినా అందులో సాచ్యురేషన్ పద్ధతి కనిపిస్తుందని తెలిపారు.

**సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి అయితే బీసీ రిజర్వేషన్ బిల్లులకు ప్రయోజనం**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉన్నామని సీఎం స్పష్టంచేశారు. 'రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. తమిళనాడు ప్రభుత్వ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లోగా వాటిని రాష్ట్రపతి ఆమోదించాలి. లేని పక్షంలో ఆమోదించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఆ రెండు బిల్లుల్లో ఒకటి ఉపాధి, విద్యలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేది.. రెండోది స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించినది. ఇవి నాలుగు నెలల నుంచి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీరాజ్ ఎన్నికల్లో 50% కోటా పరిమితిని ఎత్తివేసే ఆర్డినెన్స్ దాదాపు 40 రోజుల నుంచి ఆమోదం కోసం వేచిచూస్తోంది. ఉప రాష్ట్రపతిగా సుదర్శన్ రెడ్డి ఎన్నికైతే ఈ బిల్లులకు ఉపయోగం ఉంటుంది. ఆయన రాష్ట్రపతికి రాజ్యాంగ అంశాన్ని వివరించడమేకాక.. రాజ్యసభ చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వానికి డైరెక్షన్ కూడా ఇచ్చే అవకాశం ఉంటుంది' అని సీఎం అభిప్రాయపడ్డారు.

**బిల్లులకు ఆమోదం రాకుంటే పార్టీల పరంగా రిజర్వేషన్లు**

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినందున.. రిజర్వేషన్ బిల్లులు, ఆర్డినెన్స్‌కు సకాలంలో రాష్ట్రపతి ఆమోదం లభించకుంటే అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం టికెట్లు ఇవ్వాలని కోరటమొక్కటే మార్గమని సీఎం తెలిపారు. మున్సిపాలిటీల ఎన్నికల నాటికి రిజర్వేషన్ చట్టాన్ని సవరిస్తామని చెప్పారు. బిల్లులకు 90 రోజుల్లో గవర్నర్, రాష్ట్రపతి విధిగా ఆమోదం తెలపాలా? అన్న అంశంపై సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల అభిప్రాయం కోరింది. దీనిపై కేసు విచారణకు వచ్చినప్పుడు రాష్ట్ర అభిప్రాయం చెబుతామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను స్వయంగా కలిసి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు కోరాలని కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశిస్తే వెళ్తారా అన్న ప్రశ్నకు..' హైకమాండ్ చెప్పనీయండి.. ఆయన (కేసీఆర్) అపాయింట్‌మెంట్ ఇవ్వాలి కదా?'అని వ్యాఖ్యానించారు. వచ్చేనెల మొదటి వారంలో సమావేశం నిర్వహించి జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## నేడు ట్రంపెట్ రోడ్డును ప్రారంభించనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: కోకాపేట్ నియోపొలిస్ లే అవుట్ నుంచి నేరుగా ఔటర్ రింగ్‌రోడ్డుకు రాకపోకలు సాగించేందుకు నిర్మించిన ట్రంపెట్ రోడ్డును సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. హెచ్‌ఎండీఏ ఈ ట్రంపెట్‌ను రూ.65 కోట్లతో నిర్మించింది. నాలుగేళ్ల కిందటే పనులు ప్రారంభించినప్పటికీ కొన్ని కారణాల వల్ల జాప్యం జరిగింది. ఈ ట్రంపెట్ వల్ల నియోపొలిస్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రాకపోకలు సులభతరం కానున్నారు. ఈ ట్రంపెట్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డుకు రాకపోకలు సాగించేందుకు ప్రవేశమార్గంలో 3 టోల్‌బూత్‌లను, నిష్క్రమణ మార్గంలో 5 టోల్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రద్దీ నెలకొని వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో నేరుగా ఔటర్‌కు వెళ్లేందుకు మార్గం సుగమం కావడం వల్ల వాహనదారులకు భారీ ఊరట లభించనుంది.

### గత ప్రభుత్వంపై రేవంత్‌రెడ్డి నిందలేయడం విడ్డూరం

#### మండలి విపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి జోగు రామన్న





సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీ మోసం బట్టబయలు కావడంతో, దిక్కుతోచని సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి గత ప్రభుత్వంపై నిందలేస్తుండటం విడ్డూరంగా ఉందని శాసనమండలి విపక్ష నేత మధుసూదనాచారి, మాజీమంత్రి జోగు రామన్న విమర్శించారు. సీఎం బీసీ రిజర్వేషన్లపై సోమవారం చేసిన వ్యాఖ్యలను సంయుక్త పత్రికా ప్రకటన ద్వారా తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చట్ట, న్యాయపర ప్రయత్నాలు ఎన్నో చేసిందని, చివరకు ప్రధాని నరేంద్ర మోదీని కూడా కేసీఆర్ కలిశారని తెలిపారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధించింది సుప్రీంకోర్టు అయితే, పార్లమెంట్‌లో పరిమితిని ఎత్తివేసే చర్యలు చేపట్టకుండా సుదీర్ఘకాలం ద్రోహం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు.

# ప్రజల నడ్డి విరిచే పన్నులు ఎత్తివేయాలి

- పెట్రోల్, డీజిల్, ఎల్పీజీపై పన్నులు తగ్గించి, సెస్సు రద్దు చేయాలి
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశ నేపథ్యంలో ప్రధాని మోదీకి కేటీఆర్ లేఖ



సాక్షి, హైదరాబాద్: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబ్‌లో రద్దు లేదా మార్పు ద్వారా ప్రజలకు నిజమైన దీపావళి అందిస్తామని ప్రచారం చేసుకుంటున్న ప్రధాని నరేంద్రమోదీకి చిత్తశుద్ధి ఉంటే పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగే జీఎస్టీ జాతీయ కౌన్సిల్ సమావేశ నేపథ్యంలో ప్రధానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

### చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలి

'తెలంగాణలో చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై పన్నులు ఉండకూడదని భావించాం. కానీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేనేత వస్త్రాలపై తొలుత 5శాతం విధించి ఆ తర్వాత 12శాతానికి పెంచాలని నిర్ణయించింది. దేశవ్యాప్త వ్యతిరేకత వెల్లువెత్తడంతో 12శాతం పన్ను విధింపు నిర్ణయాన్ని వాయిదా వేశారు. చేనేతపై పన్ను విధింపును విరమించుకోవాలి. జీఎస్టీలోని 12శాతం స్లాబ్‌ను రద్దు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. మొత్తం జీఎస్టీ ద్వారా సమకూరే రూ.22 లక్షల కోట్లలో 12% స్లాబ్ వాటా కేవలం 5శాతం మాత్రమే. దశాబ్ద కాలంగా నిత్యావసరాలపై జీఎస్టీ విధించి సామాన్యుడి నడ్డి విరిచిన బీజేపీ ప్రభుత్వం స్లాబ్ రద్దు అంటూ లీకులు ఇస్తూ ప్రచారం చేసుకుంటోంది.

### పెట్రో, ఎల్పీజీ ధరలను తగ్గించాలి

పెట్రో ఉత్పత్తులు, ఎల్పీజీ ధరలను తగ్గిస్తే పరోక్షంగా ఇతర నిత్యావసరాల ధరల భారం కూడా తగ్గుతుంది. సెస్సుల రూపంలో రాష్ట్రాల ఆదాయాన్ని దెబ్బకొట్టే కుట్రకు పాల్పడిన కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసింది. పెట్రో ఉత్పత్తులు, ఎల్పీజీ రేట్లను వెంటనే తగ్గించి సెస్సులను పూర్తిగా ఎత్తివేయాలి. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు, విద్యకు సంబంధించిన ఫీజులు, కేన్సర్ చికిత్సకు అవసరమైన ఔషధాలపై విధిస్తున్న జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలి'అని ప్రధానికి రాసిన లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ సర్కారు ముక్కు నేలకు రాయాలి: కేటీఆర్

మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల మండలం గుడిబండ పెద్దవాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్ డ్యామ్ 2 నెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని కేటీఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల సంగతిని పక్కన పెడితే ఒక్క ఇటుక ముక్క కూడా సరిగా పేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలన్నారు.హైదరాబాద్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. చందానగర్ నగల దుకాణంలో దోపిడీ, కూకట్‌పల్లిలో 12ఏళ్ల బాలిక దారుణ హత్య దిగజారిన శాంతిభద్రతలకు అద్దం పడుతున్నాయన్నారు.

## అసత్య ప్రచారాలు కేటీఆర్‌కు అలవాటే..

### ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కేయన్స్ సెమీ కండక్టర్ పరిశ్రమ హైదరాబాద్ నుంచి గుజరాత్ తరలిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలు, బట్టకాల్చి మీద వేయడం లాంటిదని, నిరాధార, అసత్య ప్రచారాలు చేయడం ఆయనకు అలవాటేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. కేయన్స్ సెమీ కండక్టర్ పరిశ్రమ గురించి కేటీఆర్ వ్యాఖ్యలను మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు ఖండించారు. కేయన్స్ పరిశ్రమ హైదరాబాద్ నుంచి వెళ్ళిపోయింది అనడం కంటే గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వాలు భారీ సబ్సిడీలు కుమ్మరించి లాక్కొని పోయాయని అనడం సబబుగా ఉంటుందని సూచించారు. ఈ విషయం కేటీఆర్‌కు తెలిసినప్పటికీ తెలంగాణ ప్రజలను మభ్య పెట్టడానికి ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో కూర్చొని ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం చేయడం అలవాటేనని ఎద్దేవా చేశారు. తాము ఏం చెప్పినా తెలంగాణ ప్రజలు నమ్ముతారని అనుకోవడం వారి భ్రమ అని స్పష్టం చేశారు. కేయన్స్ సెమీకాన్ పరిశ్రమ తెలంగాణలో ఏర్పాటు చేస్తే రాష్ట్ర పాలసీ మేరకు రూ.330 కోట్లు రాయితీలు లభిస్తాయని, అదే గుజరాత్‌లో కేంద్ర సబ్సిడీ రూ.16,534 కోట్లు ఉదారంగా లభిస్తాయని మంత్రి తెలిపారు.

మీరు అంటిపెట్టుకుని ఉన్నదాన్ని మాత్రమే కోల్పోతారు.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, 20 ఆగస్టు 2025

# సంధి సాధ్యమేనా?!

పరస్పరం కలహించుకుంటున్న రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య సంధి కుదర్చటానికీ, సామరస్యం సాధించటానికీ అలాస్కా శిఖరాగ్ర సమావేశానికి వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చివరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అనధికార అధికార ప్రతినిధిగా మారి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తారు. కాల్పుల విరమణకు రష్యా అంగీకరించకపోతే కఠినాతికఠినంగా వ్యవహరిస్తామని అలాస్కా సమావేశానికి ముందు హెచ్చరించిన ఆయన... కాల్పుల విరమణ వల్ల ప్రయోజనం లేదని, శాంతి ఒప్పందం కోసం చర్చలు జరగాలని చెబుతున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం వైట్‌హౌస్‌లో తనను కలిసినప్పుడు సైతం ఇలాంటి సలహాయే ఇచ్చారు. దీన్ని ఏదో మేరకు సరిదిద్ది, ఉక్రెయిన్‌కు కనీస భద్రత గ్యారెంటీనైనా సాధించాలన్న ధ్యేయంతో ఆరుగురు యూరొప్ దేశాల నేతలు ట్రంప్‌తో భేటీ అయ్యారు. అమెరికాతో పాటు రష్యా, ఉక్రెయిన్‌లు పాల్గొనే త్రైపాక్షిక చర్చలకు సుముఖంగా ఉన్నామని ట్రంప్ చెప్పటం ఉన్నంతలో ఊరటనిచ్చే అంశం. కానీ ట్రంప్ దానికైనా కట్టుబడతారా లేదా... పుతిన్‌ను ఒప్పించగలరా లేదా అన్నది చెప్పలేం.

జెలెన్‌స్కీకి మొన్న ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో ఎదురైన చేదు అనుభవాలను నివారించి, ఆయన వెనక యూరప్ దేశాలన్నీ ఉన్నాయని చెప్పటానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మెక్రాన్, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడెరిక్ షుల్జ్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని తదితరులు కలిశారు. కానీ అందువల్ల ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్నార్థకం. ఉక్రెయిన్‌కు 'నాటో తరహా' భద్రత కల్పించటానికి ట్రంప్ అనుకూలమే గానీ అదంతా యూరప్ దేశాలే చూసుకోవాలట. తమ వంతుగా గగనతల రక్షణ విషయంలో సాయంగా నిలుస్తారట!

అసలు యూరప్ దేశాలకు ఉక్రెయిన్ విషయంలో ట్రంప్ ఏం చేస్తారనే ఆదుర్దా కన్నా ఆయన నాటో పక్షాన ఉంటారా ఉండరా అనే బెంగ ఎక్కువైంది. జెలెన్‌స్కీతో మళ్లీ ఆయన లడాయికి దిగితే అటుతర్వాత తాము సైతం మాట్లాడే స్థితి ఉండకపోవచ్చన్న భయంతోనే యూరప్ అధినేతలు వైట్‌హౌస్‌కు వెళ్లినట్టు కనిపిస్తోంది. కోల్పోయిన భూభాగాల గురించీ, నాటో సభ్యత్వం గురించీ మరిచిపోవాలని తొలుత తనను కలిసిన జెలెన్‌స్కీకి చెప్పటంతో పాటు యూరప్ దేశాధినేతల ముందు కూడా ట్రంప్ ఆ మాటే అనటం గమనించదగ్గది. ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన నాటి నుంచీ పుతిన్ చెప్పిన మాటల్నే ట్రంప్ ఇప్పుడు వల్లిస్తున్నారు. చాలా అంశాల్లో పుతిన్‌కూ, తనకూ ఏకాభిప్రాయం కుదిరిందని ఆ శిఖరాగ్ర సమావేశం అనంతరం ఆయన ఇప్పటికే ప్రకటించారు. పుతిన్ దాదాపు పన్నెండేళ్ల క్రితం ఆక్రమించిన క్రిమియాలో పలు పట్టణాలు, నదులూ, పర్వతశ్రేణులూ ఉన్నాయి. విలువైన పంటభూములున్నాయి. ఇవిగాక మూడున్నరేళ్లకు పైగా సాగుతున్న దురాక్రమణ యుద్ధంలో ఆక్రమించుకున్న తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలున్నాయి. వీటిని వదులుకోవటమంటే జెలెన్‌స్కీకి ఆత్మహత్యా సదృశం. అయినా తమ కోసం ట్రంప్ ఎంతో చేస్తున్నారని ప్రశంసించి, ఆయనకు కృతజ్ఞతలు చెప్పాల్సి వచ్చింది. జెలెన్‌స్కీకి అంతకన్నా గత్యంతరం లేదు. ఉక్రెయిన్‌కి ప్రస్తుతం అందుతున్న సాయంలో 47 శాతం వాటా అమెరికాదే. జర్మనీ 9, బ్రిటన్ 8, జపాన్ 6 శాతాలతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి. కెనడా, నెదర్లాండ్స్, స్వీడన్, ఫ్రాన్స్ వంటివి ఒకటి, రెండు శాతాలకు మించి ఇవ్వడం లేదు. అందుకే జెలెన్‌స్కీ నోరెత్తలేకపోతున్నారు.

అమెరికా గత పాలకుల ప్రాపకంతో ఉక్రెయిన్‌ను రెచ్చగొట్టి, రష్యాతో గిల్లికజ్జాలకు దిగేలా చేసిన యూరప్ దేశాలకు ఇప్పుడు ఏం చేయాలో పాలుబోని దుఃస్థితి. నెలక్రితం ట్రంప్‌తో మాట్లాడాక అంతా సామరస్యంగా పరిష్కారమైందని, ఉక్రెయిన్ విషయంలో తమను సంప్రదించకుండా ఆయన ఏ నిర్ణయమూ తీసుకోబోరని యూరప్ దేశాధినేతలు నమ్మారు. అలాస్కా శిఖరాగ్రానికి వారం రోజుల ముందు కూడా వారంతా ట్రంప్‌ను కలిశారు. ఆ భేటీకి జెలెన్‌స్కీని కూడా తీసుకెళ్లారు. ముందు కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావాలనీ, ఆ తర్వాతే ద్వైపాక్షికమో, త్రైపాక్షికమో చర్చలుండాలనీ ఆ భేటీలో అందరూ అభిప్రాయపడ్డారు. తాజాగా ట్రంప్ త్రైపాక్షిక చర్చల గురించి మాట్లాడుతున్నా పుతిన్ అందుకు సుముఖంగా ఉంటారా అన్న సంశయం అందరినీ పీడిస్తోంది. ఆ మాటెలా ఉన్నా అలాస్కా శిఖరాగ్రం భారత్‌కు ఎంతో కొంత మేలు చేసిందని చెప్పాలి. రష్యాపై ఆగ్రహంతో మనపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్ ఆ విషయంలో వెనక్కు తగ్గే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు చెబుతున్న మాటకు కట్టుబడి సాధ్యమైనంత త్వరలో త్రైపాక్షిక చర్చలకు ట్రంప్ చొరవ తీసుకుంటే... పుతిన్‌ను ఒప్పిస్తే అది శాంతికి దోహదపడుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.ద్వాదశి ప.2.21 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పునర్వసు రా.1.43 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.2.08 నుండి 3.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.29 వరకు, **అమృత ఘడియలు:** రా.11.30 నుండి 12.57 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

# శాంతి సాధనలో మూడు ముక్కలాట

**విశ్లేషణ**



టంకశాల అశోక్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ నెల 15న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో, 18 నాడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో పాటు యూరోపియన్ నాయకులతో జరిపిన చర్చలు ఆశాభావాన్ని కలిగిస్తున్నాయి. అందుకు సంబంధించి ఉండిన చివరి అనుమానాలు 18 నాటి వైట్ హౌస్ సమావేశంతో తీరిపోయాయి. అంతకుముందు 15న అలాస్కాలో ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన చర్చలలో కనిపించిన సానుకూలతను జెలెన్‌స్కీతో పాటు యూరోపియన్ నాయకులు వైట్‌హౌస్ సమావేశంలో భంగపరచవచ్చుననే సందేహాలుండేవి. శాంతి ప్రయత్నాలకు ముందు కాల్పుల విరమణ జరిగి తీరాలనే పట్టుదలతో ఉండిన ఆ బృందం, ట్రంప్ ఆలోచనను తిరిగి మార్చవచ్చుననే భావన చాలా మందికి కలిగింది. కానీ, అది గ్రహించి కావచ్చు 18 నాటి చర్చలకు ముందు రాత్రే ట్రంప్, కేవలం కాల్పుల విరమణ వల్ల ఉపయోగం లేదనీ, పూర్తి స్థాయిలో శాంతి కోసం ప్రయత్నం జరగాలనీ స్పష్టం చేశారు.

### పుతిన్ వాదనను అంగీకరించిన ట్రంప్

అంతిమంగా అలాస్కా, వైట్ హౌస్ భేటీల సారాంశం ఏమిటి? మూడేళ్లుగా సాగుతున్న యుద్ధంపై అమెరికా, రష్యా అధ్యక్షులు మొదటిసారి సమావేశమయ్యారు. వెంటనే కాల్పుల విరమణకు పుతిన్‌ను ఒత్తిడి చేయగలనని, అందుకు సమ్మతించని పక్షంలో తీవ్రమైన చర్యలు తీసుకోగలనంటూ వెళ్లారు ట్రంప్. అక్కడ మూడు గంటల చర్చలలో పుతిన్ ఇచ్చిన సుదీర్ఘమైన వివరణలతో పూర్తిగా సంతృప్తి చెంది, కాల్పుల విరమణ వల్ల ప్రయోజనం లేదని, సంపూర్ణ స్థాయిలో శాంతి సాధనే సరైన మార్గమనే వాదనతో అంగీకరించారు. చంచల స్వభావిగా పేరున్న ఆయన అటువంటి అభిప్రాయంపై స్థిరపడటం ఈ కథాక్రమంలోని కీలకమైన మలుపు. పుతిన్ వాదన నచ్చినప్పటికీ అట్లా స్థిరపడక పోయి ఉంటే, యూరోపియన్ల సమావేశంలో తన ఆలోచనను తిరిగి మార్చుకునే వారేమో! అపుడు విషయం మళ్లీ మొదటికి వచ్చేది. జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడరిక్ షుల్జ్, యూరోపియన్ నాయకుల తరఫున మాట్లాడుతూ, శాంతి చర్చల కన్నా ముందు కాల్పుల విరమణ తప్పనిసరియని వాదించారు. కానీ ట్రంప్ జర్మనీ ఛాన్స్‌లర్ మాటను తోసిపుచ్చారు.

ఈ ఒక్క విషయమే ఇంతగా చెప్పుకోవటం ఎందుకంటే, ఈ దశలో మొత్తం విషయమంతా అమెరికా అధ్యక్షుడు ఎవరి వాదనను అంగీకరించి ముందుకు పోగలరన్న దానిపైనే ఆధారపడి ఉంది. ఇపుడు రెండు చర్చల అనంతరం అందుకు స్పష్టత వచ్చినందున ఇతర విషయాలను చూద్దాము. అవి ప్రధానంగా మూడు. ఒకటి–రష్యా కోరుతున్న భూభాగాలను ఉక్రెయిన్ వదలుకోవటం; రెండు–ఉక్రెయిన్ 'నాటో'లో చేరకపోవటం; మూడు– ఉక్రెయిన్‌కు భవిష్యత్తులో భద్రత కోసం రక్షణ హామీలు లభించటం. ఈ మూడు అంశాలు కూడా అలాస్కాలో, వైట్ హౌస్‌లో ప్రస్తావనకు వచ్చాయి. రష్యా తాను ఇప్పటికే పూర్తిగానో, పాక్షికంగానో ఆక్రమించిన క్రిమియా, డొనెటెస్క్, జపోరిజిజియా, ఖేర్సాన్, లుహాన్స్క్, ఖార్కివ్ ప్రాంతాలను తమకు అప్పగించటం, ఆ యా నియంత్రణ రేఖలను అదే స్థాయిలో స్తంభింపజేయటం జరగాలని కోరుతున్నది. అవి అన్నీ కాకపోయినా ఏదో ఒక మేరకు వదులుకోవాలని ట్రంప్ మొదటినుంచి అంటున్నారు. యూరోపియన్ నాయకుల వైఖరి ఇంచుమించు అదే! వైట్ హౌస్ చర్చల సందర్భంలో అవుననక, కాదనక... అది జెలెన్‌స్కీ తేల్చుకోవలసిన విషయమని వదిలివేశారు. భూభాగాలను వదలుకొనే ప్రసక్తి లేదని జెలెన్‌స్కీ అంటూనే, అది తనకు, పుతిన్‌కు, ట్రంప్‌కు మధ్య త్రైపాక్షిక చర్చలలో తేలుతుందని మరొకవైపు సూచిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నపుడు, రష్యా డిమాండ్లలో ఒకటి కొలిక్కి రాగల అవకాశాలు సూత్రరీత్యా కనిపిస్తున్నాయి.

### ఉక్రెయిన్ 'నాటో'లో చేరకూడదు...

'నాటో'లో ఉక్రెయిన్ సభ్యత్వం విషయానికి వస్తే, రష్యా డిమాండ్‌కు అమెరికా అధ్యక్షుడు మొదటి నుంచీ సానుకూలంగా ఉన్నారు. అసలు ఉక్రెయిన్ ఆ సంస్థలో చేరాలనుకోవటమే రష్యా అభద్రతా భావానికి, ఈ దాడికి మూల కారణమని కూడా అన్నారు. అటువంటి వైఖరి తీసుకున్న తర్వాత ఇక ఉక్రెయిన్ ఆ సైనిక కూటమిలో చేరగల అవకాశం ఉండదు. వాస్తవానికి అందులో చేరాలనే మాట ఉక్రెయిన్ రాజ్యాంగంలో లాంఛనంగా ఉన్నప్పటికీ, ఆ పట్టుదల యూరోపియన్ దేశాలదే! రష్యాను క్రమంగా చుట్టుముట్టి, ఛిన్నాభిన్నం చేయాలన్నది వారికి గతం నుంచి గల దీర్ఘకాలిక ప్రణాళిక. అయితే, ఈ ఒప్పందాల క్రమంలో ఉక్రెయిన్ తామిక 'నాటో'లో చేరబోమంటూ రాజ్యాంగపరంగా ప్రకటించవలసి ఉంటుందన్నది రష్యా డిమాండ్. అది జరగాలని ట్రంప్ కూడా ఒత్తిడి చేయవచ్చు. అదే జరిగితే యూరోపియన్ నాయకులు చేయగలిగింది ఉండదు. ఆ విధంగా శాంతి సాధనకు మరొక అడ్డంకి తొలగిపోతుంది. ఉక్రెయిన్‌లోని రష్యన్ జాతీయుల హక్కుల పరిరక్షణ వంటి మరికొన్ని అంశాలు ఉన్నాయి గానీ, ఇతరత్రా గల ప్రధాన సమస్యలు పరిష్కారమైనపుడు అవీ కావచ్చు.



ట్రంప్: పుతిన్‌తో...



జెలెన్‌స్కీతో...

◆ ఈ ఒప్పందాల క్రమంలో ఉక్రెయిన్ 'నాటో'లో చేరబోమంటూ రాజ్యాంగపరంగా ప్రకటించవలసి ఉంటుందన్నది రష్యా డిమాండ్. అది జరగాలని ట్రంప్ కూడా ఒత్తిడి చేయవచ్చు. ఆ పని జరిగితే ఇక యూరోపియన్ నాయకులు చేయగలిగింది ఉండదు.

◆ 'నాటో'లో చేరకపోయినా 5వ ఆర్టికల్‌ను పోలిన రక్షణలు కల్పించగలమని ట్రంప్ సూచించగా అందుకు పుతిన్ సమ్మతించారు.

ఉక్రెయిన్‌కు ఆందోళనకరంగా ఉన్న ప్రధానాంశం తమ రక్షణ. చర్చలలో రష్యా అధ్యక్షుడు మొట్టమొదటిసారిగా అందుకు కొన్ని సడలింపులు చూపటం శాంతి సాధనకు మార్గాన్ని సుగమం చేసింది. అక్కడ ట్రంప్‌తో పుతిన్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌కు భద్రత ఏర్పడటం తప్పనిసరి అవసరమని, అక్కడి ప్రజల మూలాలూ తమ ప్రజల మూలాలూ ఒకటేనని, కనుక వారికి రక్షణ ఏర్పాట్లకు ఎటువంటి అభ్యంతరమూ లేదని అన్నారు. ఆ భద్రత ఏ రూపంలోనన్నది ప్రశ్న. 'నాటో'లో చేరేందుకు వీలు లేదన్న పుతిన్ డిమాండ్‌ను ట్రంప్ అంగీకరించారు. అట్లా చేరకపోయినా 5వ ఆర్టికల్‌ను పోలిన రక్షణలు కల్పించగలమని ట్రంప్ సూచించగా అందుకు పుతిన్ సమ్మతించారు. ఆర్టికల్ 5 అనే మాట ప్రచారంలోకి వచ్చినట్లు అందులోని వివరాలు ప్రచారంలోకి రాలేదు గానీ, అవి గమనించదగ్గవి. నాటోలోని ఏ దేశంపై అయినా బయటి దేశం దాడి జరిపితే అది మొత్తం నాటో కూటమిపై జరిగిన దాడిగా పరిగణించి అందరూ ఆ దేశానికి మద్దతుగా కదలివస్తారు. కానీ దాని అర్థం అందరూ యుద్ధంలో ప్రవేశిస్తారని కాదు. ఎవరు ఏ రూపంలో పాల్గొంటారన్నది వారి నిర్ణయం. ఉక్రెయిన్ నాటోలో లేకపోయినా అమెరికా సహా అందరూ తమ తమ సహాయాలు చేస్తూనే ఉన్నారు. ఇందులో గుర్తించవలసింది మరొకటి ఏమంటే, ఉక్రెయిన్‌కు అందజేసే ఆయుధాలన్నీ ఖరీదుకేగానీ ఉచితంగా కాదు.

వైట్‌హౌస్ చర్చలు సానుకూలంగా ఉన్నట్లు భావించిన ట్రంప్ ఆ వెంటనే పుతిన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇక ఇరుపక్షాలూ సన్నద్ధమైతే మొదట రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షుల మధ్య ద్వైపాక్షికంగా, తర్వాత అమెరికా అధ్యక్షుని చేరికతో త్రైపాక్షికంగా చర్చలు జరుగు తాయి. శాంతి దిశగా అడుగులైతే పడుతున్నాయి. ఇందుకు తిరిగి ఏ భంగమూ కలగదని ఆశించాలి.

*వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు*

# ప్రజాస్వామ్య రక్షకులు ప్రజలే!

**అభిప్రాయం**



ప్రొ॥ కూరపాటి వెంకట నారాయణ

మన దేశ ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్‌గా (1990–96) టి.ఎన్. శేషన్ ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనకు ఎనలేని కృషి చేసి తనదైన ముద్ర వేశారు. ఎన్నికలలో పాల్గొనే పార్టీలకు, అభ్యర్థులకు వర్తించే నియమావళిని తు.చ. తప్పకుండా అమలు చేశారు. రాజ్యాంగం ప్రకారం స్వయం ప్రతిపత్తి గల భారత ఎన్నికల సంఘం (ఈసీ) తన అధికారాలను ఉపయోగించుకుని నిక్కచ్చిగా వ్యవహరించడం లేదనే విమర్శను కొద్ది సంవత్సరాలుగా ఎదుర్కొంటున్నది. ఎన్నికలలో రోజు రోజుకూ పెరుగుతున్న ధన స్వాముల ఆగడాలను నియంత్రించడంలో ఈసీ తన నిజాయతీని నిరూపించలేక పోతున్నదని ఎన్నికల తీరు స్పష్టం చేస్తున్నది.

వివిధ రకాల ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, విందులు, వినోదాలు, నగదు పంపిణీ, గిఫ్టుల పంపిణీ వంటివి చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అధికార్లకూ ఈ సంగతి తెలుసు. తెలంగాణలో దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికలలో కొన్ని గ్రామాల ఓటర్లు తమకు డబ్బులు ఇంకా చేరలేదని పోలింగ్ జరుగుతున్న రోజు ధర్నా చేసిన ఉదంతాలు చూస్తే మన ప్రజాస్వామ్యం ఎటువైపు పయనిస్తుందో అర్థమవుతుంది. ఆర్థికంగా బలపడ్డ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిమితిని మించి అనేక రెట్లు డబ్బులు ఖర్చుపెడుతున్నప్పటికీ ఈసీ తగిన చర్యలు చేపట్టడం లేదు.

◆ ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తెలిసినా జనం 'అది మామూలే కదా' అన్న ధోరణితో నిరాసక్తంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

కొన్ని సందర్భాల్లో ఒకే ఓటరు రెండు వేరు వేరు ప్రదేశాలలో ఓటు హక్కు కలిగి ఉండటం ఈ 'అతి పెద్ద' ప్రజాస్వామ్యంలో మరో విచిత్రం. ఒకే ఓటరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేస్తాడు, తాను వలస వెళ్లిన పట్టణంలో కూడా పురపాలక సంస్థ ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగిస్తున్నాడు. ఎన్నికల బూత్‌లలో అసలు ఓటర్ల కంటే డూప్లికేట్ ఓటర్లు ఎక్కువగా కనిపిస్తున్నారు. అసలు ఓటర్లను బూత్‌లకు రాకుండా చేయడమో, లేదా వారు రాకముందే వారి ఓట్లను వీళ్లే వేయడమో జరుగుతోంది.

జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు మహారాష్ట్రలో గత శాసనసభ ఎన్నికల్లో జరిగిన అవకతవకలను ఎత్తి చూపుతున్నాయి. అలాగే కర్ణాటక సెంట్రల్ బెంగళూరులోని మహాదేవపురా శాసనసభ నియోజకవర్గంలో, ఇతర రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల అవకతవకలనూ ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చారు. అయినప్పటికీ ఈసీ తగిన విధంగా స్పందించడం లేదనే విమర్శలు తెలిసినవే. బిహార్‌లో గత పార్లమెంటు ఎన్నికల్లో ఏడు కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇటీవల నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)తో వారిలో 65 లక్షల ఓటర్లు తగ్గడం దేశంలో పెద్ద దుమారం లేవడానికి కారణమయ్యింది. ఈ భారీ ఓటర్ల కోతకు రాజకీయ ఒత్తిళ్లకు ఎన్నికల సంఘం తలవంచడమే కారణమనే విమర్శ పెద్ద ఎత్తున వినిపిస్తోంది.

ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తెలిసినా జనం 'అది మామూలే కదా' అన్న ధోరణితో నిరాసక్తంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. ప్రజలు చైతన్యంతో నిరసనను తెలియజేయకపోతే... మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.

*వ్యాసకర్త యూజీసీ ఎమెరిటస్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ*

## సోషల్ టాక్

### చైనా వలలో పడొద్దు!



1. ఇప్పటికీ చైనా దగ్గర 38 చ.కి.మీ. భారత భూభాగం ఉంది. 2. సరిహద్దు నుంచి బలగాలను ఉపసంహరించడం లేదు. 3. అరుణాచల్ తమదే అంటున్నారు. 4. సబ్ మెరైన్లు, స్టెల్త్ ఫైటర్లతో పాక్‌ను బలోపేతం చేస్తున్నారు. 5. అరుదైన ఖనిజాలను ఇండియాకు ఇవ్వడం పట్ల అభ్యంతరాలున్నాయి. 6. ఎల్‌ఏసీ దాకా రైల్వే లైన్ నిర్మిస్తున్నారు. సరిహద్దు వివాదాలు సంతృప్తికరంగా పరిష్కారమై, పీఓకే మనదని అంగీకరిస్తేనే చేరువ చైనాకు కావాలి.

– ప్రకాశ్ సింగ్, పోలీస్ మాజీ ఉన్నతాధికారి

### దక్షిణాదికే సరి



ప్రధాని గుజరాత్ నుంచి, స్పీకర్ రాజస్థాన్ నుంచి, రాష్ట్రపతి ఒడిశా నుంచి, ప్రతిపక్ష నేత యూపీ నుంచి ఉన్నారు. ఉప రాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండటం ఆదర్శనీయం.

– యశోవర్ధన్ ఝా ఆజాద్, ఐబీ మాజీ స్పెషల్ డైరెక్టర్


### కదలిక



ఓడరేవులో ఓడ సురక్షితంగా ఉంటుంది. కానీ అది ఉండాల్సిన చోటు అది కాదు. కదలటం బాధాకరమే. మార్పు బాధాకరమే. కానీ, ఉన్నచోటే ఉండిపోవడమంత బాధాకరమైనది మరొకటి ఉండదు.

– ఎన్.ఆర్. నారాయణ మూర్తి, ఇన్ఫోసిస్ కో–ఫౌండర్

### లక్ష్యం



నేను బాలుడిగా ఉన్నప్పుడు నన్ను అదృశ్యం చేసుకునే మహిమను ఎప్పటికైనా సాధించగలననే నమ్మాను. కానీ నేను కచ్చితంగా తెలుసుకున్నది మాత్రం ఒకటి ఉంది. జీవితానికి ఒక లక్ష్యం లేకపోతే మాత్రం మనం అదృశ్యం అయినట్లే!

– టెరెన్స్ స్టాంప్, నటుడు, ఆస్కార్ నామినీ

### అశ్రద్ధ



మీరేమిటన్నది మీ గురించి మీరు తెలియజెప్పుకోవటానికి అశ్రద్ధ వహిస్తే... మీ కంటే ముందే ఇతరులు మీ గురించి వేరే విధంగా ఈ లోకానికి తెలియబరుస్తారు. ఆ అవకాశం వారికి ఇవ్వకండి!

– మిషెల్ ఒబామా, తొలి బ్లాక్ 'ఫస్ట్ లేడీ'

### నీడ



ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు, భయంపై విజయం సాధించడం! భయం నీడ నుండి బయటకు అడుగు పెట్టినప్పుడు అవకాశాలు ఒక్కసారిగా వచ్చేస్తాయి.

– లారా లూమర్, యాక్టివిస్టు

## మలేరియా తగ్గితే జీడీపీ పెరిగింది!

**ఇన్ బాక్స్**

ప్రపంచ వ్యాప్తంగా దోమల నివారణ పెద్ద సమస్యగా మారింది. దోమల వల్ల వచ్చే ముఖ్యమైన వ్యాధి మలేరియా. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషానికి ఒక మరణం సంభవిస్తోంది. గత కొన్ని దశాబ్దాలుగా మలేరియా నియంత్రణలో కష్టించి సాధించిన ప్రగతి ఇప్పుడు ప్రమాదంలో పడి, ముందుకు సాగలేని పరిస్థితి వచ్చింది. వాతావరణం, సామాజిక సంఘర్షణలు, ఆర్థిక స్థితిగతులు, అత్యవసర పరిస్థితులు దీనికి అడ్డంకులుగా మారుతున్నాయి. అందువలన మలేరియా నియంత్రణ ప్రాథమిక సూత్రాలైన గుర్తింపు, చికిత్స, నివారణ చర్యలు అందుబాటులో ఉండటం లేదు. నిరూపితమైన నివారణ చర్యల కోసం తిరిగి పెట్టుబడి పెట్టడం, అడ్డంకులను తొలగించు వ్యూహాలను పన్నడం, కలసికట్టుగా తిరిగి అందరూ ఈ కొత్త ప్రయత్నాలను మొదలు పెట్టడం ద్వారా మలేరియాను అంతం చేయవచ్చు.



2000 – 2017 మధ్య 180 దేశాల మలేరియా, స్థూల దేశీయోత్పత్తు (జీడీపీ)ల డేటాలను విశ్లేషించినప్పుడు... మలేరియా సంభవం 10% తగ్గినప్పుడు తలసరి జీడీపీలో సగటున 0.3% పెరుగుదల ఉందని తేలింది. ప్రతి దేశం మలేరియాను నివారించడానికీ, గుర్తించడానికీ, చికిత్స చేయడానికీ ఒక కొంగొత్త సాంకేతికతను వాడుతున్నాయి. దోమల జీవిత కాలాన్నీ, అవి మలేరియాను వ్యాప్తి చేసే సామర్థ్యాన్నీ తగ్గించడానికి పురుగు మందులతో కూడిన దోమ తెరల సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. 2000లో ఈ సాంకేతికతను విస్తరించినప్పటి నుండి 68 శాతం మలేరియా కేసులను నివారించినట్లు అంచనా. 'కాలానుగుణ మలేరియా చికిత్స' పొందిన పిల్లలలో దాదాపు 75 శాతం మలేరియా బారి నుంచి బయటపడ్డారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు దీర్ఘకాలం ఉండే దోమ తెరలు, మోనోక్లోనల్ యాంటీ బాడీ చికిత్స, శక్తిమంతమైన కొత్త వాహక నియంత్రణ సాధనాలు, జన్యుపరంగా మార్పు చెందిన దోమలు, ప్రపంచంలోని మొట్టమొదటి మలేరియా వ్యాక్సిన్ వంటి విప్లవాత్మక ఆవిష్కరణలపై పనిచేస్తున్నారు.

అందువలన గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ దేశాలు మలేరియా నిర్మూలనకు దగ్గరగా ఉన్నాయి. మన దేశంలో గత సంవత్సరం 2,57,383 మలేరియా కేసులు, 62 మరణాలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా గిరిజన ఆవాసాలు, కొండ ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతూ ఉన్నాయి. అక్కడ జనాభా 20% మాత్రమే ఉన్నప్పటికీ, 80% కేసులు అక్కడే ఉన్నాయి. మనందరం కలిసి మలేరియాను సమూలంగా తొలగించేందుకు కంకణం కట్టుకుందాం. ఇది మన సమష్టి బాధ్యత.

– తలతోటి రత్న జోసఫ్, మెడికల్ ఎంటమాలజిస్ట్ | 9490413111
(నేడు వరల్డ్ మస్కిటో డే)

**డేటా పాయింట్**

## 66 శాతం 'నెట్' వినియోగదారులు!

టెలికమ్ నియంత్రణ సంస్థ 'ట్రాయ్' గణాంకాల ప్రకారం... ఈ ఏడాది మార్చి నాటికి దేశంలోని ఇంటర్‌నెట్ వినియోగదారులు 96.91 కోట్లు. 2024 డిసెంబరులో ఇది 97.01 కోట్లు. అంటే స్వల్పంగా తగ్గుదల నమోదైందన్నమాట. దేశంలో మొత్తం వైర్‌లెస్ వినియోగదారుల సంఖ్య 116.37 కోట్లు. జనవరి – మార్చి త్రైమాసికంలో మొత్తం వినియోగించిన వైర్‌లెస్ డేటా 59,447 పెటా బైట్లు (ఒక పెటా బైట్ అంటే 10,48,576 గిగాబైట్లు). బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు 94.41 కోట్ల మంది. మొత్తం ఇంటర్‌నెట్ సబ్‌స్క్రైబర్లలో పట్టణాలకు చెందినవారు 57.9 శాతం కాగా, గ్రామీణులు 42.1 శాతం. మొత్తంగా చూస్తే దేశంలో ప్రతి 100 మందికి ఇంటర్‌నెట్ వినియోగదారులు 68.63 మంది. 30 ఏళ్ల కిందట... అంటే 1995లో దేశ జనాభాలో ఇంటర్‌నెట్ వినియోగదారులు కేవలం 0.03 శాతమే. ఇప్పుడు ఏకంగా 66 శాతానికి పైగా పెరిగారు.



జనాభాలో ఇంటర్‌నెట్ వినియోగదారుల శాతం

| | |
|---|---|
| 1995 | 0.03 |
| 2000 | 0.5 |
| 2005 | 2.39 |
| 2010 | 7.5 |
| 2015 | 17 |
| 2020 | 43 |
| 2025 | 66 |

ఆధారం: ట్రాయ్, స్టాటిస్టా, ప్రపంచ బ్యాంకు

**జ్యోతిర్మయం**

## జగదీశ్వర తత్త్వం

బ్రహ్మ మానస పుత్రుడు అత్రి మహర్షి. మహా సాధ్వి అనసూయ ఆయన భార్య. యోగ్యులూ, ముల్లోకాలకూ పూజనీయులూ స్తుతిపాత్రులూ అయిన మహనీయులు తమకు సంతానంగా కలగాలని అత్రి మహర్షి నూరేళ్ళు తపస్సు చేశాడు. ప్రాణాయామం చేత మనసును నియంత్రించి, గాలి మాత్రమే ఆహారంగా, ఒంటి కాలి మీద నిలబడి తపస్సు చేశాడు. 'ఈ జగత్తు అంతటికీ ప్రభువైన భగవంతుడెవరో, ఆయన తనతో సమానమైన ఘనులను నాకు సంతానంగా ప్రసాదించు గాక!' అని తపస్సు చేశాడు. నూరేళ్ల తరవాత, కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతులతో, హంస, గరుడ, వృషభ వాహనాలను అధిష్ఠించి ఉన్న బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏక కాలంలో ఆయన ముందు సాక్షాత్కరించారు. ''త్రిమూర్తులారా! నేను తపస్సు చేసింది జగదీశ్వరుడొక్కడి గురించి. ఆయన కాకుండా, నా తపఃఫలంగా, మీ ముగ్గురు మహనీయులూ నా ముందు ప్రత్యక్షం కావటం, నా తపః సంకల్పానికి భిన్నంగా ఉంది!'' అని.

''సాటిలేని మహర్షివి నువ్వు తపస్సు చేస్తే, నీ సంకల్పమే సిద్ధిస్తుంది. అన్యథా జరగదు. **'యథా కృతః తే సంకల్పః భావ్యం తేన ఏవ, న–అన్యథా!'** (భాగవతం) మా ముగ్గురి కలయికే నువ్వు ధ్యానించిన జగదీశ్వరుడు. కాబట్టి జగదీశ్వరుడిని నువ్వు ధ్యానించినప్పుడు, నువ్వు ధ్యానించింది మా ముగ్గురినీ! నువ్వు సంకల్పించినట్టే, మా ముగ్గురి అంశలతో, మాకు సములైన ముగ్గురు కుమారులు కలుగుతారు'' అని వరమిచ్చి వెళ్ళారు. ఆ ప్రకారమే, అత్రి–అనసూయలకు బ్రహ్మ అంశతో చంద్రుడూ, విష్ణువు అంశతో దత్తాత్రేయుడూ, శివాంశతో దుర్వాసుడూ కుమారులుగా కలిగారు. అత్రి–అనసూయ పుణ్య దంపతుల గురించిన కథలు రామాయణ, భారత, భాగవతాలలోనూ, ఇతర పురాణాల్లోనూ కనిపిస్తాయి. జగదీశ్వర తత్త్వం గురించిన పై కథ భాగవతం నాలుగో స్కంధంలోనిది.

– ఎం. మారుతి శాస్త్రి

## క్లుప్తంగా...

### పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

- డీజీపీ జితేందర్ హామీ



సాక్షి, హైదరాబాద్: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీజీపీ డాక్టర్ జితేందర్ హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించడం, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతస్థాయిలో అమలు చేయడం, పదోన్నతులు, ఇతర పరిపాలనా అంశాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, వైద్య సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ...అసోసియేషన్ సూచనలను పరిశీలించి, అవసరమైన స్థాయిలో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. మెడికల్ క్యాంపులను విస్తృత స్థాయిలో నిర్వహించి సిబ్బందికి వైద్య పరీక్షలు చేయాల్సి ఉందని అన్నారు. 12 అంశాలను పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. అన్ని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన డీజీపీ జితేందర్, ఇతర పోలీసు అధికారులకు గోపిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

### సింగరేణికి గనుల అన్వేషణ లైసెన్స్

- సంస్థ సీఎండీ బలరాం వెల్లడి



సాక్షి, హైదరాబాద్/కొత్తగూడెంఅర్బన్: కర్ణాటక రాష్ట్రం దేవదుర్గ్‌లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్‌ను సింగరేణి సంస్థ దక్కించుకోబోతున్నట్టు సంస్థ సీఎండీ బలరాం తెలిపారు. కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో 37.75 శాతం రాయల్టీని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్–1 బిడ్డర్‌గా నిలిచిందని తెలిపారు. ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే పనులు మొదలుపెట్టి, ఫలితాల నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని తెలిపారు. దీని ద్వారా గనులను మైనింగ్ కోసం వేలం నిర్వహిస్తారని వెల్లడించారు. అన్వేషణ కోసం సుమారు 90 కోట్ల రూపాయలు వ్యయం అవుతుండగా.. అందులో రూ.20 కోట్లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా చెల్లిస్తుందని తెలిపారు. కాగా, సింగరేణి సంస్థ లైసెన్స్‌ను వేలం ద్వారా దక్కించుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు.

### రెడ్కో చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శరత్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శరత్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.





## చెరువు నిండి.. పుట్టిలో ఇంటికి

కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని చర్లతిర్మలాపూర్ చెరువు నిండి కాజ్‌వే మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా, మంగళవారం ఉదయం గ్రామం నుంచి జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లే సమయంలో.. ప్రవాహ వేగం మరింత పెరిగింది. దీంతో గ్రామస్తులు పుట్టిలో విద్యార్థులను ఉంచి తాడుతో లాగుతూ ఉయ్యాలవాడ– చర్లతిర్మలాపూర్ మధ్యనున్న కాజ్‌వేను దాటించారు. అక్కడినుంచి విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు చేరుకున్నారు. - సాక్షి, నాగర్‌కర్నూల్

## 'పడకేసిన' సౌకర్యాలు

ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో జ్వరాలు పంజా విసురుతున్నాయి. సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తీవ్రత పెరిగింది. దీంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పిల్లల విభాగంలో పడకలు సరిపోవడం లేదు. ఒక్కొక్క పడకపై ఇద్దరేసి చిన్నారులను పడుకోబెట్టి.. చికిత్స చేస్తున్నారు. దీనివల్ల వ్యాధులు నయమవ్వడమేమో కానీ.. ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్



# గోదావరి ఉగ్రరూపం!

- భద్రాచలం వద్ద గంటగంటకూ పెరుగుతున్న ఉధృతి
- మరో 24 గంటల్లో తొలి ప్రమాద హెచ్చరిక జారీ!
- కాళేశ్వరం లింక్–2, 4 ద్వారా పంపింగ్ ప్రారంభం
- మల్లన్న, కొండపోచమ్మ సాగర్‌లకు చేరిన గోదావరి జలాలు



26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాక్షి, హైదరాబాద్: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రాష్ట్రంలోని సింగూరు నుంచి ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ వరకు పరీవాహకంలోని అన్ని ప్రాజెక్టులకు వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం రాత్రి 7 గంటలకి భద్రాచలం వద్ద 6.87 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో నీటిమట్టం 36.5 అడుగులకు చేరుకుంది. ప్రవాహం 9.32 లక్షల క్యూసెక్కులు, నీటి మట్టం 43 అడుగులకు చేరితే తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. పెన్‌గంగా, ఎగువ గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి నదుల్లో ఉధృతి పెరుగుతుండటంతో మరో 24 గంటల్లో తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. మంజీరపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకి 37,499 క్యూసెక్కుల వరద వస్తుండగా, 19.39 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 43,1501 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ట సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 80వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 17.8 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 88వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీరామ్‌సాగర్ నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, 2.75 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 72.99 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 39 గేట్లను పైకెత్తి 3.75 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 3.74లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 16.06 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 3.74 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల బరాజ్‌కి 2.63 లక్షలు, అన్నారం బరాజ్‌కి 1.21 లక్షలు, మేడిగడ్డ బరాజ్‌కి 6.65 లక్షల క్యూసెక్కులతోపాటు సమ్మక్క బరాజ్‌కి 7.65 లక్షలు, సీతమ్మసాగర్ బరాజ్‌కి 6.27 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి విడుదల చేస్తున్నారు.

**కాళేశ్వరం లింక్–1, 2 ద్వారా పంపింగ్ షురూ**

మిడ్‌మానేరు జలాశయం నుంచి అన్నపూర్ణ పంప్‌హౌజ్ ద్వారా గోదావరి జలాల తరలింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–2లో భాగమైన నంది పంప్‌హౌజ్‌లోని ఒక పంప్ ద్వారా 3150 క్యూసెక్కులను మేడారం రిజర్వాయర్‌లోకి వేసి అక్కడి నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా రామడుగు రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. రామడుగు నుంచి 3150 క్యూసెక్కులను గాయత్రి పంప్‌హౌజ్‌లోని ఒక పంప్ ద్వారా మిడ్‌మానేరు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. శ్రీరామ్‌సాగర్ నుంచి ఫ్లడ్‌ఫ్లో కెనాల్ ద్వారా గ్రావిటీతో మరో 12,600 క్యూసెక్కులు మిడ్‌మానేరులోకి వచ్చి చేరుతుండడంతో జలాశయంలో నిల్వలు 13.78 టీఎంసీలకు చేరాయి. దీంతో మిడ్‌మానేరు నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–4లో భాగమైన అన్నపూర్ణ పంప్‌హౌజ్‌లోని ఒక పంపు ద్వారా 3200 క్యూసెక్కులను అనంతగిరి రిజర్వాయర్‌లోకి వేస్తుండటంతో రిజర్వాయర్‌లో నిల్వలు 3.5 టీఎంసీలకు గాను 1.06 టీఎంసీలకు చేరాయి. మిడ్‌మానేరు నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా నిల్వలు 25.77 టీఎంసీలకు చేరితే 4 పంపులను ఆన్‌చేసి రోజుకు కనీసం ఒక టీఎంసీ జలాలను తరలించుకునే అవకాశం కలగనుంది. రంగనాయకసాగర్ నుంచి రెండు పంపుల ద్వారా 2534 క్యూసెక్కుల నీళ్లను మల్లన్నసాగర్‌లోకి ఎత్తిపోస్తుండటంతో రిజర్వాయర్‌లో నిల్వలు 50 టీఎంసీలకు గాను 10.38 టీఎంసీలకు చేరాయి.

**శ్రీశైలం, సాగర్‌లో ఇలా..**

దోమలపెంట/నాగార్జునసాగర్: కృష్ణాపరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుతోంది. ఎగువన గల శ్రీశైలం జలాశయానికి 3,61,654 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. దిగువకు స్పిల్‌వే మీదుగా 3,44,750 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 65,436 క్యూసెక్కులు మొత్తం సాగర్ జలాశయంలోకి 4,10,186 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి 3,94,573 క్యూసెక్కులు వదులుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–1, 2 పంప్‌హౌస్‌ల ద్వారా జరుగుతున్న నీటి పంపింగ్ వివరాలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

## పంటల సాగు ఆశాజనకం

- కృష్ణా, గోదావరి ప్రాజెక్టులకు పోటెత్తిన వరద
- వరదల నిర్వహణ, సాగునీటి అవసరాలను సమతూకం చేయాలి: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కింద పంటల సాగుకి ఆశాజనక పరిస్థితులు నెలకొన్నాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. కృష్ణా పరీవాహకంలోని జూరాల, శ్రీశైలం, సాగర్‌లో నిల్వలు గరిష్ట స్థాయికి చేరాయని, గోదావరి ప్రాజెక్టులకు సైతం భారీ వరదలు పోటెత్తాయన్నారు. రాష్ట్రంలోని 34,740 చెరువుల్లో 12,023 చెరువులు నిండి ఉప్పొంగుతున్నాయని చెప్పారు. 9,100 చెరువులు 75–100 శాతం వరకు నిండాయన్నారు. ప్రాజెక్టులకు వస్తున్న వరదలను సమర్థవంతంగా నిర్వహించాలని, సాగునీటి అవసరాలను సమతూకం చేసుకుంటూ నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో జలాశయాలకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఎన్సీలతోపాటు క్షేత్రస్థాయిలోని సీఈలు, ఎస్‌ఈలు, ఈఈలతో మంగళవారం ఆయన జలసౌధ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్, వచ్చే రబీ పంటల అవసరాల కోసం గోదావరి జలాలను ఒడిసిపట్టుకోవడానికి పంప్‌హౌజ్‌ల ద్వారా గరిష్ట సామర్థ్యంతో నీళ్లను ఎత్తిపోయాలని ఉత్తమ్ ఆదేశించారు. బుధవారం తానే స్వయంగా ఎల్లంపల్లి, శ్రీరామ్‌సాగర్, మిడ్‌మానేరు రిజర్వాయర్లను సందర్శించి వరద పరిస్థితులను సమీక్షిస్తానని వెల్లడించారు.

**రూ.335 కోట్లతో పునరుద్ధరణ**

వరదల్లో దెబ్బతిన్న జలవనరుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. మొత్తం 177 చెరువులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాలకు గండ్లు పడటంతోపాటు ఇతరత్రా నష్టం జరిగిందని క్షేత్రస్థాయి నుంచి నివేదికలు అందాయన్నారు. రూ.335 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన పునరుద్ధరణ పనులను వేగిరం చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్, ములుగు, మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో అత్యధిక నష్టం జరిగిందని, వరదల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరదల నిర్వహణతోపాటు రైతులకు సాగునీటి సరఫరా అనే రెండు సవాళ్లు తమ ముందున్నాయని, రెండింటినీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చూస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్ పాల్గొన్నారు.

## పంట పొలాల్లో ఇసుక మేటలు

- ములుగు జిల్లాను వీడని వాన.. వరద..




చిన్నబోయినపల్లి సమీపంలో ఇసుక మేటలు వేసిన పొలంలో రోదిస్తున్న మహిళా రైతు రాజేశ్వరి

ఏటూరునాగారం: ములుగు జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో సుమారుగా 450 ఎకరాల మేర పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిన ట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివాపురం వెళ్లే ప్రధాన రోడ్డు కొట్టుకుపోయింది. వట్టివాగు, గోగుపల్లి వాగు వరద రోడ్డుపై నుంచి ప్రవహించడంతో బీటీ కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. కొండాయి వద్ద జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో పడవలను నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గేవరకు పడవలను నడపొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.


**గర్భిణుల తరలింపు..:** వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల సబ్ సెంటర్ పరిధిలో గల టేకులబోరు, ముకునూరు పాలెం, వీరభద్రవరం గ్రామాలకు చెందిన గర్భిణులను మంగళవారం ఏటూరునాగారం వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని కాల్వపల్లిలో పశువుల కాపరి దుబారి రామయ్య, సాయికిరణ్, రాజబాబు, రాములు తూముల వాగు వరద ప్రవాహం పెరగడంతో చిక్కుకుపోయారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు వరదలో నుంచి వారిని వాగు దాటించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# విద్యుదాఘాతంతో నలుగురి మృతి


- పాతబస్తీలో వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా ఇద్దరు..
- అంబర్‌పేటలో గణేశ్ మండపం ఏర్పాటు చేస్తుండగా ఒకరు..
- కామారెడ్డి జిల్లాలో విగ్రహాన్ని తరలిస్తుండగా మరొకరు..




రత్లావత్ ధోని




వికాస్ ఠాకూర్



రామ్‌చరణ్ తేజ



లక్ష్మీనారాయణ



స్పృహ కోల్పోయిన సాయికి సీపీఆర్ చేస్తున్న యువకులు

చాంద్రాయణగుట్ట/అంబర్‌పేట/మాచారెడ్డి: వినాయక చవితి ఏర్పాట్లలో ఉండగా...వేర్వేరు చోట్ల జరిగిన విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రామాంతపూర్‌లో శ్రీకృష్ణుడి శోభాయాత్రలో విద్యుదాఘాతంతో ఐదుగురి మృతి చెందిన ఘటన మరవకముందే మరో నలుగురు మృత్యువాత పడ్డారు. పాతబస్తీలోని పురానాపూల్ చంద్రికాపురం బైరూపియా గల్లీకి చెందిన అఖిల్ గణనాథుడిని ప్రతిష్ఠించడానికి 15 మంది స్నేహితులతో కలిసి విగ్రహాన్ని తెచ్చేందుకు సోమవారం రాత్రి జల్‌పల్లి సమీపంలోని లక్ష్మీగూడకు వెళ్లారు. 22 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాన్ని కొనుగోలు చేసి..తక్కువ ఎత్తులో ఉండే ట్రాలీలో పెట్టి ట్రాక్టర్‌పై తీసుకొస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో బండ్లగూడలోని రాయల్ సీ హోటల్ ఎదురుగా వచ్చిన సమయంలో రోడ్డుకు అడ్డంగా వెళుతున్న 33 కేవీ హై ఓల్టేజీ విద్యుత్ తీగలు వినాయక విగ్రహ కిరీటానికి తాకాయి. దీంతో కరెంట్ షాక్ తగిలి ట్రాక్టర్ డ్రైవర్ రత్లావత్ ధోని(19), వికాస్ ఠాకూర్(21), అఖిల్‌లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సంతోష్‌నగర్‌లోని ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ధోని, వికాస్ మృతి చెందారు. అఖిల్ పరిస్థితి విషమంగానే ఉందని పోలీసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నాగులపల్లి తండాకు చెందిన డ్రైవర్ ధోనికి మూడు నెలల క్రితమే దగ్గరి బంధువుల అమ్మాయితో ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఈ నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉండగానే ఇంతలోనే విషాదం చోటుచేసుకుంది.

**స్నేహితులతో కలిసి ఏర్పాట్లలో ఉండగా...**

హనుమకొండకు చెందిన నందబోయిన రాజు తన కుటుంబంతో కలిసి బాగ్‌అంబర్‌పేట రెడ్‌బిల్డింగ్ సమీపంలో నివసిస్తున్నాడు. ఇతని కుమారుడు రామ్‌చరణ్ తేజ(18) కొన్నేళ్లుగా స్నేహితులతో కలిసి గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నాడు. సోమవారం కామాక్షి అపార్ట్‌మెంట్ ఎదుట గణేశ్ మండపానికి స్నేహితులతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. రామ్‌చరణ్ మండపంపైకి ఎక్కి పెద్ద కర్రలు సర్దుతుండగా ఒక కర్ర.. పైనుంచి వెళుతున్న హైటెన్షన్ వైర్లకు తగిలింది. దీంతో అప్పటికే పచ్చిగా ఉన్న కర్రకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి రామ్‌చరణ్ తేజ ఒక్కసారిగా కిందపడిపోయాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

**పుట్టిన రోజే...:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్‌కు చెందిన 15 మంది యువకులు గణేశ్ విగ్రహం కోసం నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో విగ్రహాన్ని తరలిస్తుండగా పాల్వంచ మండలం ఆరెపల్లి స్టేజీ వద్ద ప్రధాన రహదారిపై 11 కేవీ విద్యుత్ తీగలకు విగ్రహానికి సపోర్టుగా కట్టిన ఇనుప రాడ్లు తగిలాయి. దీంతో అక్కడే ఉన్న కొమ్ము లక్ష్మీనారాయణ(19) కరెంట్‌షాక్‌తో మృతి చెందాడు. మరో యువకుడు సాయి స్పృహ కోల్పోయాడు. వెంటనే అతన్ని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడు లక్ష్మీనారాయణది మంగళవారమే పుట్టిన రోజు. విగ్రహంతో ఇంటికి చేరిన తర్వాత కేక్ కట్ చేసి ఆనందంగా గడపాలని స్నేహితులు అనుకున్నారు. అంతలోనే ఈ ఘటన చోటుచేసుకుంది.

### విద్యుత్ వైర్లు తగలలేదు: సీఎండీ

సంఘటన స్థలాన్ని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. 33కేవీ విద్యుత్ లైన్లు తెగడం గానీ, వేలాడటం గానీ జరగలేదని, ఇందులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం లేదన్నారు. హైటల్టేజీ లైన్‌కు రెండు అడుగుల దూరం ఉన్నా, ఇండక్షన్ స్పార్క్ (ప్రేరణ జ్వాల) వస్తుందని, ఆ స్పార్క్ కారణంగానే యువకులు భయపడి కిందకు దూకి ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. డ్రైవర్ కిందకు దూకే క్రమంలో టైర్ కింద పడ్డాడని, మరో యువకుడు డివైడర్ వైపు దూకి చనిపోయాడని చెప్పారు. వర్షాకాలంలో విద్యుత్ లైన్లకు ఐదు అడుగుల దూరంగా ఉండాలని సీఎండీ సూచించారు.

## ఏసీబీకి చిక్కిన అవినీతి ఉద్యోగులు

- జెండర్ మార్పుకు ఆమనగల్లు తహసీల్దార్, సర్వేయర్ రవి రూ.లక్ష డిమాండ్
- తాండూరులో లంచం తీసుకుంటూ పట్టుబడిన మున్సిపల్ ఉద్యోగి



ఆమనగల్లులో ఏసీబీ అధికారులకు పట్టుబడిన తహసీల్దార్ లలిత, సర్వేయర్ రవి

ఆమనగల్లు/తాండూరు: ముగ్గురు అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కారు. పట్టాదారు పాస్‌పుస్తకంలో జెండర్ (లింగ) మార్పిడికి ఓ రైతు ఆమనగల్లు తహసీల్దార్ లలితను సంప్రదించాడు. దీనికోసం ఆమె రూ.50 వేలు డిమాండ్ చేసింది. దీంతో గత నెల 29న బాధితుడు రూ.50 వేలు తీసుకెళ్లి ఆఫీసులో పనిచేసే ధరణి ఆపరేటర్‌కు ఇచ్చాడు. అయినా, పని పూర్తికాకపోవడంతో తహసీల్దార్‌ను కలిశాడు. తనతోపాటు సర్వేయర్‌కు కలిపి మరో రూ.50 వేలు ఇస్తే పని పూర్తి చేస్తామని చెప్పారు. దీంతో రెండు వారాల క్రితం ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయించాడు. తహసీల్దార్‌తో బాధితుడు మాట్లాడిన ఫోన్ సంభాషణ, ఇతర ఆధారాలతో ఏసీబీ డీఎస్పీ శ్రీధర్, సీఐలు గౌస్‌ఆజాద్, మధుసూదన్‌రెడ్డి కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం సోదాలు నిర్వహించారు. తహసీల్దార్ లలితతోపాటు, సర్వేయర్ రవిని ఓ గదిలో విచారించారు. అనంతరం వారిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

**ఇంటి నంబర్ కేటాయించేందుకు..**



మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బెజ్జు రమేశ్

తాండూరు మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన ప్రజలు ఇంటి నంబర్ల కోసం పలుమార్లు మున్సిపల్ అధికారులను కలిశారు. అయినా పని కాలేదు. దీంతో కాలనీలో ఉండే ఓ పార్టీ నాయకుడిని సంప్రదించారు. దీంతో ఆయన మున్సిపాలిటీలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ బెజ్జు రమేశ్‌ను కలిశారు. ఒక్కో ఇంటికి రూ.6 వేల చొప్పున రూ.60 వేలు అప్పగించి, పదిమందికి ఇంటి నంబర్ ఇప్పించారు. సదరు నాయకుడు ఇదే వార్డులో ఓ రేకుల షెడ్డు నిర్మించి, ఇంటి నంబర్ ఇవ్వమని అడగ్గా, రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత మంగళవారం ఆఫీస్‌కు వెళ్లి రమేశ్‌కు డబ్బులు ఇచ్చాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకొని, నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీబీ రంగారెడ్డి జిల్లా రేంజ్ డీఎస్పీ ఆనంద్ మాట్లాడుతూ ఈ వ్యవహారంలో మరెవరి పాత్ర అయినా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

## నగదు ఆధారిత గేమ్స్‌పై నిషేధం

- మూడేళ్ల జైలు, రూ.కోటి జరిమానా
- ప్రచారం చేసిన వారికి రెండేళ్ల జైలు
- రూ.50 లక్షల జరిమానా కూడా
- గేమింగ్ ప్లాట్‌ఫాంల నియంత్రణ
- కీలక బిల్లుకు కేంద్రం ఆమోదం
- ప్రజారోగ్యం దృష్ట్యా నిర్ణయం
- ఇ-స్పోర్ట్స్, సోషల్ గేమ్స్‌కు ప్రోత్సాహం
- నేడు పార్లమెంటు ముందుకు బిల్లు

**న్యూఢిల్లీ:** భారత్‌లో ఆన్‌లైన్ గేమింగ్‌కు నూకలు చెల్లాయి. నెటిజన్లను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సర్వనాశనం చేస్తున్న ఈ భూతానికి సమాధి కట్టే దిశగా కేంద్రం కీలక చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలు అందించే ప్లాట్‌ఫాంలపై అతి త్వరలో నిషేధం విధించనుంది. ఈ మేరకు ఆన్‌లైన్ ప్రమోషన్, నియంత్రణకు ఉద్దేశించిన 'రెగ్యులేషన్, ప్రమోషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్'బిల్లుకు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదముద్ర వేసింది. ఆన్‌లైన్ గేమ్ యూజర్లు ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ దిశగా కఠిన చర్యలకు ఉపక్రమించింది. ముఖ్యంగా యూజర్లకు నగదు ప్రోత్సాహకాలను ఎరగా వేస్తున్న గేమింగ్ ప్లాట్‌ఫాంలపై ఉక్కుపాదం మోపనుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం చట్టబద్ధమైన నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. ఒక ఆన్‌లైన్ గేమింగ్ నగదు బెట్టింగ్ పరిధిలోకి వస్తుందా, రాదా అన్నది తేల్చే పూర్తి అధికారాలు దానికి కట్టబెట్టనున్నారు. ''దేశాన్ని పట్టి పీడిస్తున్న నగదు అక్రమ చెలామణీ (మనీ లాండరింగ్), అక్రమ ఆర్థిక లావాదేవీలు, సైబర్ క్రైమ్ వంటి పలు జాఢ్యాలకు ఈ ఆన్‌లైన్ నగదు బెట్టింగ్‌లు ఊతమిస్తున్నట్టు తేలిన నేపథ్యంలో కఠిన చర్యలకు ప్రధాని నరేంద్ర మోదీ పచ్చజెండా ఊపారు. ఈ బిల్లును బుధవారమే పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు''అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ''ఆన్‌లైన్ బెట్టింగులు పౌరులకు పూడ్చుకోలేని ఆర్థిక నష్టం మిగులుస్తున్నాయి. డిప్రెషన్ల వంటి మానసిక సమస్యలకు లోనై చాలామంది ఆత్మహత్యల దాకా వెళ్తున్నారు''అని గుర్తు చేశాయి.

**బిల్లులోని కీలకాంశాలు...**

- రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు, బాధ్యులకు మూడేళ్ల కఠిన జైలు శిక్ష, రూ.కోటి దాకా జరిమానా. పదేపదే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే ఐదేళ్ల దాకా జైలు శిక్ష పడుతుంది.
- వాటిని ప్రచారం చేసే వ్యక్తులు, సంస్థలకు రెండేళ్ల దాకా జైలు, రూ.50 లక్షల దాకా జరిమానా
- ఇలాంటి గేమింగ్ సంబంధిత నిధులను ప్రాసెస్ చేయకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై నిషేధం
- ఇలాంటి వాటిని ప్రోత్సహించే ప్లాట్‌ఫాంలకు వాణిజ్య ప్రకటనలను కూడా పూర్తిగా నిషేధిస్తారు
- నమోదు కాని, అక్రమ గేమింగ్ ప్లాట్‌ఫాంలపై ఉక్కుపాదం మోపుతారు
- ఇ-స్పోర్ట్స్, క్యాండీ క్రష్ వంటి నైపుణ్యాధారిత ఆన్‌లైన్ గేమ్స్ తదితరాలను ఇతోధికంగా ప్రోత్సహిస్తారు
- ఇలాంటి గేమ్స్ ఆడేవారిని మాత్రం శిక్షల పరిధి నుంచి తప్పించారు. వారిని బాధితులుగా పరిగణించాలని నిర్ణయించారు.

### మంత్రివర్గం ఇతర నిర్ణయాలు

రూ.8,307 కోట్లతో ఆరు వరుసల భువనేశ్వర్ బైపాస్ ప్రాజెక్టుకు, రూ.1,507 కోట్లతో రాజస్తాన్‌లోని కోటా-బుందీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవి పరిశ్రమకు, వర్తక, విద్యా రంగాలకు ఎంతగానో ప్రోత్సాహమివ్వడంతో పాటు ఇతోధికంగా ఉపాధి కల్పించే చర్యలంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు.

### ఇప్పటికే పలు చర్యలు

జూదంగా మారిన ఆన్‌లైన్ బెట్టింగ్, గేంబ్లింగ్ ప్లాట్‌ఫాంలను నిషేధించేందుకు మోదీ సర్కారు కొన్నేళ్లుగా కీలక చర్యలు తీసుకుంటూ వస్తోంది...

- 2022-2025 జూన్ నడుమ ఇలాంటి 1,524 ప్లాట్‌ఫాంలను నిషేధించింది.
- ప్రస్తుతం ఐటీ చట్టం, 2000, ఐజీఎస్టీ చట్టం ప్రకారం నమోదు కాని, విదేశీ, చట్టాలను ఉల్లంఘించే ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫాంలను నిషేధించేలా మధ్యవర్తి సంస్థలకు సూచించే అధికారం జీఎస్టీ నిఘా విభాగం డీజీ చేతిలో ఉంది.
- ఆన్‌లైన్ మనీ గేమింగ్ సప్లయర్లను ఐజీఎస్టీ చట్టం ప్రకారం కేంద్రం నియంత్రిస్తోంది.
- ఇలాంటి గేమింగ్ ప్లాట్‌ఫాంలను 2023లో 28 శాతం జీఎస్టీ పరిధిలోకి తెచ్చారు.
- వీటిద్వారా గెలుచుకునే నగదు మొత్తాలపై ఆదాయ పన్నును 2025 ఆర్థిక సంవత్సరం నుంచి 30 శాతానికి పెంచారు.
- విదేశీ గేమింగ్ ఆపరేటర్లను కూడా భారత చట్టాల పరిధిలోకి తెచ్చారు.
- 2023 నుంచి అమల్లోకి వచ్చిన భారత న్యాయసంహిత ప్రకారం అనధికారిక బెట్టింగ్‌ను క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. దీనికి ఏడేళ్ల దాకా జైలుశిక్షతో పాటు భారీ జరిమానాలు విధిస్తారు.

# నెహ్రూ వల్ల రెండు సార్లు దేశ విభజన

## సింధూ నది జలాల ఒప్పందంతో భారత్‌కు తీవ్ర నష్టం

- 80 శాతం జలాలను పాకిస్తాన్‌కు అప్పగించారు
- నెహ్రూ హయాంలో జరిగిన తప్పిదాలను సరి చేస్తున్నాం
- ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- సి.పి.రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందామని.. సహకరించాలని విపక్షాలకు విజ్ఞప్తి



సమావేశంలో రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న ప్రధాని మోదీ, మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, జేపీ నడ్డా

**న్యూఢిల్లీ:** దివంగత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సొంత ప్రతిష్ట పెంచుకోవడానికి దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడ్డారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. పాకిస్తాన్‌తో నెహ్రూ కుదుర్చుకున్న సింధూ జలాల ఒప్పందంతో మనకు పూడ్చలేని నష్టం జరిగిందన్నారు. అప్పటి మంత్రివర్గాన్ని గానీ, పార్లమెంట్‌ను గానీ విశ్వాసంలోకి తీసుకోకుండా ఈ ఒప్పందంపై ఆమోదముద్ర వేశారని విమర్శించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎన్డీఏ ఎంపీలకు మోదీ పిలుపునిచ్చారు. దేశానికి.. ప్రధానంగా రైతన్నలకు నష్టం చేకూర్చేలా నెహ్రూ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేశామని గుర్తుచేశారు. నెహ్రూ నిర్వాకం వల్ల రెండుసార్లు దేశ విభజన జరిగిందన్నారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో భారత్‌ను విభజించారని, సింధూ నదిని ముక్కలు చేసి దేశాన్ని మరోసారి విభజన తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. అధికార ఎన్డీయే తరఫున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సి.పి.రాధాకృష్ణన్‌ను ప్రధాని మోదీ మంగళవారం ఎన్డీయే ఎంపీలకు పరిచయం చేశారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఏం చెప్పారంటే...

**రాద్ధాంతం ఎందుకని దబాయింపు**

''సింధూ నదిలో 80 శాతానికి పైగా నీటిని పాకిస్తాన్‌కే అప్పగించారు. మన రైతులను దగా చేశారు. అప్పటి జనసంఘ్ ఎంపీ అటల్ బిహారీ వాజ్‌పేయి సహా పలువురు పార్లమెంట్ సభ్యులు నెహ్రూ నిర్ణయాన్ని తప్పుపట్టారు. నిరసన వ్యక్తంచేశారు. దీనిపై పార్లమెంట్‌లో రెండు గంటలపాటు చర్చ జరిగింది. కొన్ని బకెట్ల నీరు పోతే రాద్ధాంతం ఎందుకని నెహ్రూ దబాయించారు. పైగా లద్దాఖ్‌లో మన భూభాగాన్ని చైనా ఆక్రమించుకుంటే చూసీచూడనట్లు వదిలేశారు. అక్కడ గడ్డి పరక కూడా పెరగదని వ్యంగ్యంగా మాట్లాడారు. చేసిన పొరపాటును నెహ్రూ కొన్నిరోజులకు ఒప్పుకున్నారు. సింధూ నది జలాల ఒప్పందం కుదుర్చుకుంటే పాకిస్తాన్‌తో ఇతర సమస్యలు పరిష్కారం అవుతాయని భావించానని, కానీ, అలా జరగలేదని ఒక సహచరుడితో అన్నారు. నెహ్రూ హయాంలో చేసిన తప్పిదాలను సరి చేస్తున్నాం'' అని అన్నారు.

**సరిపడా విదేశీ మారకద్రవ్య నిల్వలు**

''ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ సంస్థ ఇండియా క్రెడిట్ రేటింగ్‌ను ఇటీవల అప్‌గ్రేడ్ చేసింది. మన ఆర్థిక వ్యవస్థ ప్రగతికి ఇదొక నిదర్శనం. దీనివల్ల మన దేశానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయి. జీఎస్టీలో తదుపరి తరం సంస్కరణలు తీసుకొస్తామని, జీఎస్టీ రేట్లను సరళీకృతం చేస్తామంటూ ఎర్రకోట నుంచి చేసిన ప్రకటనను స్టాక్‌మార్కెట్ స్వాగతించింది. సెన్సెక్స్ వరుసగా రెండు రోజులు ర్యాలీ చేసింది. మన ఆర్థిక వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉంది. ప్రపంచంలోని అత్యంత రద్దీ ఎయిర్‌పోర్టుల్లో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కూడా ఉంది. విదేశీ మారకద్రవ్య నిల్వలకు ఢోకా లేదు. సరిపడా నిల్వలు మన దగ్గర ఉన్నాయి'' అని అన్నారు.

### రాజకీయాలతో రాధాకృష్ణన్ ఆడుకోలేదు

''ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం హర్షణీయం. ఆయన ఎంతో నిరాడంబరంగా జీవిస్తారు. దశాబ్దాలుగా ప్రజాసేవకు అంకితమయ్యారు. క్రీడల్లో ఆయనకు ఎంతో ఆసక్తి ఉన్నప్పటికీ రాజకీయాలతో ఏనాడూ ఆడుకోలేదు. రాధాకృష్ణన్‌తో నాకు నాలుగు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. మాకు నల్లజుట్టు ఉన్నప్పటి నుంచి పరస్పరం మంచి పరిచయం ఉంది. ప్రజాసేవ అంటే ఆయనకు అమితమైన అనురక్తి. వివిధ స్థాయిలో ప్రజలకు సేవలందించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో రాధాకృష్ణన్‌ను గెలిపించాలని అన్ని రాజకీయ పార్టీలకూ విజ్ఞప్తి చేస్తున్నా. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుందాం. అందుకు సహకరించాలని ప్రతిపక్షాలను కోరుతున్నా'' అని అన్నారు.

# జెలెన్‌స్కీతో మాట్లాడతా

## నేరుగా ఉక్రెయిన్ అధ్యక్షుడితో చర్చలకు సిద్ధమైన పుతిన్

- వివరాలు వెల్లడించిన అమెరికా విదేశాంగ మంత్రి రూబియో
- జెలెన్‌స్కీ, పుతిన్ భేటీ తర్వాతే త్రైపాక్షిక సమావేశం

**వాషింగ్టన్:** ఉక్రెయిన్ యుద్ధానికి ఆఖరి గడియలు దగ్గర పడిన సంకేతాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై ఆక్రమణాగ్రహంతో రగిలిపోతున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పుడు కాస్తంత మెత్తబడినట్లు తెలుస్తోంది. ఈ వాదనకు బలం చేకూరుస్తూ పుతిన్ స్వయంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపేందుకు అంగీకరించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మంగళవారం ప్రకటించారు. మంగళవారం అమెరికాలో ఫాక్స్ న్యూస్ వార్తాసంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రూబియో ఈ విషయం వెల్లడించారు. ''జెలెన్‌స్కీతో భేటీకి తాను ఇప్పుడు ఆసక్తి కనబరుస్తున్నట్లు స్వయంగా పుతిన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఫోన్‌లో చెప్పారు. ఖచ్చితంగా జెలెన్‌స్కీని కలుస్తానని ట్రంప్‌కు పుతిన్ మాటిచ్చారు. దాదాపు మూడు సంవత్సరాల తర్వాత జెలెన్‌స్కీతో పుతిన్ భేటీకి సమ్మతి తెలపడం శాంతిస్థాపన బాటలో కీలక ముందడుగు. అయితే జెలెన్‌స్కీ, పుతిన్ భేటీ అయ్యాక వెంటనే ఇద్దరు మంచి మిత్రులుగా మారతారని నేను అనుకోవట్లేదు. భేటీ జరిగిందంటే ఏకంగా శాంతి ఒప్పందం కుదిరిందని ఇప్పుడే భావించడం తొందరపాటే అవుతుంది. ఎన్నో అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరెన్నో అంశాలపై విస్తృతస్థాయి చర్చ జరగాల్సి ఉంది. గత మూడున్నరేళ్ల యుద్ధకాలంలో రష్యా, ఉక్రెయిన్ ఉన్నతాధికారులు సంయమనంతో మాట్లాడుకున్నదే లేదు. ఈ ధోరణే ఇన్నాళ్లూ రణరంగంలో మరింత రక్తంచిందేలా చేసింది. మరణాలు, మారణహోమాలకు యుద్ధం చిరునామాగా మారింది. కానీ ఇప్పుడు కాస్తంత సుహృద్భావ వాతావరణంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు మాటలు కలిపారు. తొలుత పుతిన్, జెలెన్‌స్కీ ముఖాముఖి భేటీ ఉంటుంది. ఇది సత్ఫలితాలనిస్తే ఆ తర్వాత ఇరునేతలకు ట్రంప్ జతకూడుతారు. అప్పుడు త్రైపాక్షిక సమావేశం సాకారమవుతుంది''అని రూబియో అన్నారు.

**ఇరుపక్షాలకు అనువైన చోటే భేటీ: ట్రంప్**

జెలెన్‌స్కీ, పుతిన్‌లకు అనువైన ప్రదేశంలోనే త్రైపాక్షిక సమావేశం నిర్వహిస్తామని ట్రంప్ చెప్పారు. ఈ మేరకు ఆయన తన సొంత సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్‌సోషల్‌లో ఒక పోస్ట్ పెట్టారు.''సోమవారం మధ్యాహ్నం శ్వేతసౌధానికి విచ్చేసిన విశిష్ట అతిథులతో చక్కని సమావేశం జరిగింది. ఐరోపా సమాఖ్య సభ్యదేశాల అగ్రనేతలతో సంయుక్త భేటీలో ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నాం. త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలన్న మా ఉమ్మడి నిర్ణయాన్ని వెంటనే పుతిన్‌కు ఫోన్‌చేసి చెప్పా. ఆయన అందుకు సమ్మతించారు. త్వరలోనే ఈ భేటీ ఉంటుంది. జెలెన్‌స్కీ, పుతిన్‌కు అనువైన నగరంలోనే తొలుత వాళ్లిద్దరూ సమావేశమవుతారు. ఇది చక్కటి ఫలితాన్నిచ్చాకే నేను వాళ్లతో కలిసి త్రైపాక్షి సమావేశాన్ని నిర్వహిస్తా. ఈ భేటీకి సాకారం చేసేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి రూబియో, నా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ చెమటోడుస్తున్నారు''అని ట్రంప్ అన్నారు.

# ఒక్కరోజే 30 సెంటీమీటర్ల వాన

- వరద నీళ్లలోనే తేలియాడిన కార్లు
- రాష్ట్రవ్యాప్తంగా 10 మంది మృతి, ముగ్గురు గల్లంతు
- లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు

## ముంబైలో స్తంభించిన రైలు, రోడ్డు, విమాన సర్వీసులు



ముంబైలోని కుర్లాలో వరదనీటిలో వెళ్తున్న బస్సు టాప్‌పైకి చేరిన ప్రయాణికులు

**ముంబై:** ముంబై వరుసగా రెండో రోజూ తడిసిముద్దయింది. మంగళవారం రికార్డు స్థాయిలో 30 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాలకు సంబంధించిన వివిధ ఘటనల్లో మొత్తం పది మంది ప్రాణాలు కోల్పోయారు. మిత్తి నదికి వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుండపోత వానల కారణంగా రోడ్డు, రైలు, విమాన సర్వీసులపైనా ప్రభావం తీవ్రంగా పడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వీధులు నదులను తలపించాయి. వాహనదారులు, ప్రయాణికులు నడుముల్లోతు వరదలోనే ముందుకు సాగాల్సి వచ్చింది. రైలు మార్గాలపై కొన్ని ప్రాంతాల్లో 8 సెంటీమీటర్ల మేర వరద చేరడంతో సెంట్రల్ రైల్వే నడిపే అత్యంత కీలకమైన సబర్బన్ సర్వీసులను రద్దు చేసింది. దీంతో, ప్రయాణికులు ఎక్కడివారక్కడే ఉండిపోయారు. రైళ్లు పట్టాలపైనే నిలిచిపోవడంతో జనం బయటకు దూకి వరద నీళ్లలోనే గమ్యస్థానాలకు కాలినడకన బయలుదేరారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయలేదు. బాంబే హైకోర్టు సైతం మధ్యాహ్నం 12.30 గంటల వరకే పనిచేసింది. సెంట్రల్ రైల్వే దూరప్రాంత రైలు సర్వీసులను రీషెడ్యూల్ లేదా రద్దు చేసింది. ఛత్రపతి శివాజీ టెర్మినస్-థానే మధ్యలో దాదాపు 8 గంటల తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. సీఎస్ఎంటీ-మన్‌ఖుర్ద్ హార్బర్ లైన్‌లో రైళ్లు మాత్రం నిలిచిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయానికి 253 విమానాల టేకాఫ్, మరో 163 విమానాల ల్యాండింగ్ ఆలస్యమైంది. దృగ్గోచరత సరిగాలేక 8 విమానాలను దారి మళ్లించినట్లు ముంబై ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

### నిలిచిన మోనో రైళ్లు



మైసూర్ కాలనీ- భక్తి పార్క్ స్టేషన్ల మధ్య నిలిచిపోయిన మోనో రైలు

సుమారు 700 మందితో మంగళవారం సాయంత్రం బయలుదేరిన మోనో రైళ్లు రెండు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. మైసూర్ కాలనీ-భక్తి పార్క్ స్టేషన్ల మధ్యన ఉండగా 6.15 గంటల వేళ విద్యుత్ సరఫరా లోపంతో అర్ధంతరంగా నిలిచిపోయింది. ఏసీ పనిచేయకపోవడంతో అందులో ఉన్న 582 మంది గంటపాటు ఉక్కిరిబిక్కిరియ్యారు. స్పృహతప్పిన కనీసం 15 మందిని ఆస్పత్రిలో చేర్పించారు. ఫైర్, మున్సిపల్ సిబ్బంది ప్రయాణికులందరినీ సురక్షితంగా ఖాళీ చేయించి, బస్సుల్లో గమ్యస్థానాలకు పంపించారని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. వడాలా స్టేషన్‌కు సమీపంలో 200 మంది ప్రయాణికులతో నిలిచిపోయిన మరో మోనోరైలును అధికారులు విజయవంతంగా వెనక్కి తీసుకెళ్లారు. కాగా, వచ్చే 48 గంటలు అత్యంత కీలకమైన సమయమని సీఎం అన్నారు. ముంబై, థానె, రాయ్‌గఢ్, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాల్లో హై అలెర్ట్ ప్రకటించామని చెప్పారు.

# బలపడుతున్న చైనా, భారత్ బంధం

- వాణిజ్య పెంపే ధ్యేయంగా తెరచుకోనున్న మూడు సరిహద్దు పాయింట్లు
- సత్సంబంధాల మెరుగు కోసం విస్తృత చర్చలు జరిపిన విదేశాంగ మంత్రులు
- 12 అంశాలపై ఇరుదేశాల మధ్య కుదిరిన పరస్పర అవగాహన

**న్యూఢిల్లీ:** గల్వాన్ ఘర్షణ ఉదంతం తర్వాత క్షీణించిన భారత్, చైనా సత్సంబంధాల బలోపేతమే లక్ష్యంగా మంగళవారం ఢిల్లీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. త్వరలో చైనాలో మోదీ పర్యటన నేపథ్యంలో భారత్‌లో పర్యటిస్తున్న ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీ, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మంగళవారం విస్తృతస్థాయి చర్చలు జరిపారు. పలు రంగాల్లో పరస్పర సహకారం, అభివృద్ధే లక్ష్యంగా 12 అంశాలపై ఉమ్మడిగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. వాణిజ్యం పెంపు ధ్యేయంగా సరిహద్దులను తెరవడం, ఇరువైపులా పెట్టుబడుల వరద పారించడం, నేరుగా పౌరవిమానయాన సేవలను పునరుద్ధరించడం వంటి కీలక అంశాలపై నేతలు అవగాహనకొచ్చారు. అమెరికా మోపిన అధిక టారిఫ్ భారం కారణంగా పరోక్షంగా చాన్నాళ్ల తర్వాత భారత్, చైనా ఏకతాటి మీదకు రావడం విశేషం. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల కీలక ఉమ్మడి ఆశయాల అమలుకు కృషి చేయాలని ఇరు పక్షాలు మంగళవారం నిర్ణయించాయి. లిపులేఖ్ పాస్, షిప్కీ లా పాస్, నాథూ లా పాస్ సరిహద్దుల గుండా తిరిగి విస్తృతస్థాయిలో వాణిజ్యం చేయాలని జైశంకర్, వాంగ్ నిర్ణయించారు. స్నేహపూర్వక సంప్రతింపుల ద్వారా సరిహద్దు వెంట మళ్లీ శాంతిస్థాపనకు ప్రయత్నించనున్నారు. ఈ మేరకు 12 అంశాలతో సంయుక్త పత్రాన్ని నేతలు విడుదలచేశారు. పర్యాటకులు, వ్యాపారులు, మీడియా ప్రతినిధులు, ఇతర కారణాలతో సందర్శించే వ్యక్తులకు వీసాలు ఇవ్వాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. వచ్చే ఏడాది కైలాశ్ పర్వత యాత్ర, మానససరోవర్ యాత్ర కోసం భారతీయులను చైనా అనుమతించనుంది. ఇరుదేశాల భూభాగాల్లో ప్రవహించే నదీజలాలపై సహకారం, ప్రవాహస్థాయిలు, వరదలపై ఎప్పటికప్పుడు సమాచార మార్పిడికి, ఇరుదేశాల నిపుణుల స్థాయి వ్యవస్థకు ప్రాధాన్యతనివ్వడం వంటివి ఈ సంయుక్త పత్రాల్లో చోటు దక్కించుకున్నాయి. భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువుల ఎగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న ఆంక్షలను సడలించడానికి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ అంగీకరించారు. భారత్‌కు అవసరమైన అరుదైన ఖనిజాలు, ఎరువులు సరఫరా చేస్తామని వాంగ్ హామీ ఇచ్చారు. ఖనిజాలు, ఎరువులతోపాటు టన్నెల్ బోరింగ్ మెషిన్ల అవసరం ఉందని జైశంకర్ చెప్పగా, వాంగ్ యీ వెంటనే సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

**''తైవాన్‌పై మా వైఖరిలో మార్పు లేదు''**

తైవాన్ విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత ప్రభుత్వ వర్గాలు మంగళవారం తేల్చిచెప్పాయి. వాంగ్‌తో సమావేశమైనప్పుడు చైనాలో తైవాన్ అంతర్భాగం అని జైశంకర్ వ్యాఖ్యానించినట్లు చైనా విదేశాంగ శాఖ పొరపాటున తెలియజేసింది. దీనిపై భారత ప్రభుత్వ వర్గాలు తాజాగా స్పష్టతనిచ్చాయి. ప్రపంచంలోని ఇతర దేశాల తరహాలోనే తైవాన్‌తో సంబంధాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నాయి. తైవాన్‌తో భారత్‌కు చక్కటి సంబంధాలు ఉన్నట్లు వెల్లడించాయి.



### భారత్ - చైనా సంబంధాలు పైపైకి: మోదీ

భారత్-చైనా మధ్య సంబంధాలు స్థిరంగా పురోగమిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పరస్పర ప్రయోజనాలను, అవసరాలను గౌరవించుకుంటూ ముందుకెళ్తున్నాయని తెలిపారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. భారత్-చైనా సంబంధాలపై వారు మాట్లాడుకున్నారు. అనంతరం మోదీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో రష్యాలోని కజన్ సిటీలో చైనా అధినేత జిన్‌పింగ్‌తో భేటీ అయ్యానని, అప్పటి నుంచి భారత్-చైనా సంబంధాలు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల నడుమ స్థిరమైన, నిర్మాణాత్మక సంబంధ బాంధవ్యాల వల్ల ఆసియాతోపాటు ప్రపంచంలో శాంతి, సౌభాగ్యం నెలకొంటాయని మోదీ స్పష్టంచేశారు.

# 6 వేల విద్యార్థి వీసాలు రద్దు

## చట్ట ఉల్లంఘనలు, నేరాలకు పాల్పడినందుకు కఠినచర్యలు తీసుకున్న అమెరికా

**వాషింగ్టన్:** అమెరికా చట్టాలను మీరితే విద్యార్థి వీసాలను రద్దుచేయడం ఖాయమని గతంలోనే స్పష్టంచేసిన ట్రంప్ ప్రభుత్వం అన్నంతపనీ చేసింది. అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తూ, పలురకాల నేరాలకు పాల్పడినందుకు శిక్షగా ఇప్పటిదాకా 6,000 మంది విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటించింది. ఇతరులపై దాడులు, మద్యం సేవించి వాహనం నడపడం, చోరీలకు పాల్పడటం, ఉగ్రవాదానికి నైతిక మద్దతు పలకడం, ఇతరత్రా చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో మునిగిపోయిన అంతర్జాతీయ విద్యార్థుల స్టూడెంట్ వీసాలను రద్దుచేసినట్లు విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా చట్టనిబంధనల్ని ఉల్లంఘించినందుకు ఈ ఆరువేల మందిలో దాదాపు 4వేల మంది వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఉగ్రవాద సంబంధ కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు 300 మంది విద్యార్థుల వీసాలను రద్దు చేశారు. 'ఇమిగ్రేషన్, నేషనల్ యాక్ట్'లోని మూడో సెక్షన్ ప్రకారం ఉగ్రవాదానికి మద్దతు పలికిన వారి వీసా రద్దు అవుతుంది. పాలస్తీనా అనుకూల, యూదు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న వారి వీసా రద్దు అవుతుంది. ఉగ్రసంస్థకు అనుకూలంగా వ్యవహరించడం, అమెరికా పౌరులకు ప్రాణహాని కల్పించడం సైతం చట్టాన్ని ఉల్లంఘించే చర్యలుగా అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. జనవరి నుంచి వేలాది మంది విద్యార్థుల వీసాల అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌ను అర్ధంతరంగా ట్రంప్ ప్రభుత్వం నిలిపివేయడం తెల్సిందే. జూన్‌లో మళ్లీ వీసాల అపాయింట్‌మెంట్లను పునరుద్ధరించినప్పటికీ అభ్యర్థులంతా తమ సోషల్‌మీడియా ఖాతాల వివరాలు అధికారులు తనిఖీ చేసేందుకు వీలుగా 'పబ్లిక్'మోడ్‌లోనే ఉంచాలని సూచనలు చేయడం తెల్సిందే.





# నేడు సభలో జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు

**న్యూఢిల్లీ:** కేంద్రం ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లును ప్రవేశపెట్టి, చర్చను ప్రారంభించనున్నట్లు సమాచారం. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను కేంద్రం పునరుద్ధరించేందుకు అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఈ నెల 20న ప్రవేశపెట్టే బిల్లు ద్వారా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తారన్న వార్తలు జోరందుకున్నప్పటికీ దీనిపై కేంద్రం ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన సానుకూల పరిణామం చోటుచేసుకుంటుందని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇటీవల ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి ఇవ్వడంపై అభిప్రాయం తెలపాల్సిందిగా ఇటీవల సుప్రీం కోర్టు సైతం కేంద్రాన్ని కోరింది. 2019లో ఆర్టికల్ 370 రద్దుతోపాటు జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించడం తెల్సిందే.

# ఇరుసభల్లో అదే తీరు

## ఎస్ఐఆర్ అంశంపై పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింపజేసిన విపక్ష ఎంపీలు

**న్యూఢిల్లీ:** బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై విపక్షాలు పార్లమెంట్ వేదికగా పట్టువీడట్లేవు. దాంతో లోక్‌సభ, రాజ్యసభలు పూర్తిస్థాయిలో సజావుగా సాగక తరచూ వాయిదాలు పడుతూ ముందుకు సాగాయి. చివరకు బుధవారానికి వాయిదాపడ్డాయి. తొలుత మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ మొదలుకాగానే స్పీకర్ ఓం బిర్లా మాట్లాడారు. ఇకపై సభాకార్యకలాపాలు రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో పొందుపరిచిన 18 భాషలకు తోడుగా మరో నాలుగు భాషల్లోనూ తర్జుమా కానుందని ఆయన ప్రకటించారు. సభలో జరిగే కీలక చర్చలు కీలక భాషల్లో అందరికీ అందుబాటులోకి రావడం ప్రజాస్వామ్య విజయమని ఆయన ప్రకటిస్తుండగానే విపక్షసభ్యులు లేచి నిలబడి ఎస్ఐఆర్ అనుకూల ప్లకార్డులు చేతబూని నినాదాలు మొదలెట్టారు. విపక్షసభ్యుల నినాదాల మధ్యే సభ ప్రశ్నోత్తరాల సమయందాకా వచ్చింది. తర్వాత విపక్షపార్టీల ఎంపీలు గట్టిగా నినాదాలు చేయడంతో సభ మధ్యాహ్నానికి వాయిదాపడింది. మధ్యాహ్నం 12 గంటలకు సభ మొదలుకాగానే విపక్షసభ్యులు ఆందోళన చేపట్టడంతో సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న తెన్నేటి కృష్ణప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదాపడింది. తర్వాత సభ మొదలయ్యాక గువాహటిలో ఐఐఎం ఏర్పాటుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టారు. షిల్లాంగ్ తర్వాత ఈశాన్యభారతంలో నెలకొల్పబోతున్న రెండో ఐఐఎం ఇదే. మూజువాణి ఓటుతో ఈ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(సవరణ),2025 బిల్లుకు సభ ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లు ఆమోదం పొందగానే సభ బుధవారానికి వాయిదాపడింది. రాజ్యసభలోనూ ఇదే దృశ్యం పునరావృతమైంది. బిహార్‌లో ఓట్ల జాబితాలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని, ఈ అంశంపై తక్షణం చర్చించాలని విపక్షసభ్యులు డిమాండ్‌లు చేశారు. దీంతో సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదాపడింది. తిరిగి మొదలుకాగానే 267వ రూల్ ప్రకారం ఎస్ఐఆర్‌పై చర్చించాలంటూ తన వద్దకు వచ్చిన 20 నోటీసులను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. సభ పలుమార్లు వాయిదా పడుతూ చివరకు బుధవారానికి వాయిదాపడింది.

# పీఎం, సీఎం, మంత్రుల తొలగింపునకు నేడు బిల్లు

**న్యూఢిల్లీ:** తీవ్రమైన నేరాలకు పాల్పడి అరెస్టయితే ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా బిల్లును బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. ఐదేళ్ల అంతకంటే ఎక్కువ శిక్షపడే స్థాయి తీవ్ర నేరాలకు పాల్పడి, అరెస్టయి వరసగా 30 రోజులపాటు కస్టడీలో ఉన్న సందర్భాల్లో ఆయా నేతలను పదవి నుంచి తొలగించేందుకు ఈ మూడు బిల్లులను తీసుకొస్తున్నారు. ఈ మేరకే గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్(సవరణ)బిల్లు, 2025, రాజ్యాంగం(130వ సవరణ)బిల్లు, 2025, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ(సవరణ) బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బుధవారం వీటిని లోక్‌సభ ముందుకు తీసుకొచ్చాక పార్లమెంట్ సంయుక్త కమిటీకి సిఫార్సు చేసే తీర్మానాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రవేశపెడతారు. ప్రస్తుతమున్న కేంద్రపాలిత ప్రాంతాల చట్టం,1963లో ముఖ్యమంత్రి, మంత్రిని పదవి నుంచి తొలగించే ఏ నిబంధనా లేదు. అలాగే ఇతర చట్టాల్లోనూ ప్రధాని, కేంద్ర మంత్రులను తొలగించే నిబంధనలు లేవు.



**ఇదేం 'సింగారం'?**
కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణానికి పునాది రాయి పడేలా లేదు. నాలుగేళ్లుగా భూసేకరణ, డీపీఆర్ అంటూ హడావుడి చేస్తున్నప్పటికీ ఆచరణ రూపం దాల్చేలాలేదు. -10లో



**కెమెరా క్లిక్.. అదిరే పిక్..**
అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్ ఫొటోగ్రఫీ ప్రతి ఒక్కరికీ చేరువైంది. అందరి జీవితాల్లోనూ అనేక మధురమైన జ్ఞాపకాలను పదిలపరుస్తోంది. - సిటీప్లస్‌లో

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం
25.0/22.0
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 25, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

# కేబుల్ వైర్లు కట్

## మూగబోయిన టీవీలు

### నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు

- ఇబ్బందుల్లో వినియోగదారులు
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి
- రామంతాపూర్, అంబర్‌పేట్, బండ్లగూడ దుర్ఘటనలతో చర్యలు



ఎల్బీ నగర్‌లో



జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో తొలగించిన కేబుల్ వైర్లను తరలిస్తున్న సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో

విద్యుత్ స్తంభాలకు వేలాడుతూ నగరవాసుల మృత్యువాతకు కారణమవుతున్న స్టార్ కేబుళ్లు, ఇంటర్నెట్ కేబుళ్ల తొలగింపు ప్రక్రియను రెండో రోజైన మంగళవారం కూడా చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా మారిన కేబుళ్లను తొలగించారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా టీవీ కేబుళ్లతో పాటు ఇంటర్నెట్ కేబుళ్లను కూడా తొలగించడంతో వినియోగదారులు ఇబ్బందుల పాలయ్యారు. ఇంట్లో టీవీ ప్రసారాలతో పాటు ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. ఇళ్ల నుంచి పని చేసే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పలేదు.

**వరుస ఘటనలతో సర్కారు సీరియస్..**

ఏదైనా స్తంభం నుంచి కేబుల్ లాగాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఒక్కో స్తంభానికి రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు చెల్లించాలి. కేబుళ్లు 15 ఫీట్ల ఎత్తులో అమర్చుకోవాలి. కానీ.. మెజార్టీ కేబుళ్లు పది అడుగుల ఎత్తులోనే కన్పిస్తున్నాయి. సపోర్టింగ్ వైరు, కేబుల్ గరిష్ఠ బరువు మీటర్‌కు 200 గ్రాములకు మించరాదు. స్తంభానికి స్తంభానికి మధ్య తీగల పొడవు 50 మీటర్లు మించరాదు. కానీ.. చాలా చోట్ల కేజీల కొద్దీ బరువున్న తీగలను చుట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే జంక్షన్ బాక్సులకు కరెంట్ వాడుతున్నారు. కనీసం నెలవారీ బిల్లు చెల్లించడం లేదు. ఏ ఒక్క చోట కూడా మీటర్ ఉండదు. కానీ యథేచ్ఛగా విద్యుత్‌ను వాడుతుంటారు. నగరంలో ఈ తరహా కంపెనీలు 28కి పైగా ఉన్నట్లు అంచనా. ఆయా కేబుల్ ఆపరేటర్లతో ఇప్పటికే డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సమావేశమై..స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక నేతలు, ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలతో ఒత్తిడి తీసుకొచ్చి, తొలగింపు ప్రక్రియను విస్మరించారు. తాజాగా రామంతాపూర్, అంబర్‌పేట్, బండ్లగూడ వరుస ఘటనలతో ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. సోమవారం మధ్యాహ్నం నుంచి కేబుళ్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ.. రెండో రోజైనా మంగళవారం మరింత వేగవంతం చేసింది.

**విగ్రహాల తరలింపు పట్ల అప్రమత్తంగా ఉండాలి**

గణేష్ విగ్రహాల తరలింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ నిర్వాహకులకు సూచించారు. రామంతాపూర్, బండ్లగూడ, అంబర్‌పేట ఘటనల్లో విద్యుత్ అధికారుల తప్పిదం లేదని స్పష్టం చేశారు. ఇతర కారణాలే ఇందుకు కారణమని తెలిపారు. ఇప్పటికే ప్రమాదకరంగా మారిన ఎల్‌టీ, హెచ్‌టీ కేబుళ్లను గుర్తించి, వాటి స్థానంలో ఏబీ కేబుల్ ఏర్పాటు ప్రక్రియను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

### విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు తప్పనిసరి..

- విగ్రహాల ఎత్తును బట్టి రూట్‌ను ఎంచుకోవాలి. ఒకవేళ ఎక్కడైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- విద్యుత్ లైన్ల నుంచి కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్‌లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం /ఇండక్షన్ ఉంటుంది.
- క్రేన్లు, ట్రక్కులు, ఎత్తైన మెటల్ విగ్రహాల తరలింపులో అప్రమత్తంగా ఉండాలి.
- మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకరేషన్లను వీలైనంత వరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. సామాన్యులు విద్యుత్ స్తంభాలు ఎక్కకూడదు. సంస్థ సిబ్బంది ద్వారానే కనెక్షన్ తీసుకోవాలి.
- మండపాల్లో విద్యుత్ పనులు చేసేప్పుడు పరిసరాలను పూర్తిగా పరిశీలించాలి. విద్యుత్ తీగలు, స్తంభాలు, ఇతర ప్రమాదకర పరికరాల నుంచి పిల్లల్ని దూరంగా ఉంచాలి.
- వైరింగ్‌లో లీకేజీలు లేకుండా చూసుకోవాలి. వర్షానికి తేమతో షాక్ కొట్టే ప్రమాదం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలి.

# కుప్పలు.. తప్పని తిప్పలు

### చెత్తమయంగా మారిన నగరం

- ఎట్టకేలకు కార్మికుల సమ్మె విరమణ



**సాక్షి, సిటీబ్యూరో:** నగరం చెత్తమయంగా మారింది. ఒకవైపు వదలని వానలతో ఇంటింటి నుంచి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. మరోవైపు ఇళ్ల నుంచి సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు వెళ్లిన చెత్త అక్కడి నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించే వాహనాల కార్మికులు సోమవారం నుంచి మంగళవారం వరకు సమ్మె చేయడంతో ఎక్కడి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలో చెత్త అక్కడే పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లోనూ ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. మంగళవారం సాయంత్రం యాజమాన్యంతో కుదిరిన అవగాహనతో ప్రస్తుతానికి సమ్మె నిలిచిపోయినప్పటికీ, ఈ సమస్య మళ్లీ ఎప్పుడు తలెత్తుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

**అసలు సమస్య ఏమిటి?**

నగరంలోని చెత్తనంతా రాంకీకి చెందిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకే తరలిస్తుండటం అసలు సమస్యలకు మూలకారణం. ఒకేచోట ఈ పనులు జరుగుతున్నందున, ఎప్పుడైనా సరే సమ్మెవంటి పరిస్థితులేర్పడితే నగరం మొత్తం ప్రభావం చూపుతోంది. నగరానికి అన్నివైపులా చెత్త నిర్వహణ కేంద్రాల ప్రతిపాదనలున్నా, ప్లాంట్ల పనులు పూర్తయిన చోట సైతం అందుకు స్థానికుల నుంచి వ్యతిరేకతతో పాటు రాజకీయ కారణాలతో అవి పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో శివార్లలోని మున్సిపాలిటీల చెత్త సైతం జవహర్‌నగర్‌కే చేరుతోంది. రోజుకు సగటున 9వేల మెట్రిక్ టన్నుల చెత్తను భరించే స్థితిలో డంపింగ్‌యార్డు లేదు. ఇప్పటికైనా చెత్త నిర్వహణ ప్లాంట్ల పెంచి పనులు వికేంద్రీకరించకపోతే చెత్త సంక్షోభం తీవ్రమయ్యే పరిస్థితులు నెలకొనున్నాయి.

**ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి**

వినాయకచవితి పండుగ సందర్భంగా మండపాల నుంచి వెలువడే వ్యర్థాల సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంది. లేని పక్షంలో పండుగ సమయంలో ప్రజలు అపరిశుభ్రత, అనారోగ్యాలతో అల్లాడే పరిస్థితులు తప్పవని ఘన వ్యర్థాల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమ్మెను పురస్కరించుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా మంగళవారం సగం చెత్త మాత్రమే తరలించగలిగారు. రోజుకు దాదాపు 7,500 మెట్రిక్ టన్నుల చెత్త తరలిస్తుండగా, మంగళవారం 3,800 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే తరలించారు.

**కార్మికుల సమ్మె విరమణ**

వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ చెత్త తరలింపు పనులు నిలిపిన రాంకీ సంస్థ డ్రైవర్లు, హెల్పర్లు సమ్మె విరమించినట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికశాఖ జాయింట్ కమిషనర్ జరిపిన చర్చల్లో కార్మికుల వేతనాల పెంపునకు రాంకీ యాజమాన్యం అంగీకరించడంతో సమ్మె విరమించినట్లు ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుదాం




గణేష్ నిమజ్జన కార్యాచరణ గైడ్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి తదితరులు

- ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకొందాం
- సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**బంజారాహిల్స్:** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల గణేష్ ఉత్సవాలు–2025 ఏర్పాట్లపై జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ ఉత్సవాలకు శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు కృషి చేయాలన్నారు. నిమజ్జనం సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పాడైపోయిన రోడ్ల మరమ్మతులకు అదనపు నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. ఇది అందరి పండుగ, అన్ని ప్రభుత్వ శాఖలు, ఉత్సవ సమితి, ప్రజలు పరస్పర సహకారంతో చేసుకుందామన్నారు. సమావేశంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డీజీపీ జితేందర్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, మూడు కమిషనరేట్‌ల సీపీలు సీవీ ఆనంద్, సుధీర్‌బాబు, అవినాశ్ మహంతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**గణేష్ నిమజ్జన కార్యాచరణ గైడ్ ఆవిష్కరణ..**

గణేష్ ఉత్సవాల్లో ప్రభుత్వ శాఖలు, విభాగాల మధ్య సమన్వయం, సహకారం, సమాచారం పెంపొందించే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా రూపొందించిన గణేష్ నిమజ్జన కార్యాచరణ గైడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు ఆవిష్కరించారు. జోన్లు, సర్కిళ్ల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణ, బాధ్యుల మొబైల్ నెంబర్లు, గణేష్ యాక్షన్ టీం వివరాలు ఇందులో పొందుపరిచారు.

# భలే మంచి బేరం

## అమ్మకానికి తుర్కయంజాల్, బాచుపల్లి లేఅవుట్లలో ప్లాట్లు

- రెండు చోట్ల 82 ప్లాట్లు విక్రయానికి సిద్ధం
- మరో 11 ప్రాంతాల్లోనూ సన్నాహాలు
- దశలవారీగా ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు హెచ్‌ఎండీఏ చర్యలు

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రభుత్వ స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వివిధ చోట్ల ఉన్న ప్రభుత్వ భూములను వేలం వేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ఏర్పాట్లు చేపట్టింది. గతంలో ఉప్పల్, కోకాపేట్, బుద్వేల్, హయత్‌నగర్, బోడుప్పల్, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో విజయవంతంగా ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించి ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తాజాగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోనే ప్రభుత్వ స్థలాలను విక్రయించేందుకు సర్కార్ పచ్చజెండా ఊపింది. దీంతో పలు ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ లేవుట్లను పూర్తి చేసినప్పటికీ.. వాటిని వేలం వేసేందుకు అధికారులు సర్కార్ ఆమోదం కోసం ఎదురు చూశారు. ఈ మేరకు కొద్ది రోజుల క్రితమే హెచ్‌ఎండీఏ అధికారులు సన్నాహాలు చేపట్టారు. మొదటి విడతగా త్వరలో తుర్కయంజాల్, బాచుపల్లిలోని 82 ప్లాట్లను విక్రయించనున్నారు. ఆ తర్వాత మిగతా స్థలాలను అమ్మకానికి పెట్టనున్నారు. ప్రస్తుతం రియల్ రంగానికి సానుకూలమైన వాతావరణం ఉండడంతో అమ్మకానికి ఇదే అదనుగా భావిస్తున్నట్లు సమాచారం.

**అనూహ్య స్పందన**

ఇటీవల హౌసింగ్‌బోర్డు నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కొనుగోలుదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ స్థలాలకు సైతం మధ్యతరగతి, ఉన్నత ఆదాయవర్గాల నుంచి మంచి స్పందన ఉంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో వివిధ చోట్ల నిర్వహించిన బిడ్డింగ్‌కు ఎన్నారైలు భారీ స్పందించారు. కోకాపేట్, బుద్వేల్ వంటి ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ నిర్ణయించిన ధరల కంటే రెట్టింపు ధరల్లో అమ్ముడయ్యాయి. ప్రస్తుతం బైరామల్‌గూడ, కోకాపేట్, చందానగర్, పుప్పాలగూడ, బౌరంపేట్, చెంగిచెర్ల, సూరారంలలో మొత్తం 11 చోట్ల ఉన్న స్థలాలను విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.



**త్వరలో బిడ్డింగ్ నిర్వహించనున్న ప్లాట్‌లు..**

| లే అవుట్ | సర్వే నెంబర్ | ప్లాట్ల సంఖ్య |
|---|---|---|
| తుర్కయంజాల్ | 471/1 | 12 |
| బాచుపల్లి | 39,40 | 70 |

**దశలవారీగా వేలం నిర్వహించనున్న స్థలాలు**

| గ్రామం | సర్వే నెంబర్ | చదరపు గజాలు |
|---|---|---|
| బైరామల్‌గూడ | 57 | 2420 |
| కోకాపేట్ | 144 | 8591 |
| చందానగర్ | 174 | 484 |
| పుప్పాలగూడ | 146 | 1400 |
| బాచుపల్లి | 363 | 2299 |
| బౌరంపేట్ | 694 | 2420 |
| బౌరంపేట్ | 130 | 530 |
| బౌరంపేట్ | 130 | 1500 |
| బౌరంపేట్ | 130 | 666 |
| చెంగిచెర్ల | 33/1 | 1210 |
| సూరారం | 166/167 | 4840 |

# వేడుక.. కారాదు విషాదం

## ఆనందంతో పాటు భద్రతా ముఖ్యమే

- జనసమూహం ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం
- మండపాల ఏర్పాటు, శోభాయాత్ర, నిమజ్జనం వేళల్లో అలర్ట్
- విద్యుత్ స్తంభాలు, తీగలు, గుంతలున్న చోట ఉత్సవ ఏర్పాట్లు వద్దు
- సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేయొద్దు
- నగరంలో వరుస ఘటనల నేపథ్యంలో పోలీసుల సూచనలు




దోమలగూడ రోడ్డులో..

**సాక్షి, సిటీబ్యూరో:** పండుగ ఏదైనా ఆనందంగా, ఆహ్లాదకరంగా సాగాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి చేసుకునే వేడుకలేవైనా మధురమైన అనుభూతులను మిగల్చాలే తప్ప.. విషాద ఛాయలను కాదు. ఇప్పటికే రామంతాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో నిర్వహించిన రథయాత్రలో విద్యుదాఘాతంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటన మరవకముందే తాజాగా బండ్లగూడలో వినాయక చవితికి గణపతి విగ్రహాన్ని తరలిస్తుండగా, అంబర్‌పేటలో గణేష్ మండపం ఏర్పాటు చేస్తుండగా కరెంట్ షాక్ దుర్ఘటనలు జరిగాయి. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ వరుస వేడుకలు రానున్న నేపథ్యంలో పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.

**మార్గదర్శకాలను పాటించాలి..**

మతపరమైన పండుగలు, వేడుకల్లో జనసందోహం సాధారణమే. అందుకే వీటి నిర్వహణకు పటిష్టమైన భద్రతా చర్యలు అవసరం. సరైన ప్రణాళిక, కమ్యూనికేషన్, అవగాహన అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. పోలీసులు, ప్రభుత్వ విభాగాల భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. పరిసరాల పరిశుభ్రత, సామాజిక దూరం పాటించడంతో పాటు విద్యుదాఘాతాలు, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి. వేడుకల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను వేర్వేరుగా ఏర్పాటు చేయడంతో పాటు ప్రథమ చికిత్స సదుపాయాలను అందుబాటులో పెట్టుకోవాలి.

**ప్రజా రవాణానే ఉత్తమం..**

సాధారణంగా వర్షాకాలంలో గుంతలు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, తీగలు ఉన్న చోట అప్రమత్తంగా వ్యవహరించాలి. వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వంటి శోభాయాత్రల సమయంలో మరింత జాగ్రత్త అవసరం. వ్యక్తిగత వాహనాలకు బదులుగా ప్రజా రవాణా సదుపాయాలను వినియోగిస్తే రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. పర్సులు, విలువైన వస్తువులను వెంట తీసుకురాకూడదు. అనారోగ్య సమస్యలున్న వాళ్లు జనసందోహంలోకి వెళ్లకపోవడమే ఉత్తమం.

**అతి డెకరేషన్ వద్దు..**

మండపాలకు అతిగా డెకరేషన్ చేయకూడదు. కరెంట్ వైర్లలో ఓవర్‌లోడ్ కారణంగా భారీ ప్రమాదం జరిగే ఆస్కారం ఉంటుంది. జనసందోహం ఉన్న చోట డ్రోన్లు, ఫ్లయింగ్ కెమెరాలు నిషిద్ధం. నిమజ్జన వేళల్లో అత్యవసర దీపాలతో పాటు ఇసుక సంచులు, వాటర్ డ్రమ్‌లు వంటి అగ్ని ప్రమాద నివారణ ఉపకరణాలు వెంట ఉండేలా చూసుకోవాలి. మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఇరుకు గల్లీలు, రోడ్ల మీద, తగాదా ఉన్న భూములు, సున్నితమైన ప్రదేశాల్లో మండపాలను ఏర్పాటు చేయకూడదు. శాశ్వత నిర్మాణాలు కాకుండా తాత్కాలిక మండపాలను మాత్రమే ఏర్పాటు చేయాలి. మండపానికి మూడు వైపులా కవర్ చేస్తూ.. టార్పాలిన్‌తో రూఫ్ ఏర్పాటు చేయాలి. పబ్లిక్ రోడ్లకు ఆటంకం కలిగించేలా ఆర్చ్‌లు, స్టేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయొద్దు. జెండాలు, పోస్టర్లు, బ్యానర్లు వంటివి ఇతర మతస్తుల ప్రాంతాల వద్ద ఏర్పాటు చేయకూడదు.

**సోషల్ అలర్ట్ తప్పనిసరి..**

వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాలలో పోస్టు చేయాలనే ఆత్రుత ఉండకూడదు. అధికారిక ధ్రువీకరణ లేకుండా తప్పుడు సమాచారం, వదంతులను సోషల్ మీడియాలో వ్యాప్తి చేయొద్దు. నిర్ధారించుకోకుండా గందరగోళం, భయాందోళనలు కలిగించే ప్రమాద ఘటనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పోస్టు చేయకూడదు. భద్రతా మార్గదర్శకాలు, సానుకూల సందేశాలు స్నేహితులు, కుటుంబ సభ్యులకు చేరేలా సామాజిక మీడియాను వినియోగించాలి.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**



గత ఏడాది రాచకొండలో 13,472 వినాయక విగ్రహాలు ఏర్పాటయ్యాయి. పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే స్పీకర్లను ఏర్పాటు చేయాలి. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే కేవలం భక్తి గీతాలను మాత్రమే వినిపించాలి. డీజేలు, లౌడ్ స్పీకర్లను ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయొద్దు. శోభాయాత్రలు, బైక్ ర్యాలీలు, పాదయాత్రల నేపథ్యంలో సున్నితమైన ప్రదేశాలు, రద్దీగా ఉండే ట్రాఫిక్ ప్రాంతాలపై పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. – **జి.సుధీర్ బాబు, రాచకొండ సీపీ**

# దేశంలోనే గాంధీ ఆస్పత్రిని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం

### 2016 పడకలతో అప్‌గ్రేడేషన్ చేస్తాం

- ఆస్పత్రిలో నిర్వహణ లోపాలున్నాయి
- త్వరలోనే స్పెషలాఫీసర్‌ను నియమిస్తాం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ

**గాంధీ ఆస్పత్రి :** తెలంగాణ వైద్యప్రదాయిని సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిని దేశంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని, ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో నిర్వహణ లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దేందుకు త్వరలోనే స్పెషల్ ఆఫీసర్‌ను నియమిస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం గాంధీ ఆస్పత్రిలోని పలు వార్డులను ఆయన పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రికల్ రిపేర్లు, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, అవయవ మార్పిడి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ), వైద్యులు, సిబ్బంది కొరత తదితర అంశాలపై ఆస్పత్రి పాలన యంత్రాంగంతో సమావేశమై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. గాంధీ ఆస్పత్రి పాలన యంత్రాంగం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వహణ లోపాలను సరిదిద్దేందుకు ఐఏఎస్ క్యాడర్‌లో స్పెషల్ ఆఫీసర్‌ను నియమించనున్నట్లు స్పష్టం చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ఫండ్స్‌ను సద్వినియోగం చేసుకుని రోగులకు మరిన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గాంధీ ఆస్పత్రిని 2016 పడకలతో అప్‌గ్రేడేషన్ చేసి అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమిస్తామన్నారు. గాంధీలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు, ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు అదనంగా అవసరమయ్యే రూ.5 కోట్లు త్వరలోనే కేటాయిస్తామన్నారు.



గాంధీలో రోగితో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

**ఐవీఎఫ్, ఐయూఐ సేవలు సక్సెస్..**

గాంధీ ఆస్పత్రి సంతాన సాఫల్య కేంద్రం విజయవంతంగా కొనసాగుతోందని, 23 మందికి ఐవీఎఫ్ సేవలు అందించగా 2 పాజిటివ్ కేసులు, మరో 23 మందికి ఐయూఐ సేవల్లో 6 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని మంత్రి వివరించారు. ప్రస్తుతం గాంధీ, పేట్లబురుజు ఆస్పత్రుల్లో సంతాన సాఫల్య కేంద్రాలు కొనసాగుతుండగా, కొండాపూర్ ఆస్పత్రిలో త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. గాంధీఆస్పత్రిలో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు మాడ్యులర్ థియేటర్లు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఈ అంశంపై ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

**సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై చర్యలు..**

ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల ప్రకారం యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 379 సరోగసీ సెంటర్లను గుర్తించామని, వీటిలో 150కి పైగా నగరంలోనే ఉన్నాయని వివరించారు. నిబంధనలు అతిక్రమించిన సెంటర్లు, క్లినిక్‌లపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఎంఈ నరేందర్ కుమార్, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత, గాంధీ సూపరింటెండెంట్ సీహెచ్ఎన్ రాజకుమారి, హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ వెంకటి పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్యలతో తిరుపతి విమానం రద్దు

**శంషాబాద్:** సాంకేతిక సమస్యలతో తిరుపతి విమానం రద్దు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం ఉదయం 5.55 గంటలకు 53 మంది ప్రయాణికులతో అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 91877 విమానం తిరుపతికి బయలుదేరేందుకు సిద్ధమైంది. విమానంలో టేకాఫ్ తీసుకునే ముందు సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ విమానాన్ని నిలిపివేశారు. కొన్ని గంటల తర్వాత విమానాన్ని రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు ప్రయాణికులకు వెల్లడించారు.





## సిగరెట్లు లేవన్నందుకు బాలికపై దాడి

**సనత్‌నగర్:** సిగరెట్లు అడిగితే లేవని చెప్పినందుకు ఓ యువతిపై సమీప బంధువు దాడి చేసిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రసూల్‌పురా కృష్ణానగర్ నాల్గవ బ్లాక్‌లో నివాసం ఉండే బాలిక (17) కుటుంబం స్థానికంగా దుకాణం నిర్వహిస్తుంటుంది. ఈ నెల 17న రాత్రి 8.30 గంటల సమయంలో సదరు బాలిక షాపులో ఉండగా ఆమె సమీప బంధువు అహ్మద్ సిగరెట్స్ అడిగాడు. సిగరెట్లు లేవని చెప్పడంతో అహ్మద్ కోపంగా బాలికను బయటకు లాక్కెళ్లి కొట్టడం ప్రారంభించాడు. ఆ తర్వాత మరికొంత మంది అతని స్నేహితులు గుల్లు, ఫౌజియా, గౌసియా, నౌషీన్‌లు కూడా ఆమెపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనలో బాలిక కంటికి గాయమైంది. తన కుమార్తెపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తల్లి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మార్ఫింగ్ ఫొటోలతో యువతికి బెదిరింపులు

**సనత్‌నగర్:** 'నువ్వు నాతో ఉండకపోతే, నీ ఫొటోలను ప్రతిచోటా వైరల్ చేస్తా..నీ జీవితాన్ని నాశనం చేస్తా.. నువ్వు ఎవరికీ నీ ముఖాన్ని చూపించలేవు..' అంటూ మార్ఫింగ్ చేసిన అశ్లీల ఫొటోలు, వీడియోలతో ఓ యువతిని బెదిరించిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీకి చెందిన యువతి (18) కామన్ లా అడ్మిషన్ టెస్ట్‌కి ప్రేపర్ అవుతోంది. ఉత్తరప్రదేశ్ హర్డోల్‌కు చెందిన అర్షద్‌ఖాన్ ఏఐ పరిజ్ఞానంతో మార్ఫింగ్ చేసిన ఆమె అశ్లీల ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ గత కొంత కాలంగా బెదిరింపులకు దిగుతున్నాడు. ఈ క్రమంలో ఆమెతో పాటు ఆమె సోదరుడికి కూడా ఆ ఫొటోలు పంపించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. ఆమెకు ఫోన్ చేసి నాతో రావాలని, నేను చెప్పినట్లు వినాలని బెదిరించాడు. దీంతో అర్షద్ వేధింపులు తట్టుకోలేక బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో ప్లంబర్ మృతి


మృతిచెందిన కృష్ణ

**అమీర్‌పేట:** ఎస్ఆర్‌నగర్ పరిధిలోని బీకేగూడలో మంగళవారం ఓ ప్లంబర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీకేగూడ 60 ఫీట్ రోడ్డులో ఈశ్వర్ ప్రసాద్ అనే వ్యక్తి ఇటీవల ఓ టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. అబిడ్స్ చిరాగల్లీలో ఉండే కె.విష్ణు అలియాస్ కృష్ణ (37) అనే వ్యక్తి టిఫిన్ సెంటర్‌లో ప్లంబింగ్ పనులు చేసేందుకు వచ్చాడు. ఈ మేరకు కొంత సామగ్రి గొనుగోలు చేసి మరమ్మతులు చేసేందుకు టిఫిన్ సెంటర్ పైపోర్షన్‌కు వెళ్లాడు. ఎంత సేపటికి కిందకు రాలేదు. మధ్యాహ్నం కావస్తున్నా అతడు రాకపోవడంతో పైకి వెళ్లి చూడగా కృష్ణ కింద పడిపోయి కనిపించాడు. పరీక్షించగా కొనఊపిరితో ఉన్నట్లు గుర్తించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కృష్ణ మృతికి కారణాలపై విచారణ జరిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## బాలిక హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

**మూసాపేట:** కూకట్‌పల్లి దయార్‌గూడలో సోమవారం సహస్రిని (11) అనే బాలికను హత్య చేసిన కేసులో దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఈమేరకు మంగళవారం ఎస్ఓటీ, సీసీఎస్, పోలీస్ బృందాలు సుమారు 6 టీములుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టాయి. సీసీ ఫుటేజ్, క్లూస్ ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు అనుమానితులను విచారించారు. కాలనీలో, భవనంలోని పలువుర్ని ప్రశ్నించారు. బాలిక ఒంటిపై సుమారు 20కి పైగా చిన్న చిన్న గాట్లు ఉన్నాయని, పదునైన చిన్నపాటి ఆయుధంతో పొడిచి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మెడపై 14 గాట్లు, కడుపులో 6 గాట్లు ఉన్నట్లు బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి కాగానే మృతదేహాన్ని సంగారెడ్డి జిల్లాలోని వారి సొంత గ్రామానికి తీసుకువెళ్లారు. ఇప్పటి వరకు బాలిక హత్య ఎవరు చేశారో, ఎందుకు చేశారో అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసులు తెలిపారు. కాగా అదే భవనంలో ఉన్న ఒడిశాకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానాలున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కుటుంబంపై చేతబడి చేశారన్న అనుమానంతో అతడు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు ఆ కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

# అవినీతి జలగలు!

**ఏసీబీకి వరుసగా పట్టుబడుతున్న అధికారులు**
- ఆర్ఐ మొదలు తహసీల్దార్లు, అదనపు కలెక్టర్ల వరకు
- తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు
- అయినా మారని తీరు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** జిల్లా ప్రజలను అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుంటున్నా.. కేసులు నమోదు చేసి జైళ్లకు పంపిస్తున్నా అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ప్రతి పనికి ఓ రేట్ ఫిక్స్ చేసి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న జిల్లా.. అవినీతి కేసుల్లోనూ అదే రికార్డును కొనసాగిస్తోంది. అడ్డదారుల్లో జిల్లాకు రావడం, ఆ తర్వాత ఫోకల్ పోస్టుల్లో తిష్టవేయడం, పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించుకునే క్రమంలో ఏసీబీకి పట్టుబడుతుండటం పరిపాటిగా మారింది. పారదర్శకత, అవినీతి నిర్మూలనకు పెద్దపీట వేయాల్సిన ఉన్నతాధికారులు సైతం ఏసీబీ కేసుల్లో పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్, ఇబ్రహీంపట్నం, తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో వెలుగు చూసిన అవినీతి చేపల ఘటనను ఇంకా పూర్తిగా మరిచిపోక ముందే తాజాగా ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో మరో రెండు భారీ చేపలు ఏసీబీ వలకు చిక్కడం గమనార్హం.


రెండు నెలల క్రితం ఏసీబీకి చిక్కిన తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున

**మచ్చుకు కొన్ని..**
- పాసుబుక్‌లో జెండర్ సవరణ కోసం జూలై 29న రూ.50 వేలు తీసుకున్న ఆమనగల్లు తహసీల్దార్ లలిత, సర్వేయర్ రవి తాజాగా మరో రూ.లక్ష డిమాండ్ చేసి మంగళవారం ఏసీబీకి చిక్కారు.
- నిషేధిత జాబితాలో ఉన్న భూమిని పట్టా భూమిగా మార్చేందుకు రూ.12 లక్షలు డిమాండ్ చేసిన ఘటనలో మే 28న ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణను ఏసీబీ అరెస్ట్ చేసింది. తర్వాత 12 గంటల పాటు తహసీల్దార్ ఆఫీసులో తనిఖీలు చేసింది.
- గత ఆగస్టులో నిషేధిత జాబితాలోని 14 గుంటల భూ వ్యవహారంలో గుర్రంగూడకు చెందిన బాధితుడు ముత్యంరెడ్డి నుంచి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ అప్పటి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎంవీ భూపాల్‌రెడ్డి సహా సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు.
- భూమి పేరు మార్పిడీ వ్యవహారంలో రూ.50 వే లు తీసుకుంటూ జూలై 1న తలకొండపల్లి తహ సీల్దార్ నాగార్జున సహా వీఆర్ఏ యాదగిరి పట్టుబడ్డారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి జైలుకు పంపారు.
- గత మే 31న నెక్నంపూర్‌లోని ఓ నిర్మాణానికి నిరంభ్యంతర పత్రం జారీ కోసం రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్ సహా గండిపేట మండల సర్వేయర్ పి.గణేశ్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్తీక్, ఎస్సీ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్ ఏఈ నిఖేష్‌కుమార్ ఏసీబీ కేసులో అరెస్టై జైలుకు వెళ్లారు.
- గొర్రెల పథకం స్కాంలో సంబంధం ఉన్న జిల్లా పశువైద్య శాఖ అధికారి అంజలప్ప సహా అప్పటి భూగర్భ జలవనరులశాఖ అధికారి రఘుపతిరెడ్డి సైతం ఏసీబీ కేసులో అరెస్టై, తర్వాత విడుదలయ్యారు.
- గోపన్‌పల్లిలోని ఓ నిర్మాణానికి ట్రాన్స్‌ఫార్మర్, సీటీ మీటర్ జారీ కోసం రూ.50 వేలు డిమాండ్ చేసిన గచ్చిబౌలి ఏడీఈ సతీష్‌ను ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు.
- మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న 11కేవీ, 33 కేవీ లైన్ షిఫ్టిక్ కోసం రూ.18 వేలు లంచంగా తీసుకుంటూ సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ డీఈ (టెక్నికల్) టి.రామ్మోహన్ ఏడాది క్రితం ఏసీబీకి పట్టుబడ్డారు.

## గర్భిణి అనుమానాస్పద మృతి

**అమీర్‌పేట:** ఎండోస్కోపీ చేసుకునేందుకు ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణి కడుపులోని బిడ్డతో పాటు అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వెల్లడించారు. ఉప్పల్ చిలుకానగర్‌లో ఉంటున్న మహ్మద్ అలీం భార్య షబానాబేగం (27) ఏడు నెలల గర్భవతి. అనారోగ్య సమస్య తలెత్తడంతో వైద్యుల సలహా మేరకు ఎండోస్కోపీ చేసుకునేందుకు సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రికి వచ్చింది. ఎండోస్కోపీ చేసేందుకు లోపలికి తీసుకువెళ్లిన కొద్దిసేపటి తర్వాత సిబ్బంది బయటకు వచ్చి షబానాబేగం తీవ్ర ఆయాసంతో బాధపడుతుందని చెప్పి ఓ పేపర్‌పై సంతకం చేయించుకుని వెళ్లారు. మధ్యాహ్న సమయంలో వచ్చి కడుపులోని బిడ్డతో పాటు తల్లి మృతి చెందిందని తెలిపారు. వైద్య పరీక్షల కోసం నడుచుకుంటూ వచ్చిన షబానా బేగం మృతి చెందడంపై కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఐటీపీ అనే వింత వ్యాధితో బాధపడుతున్న కారణంగా రక్తకణాల సంఖ్య తగ్గిపోయి ఇంటర్నల్‌గా అధిక శాతం రక్తస్రావమై మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## మహాగణపతి తొలి పూజకు హాజరుకానున్న గవర్నర్

**30న దర్శించుకోనున్న యూఎస్ కాన్సులేట్ జనరల్**


యూఎస్ కాన్సులేట్ ప్రతినిధి సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**ఖైరతాబాద్:** మహాగణపతి తొలి పూజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నారని ఎమ్మెల్యే, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ్ హడ్‌హక్ కమిటీ కన్వీనర్ దానం నాగేందర్ తెలిపారు. వినాయక చవితికి వారం రోజులు ఉండటంతో మహాగణపతి తుది మెరుగులు దిద్దుకుంటున్నాడు. ఖైరతాబాద్ మహాగణపతిని ఈ నెల 30న యూఎస్ కాన్సులేట్ జనరల్ సందర్శించుకోనున్న నేపథ్యంలో యూఎస్ కౌన్సిల్ ప్రతినిధి బృందం మంగళవారం ఖైరతాబాద్ మహాగణపతి మండపాన్ని సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించారు. ప్రతినిధి బృందానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ మహాగణపతి విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా మహాగణపతి తొలి పూజకు గవర్నర్ హాజరవుతారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా వచ్చే అవకాశముందని తెలిపారు. మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలతో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హడ్‌హక్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, మహేష్ యాదవ్, రాంరెడ్డి, జి.కృష్ణయాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాదీ వీరుల ప్రతిఘటన చరిత్రాత్మకం



**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాదీ వీరులు మౌల్వీ అల్లావుద్దీన్, తుర్రేబాజ్ ఖాన్ ప్రతిఘటన స్వాతంత్య్ర ఉద్యమ చరిత్రలో భారతదేశ ఐక్యతను ప్రతిబింబిస్తుందని అసఫ్ జాహి రాజవంశం వారసులు హెచ్.హెచ్.నవాబ్ రౌనఖ్ యార్ఖాన్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉర్దూ విభాగం వేదికగా నజీర్ అహ్మద్ ఎడ్యుకేషనల్ అండ్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ''నజీర్ అహ్మద్ స్మారక ఉపన్యాసం''కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ వార్షిక కార్యక్రమం ''మౌల్వీ అల్లావుద్దీన్, తుర్రేబాజ్ ఖాన్ షహీద్ – 1857 మొదటి స్వాతంత్య్ర యుద్ధంలో అమరవీరులు''అనే అంశంపై కొనసాగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ వీరులకు నివాళి అర్పించారు. అనంతరం రౌనఖ్ యార్ఖాన్ మాట్లాడుతూ మౌల్వీ అల్లావుద్దీన్‌కు కాలాపానీ (సెల్యులార్ జైలు) విధించగా, బ్రిటీష్ రెసిడెన్సీ (ప్రస్తుత కోఠి మహిళా కళాశాల)పై దాడికి నాయకత్వం వహించిన తుర్రేబాజ్ ఖాన్‌ను ఉరితీశారని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అర్షియా జబీన్, డా.మొహమ్మద్ షోయబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సంపులో పడిన వ్యక్తిని కాపాడిన హైడ్రా


సంపులో పడిన వ్యక్తిని గాంధీకి తరలిస్తున్న హైడ్రా సిబ్బంది

**గాంధీఆస్పత్రి:** నిర్మాణంలో ఉన్న సంపులో పడిన ఓ వ్యక్తిని హైడ్రా సిబ్బంది కాపాడిన ఘటన సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో జరిగింది. పోలీసులు తెల్పిన మేరకు.. గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో వైద్య విద్యార్థుల వసతి గృహనిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. సెల్లార్‌తోపాటు సంపు కోసం ఇనుప చువ్వలతో నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో కవాడిగూడకు చెందిన హరీష్ సోమవారం రాత్రి మద్యం తాగిన మత్తులో మూత్ర విసర్జన కోసం వెళ్లి నిర్మాణంలో ఉన్న సంపులో పడిపోయాడు. బయటకు వచ్చేందుకు ప్రయత్నించి ఇనుపచువ్వలు ఎత్తుగా ఉండడంతో గాయాల పాలయ్యాడు. మంగళవారం ఉదయం సంపులో అపస్మారకస్థితిలో పడిఉన్న హరీష్‌ను చూసి కొందరు సెక్యూరిటీ సిబ్బందితోపాటు హైడ్రా, డీఆర్‌ఎఫ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. హైడ్రా రెస్క్యూ టీం ఇన్‌చార్జి స్వామి నేతృత్వంలో బృందం ఘటన స్థలానికి చేరుకుని సైడ్‌వాల్ కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలను మెషిన్‌తో కట్ చేసి హరీష్‌ను బయటకు తీసుకువచ్చారు. అనంతరం చిలకలగూడ పోలీసులకు అప్పగించారు. గాంధీ అత్యవసర విభాగంలో వైద్యసేవలు అందించడంతో బాధితుడు హరీష్ కోలుకుంటున్నాడు.

## అమ్మ మందలించిందని..

- ఇంట్లోనుంచి వెళ్లిన బాలుడు
- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**ఇబ్రహీంపట్నం:** తల్లి మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిన బాలున్ని ఇబ్రహీంపట్నం పోలీసులు క్షేమంగా అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరకొండకు చెందిన విజయకుమారి, హరిష్ దంపతులు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బ్రాహ్మణపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరి కొడుకు తుర్కయంజాల్ కాకతీయ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. చిన్న విషయంలో మందలించిందనే కారణంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తుర్కయంజాల్ నుంచి ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా పోలీసుల కంటపడ్డాడు. అతన్ని ఆరా తీసి, పీఎస్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులను పిలిచి అప్పగించారు.




బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించిన పట్నం పోలీసులు

## గణేశ్ ఉత్సవాలపై జీహెచ్‌ఎంసీ యాక్షన్ ప్లాన్

**సాక్షి, సిటీబ్యూరో:** వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఎప్పటికప్పుడు వ్యర్థాల తరలింపు, చెరువులు, సరస్సుల వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు, తదితరమైన పనులు వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనాలు పూర్తయ్యేంతవరకు ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా లేక్స్, పాండ్స్ వారీగా సర్కిల్, జోన్ స్థాయిలో సిబ్బంది, అధికారులకు బాధ్యతలప్పగించింది. ఆయా విభాగాల ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో పాటు రవాణా, హెచ్‌ఎండీఏ, పోలీసు(లా అండ్ ఆర్డర్), ట్రాఫిక్, హైడ్రా, జలమండలి, ఫైర్ సర్వీస్, ఆర్టీసీ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, టూరిజం, హెల్త్ తదితర విభాగాలు ఆయా విధులు నిర్వహించనున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 20 లేక్స్, 60 పాండ్స్‌లో నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయనున్నారు. 1357 మంది సిబ్బంది ఎప్పటికప్పుడు విగ్రహాలను తరలించే పనుల్లో నిమగ్నం కానున్నారు. రహదారులు షిఫ్టుల వారీగా శుభ్రం చేసేందుకు 367 బృందాలు గణేశ్ యాక్షన్ టీమ్స్‌గా పనిచేయనున్నాయి.

## జల్సాల కోసం చోరీలు..యువకుడి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు, నిందితుడిని చూపుతున్న పోలీసులు

**కుషాయిగూడ:** జల్సాల కోసం ఓ యువకుడు చోరీల బాట పట్టాడు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని అందినకాడికి దోచుకోవడం మొదలుపెట్టాడు. పలు మార్లు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మార్చుకోలేదు. తిరిగి దొంగతనానికి పాల్పడి పోలీసులకు చిక్కాడు. మంగళవారం కుషాయిగూడ ఏసీపీ వై.వెంకట్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన గుగులోత్ నవీన్ టెన్త్ వరకు చదువుకుని, ఎంఎల్‌టీ శిక్షణ పొంది కొద్దిరోజులు ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేశాడు. కుటుంబంతో కలిసి ఏఎస్‌రావునగర్‌లో ఉంటున్నాడు. వ్యసనాలకు బానిసైన నవీన్ చోరీలు చేయడం మొదలెట్టి ఇప్పటి వరకు 22 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. తాజాగా ఈ నెల 15న ఏఎస్‌రావునగర్, రుక్మిణిపురికాలనీ, క్రాంతి ఐకాన్‌లో నివసించే చర్ల చంద్రశేఖర్ ఇంట్లో దొంగతనానికి పాల్పడి నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నిందితుడు ఉప్పల్ బస్టాండ్ సమీపంలో తిరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన 16 తులాల బంగారు ఆభరణాలు, 1.70 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఔరంగాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శిల్పవల్లి తదితరులు

**కవాడిగూడ:** మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఓ మహిళతోపాటు యువకుడిని దోమలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. బషీర్‌బాగ్‌లోని సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ శిల్పవల్లి వివరాలు వెల్లడించారు. ఔరంగాబాద్‌కు చెందిన కోమల్ సోమినాద్ వరుసకు కుమారుడు అయ్యే సాహిల్ మహేష్ సాలుంకేతో కలిసి గంజాయి వ్యాపారం చేస్తోందని తెలిపారు. మంగళవారం ఉదయం లిబర్టీ చౌరస్తాలో అనుమానస్పదంగా లగేజ్ బ్యాగులతో ఉండగా దోమలగూడ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం బయట పడిందన్నారు. విజయవాడలో బాబు అనే వ్యక్తి నుండి గంజాయి కిలో రూ.25 వేలకు చొప్పున 18 కేజీల గంజాయిని కొనుగోలు చేశారని తెలిపారు. గత కొంతకాలంగా ఔరంగాబాద్‌లో ఈ గంజాయిని అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి విక్రయించిన బాబు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్స్ సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నా రు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ యాదగిరి, ఎస్ఐ కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో గురుబ్రహ్మనగర్, దుర్గాభవానీనగర్ బస్తీవాసులు

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గురుబ్రహ్మనగర్, దుర్గాభవానీనగర్ బస్తీల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలంటూ ఆయా బస్తీలవాసులు మంగళవారం నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా ఎంతోమందికి ఆవాసం కల్పించినవారవుతారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి



బస్తీల్లో పర్యటిస్తున్న ఏసీపీ రాఘవేంద్రరావు

**రహమత్‌నగర్:** నగరంలో వరుసగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం రాత్రి ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, బోరబండ ఎస్‌హెచ్ఓ సురేందర్, అడ్మిన్ ఎస్ఐ నాగూల్ మీరా, ట్రాన్స్‌కో ఏఈతో కలిసి మోతినగర్, శ్రీరాంనగర్, బ్రహ్మశంకర్‌నగర్ తదితర బస్తీల్లో ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాఘవేంద్రరావు మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## జలమండలి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



జలమండలి ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**పంజగుట్ట:** జలమండలిలో అధికంగా పని చేస్తున్న కార్మిక, ఉద్యోగులకు ఓవర్‌టైం చెల్లింపులు యథావిధిగా కొనసాగిస్తామని జలమండలి ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సి.సతీష్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ వటర్‌వర్క్స్, సివరేజీ కంగర్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు, తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు క్లెం రాజ్‌రెడ్డితో కలిసి ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో మంగళవారం ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని యూనియన్ నాయకులు ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అల్లి శ్రవణ్ కుమార్, ఎండీ జాంగీర్, బి.దేవేందర్, సైద్ అక్తర్ అలీ, భూమయ్య, సీతయ్య, రాజు, ఆనంద్ రెడ్డి, అజయ్‌నాథ్, లక్ష్మణ్‌యాదవ్, గౌస్ పాషా, మహేష్ తదితరులు ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**హిమాయత్‌నగర్:** విద్యార్థినులను ఉన్నత విద్య అభ్యసించడంతో పాటు వారిని ఉద్యోగ అవకాశాల వైపు మళ్లించడం, సొంతంగా వ్యాపారంలో రాణించేలా వారిని సన్నద్ధం చేస్తామని బీజేఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.విజయ్‌కుమార్ అన్నారు. మహిళా అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 'గర్ల్స్ బాస్ రెడీనెస్' అనే అంశంపై లాంచ్ గర్ల్స్ అనే సంస్థ, మహిళా సాధికారత విభాగం సంయుక్తంగా మంగళవారం కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. మొదట అధ్యాపకులకు శిక్షణ ఇప్పిస్తామని, ఆ తర్వాత కళాశాలలోని మొదటి సంవత్సరం విద్యార్థులకు 15 వారాల పాటు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. మహిళా సాధికారత విభాగాధిపతి డాక్టర్ ఎస్.దీపిక, వైస్.ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాస్, పరీక్షల విభాగాధికారి డాక్టర్ పి.బాలస్వామి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ సూర్యకుమారి, ప్రోగ్రాం మేనేజర్ జే.జ్యోతి, సుస్మిత, లహరి కోర్స్ కో–ఆర్డినేటర్ జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో నిలిచిన వరద నీరు



కేబీఆర్ పార్కు వద్ద వరద నీటి తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

### కేబీఆర్ పార్కులో నిండిన కుంటలు..

# రోడ్లపైకి వరద..

- రంగంలోకి హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు
- మోటార్లతో నీటిని తోడేసిన హైడ్రా సిబ్బంది
- ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- పనులను పర్యవేక్షించిన ఇన్‌చార్జి మంత్రి, మేయర్





కేబీఆర్ పార్కు గేట్ నెం.2లో వరద నీటిని పంపింగ్ చేస్తున్న హైడ్రా సిబ్బంది

**బంజారాహిల్స్:** వరుసగా కురుస్తున్న వర్షాలకు కేబీఆర్ పార్కులోని కుంటలు, చెరువులు నిండిపోవడంతో రోడ్లపై వరద చేరుతోంది. మరో వైపు జీహెచ్ఎంసీ వాక్‌వే మొత్తం వరద నీటితో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కేబీఆర్ పార్కు పార్కింగ్ గేటు నెం.2 పూర్తిగా నీట మునగడంతో పాటు వరద పెద్ద ఎత్తున ప్రధాన రోడ్డుపైకి రావడంతో వాహనాలు ఇక్కడ నెమ్మదిగా ముందుకు కదిలాయి. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు ఇక్కడికి చేరుకొని భారీ మోటార్ల సహాయంతో వరద నీటిని తోడేయడంతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న పైప్‌లైన్లో వ్యర్థాలు ఇరుక్కోవడంతో నీరు సాఫీగా సాగడం లేదని గుర్తించారు. పైప్‌లైన్‌ను శుభ్రంచేసి వరద వెళ్లేలా చేశారు. మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఇక్కడికి చేరుకున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాశ్ గౌడ్ రోడ్డుకు అవతలి వైపు నుంచి కూడా కొంత ట్రాఫిక్‌ను ముందుకు పంపించారు. వరద తగ్గడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయ్యింది.

**వరద నీటిని తొలగించిన హైడ్రా**

**పనులను పర్యవేక్షించిన మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి**

**బంజారాహిల్స్:** కేబీఆర్ పార్కు వద్ద నిలిచిన వరద నీటిని హైడ్రా తొలగించింది. కేబీఆర్ పార్కులో నుంచి భారీ మొత్తంలో వచ్చిన వరద రోడ్డు చేరడంతో హైడ్రా, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఆ నీటిని తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశాయి. కేబీఆర్ ప్రధాన గేటు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లే మార్గంలో నీరు నిలిచిపోవడంతో ఈటీ ఇంజిన్లతో హైడ్రా సిబ్బంది బయటకు తోడేశారు. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఈ పనులను పర్యవేక్షించారు. ఈ సమస్యను కౌన్సిల్‌లో పెట్టి పైప్‌లైన్ల ఏర్పాటు పనులను మంజూరు చేయిస్తామని మంత్రితో పాటు మేయర్ ఈ సందర్భంగా అధికారులకు చెప్పారు. అప్పటి వరకూ అక్కడ నీరు నిలవకుండా జాగ్రత్తల తీసుకోవాలని హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులకు సూచించారు. హైడ్రా ఏడీఎఫ్ఓ మోహన్‌రావు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌తో పాటు పలువురు అధికారులు ఈ పనులను పూర్తి చేయించిన వారిలో ఉన్నారు.

## మార్గదర్శకాలను తప్పక పాటించాలి

- గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి




మాట్లాడుతున్న బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

**ఫిలింనగర్:** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం ఫిలింనగర్ గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో 18 బస్తీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హర్షద్, ఫిలింనగర్ ఎలక్ట్రిసిటీ ఏఈ పవిత్ర, 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. బస్తీల్లో మండప నిర్వహణకు సంబంధించి సమస్యల గురించి, వినాయక ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను అధికారులు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు తెలియజేశారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. పోలీసు శాఖ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తుల పట్ల సమాచారం అందించాలన్నారు. లౌడ్ స్పీకర్లు నిర్దిష్ట సమయంలోనే ఉపయోగించాలని, డీజేలకు అనుమతులు లేవన్నారు. నిమజ్జన ఊరేగింపును నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు.

## వైద్యం అందించడంలో అశ్రద్ధ వద్దు

**సనత్‌నగర్:** ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం అందించే విషయంలో అశ్రద్ధ చూపొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4.62 లక్షల విలువైన ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం ఎంతో ఖరీదుగా మారిందని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే అనేక మందికి తాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించామన్నారు.

## జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్సే..



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

**శ్రీనగర్‌కాలనీ:** కాంగ్రెస్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని నమ్మి గెలిపించారని, జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని సైతం గెలిపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కృష్ణానగర్‌లో మంగళవారం నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని, బూత్ కమిటీలు బలంగా పనిచేయాలని కోరారు. ఎంపీగా ఉన్నప్పుడు అంజన్‌కుమార్‌యాదవ్ డివిజన్‌లో చేసిన అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచాయని, ఆయన వంటి అనుభవజ్ఞులకు పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తే సైనికుల్లా పనిచేసి పార్టీకి భారీ విజయాన్ని అందిస్తామని డివిజన్ నేతలు పేర్కొన్నారు. డివిజన్ నేతలు రామయ్య, సలీం, గాలయ్య, కిరణ్‌యాదవ్, లక్ష్మీరెడ్డి, పద్మజ, రాధిక, సుకన్య, మోసిన్ ఖురేషి ఎర్ర కృష్ణకుమార్ పాల్గొన్నారు.

## గ్రామగ్రామంలో రాజ్యాంగం నినాదంతో..



రాజ్యాంగాన్ని ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

**పంజగుట్ట:** గ్రామగ్రామంలో రాజ్యాంగం అనే నినాదంతో ప్రతి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్లలో రాజ్యాంగం ప్రతిని, అంబేద్కర్, పూలే పుస్తకాలను పంపిణీ చేస్తామని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాఖ్య ప్రతినిధులతో కలిసి రాజ్యాంగం ప్రతిని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య కన్వీనర్ రామకృష్ణ కెతావత్, మహిళా కో కన్వీనర్లు సుశీలా కుమారి, చంద్ర ప్రభతో కలిసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేలకు పైగా గ్రామాలు, కాలనీలు, బస్తీల్లో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, అంబేద్కర్, పూలే చరిత్రలతో ఉన్న పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాగం తీసేసి మనుశాస్త్రం తెచ్చే ఆలోచనలో ఉన్నాయని, రాజ్యాంగం లేకపోతే సమానత్వం ఉండదని, మహిళలకు స్వేచ్ఛ ఉండదని, రిజర్వేషన్లు ఉండవని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కలిసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. సమావేశంలో సమాఖ్య చీఫ్ లీగల్ అడ్వైజర్ ఆనంద్, పీవీ రమణ, శేఖర్, పుష్పవతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాస ప్రత్యేక పూజలో విజయారెడ్డి



**హిమాయత్‌నగర్:** నారాయణగూడలోని గాంధీ కుటీర్ భూలక్ష్మి దుర్గాదేవి ఆలయంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలో భాగంగా మంగళవారం అమ్మవారికి కూరగాయలతో(శాకంబరి) అలంకరించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

## కాపలా ఉన్నాం.. చెత్త వేయెద్దు ప్లీజ్..



చెత్తకుప్పలు వేసే చోట కాపలా ఉన్న బస్తీ నేతలు

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటినగర్ రేషంబాగ్ ఆలియా మజీదు వద్ద కొన్నేళ్లుగా రోడ్డు పక్కన చెత్తకుప్పలు వేస్తుండటంతో భారీగా చెత్త పేరుకుపోయి స్థానికంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఇక్కడ చెత్త వేయవద్దని జీహెచ్ఎంసీ స్వీపర్లు, ఎస్ఎఫ్ఏలు, ఆర్పీలు మహిళా సమాఖ్యల ప్రతినిధులు ఎన్నిసార్లు చెప్పినా స్థానికులు వినిపించుకోవడం లేదు. చెత్తా చెదారం పేరుకుపోతూ దుర్వాసనలతో స్థానికులు నరకాన్ని అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే స్థానిక నేతలు మహ్మద్ మొహిసిన్, జానకి రామ్ తదితరులు కొత్త ఆలోచనతో ఇక్కడ చెత్త వేయకుండా పరిష్కారం చూపారు. రెండు గొడుగులు ఏర్పాటు చేసి వాటి కింద కుర్చీలు ఏర్పాటు చేసుకొని కూర్చుంటున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఎవరైనా చెత్త వేయడానికి వస్తే వారికి అవగాహన కల్పించి పంపించేస్తున్నారు. ఇలా ఐదు రోజులుగా వీరు చేస్తున్న కృషి ఇప్పటికైతే మంచి ఫలితాలు ఇస్తోంది. వీరు లేని సమయంలో గొడుగులు, కుర్చీలతో పాటు పారిశుద్ధ్య కార్మికులు కూర్చుంటున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకుంటున్న ఉద్యోగులు

**బంజారాహిల్స్:** ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచార సభలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ, మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఉద్యోగులతో పాటు 100 మందికి పైగా స్థానికులు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కిడ్నీ ఫంక్షనింగ్ పరీక్షలతో పాటు పలు రకాల రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించినట్లు, కంటి పరీక్షలు కూడా నిర్వహించినట్లు దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వాహకులు ఎ.జానకి, మిర్యాల రాధాకృష్ణ తెలిపారు.

## 21న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉమ

**పంజగుట్ట:** విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం యూనిఎక్స్‌పర్ట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన రాజ్‌భవన్ రోడ్డు, సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్స్ హెడ్ ఉమ తెలిపారు. కార్యక్రమ బ్రోచర్‌ను సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే విద్యార్థుల కోసం ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ మంచి అవకాశమని తెలిపారు. ఇందులో 60కి పైగా విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొంటారని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉచితంగా కౌన్సెలింగ్, ప్రాసెసింగ్, స్పాట్ అడ్మిషన్స్ 60 శాతం వరకు స్కాలర్‌షిప్స్ ఇస్తారని తెలిపారు. యూనివర్సిటీ ఎంపిక, అప్లికేషన్ వివరాలు, వీసా గైడ్‌లైన్స్, మాక్ ఇంటర్వ్యూలపై అవగాహన కల్పిస్తామన్నారు. వివరాలకు ఫోన్: 99123 28645 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## సైరన్, మల్టీటోన్స్ హారన్ల వాడకంపై 987 కేసులు

**ఫిలింనగర్:** నగర ట్రాఫిక్ పోలీసులు సైరన్, మల్టీ టోన్డ్, మ్యూజిక్ హారన్స్ వాడకంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నగర ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయెల్ డేవిస్ సూచనల మేరకు ఈ నెల 4న ప్రారంభమైన ఈ డ్రైవ్ మంగళవారం వరకు కొనసాగింది. స్పెషల్ డ్రైవ్‌లో సైరన్ల వాడకంపై 590 కేసులు నమోదు చేశారు. అలాగే మల్టీటోన్డ్, మ్యూజికల్ హారన్స్ వాడకంపై 397 కేసులు నమోదు చేశారు. వీటిపై చట్టపరంగా నిషేధం ఉన్నప్పటికీ చాలామంది వాహనదారులు వినియోగిస్తున్నారని, వీటితో ప్రజలు భయాందోళనకు గురవడమే కాకుండా ప్రమాదాలకు దారితీస్తున్నాయని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా తమ వాహనాల నుంచి మల్టీటోన్డ్, మ్యూజిక్ హారన్లను తొలగించుకోవాలని సూచించారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**హిమాయత్‌నగర్:** నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ ప్రోగ్రాం యూనిట్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో డీపీఓ రుకుముద్దీన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. త్వరలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీపీఎం యూనిట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూ.., కిలోల్లో... టమాటా 35, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 45, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, మునగకాయ 3–4, ముల్లంగి 3–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## వరదలా.. మురుగు



ఇందిరానగర్‌లో బస్తీ మొత్తం పారుతున్న మురుగు

**బంజారాహిల్స్:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఒక వైపు వరదతో పాటు మరో వైపు మురుగు సమస్య బస్తీలను వేధిస్తోంది. ముఖ్యంగా జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం.2 ఇందిరానగర్, జవహర్‌నగర్ బస్తీల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. గడిచిన నాలుగు రోజులుగా బస్తీలోని మ్యాన్‌హోళ్ల నుంచి పెద్ద ఎత్తున మురుగు లీకేజీ అవుతూ బస్తీ మొత్తం పారుతోంది. సమస్యను సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మురుగు నీటి పైపుల్లో వ్యర్థాలు తట్టుకోవడం వల్లే మురుగు బయటకు తన్నుకొస్తోందని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.

## కేబుల్ వైర్ల తొలగింపునకు శ్రీకారం





కరెంటు స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

**బంజారాహిల్స్:** రామంతాపూర్‌లో విద్యుత్ తీగలు తాకడంతో ఆరుగురు మృతి చెందిన ఘటనపై టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని 24 సబ్ స్టేషన్ల పరిధిలో కరెంటు స్తంభాలకు వేలాడదీసిన కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ వైర్లను తొలగించారు. ఉదయం నుంచి సిబ్బంది డ్రైవ్‌లో పాల్గొని లారీలకొద్దీ వైర్లను తెంచి పడేశారు. కొంత కాలంగా కరెంటు స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్ల కారణంగా తీవ్ర సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో అధికారులు ఈ చర్యలకు శ్రీకారం చుట్టారు. కొంత కాలంగా కరెంటు స్తంభాలకు కేబుల్ వైర్లతో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డీఈ హన్మంతరెడ్డి నేతృత్వంలో బంజారాహిల్స్ ఏడీఈ రమేష్, ఫిలింనగర్ ఏఈ పవిత్ర, బంజారాహిల్స్ ఏఈ రమేష్ తదితరులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ నెల 26 వరకు వైర్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

– మంత్రి దామోదర్‌కు విన్నవించిన టీజీజీడీఏ



మంత్రి రాజనర్సింహకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గాంధీ ఆస్పత్రి వైద్యులు

**గాంధీఆస్పత్రి:** తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీజీజీడీఏ గాంధీ ఆస్పత్రి విభాగం ప్రతినిధులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు. మంగళవారం గాంధీ ఆస్పత్రిని సందర్శించిన మంత్రిని టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు భూపేంద్రసింగ్ రాథోడ్, రవి, సెక్రటరీ జనరల్ అబ్బయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్, టైంబౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని కోరారు. ఏటా జనరల్ బదిలీలు నిర్వహించాలని, గాంధీ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఇటీవల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కళ్యాణ చక్రవర్తి, నవీన్ పాల్గొన్నారు.

## 'నవోదయ' ప్రవేశపరీక్షల తేదీల వెల్లడి

**రాయదుర్గం:** జవహర్ నవోదయ విద్యాలయాల(జేఎన్‌వీ)లో వివిధ తరగతుల ప్రవేశ పరీక్ష తేదీలను ప్రకటించినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ డి.విజయభాస్కర్ మంగళవారం వెల్లడించారు. జేఎన్‌వీలోని ఆరో తరగతి ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి 7వ తేదీన ఉంటుందని పేర్కొన్నారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షను 2026 ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు. ఆరో తరగతిప్రవేశాలకు ఆగస్టు 27వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 9వ తరగతికి సెప్టెంబర్ 23 తేదీ వరకు, 11వ తరగతిలో ప్రవేశాల కోసం సెప్టెంబర్ 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వివరించారు. రంగారెడ్డి జిల్లా వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 'మనూ' దూరవిద్యా కోర్సుల దరఖాస్తు గడువు పొడగింపు

**రాయదుర్గం:** మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ)లో నిర్వహించే కోర్సుల దరఖాస్తు గడువును సెప్టెంబర్ 17వ తేదీ వరకు పొడగించినట్లు సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజౌల్లాఖాన్ మంగళవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సుల్లో అడ్మిషన్ల గడువును కూడా పొడిగించినట్లు పేర్కొన్నారు. దూరవిద్యలో యూజీ/పీజీ/డిప్లొమో/ సర్టిఫికెట్ కోర్సులకు కూడా అడ్మిషన్లు అక్టోబర్ 13 వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'ది గోలిమార్ ఎడిషన్'పేరిట హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సా.6 గం.ల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

# ఇదేం 'సింగారం'?

- నాలుగేళ్లయినా కోహెడలో శాశ్వత మార్కెట్ పనులకు వీడని గ్రహణం
- ఆర్నెళ్లలోనే శాశ్వత మార్కెట్ నిర్మిస్తామని గతంలో హైకోర్టుకు ప్రభుత్వం హామీ
- హామీ అమలు కాకపోవడంతో మరోసారి కోర్టు మెట్లెక్కే యోచనలో కమీషన్ ఏజెంట్లు

**సాక్షి,సిటీబ్యూరో:** కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణానికి గ్రహణం వీడేలా లేదు.. పునాది రాయి పడేలా లేదు. నాలుగేళ్లగా భూసేకరణ, డీపీఆర్ అంటూ మార్కెటింగ్ శాఖ హడావుడి చేస్తున్నప్పటికీ ఆచరణరూపం దాల్చేలాలేదు.. మరోవైపు బాట సింగారం తాత్కాలిక మార్కెట్‌లో అద్దెల భారం తప్పేలా లేదు.. కొత్తపేట నుంచి బాటసింగారానికి తాత్కాలికంగా మార్కెట్ తరలించేందుకు వెసులుబాటు కల్పిస్తూ ఆర్నెళ్లలోపు కోహెడలో శాశ్వత మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అప్పట్లో హైకోర్టు మార్కెటింగ్ శాఖకు



### బురదగుంటగా బాటసింగారం తాత్కాలిక మార్కెట్



గడువు విధించింది. అయితే, ఈ గడువు కూడా పూర్తికా వస్తుండటం.. మార్కెట్ పనులు మొదలు కాకపోవడంతో కమీషన్ ఏజెంట్లు మరోసారి హైకోర్టు మెట్లెక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిణామాలన్నీ మార్కెటింగ్ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడలో 200 ఎకరాల్లో పండ్లు, పూల మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు మార్కెటింగ్ శాఖ ఆమోదముద్ర కూడా వేసింది. అయితే మరింత భూసేకరణ జరపాలని, ప్రాజెక్టులో మరికొన్ని అదనపు హంగులు చేర్చాలనే యోచనలో ఉన్న సీఎం.. డీపీఆర్‌కు ఇంకా ఆమోద ముద్ర వేయలేదు. దీంతో ఈ ప్రాజెక్టు ఎప్పటికి మొదలవుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

#### అద్దెల దరువు!

బాటసింగారం మార్కెట్ నిర్వహణకు అధికారులు ప్రతినెలా రూ.80 లక్షల అద్దె చెల్లిస్తున్నారు. ఇలా గత నాలుగేళ్లలో సుమారు రూ.50 కోట్ల మేర అద్దెకే చెల్లించాల్సి వచ్చింది. శాశ్వత కట్టడంపై ఒత్తిడి తేకుండా.. కేవలం అద్దె స్థలంలో మార్కెట్ నిర్వహించడం ద్వారా ఖజానాను కొల్లగొడుతుండటం వెనుక ఏదో మతలబు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్కెట్ ఖాతాలో సుమారు రూ.314 కోట్లు మూలుగుతున్నప్పటికీ, వాటిని వినియోగించుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తూ.. డీపీఆర్ పేరిట కాలయాపన చేయడం దారుణమని కమీషన్ ఏజెంట్లు పెదవి విరుస్తున్నారు. బురదగుంటగా మారిన మార్కెట్‌లో పండ్ల విక్రయాలు జరుగుతున్నా.. షెడ్లను నిర్మించకపోవడం చూస్తే రైతాంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తోందని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

### కోహెడ మార్కెట్ పనులు ప్రాంభించాలి



కొత్తపేట్ నుంచి మార్కెట్ బాటాసింగారం తరలించే సమయంలో 6 నెలల్లో కోహెడలో మార్కెట్ నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మూడున్నర ఏళ్లు పూర్తైయినా మార్కెట్ నిర్మించలేదు. మరోవైపు బాటాసింగారంలోని తాత్కాలిక మార్కెట్‌లో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే మార్కెట్ పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేయాలి. లేని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తాం.

–అచ్చ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు, ది ఫ్రూట్ కమీషన్ ఏజెంట్ల సంఘం, బాటసింగారం

## అంబేడ్కర్ వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్




అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులతో వర్సిటీ అధికారులు, పలు సంస్థల ప్రతినిధులు

**బంజారాహిల్స్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మంగళవారం విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. స్టైపెండ్ బేస్డ్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రాం'లో చేరిన మంది విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ డ్రైవ్ నిర్వహించారు. టాటా గ్రూప్ అయిన వెస్ట్‌సైడ్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్ అయిన పై ఇంటర్నేషనల్, అపోలో ఫార్మాస్యూటికల్స్ పాల్గొన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ప్రారంభించిన ఈ ప్రోగ్రాం కింద నమోదు చేసుకున్న మొదటి 200 మంది అభ్యర్థుల కోసం ఈ డ్రైవ్ చేపట్టారు. ఎంపికైన అభ్యర్థుల్లో కోర్సు ఫీజు కట్టిన వారు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఆయా సంస్థల్లో చేరేలా స్పాట్ ఆఫర్ లెటర్లు ఇచ్చారు. ఫీజు కట్టిన విద్యార్థులు వెంటనే ఆయా సంస్థల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కనీస స్టైపెండ్ నెలకు రూ.13 వేలు ఉంటుందని పేర్కొన్నారు. కొన్ని సంస్థలు విద్యార్థులకు వసతి, భోజనాన్ని కూడా అందించనున్నట్లు వెల్లడించాయి.

ఈ కార్యక్రమానికి నమోదు చేసుకున్న వారిలో మరో 325 మంది అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను 15 రోజుల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, ఈఎంఆర్ అండ్ ఆర్సీ డైరెక్టర్ రవీంద్రనాథ్ సోలమన్, యూజీసీ–డీఈబీ డైరెక్టర్ పల్లవి కాబ్డే, ప్లేస్‌మెంట్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, చందావడ్డే తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా ఫొటో ఎగ్జిబిషన్

– నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు




**సాక్షి,మేడ్చల్ జిల్లా:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో నేటి(బుధవారం) నుంచి శుక్రవారం వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫొటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తికి మట్టి మనుషులు బందూకులు పట్టి దొరల గడీలను గడగడలాడించడమే కాకుండా రజాకారులను తరిమికొట్టిన సాయుధ పోరాట ఘట్టాలను ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. నాటి మహత్తర పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు సమర యోధులు, అసువులు బాసిన వీరయోధులు ఫొటోలను ప్రదర్శించారు. అమరవీరుల స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు.

**అరుణ పతాకాల రెపరెపలు ..**

మహాసభల ప్రాంగణం (కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్) ఎరుపెక్కింది. అరుణ పతాకాలతో ఈ ప్రాంతాన్ని ముస్తాబు చేశారు. మహాసభల వేదిక (కామ్రేడ్ బాలమల్లేష్ హాల్)ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. షాపూర్ నగర్ చౌరస్తా నుంచి మహాసభల ప్రాంగణమైన మహారాజా గార్డెన్ వరకు సాయుధ పోరాట యోధులు కటౌట్లతో అలంకరించారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా ఎర్రని తోరణాలు ఏర్పాటు చేశారు.

## కెమెరాలో బంధిస్తే చిరస్థాయిగా నిలుస్తాయి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో మంత్రి పొన్నం



**హిమాయత్‌నగర్ :** ఫొటోగ్రాఫర్లలో వుండే కళాత్మకత, క్షణాల్లో ఆలోచించే నైపుణ్యంతో కెమెరాలో బంధించే చిత్రం చిరస్థాయిగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఫొటోలను సందర్భాన్ని బట్టి కళాత్మకంగా బంధించడం అంత సులభం కాదని, ఇందుకు మంచి నైపుణ్యం, గ్రహణశక్తి ఉండాలని పేర్కొన్నారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్(టీఎస్‌పీజేఏ) నిర్వహించిన 23వ రాష్ట్ర స్థాయి న్యూస్ ఫొటో కాంటెస్ట్, ఫొటో ఎగ్జిబిషన్‌ను మంగళవారం బషీర్‌బాగ్‌లోని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) కార్యాలయంలో మంత్రి పొన్నం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఫొటో కాంటెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లను మంత్రి అభినందించి మాట్లాడారు. తాను విద్యార్థి సంఘ నాయకుడిగా ఉన్నప్పుడు టీడీపీ హయాంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో, బీఆర్ఎస్ హయాంలో చేసిన ఎన్నో పోరాటాలకు సంబంధించిన చిత్రాలను చూస్తున్నప్పుడు అవి గతాన్ని గుర్తు చేస్తుంటాయని, అవే మన జ్ఞాపకాలని అన్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు రాకతో ఫొటోగ్రాఫర్లు నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, టీఎస్‌పీజేఏ అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రాజేష్, అనిల్, సీనియర్ ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సచివాలయంలో బీసీ నేతలకు సన్మానం



**సాక్షి, సిటీ బ్యూరో:** తెలంగాణ సెక్రటేరియట్ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను మంగళవారం సచివాలయంలోని అన్ని ఉద్యోగ సంఘాలు కలిసి ఘనంగా సన్మానించాయి. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు రాష్ట్రపతి ఆమోదం లభించాలన్న డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన సంఘం అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంధం సురేష్,, మహిళా అసోసియేషన్ ప్రెసిడెంట్ రమాదేవి, జనరల్ సెక్రటరీ నివేదిత, కోఆపరేటివ్ ప్రెసిడెంట్ రెండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రఫీ అద్భుతమైన కళ



**విజయనగర్ కాలనీ:** క్షణంలో అదృశ్యమయ్యే అపురూప చిత్రాలను తమ కెమెరాల్లో బంధించి ప్రపంచానికి తెలియజేసే అద్భుతమైన కళ ఫొటోగ్రఫీ అని ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంఎల్ ఆనందరావు, ఫొటోగ్రఫీ విభాగాధిపతి ఏఆర్ కమల్‌రాయ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. జేఎన్ఏఎఫ్ఏయూ విశ్రాంత రిజిస్ట్రార్, సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నుబొట్ల యశోదర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో సినిమా, టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు హరీశ్ కుమార్, శశికిరణ్, శివప్రసాద్, జితేందర్ హరి తోపాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు 48 మంది ఎంపిక

**నాంపల్లి:** వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 48 మంది ప్రముఖులను ప్రతి యేటా తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాలతో సత్కరిస్తోంది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఆయా రంగాల ప్రముఖులను పురస్కారాలకు ఎంపిక చేసింది. వీరికి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో త్వరలో పురస్కారాలు అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి రూ.5,116 చొప్పున నగదు అందజేసి సత్కరిస్తామని పేర్కొన్నారు.

**పురస్కారాలకు ఎంపికైన ప్రముఖులు...**

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు ఎంపికైన వారిలో మునిమడుగుల రాజారావు (ఆధ్యాత్మిక సాహిత్యం), వారణాసి వెంకటేశ్వర్లు (ప్రాచీన సాహిత్యం), కె.హరనాథ్(సృజనాత్మక సాహిత్యం), సి.ఎస్.రాంబాబు (కాల్పనిక సాహిత్యం), ప్రభాకర్ మందార (అనువాద సాహిత్యం), ఎస్.రఘువర్మ (అనువాదం), గంగిశెట్టి శివకుమార్ (బాలసాహిత్యం), డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి (ఉత్తమ రచయిత్రి), మంగారి హిమజ(ఉత్తమ రచయిత్రి), విల్సన్ రావు కొమ్మవరపు (వచన కవిత), సయ్యద్ హనీఫ్ (వచన కవిత), ముంజంపల్లి వీరబ్రహ్మేంద్రాచారి(పద్యరచన), చింతోజు మల్లికార్జునాచారి(పద్యరచన), పిన్నంశెట్టి కిషన్(కథ), ప్రభాకర్ జైని(నవల), మంగిపూడి రాధిక (హాస్య రచన), జ్యోతిరాణి (వివిధ ప్రక్రియలు), డాక్టర్ దేశిరాజు లక్ష్మీ నరసింహారావు(ఉత్తమ నాటక రచయిత), పి.వెంకటేశ్వరరావు(ఉత్తమ నటుడు), మంగాదేవి (ఉత్తమ నటి), డాక్టర్ రాయల హరిశ్చంద్ర (నాటక రంగం), డాక్టర్ చిత్తర్వు మధు(జనరంజక విజ్ఞానం), డాక్టర్ వి.త్రివేణి(పరిశోధన), ఆచార్య డి.విజయలక్ష్మి (భాషాఛందస్సు), ఆచార్య సీహెచ్ సుశీలమ్మ (సాహిత్య విమర్శ), బులుసు అపర్ణ (అవధానం), అయ్యగారి సీతారత్నం(మహిళాభ్యుదయం), హెచ్.హేమవతి(లలిత సంగీతం), రామలక్ష్మి రంగాచార్య (శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు), మంగ్లీ (జానపద గాయకులు), పద్మాలయ ఆచార్య (జానపద కళలు), పగిడిపాల ఆంజనేయులు (జీవిత చరిత్ర), పొత్తూరి సుబ్బారావు(పత్రికా రచన), రతన్‌కుమార్ (పేరిణి నృత్యం), ఎ.వెంకట రామమోహన చలపతి శాస్త్రి(కూచిపూడి నృత్యం), పాలకుర్తి రామమూర్తి(వ్యక్తిత్వ వికాసం), చెగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి (హేతువాద ప్రచారం), ఆచార్య సి.మురళీకృష్ణ (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), సుధాకర్ గౌడ్ (గ్రంథాలయ కర్త), వి.ఎస్.రాజ్యలక్ష్మి(సాంస్కృతిక సంస్థ నిర్వహణ), డాక్టర్ ఎస్.మనోహర్ రావు(ఇంద్రజాలం), సుభాని షేక్ (కార్టూనిస్ట్), పండితారాధ్యుల వీరేశలింగం(జ్యోతిషం), పాతూరి మహేందర్‌రెడ్డి(ఉత్తమ ఉపాధ్యాయులు), కంది నరసింహులు(చిత్రలేఖనం), నందకిషోర్ (వచన కవిత–45 సంవత్సరాల లోపువారికి), పిల్లుట్ల ముకుందం (జానపద కళలు), ఇరువింటి వెంకటేశ్వర శర్మ(గజల్) ఉన్నారు.

## 'సీఎం ప్రజావాణి'కి 386 దరఖాస్తులు



**లక్డీకాపూల్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 386 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 76, రెవెన్యూ శాఖకు 35, ప్రవాసీ ప్రజావాణికి 02, విద్యుత్ శాఖకు 29, ఇందిరమ్మ ఇండ్ల కోసం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 75 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## కార్పొరేటర్ హేమకు ఓయూ డాక్టరేట్

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ సామల హేమ మంగళవారం ఓయూ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 84 స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఆమె డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఎంబీఏ పూర్తి చేసిన హేమ సీతాఫల్‌మండి నుంచి 2015లో మొదటిసారి కార్పొరేటర్‌గా గెలుపొందారు. 2020లో జరిగిన ఎన్నికల్లో మరోమారు కార్పొరేటర్‌గా గెలిచారు. ప్రజాప్రతినిధిగా ప్రజల్లో ఉంటూనే 'తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ హబ్ పాత్ర'పై ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. పీహెచ్‌డీ అందుకున్న ఆమెను పలువురు అభినందించారు.



కార్పొరేటర్ సామల హేమకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న ఇస్రో చైర్మన్ నారాయణన్

## డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్‌తో సరోగసీ అక్రమాలకు అడ్డుకట్ట



**సాక్షి, సిటీ బ్యూరో:** సాంకేతిక పరిజ్ఞానంతో పునరుత్పత్తి పద్ధతుల్లో అనైతిక కార్యకలాపాలను నివారించడానికి ట్రూత్ ల్యాబ్స్, జీనోమ్ ఫౌండేషన్ సంయుక్తంగా డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆ సంస్థల చైర్మన్ గాంధీ తెలిపారు. మంగళవారం బంజారాహిల్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సరోగసీ పద్ధతిలో జరుగుతున్న మోసాలు విస్మయానికి గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రకమైన మోసాలను నిర్మూలించడానికి దేశంలోనే మొదటిసారిగా ట్రూత్ ల్యాబ్స్ ముందుకొచ్చిందన్నారు. డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్ విధానంలో తల్లిదండ్రులు, పుట్టిన బిడ్డకు మూడు దఫాలు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్టీఆర్ ప్రాసీజర్‌లో స్పష్టమైన ఎనాలసిస్‌ను అందిస్తామన్నారు. దీంతో బిడ్డ మార్పిడి జరిగినా, మానవ అక్రమ రవాణా, ఇతర ఏదైనా మోసం జరిగినా ఇక్కడ తెలిసిపోతుందని చెప్పారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఆరోగ్యకరమైన శిశువును అందించడానికి సైంటిస్టులు, ఆసుపత్రి సిబ్బంది సహకారం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జీనోమ్ ఫౌండేషన్ డైరెక్టర్ కనక భూషణం, వైద్యులు లక్ష్మి, ప్రసాద్, డీఎన్ఏ ఎగ్జామినర్ విజయ్, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

# చేతుల్లో పట్టాలు.. కళ్లలో ఆనందబాష్పాలు

- పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- కళాశాలల ప్రాంగణంలో ఫొటోలకు ఫోజులు
- ఘనంగా ఓయూ 84వ స్నాతకోత్సవం



**ఉస్మానియా యూనివర్సిటీ:** క్యాంపస్ కళకళలాడింది.. విద్యార్థులు సందడి చేశారు.. సంతోషం వెల్లివిరిసింది.. చేతుల్లో పట్టాలు.. కళ్లల్లో ఆనందబాష్పాలు.. ఆలింగనాలతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.. ఈ సన్నివేశాలు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో చోటు చేసుకున్నాయి. క్యాంపస్ అంతటా స్నాతకోత్సవ సందడే. ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలను అందుకొని విద్యార్థులు మురిసిపోయారు. తాము యూనివర్సిటీ స్థాయిలో పీజీలు, పీహెచ్‌డీలు చేయకపోయినా తమ పిల్లలు డాక్టరేట్లు అందుకున్నారని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. వర్సిటీ స్థాయి అత్యున్నత పీహెచ్‌డీ పట్టాను అందుకోవాలనేది అనేక మంది విద్యార్థుల కల. డాక్టరేట్ అందుకున్నవారు ఆర్ట్స్ కాలేజీ, లా కాలేజీ, సైన్స్, ఇంజినీరింగ్ తదితర కళాశాలల ప్రాంగణాల్లో ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇంతవరకు తమ ఊరిలో, తమ కుటుంబంలో తామే తొలి డాక్టరేట్ పట్టా అందుకున్నామని కొందరు విద్యార్థులు గర్వంగా చెప్పుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. కొందరు స్వీట్లు పంచిపెట్టి ఆలింగనాలు చేసుకున్నారు. స్నాతకోత్సవానికి సాధారణ తెల్లరంగు దుస్తులు ధరించడం డ్రెస్ కోడ్ కాగా అనేక మంది విద్యార్థులు నల్ల గౌను, టోపీ ధరించి ఫొటోలకు ఫోజులిచ్చారు.

**ఏర్పాట్ల పై అసంతృప్తి**


స్నాతకోత్సవ ఏర్పాట్లపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.2,200 ఫీజు వసూలు చేసి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల స్నాతకోత్సవాన్ని ఒకేసారి నిర్వహించడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. దీంతో ఠాగూర్ ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. బయట టెంట్లు వేసి ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. కుర్చీలు సరిపడా లేకపోవడంతో అనేక మంది ఇబ్బంది పడ్డారు. తెప్పించిన తినుబండారాలను కూడా పంపిణీ చేయలేక పోయారు. సరైన ప్రణాళిక లేనందున ఏర్పాట్లు అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## కేబుల్ కోతలు ఆపండి: సీఓఏఐ

– ఇంటర్నెట్ కేబుల్స్ విద్యుత్తును సరఫరా చేయవు

**సాక్షి, సిటీబ్యూరో:** కేబుల్ కోతల కారణంగా హైదరాబాద్‌లోని ఫైబర్–టు–హోమ్ కనెక్టివిటీలో పెద్ద ఎత్తున సమస్యలు నెలకొన్నాయి. హోమ్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు నెట్‌వర్క్ అంతరాయంగా మారింది. విద్యుత్ శాఖ ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్‌ను విచక్షణారహితంగా కత్తిరించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 'ఇంటర్నెట్ కేబుల్స్ విద్యుత్తును తీసుకువెళ్లవు, వీటి వల్ల విద్యుత్ మౌలిక సదుపాయాలకు సంబంధం లేదు'అని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) పేర్కొంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, సేవలను వీలైనంత త్వరగా పునరుద్ధరించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నట్లు సీఓఏఐ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ ఎస్.పి. కొచ్చర్ వెల్లడించారు. ఆప్టికల్ కేబుల్స్‌ను కత్తిరించొద్దని విద్యుత్ శాఖను కోరారు. ఇంటర్నెట్ కనెక్టివిటీకి నిలిచిపోవడం వల్ల ప్రజలకు పలు విధాల అసౌకర్యాలకు దారితీస్తుందని తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 20, ఆగస్టు, 2025

ఒక్క ఫొటో అనేక భావాలను, అర్థాలను ప్రతిబింబిస్తుంది. చరిత్రలోని అనేే సంఘటనలను, మధురానుభూతులకు కళ్లకు కట్టేది ఈ చిత్రమే.. అయితే ఒకప్పుడు ఇది సామాన్యునికి బహుదూరం.. కానీ అదివచ్చిన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా నేడు ప్రతి ఒక్కరికీ చేరువయ్యింది. ప్రతి ఒక్కరి జీవితంలోనూ అనేక మధురమైన జ్ఞాపకాలను పదిలపరుస్తోంది.. మరికొందరికి ప్రకృతిలోని ప్రతిదీ చిత్రీకరించే సాధనంగా మారుతోంది. మొబైల్ రాకతో ఇది మరింత చేరువయ్యింది.. ఈ నేపథ్యంలో మొబైల్ ఫొటోగ్రఫీ అనే హాబీ ట్రెండింగ్ అవుతోంది.. ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు ఔత్సాహికులు వారు తీసిన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.. ప్రస్తుతం ఇవి వైరల్ అవుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

# కెమెరా క్లిక్.. అదిరే పిక్..







## ట్రెండింగ్‌గా మారుతున్న మొబైల్ ఫొటోగ్రఫీ







- ఫొటోలు, పోస్టులతో నిండిపోయిన సోషల్ మీడియా
- ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా పోస్టులు
- లైఫ్ స్టైల్ నుంచి ప్రకృతి సీనరీ వరకూ
- చెట్లు, పుట్టలు ఇలా ప్రతిదీ క్రియేటివిటీ చిహ్నమే
- వైరల్‌గా మారిన పలు మొబైల్ చిత్రాలు

సాధారణంగా సామాజిక మాధ్యమాల్లో రీల్, సినిమాలు, జోకులు, మీమ్స్ వైరల్ అవుతుంటాయి. దీనికి భిన్నంగా గత కొంతకాలంగా యువతకు సంబంధించిన క్రియేటివ్ వర్క్ కూడా వైరల్ అవుతున్నాయి. అయితే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొబైల్స్‌లో ఫొటోలు తీయడం హాబీగా మారిన కొందరి ఫొటోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాల్లో మంగళవారం పోస్టులుగా తెగ వైరల్ అయ్యాయి. వీటికి షేర్లు, లైకులు కొడుతూ పలువురు కామెంట్లు చేశారు. ఫొటో గ్రఫీపట్ల తమకున్న ప్యాషన్‌ని, తమలోని క్రియేటివిటీని సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించారు.

### ఒక్కో ఫొటోకూ.. ఒక్కో కథ..

ఈ ఏడాది ఫొటోగ్రఫీ డే సందర్భంగా సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), వాట్సాప్ వంటి వేదికలు విభిన్న, వినూత్న ఫొటోలతో నిండిపోయాయి. ప్రతి ఒక్కరు తమ కెమెరాలో బంధించిన ప్రత్యేక క్షణాలను షేర్ చేస్తూ 'ఇదే నా స్టైల్, ఇదే నా ప్రత్యేకత' అని తమ ప్రతిభను చాటుకున్నారు. కొందరు యువత ప్రకృతిని తమ కెమెరాలో బంధించగా, మరికొందరు నగర జీవన శైలిని, మరి కొందరు ట్రావెలింగ్, సంస్కృతి, ఆర్ట్, చరిత్ర, ఫుడ్ ఫొటోగ్రఫీ వంటి అంశాలను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఫొటోగ్రఫీ డే అనేది కేవలం ఒక వేడుక కాదు, ఇది ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను చాటుకునే ఓ వేదిక. ప్రతి ఫొటో ఒక కొత్త కథ చెబుతోంది. అందుకే ఈ ఫొటోగ్రఫీ దినోత్సవం కేవలం ఫొటోల పండుగ మాత్రమే కాదు.. ఒక లైఫ్ స్టైల్ ఫెస్టివల్ అని చెప్పకనే చెబుతోంది.



### సోషల్ మీడియా పాత్ర..

ఫొటోగ్రఫీకి సోషల్ మీడియా ఒక ప్రధాన వేదికగా మారింది. ఒకప్పుడు ఔత్సాహికులు తీసిన ఫొటోలను ఇంట్లో, ఆల్బమ్స్‌లో చూసేవాళ్లు. ఇప్పుడు అదే ఫొటోలు నిమిషాల్లోనే ప్రపంచానికి చేరుతున్నాయి. ఇన్‌స్టా 'ఫొటోగ్రఫీ డే హాష్‌ట్యాగ్'తో పోస్ట్ చేస్తే, అది వేల మందికి చేరుతుంది. ఫేస్‌బుక్‌లో షేర్ చేస్తే స్నేహితులు, బంధువులు లైక్స్‌తో ప్రోత్సహిస్తారు. ఎక్స్‌లో పోస్ట్ చేస్తే వెంటనే ట్రెండింగ్ అవుతుంది. వాట్సాప్ స్టేటస్ ద్వారా మన స్నేహితుల సర్కిల్‌లో హైలైట్ అవుతాయి. అంటే ప్రతి ఒక్కరి చేతిలో ఒక చిన్నపాటి ప్రచార సాధనం ఉన్నట్లు. ఇది కేవలం వ్యక్తిగత ప్రతిభను చూపించడానికే కాకుండా, నెట్‌వర్కింగ్‌లో కూడా ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఒక్క ఫొటో ఆధారంగా అనేక మంది కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. కొంతమంది తమ ఫొటోలు పోస్టు చేయడం ద్వారా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల దృష్టికి చేరుతున్నారు. మోడలింగ్, ఫొటో ఎగ్జిబిషన్, బ్రాండ్ ప్రమోషన్స్ వంటి అవకాశాలు పొందుతున్నారు.

### జెన్-జీ స్టైల్ అండ్ క్రియేటివిటీ..

ఫొటోగ్రఫీ డే నేపథ్యంలో సోషల్ మీడియాలో తమ ఫొటోలను కేవలం షేర్ చేయడమే కాదు.. వాటికి ప్రత్యేక ఎఫెక్ట్స్, ఫిల్టర్స్, క్రియేటివ్ క్యాప్షన్స్ జోడించడం ద్వారా కొత్త ట్రెండ్ సృష్టించారు. లైఫ్ స్టైల్ యాప్స్ ఫొటోగ్రఫీని కేవలం హాబీ స్థాయి నుంచి ప్రొఫెషనల్ స్థాయికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఒక మంచి ఫొటోతీసి, దాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తే, అది స్ఫూర్తిగా మారుతుంది. నగరంలోని యువత తమ ఫొటోగ్రాఫిక్ స్కిల్స్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. చార్మినార్, హుస్సేన్ సాగర్, గోల్కొండ వంటి చారిత్రక కట్టడాలు కొత్త కోణంలో కెమెరా కంట పడగా, నగర ఆధునిక లైఫ్ స్టైల్ కూడా ఫ్రేమ్‌లో బంధీ అయ్యాయి.

---

# మొక్కిన చోటే మొలకెత్తి..



- సీడ్ గణేశ విగ్రహాల పంపిణీకి శ్రీకారం
- ప్రకృతి నుంచి వచ్చింది ప్రకృతిలోనే కలవాలి : తనికెళ్ల భరణి
- 1500 విగ్రహాల పంపిణీ లక్ష్యం : రీ సస్టైనబిలిటీ ఎండీ

గచ్చిబౌలి: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి గణేశ నవరాత్రి పూజలు చేయడం పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని అందరికీ తెలిసిందే. గ్రీన్ గణేశ పేరిట రీ సస్టైనబిలిటీ, 92.7 బిగ్ ఎఫ్ఎంలు మరో ముందడుగు వేశాయి. పర్యావరణానికి ఎంతో మేలు చేసే సీడ్ గణేశ విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలోని మై హోం భూజ గేటెడ్ కమ్యూనిటీలో సీడ్ గణేశ విగ్రహాల పంపిణీ వాహనాన్ని నటుడు, రచయిత తనికెళ్ల భరణి, నటి మధుషాలిని, రీ సస్టైనబిలిటీ ఎండీ మసూద్ మాలిక్ జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. నగరవ్యాప్తంగా మొత్తం 1500 ప్రతిమలను పంపిణీ చేయనున్నారు. పర్యావరణానికి మేలుచేసే ఆక్రీ యాప్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఆక్రీ యాప్‌లో సంప్రదిస్తే శానిటరీ వేస్ట్, డైపర్స్, ప్లాస్టిక్, ఈ వేస్ట్, పేపర్ కార్డ్‌బోర్డ్, ఉడ్ అండ్ ఫర్నీచర్, క్లాత్స్, షూస్, మెటల్ స్క్రాప్ సేకరిస్తారని నిర్వాహకులు తెలిపారు. సేకరించే చెత్తకు కొంత డబ్బులు కూడా చెల్లించనున్నారు. ఈ కార్యక్రమంలో 92.7 ఎఫ్ఎం ఆర్‌జే శేఖర్ భాషా, ఆర్‌జే గ్రేస్, మై హోం భూజ అసోసియేషన్ ప్రతినిధులు రాజు మదనపల్లి, విద్యా రెడ్డి, డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

> **మరో అడుగు ముందుకేసి..**
>
> ప్రకృతి నుంచి వచ్చింది ప్రకృతిలోనే కలవాలి. ఈ ఉద్దేశంతోనే రీ సస్టైనబిలిటీ సంస్థ ఇప్పటి వరకూ మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తూ వచ్చారు. ఈ యేడాది మరో అడుగు ముందుకేసి సీడ్ గణేశ ప్రతిమల పంపిణీకి శ్రీకారం చుట్టారు. నారతో చేసిన గిన్నెలో మట్టి ప్రతిమ ఉంటుంది. కింది భాగంలో సీడ్ బాల్ ఉంటుంది. పూజ అనంతరం నీరు పోస్తే క్రమేపీ కరిగిపోయి అక్కడే విత్తనం మొలకెత్తి మొక్కగా మారుతుంది.
>
> – నటుడు తనికెళ్ల భరణి





- ప్రదర్శనలో 44 మంది ఫొటోగ్రాఫర్ల ఫొటోలు
- 26 వరకూ ఎగ్జిబిషన్ కొనసాగింపు

# ఆర్ట్ గ్యాలరీలో.. అపురూప చిత్రాలు..



మాదాపూర్ : స్థానిక చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శించిన అపురూప చిత్రాలు సందర్శకులను అబ్బురపరుస్తున్నాయి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 44 మంది ఫొటోగ్రాఫర్లు తీసిన 44 చిత్రాలను గ్యాలరీలో మంగళవారం ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. తెలంగాణ టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ దీనిని ప్రారంభించారు. ఒక్క ఫొటో ఎంతో సమాచారాన్ని అందిస్తుందని, సామాన్యులకు అర్థం కాని అంశాలను సైతం ఫొటోల ద్వారా అవగాహన కల్పించవచ్చని తెలిపారు. ఈ నెల 26 వరకూ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే.లక్ష్మి పాల్గొన్నారు.

---



# నేటి తరం హాబీ.. ఫొటోగ్రఫీ

- ట్రెండ్‌గా మారుతున్న మొబైల్ క్యాప్చరింగ్
- వివో వీ60 స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరణలో నటి సుభశ్రీ

సాక్షి, సిటీబ్యూరో: నేటి తరానికి ఫొటోగ్రఫీ ఓ హాబీగా మారిందని, మొబైల్స్‌లో అందుబాటులో ఉన్న టెక్నాలజీ నేపథ్యంలో మొబైల్ ఫొటోగ్రఫీ ఓ ట్రెండ్‌గా నడుస్తోందని ప్రముఖ నటి సుభశ్రీ రాయగురు అన్నారు. ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నగరంలోని గచ్చిబౌలి వేదికగా ఓ స్టోర్‌లో సరికొత్త వివో వీ60 ప్రీమియం స్మార్ట్ ఫోన్‌ను సుభశ్రీ మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో జీస్ కెమెరా, ఏఐ ఆధారిత ఫొటోగ్రఫీ సూట్ ఉందని, మొబైల్ ఫొటోగ్రఫీపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది అనువుగా ఉంటుందని ఆమె వివరించారు. ప్రపంచ స్థాయి ఆవిష్కరణలను కస్టమర్లకు చేరువ చేయడమే తమ లక్ష్యమని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోమ నాగరాజు పేర్కొన్నారు. స్ట్రాటజీ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ సుహాస్ నల్లచేరు, వీ-డ్రీమ్ టెక్నాలజీ ఏపీ-తెలంగాణ జనరల్ మనేజర్ అతిష్ భార్గవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెల్ఫీలకు ఫోజులిస్తూ సుభశ్రీ సందడి చేశారు.

---

వారంతా ఉన్నత విద్యావంతులు.. బస్తీల్లో నివసించే పేద విద్యార్థులకు ఏదైనా చేయాలని నిశ్చయించుకున్నారు. అనుకున్నదే తడవుగా 'రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ'ను స్థాపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్ ద్వారా బస్తీల్లోని పేద విద్యార్థులకు సాయంత్రం పూట ఉచితంగా ట్యూషన్స్ నిర్వహిస్తున్నారు. పాఠశాల నుంచి రాగానే టీవీలకు, మొబైల్స్‌కు అడిక్ట్‌కాకుండా వారి దృష్టి చదువువైపు మళ్లేలా కృషి చేస్తున్నారు. వారి జీవితాల్లో అక్షర జ్యోతులను వెలిగిస్తున్నారు..

- బన్సీలాల్‌పేట

# ఈ ఉపాధ్యాయులు.. అక్షర జ్యోతులు..

**రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల కృషి ఆదర్శం**



- బన్సీలాల్‌పేట్, చాచానెహ్రూనగర్‌లో విద్యార్థులకు శిక్షణ
- పేద విద్యార్థులకు అక్షర జ్ఞానాన్ని అందిస్తున్న నిర్వాహకులు
- నిత్యం 2 గంటల పాటు వంద మందికి తరగతులు
- సేవలకు గుర్తుగా 'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డు

బస్తీల్లోని పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు. బన్సీలాల్‌పేట డివిజన్, చాచా నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్లో ఒకటి నుంచి 10వ తరగతి చదివే పిల్లలకు నిత్యం సాయంత్రం వేళల్లో ట్యూషన్ నిర్వహిస్తున్నారు. చదువులో వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నారు.

### సీసీ నగర్ సెంటర్‌లో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్ కేంద్రంగా సుమారు 100 మంది విద్యార్థులు నిత్యం శిక్షణ పొందుతున్నారు. ఉదయం స్కూల్లో ఇచ్చిన హోం వర్క్ చేయించడం, అక్కడ అర్థం కాని పాఠాలను సవివరంగా బోధించడం, చదవాల్సిన వాటిని చదివించడం చేస్తుంటారు. సుమారు రెండు గంటల పాటు విద్యార్థులకు ట్యూషన్ చెబుతుంటారు. ఖాళీ సమయాల్లో మహనీయుల జీవిత విశేషాలు కథలుగా చెబుతుంటారు.

### మొబైల్, టీవీలకు దూరంగా..

బస్తీల్లోని విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి మొబైల్, టీవీలకు దూరంగా ఉండే వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ఇంటికి రాగానే వారి దృష్టి ఆటలపై మళ్లకుండా ట్యూషన్ వైపు అడుగులు వేయిస్తున్నారు. బస్తీల్లోని చాలా ఇళ్లల్లో చదువుకునే వాతావరణం ఉండదని గ్రహించిన నిర్వాహకులు రెయిన్‌బో సంస్థ ద్వారా ఆ పరిస్థితులు కల్పిస్తున్నారు. అయితే దీనికి తల్లిదండ్రులను ఒప్పించడమే పెద్ద పని అని నిర్వాహకులు చెబుతున్నారు. సామాజిక సేవా రంగంలో తాము చేస్తున్న విశేష కృషిని గుర్తించి 'సాక్షి' సంస్థ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించిందని, హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, వైఎస్ భారతి రెడ్డి కలిసి ఈ అవార్డును అందజేశారని నిర్వాహకులు చెబుతున్నారు.

### మెరుగైన విద్యావిధానం..

విద్యార్థుల ప్రతిభను బట్టి గ్రూపులుగా విభజించి బోధన చేస్తాం. వారిలో చదువు పట్ల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. విద్యతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తాం. క్రీడలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల పట్ల వారిలోని ఆసక్తిని గమనించి శిక్షణ ఇస్తున్నాం. మా పనితీరును మెచ్చి అనేక మంది ముందుకొస్తున్నారు.

– శ్రీలత మోరంపూడి, అనురాధ కొనికెపూడి డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెయిన్‌బో హోమ్స్







---

## డ్యాన్స్ కాంపిటేషన్ విజేత

# యషితా..



**ఆల్ ఇండియా పోటీల్లో ప్రతిభ**

సాక్షి, సిటీబ్యూరో: ఆల్ ఇండియా డ్యాన్స్ కాంపిటేషన్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని యషితా బాంటియా విజేతగా నిలిచింది. జోధ్‌పూర్‌లోని రాజమాత కృష్ణకుమారి బాలికల పబ్లిక్ పాఠశాల ఐపీఎస్‌సీ డ్యాన్స్ ఫెస్ట్- 25 పేరుతో పోటీలు నిర్వహించింది. దీనికి దేశ వ్యాప్తంగా 26 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో యషితా బాంటియా ప్రతిభకు గుర్తింపు లభించిందని బేగంపేట్ హెచ్‌పీఎస్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.



# టీవీనో ఫ్రిజ్జో.. కరెంటు బిల్లు కడుతుంది!

మీ ఇంట్లోని ఫ్రిజ్.. మీ ఇంటి కరెంటు బిల్లు కట్టేస్తే!
మీ వాషింగ్ మెషీన్ మీ ఇంటి అద్దె చెల్లించేస్తే!!
మీ స్మార్ట్ వాచ్, మీ స్మార్ట్ టీవీ..
మీ ఫోన్ బిల్లు లేదా ఓటీటీ ప్లాట్‌ఫామ్
రెన్యువల్ చేయడం వంటివి చేసేస్తే!!!

నమ్మబుద్ధి కావడం లేదు కదూ...
కానీ, త్వరలో సాధ్యం కానున్నాయి.

**ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) యూపీఐ అప్‌డేటెడ్ వర్షన్‌ను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) తీసుకొస్తోంది. ఇది కార్యరూపం దాలిస్తే స్మార్ట్ ఉపకరణాలే ఆటోమేటెడ్ పేమెంట్స్‌ను పూర్తి చేసేస్తాయి. అంటే యూపీఐ చెల్లింపులకు స్మార్ట్ ఫోన్‌పై పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం లేదు. యూపీఐ ఆటోపే, యూపీఐ సర్కిల్ మాదిరిగా కొత్త ఫీచర్ పనిచేస్తుందన్న మాట.**

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఒకప్పుడు కరెంటు బిల్లు కట్టాలన్నా.. ఇంటి అద్దె కట్టాలన్నా పర్సు తీసేవాళ్లు. ఇప్పుడు ఫోన్ తీస్తున్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) రాక చెల్లింపుల తీరునే మార్చింది. ఇప్పుడు ఇది మరో సంచలనానికి సిద్ధమైంది. స్మార్ట్ గాడ్జెట్స్‌తో చెల్లింపులు జరిపే కొత్త యూపీఐ వ్యవస్థను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) అభివృద్ధి చేస్తోంది. అంటే ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయిన టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, కార్లు, స్మార్ట్‌వాచ్‌ల వంటి పరికరాల ద్వారా మన ప్రమేయం లేకుండా యూపీఐ ఆటోమేటెడ్ పేమెంట్స్ చేయవచ్చు. ఈ వ్యవస్థ నెలవారీ సబ్‌స్క్రిప్షన్స్ వంటి చెల్లింపులను స్మార్ట్ పరికరాల నుండి నేరుగా ఆటో పేమెంట్ చేయడానికి వినియోగదారులకు అనుమతిస్తుంది. అంటే పార్కింగ్ ఫీజును కనెక్టెడ్ కారు నుండి నేరుగా చెల్లించవచ్చు. ఇంట్లోని స్మార్ట్ టీవీ ద్వారా ఓటీటీల చందాను, నెలవారీ అద్దె, విద్యుత్ బిల్లులు కట్టేయొచ్చు. ఇవన్నీ థర్డ్ పార్టీ యూపీఐ యాప్‌ను తెరవకుండానే జరిగిపోతాయన్నమాట.

### అక్టోబరులోగా..

ఎన్పీసీఐ ఈ ఐఓటీ-రెడీ యూపీఐని అక్టోబర్ 7–9 తేదీల్లో ముంబైలో జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 వేదికగా ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అయితే నియంత్రణ సంబంధ అనుమతులు ఇంకా రావాల్సి ఉంది. ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే వినియోగదారుల యూజర్ ఎక్స్‌పీరియెన్స్ మరింత మెరుగుపడుతుంది. ఈ కొత్త వ్యవస్థ కోసం నియంత్రణ సంబంధ, డేటా భద్రతపై కూడా ఎన్పీసీఐ పనిచేస్తోంది. అనధికార లావాదేవీల కట్టడితోపాటు గోప్యతకు పెద్ద పీట వేసే దిశగా అడుగులేస్తోంది.

- 2024–25లో యూపీఐ వేదికగా 18,587 కోట్ల లావాదేవీలకుగాను రూ.261 లక్షల కోట్లు చేతులు మారాయి.
- దేశవ్యాప్తంగా జూలైలో రికార్డు స్థాయిలో రూ.25 లక్షల కోట్ల విలువ చేసే 1,946.79 కోట్ల లావాదేవీలు జరిగాయి.
- యూపీఐ చరిత్రలో అత్యధికంగా జూలై 1న రూ.1.10 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు నమోదయ్యాయి.

స్మార్ట్ డివైజెస్‌తో ఆటోమేటెడ్ పేమెంట్స్
ఇంటి అద్దె, ఓటీటీ చందా సహా అన్నీ
రెడీ అవుతున్న యూపీఐ నూతన వెర్షన్

### ఆదేశిస్తే చాలు..

వినియోగదారుడు ప్రాథమిక యూపీఐ ఐడీకి ప్రత్యేక వర్చువల్ పేమెంట్ అడ్రస్ అనుసంధానం అవుతుంది. తద్వారా చెల్లింపులను ఆటోమేటిగ్గా పూర్తి చేయడానికి ఉపకరణాలకు వీలవుతుంది.

ప్రధాన యూపీఐ డివైస్ అయిన మొబైల్ ఫోన్ నుంచి సంబంధిత స్మార్ట్ ఉపకరణానికి ఆటోమేటిగ్గా చెల్లింపులు జరిపేలా ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది.

నిర్దేశిత పరిమితులతో సెకండరీ యూజర్లు చెల్లింపులను జరిపేలా వీలు కల్పించే యూపీఐ సర్కిల్ మాదిరిగా స్మార్ట్ పరికరాలు సైతం నిర్దేశించిన మొత్తాన్ని సురక్షితంగా పేమెంట్స్ పూర్తి చేస్తాయి.

యూజర్ల ప్రధాన అకౌంట్‌కు అనుసంధానమై సెకండరీ యూపీఐ ఐడీ క్రియేట్ అవుతుంది.

ఎన్ని ఉపకరణాలు జోడిస్తే అన్ని ఐడీలు ఉంటాయి. ఈ ఫీచర్ కోసం వన్-టైమ్ పాస్‌వర్డ్ తప్పనిసరి.

## రైతుల ప్రయోజనాల కన్నా మోదీ భజనే ముఖ్యమా?

యూరియా కొరతపై సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరతను తీర్చాలని కాంగ్రెస్ ఎంపీలు న్యూఢిల్లీలో పార్లమెంటు వేదికగా ఆందోళన చేస్తుంటే, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు ప్రధాని మోదీకి భజన చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పార్లమెంటు వేదికగా కాంగ్రెస్ ఎంపీల ఆందోళనకు మద్దతు తెలిపి, రైతుల పక్షాన నిలిచిన ప్రియాంక గాంధీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'వేదికగా మంగళవారం ట్వీట్ చేశారు. రాష్ట్ర రైతాంగానికి అవసరం మేరకుం యూరియా సరఫరా చేయకుండాం నిర్లక్ష్య, వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తోన్న మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఎండగడుతూం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో ంగొంతు కలిపి, ంతెలంగాణ రైతుల పక్షాన నిలిచారని ఆయన ప్రియాంక గాంధీని కొనియాడారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని లేఖల రూపంలో ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్రం స్పందించలేదని ఆక్షేపించారు. 'రాష్ట్ర రైతాంగానికి అండగా నిలవాల్సిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ం మోదీ భజనలో బిజీగా ఉన్నారు. రైతుల కోసం మోదీ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకుం మాతో కలిసి రావాల్సినం బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో పత్తా లేరు. గల్లీలో లొల్లి చేయడానికి ఉత్సాహం చూపే వాళ్లుం ఢిల్లీలో మోదీని ప్రశ్నించడానికి ఎందుకు భయపడుతున్నారు?'అని సీఎం ట్వీట్ చేశారు.

## కేన్సర్ బాధితుల డేటా నమోదు చేయాలి

ఈ ఏడాది 55వేల కేన్సర్ కేసులు నమోదయ్యే అవకాశం: నోరి దత్తాత్రేయుడు



సమావేశంలో మంత్రి దామోదర, దత్తాత్రేయుడు

సాక్షి, హైదరాబాద్: ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఈ సంవత్సరంలో 55 వేల కేన్సర్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని ప్రముఖ కేన్సర్ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు నోరి దత్తాత్రేయుడు తెలిపారు. ఏయే ప్రాంతాల్లో కేన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయో వైద్యాధికారులు నోటిఫై చేసి, కేన్సర్ బాధితుల డేటాను నమోదు చేయాలని సూచించారు. మంగళవారం ఆయన సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కేన్సర్ నిర్మూలనపై రూపొందించిన పలు అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేన్సర్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన పలు అంశాలను మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించారు. రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా కేన్సర్ బాధితులకు వైద్యసాయాన్ని అందించడం మంచి పరిణామమన్నారు. కేన్సర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండేలా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, కేన్సర్ బాధితుల వైద్యం కోసం ప్రతి 100 కిలోమీటర్ల పరిధిలో చికిత్స అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్‌కు మంగళవారం 300 బస్తాల యూరియా వచ్చింది. రైతులు పెద్దమొత్తంలో ఒక్కసారిగా యూరియా కోసం ఎగబడడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



యూరియా కోసం వరుసగా మూడో రోజు రైతులు బారులు తీరిన దృశ్యమిది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతులు క్యూలో నిలబడి యూరియా తీసుకెళ్లారు.
- చేగుంట (తూప్రాన్)



మహబూబాబాద్ జిల్లా గూడూరు పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం వర్షంలో గొడుగులతో క్యూలో నిల్చున్న రైతులు



ఈ క్యూ.. బుధవారం కోసం. మంగళవారమే ఇలా సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం పాలమాకుల సొసైటీ వద్ద రైతులు ముందస్తుగా చెప్పులను లైన్‌లో ఉంచారు
-నంగనూర్ (సిద్దిపేట)

# యూరియా... ఏదయా..!

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన డిమాండ్ • రోడ్డెక్కుతున్న రైతులు.. భారీ వర్షంలోనూ షాపుల ఎదుట క్యూలు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో..వానాకాలం సీజన్ నాట్లు ముగింపు దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టులు, చెరువుల కింద నాట్లువేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. వరినాట్లు పడిన 10 నుంచి 15 రోజులకు రైతులు ప్రతి ఎకరాకు ఒక బస్తా నుంచి రెండు బస్తాల చొప్పున యూరియాను వినియోగిస్తారు. ఆ తర్వాత 45 రోజులకు మరోసారి యూరియాను వాడతారు. మరోవైపు పత్తి, మొక్కజొన్న పంటలకు కూడా యూరియా వినియోగం పెరుగుతోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన యూరియా కోసం డిమాండ్ ఎక్కువవుతోంది. సరిపడా యూరియా, మిగతా ఎరువులు ఉన్నాయని అధికారులు చెబుతున్నా.. ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల వద్ద రైతులు బారులు దీరుతున్నారు. యూరియా దొరక్కపోవడంతో రోడ్లపై బైఠాయించి నిరసనలు చేస్తున్నారు. అలస్యంగా వరి సాగయ్యే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండగా, ఇప్పటికే మెజారిటీ ప్రాంతాల్లో ఒక విడత యూరియాను వినియోగించిన నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల రైతులు రెండోదఫా యూరియా కోసం పడిగాపులు పడుతున్నారు. అయితే గత జూలై నెల నుంచే రైతులకు పొదుపుగా యూరియాను పంపిణీ చేస్తూ వస్తున్న వ్యవసాయ శాఖ దగ్గర ప్రస్తుతం 50 వేల మెట్రిక్ టన్నులు కూడా నిల్వ లేదు. ప్రస్తుతం వచ్చిన యూరియాను వచ్చినట్లే రేషన్ విధానంలో రైతులకు టోకెన్‌లు ఇచ్చి ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం నుంచి సరఫరా తగ్గడం, మార్క్‌ఫెడ్ వద్ద తగినంత నిల్వలు లేకపోవడం, ప్రైవేటు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించడం వంటివి కారణాలనే చర్చ జరుగుతోంది.

**అవసరం 10.48 ఎల్‌ఎంటీ..**
**కేటాయింపు 9.80 ఎల్‌ఎంటీ**

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో పంటల విస్తీర్ణం 1.32 కోట్ల ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాగా యూరియా అధికంగా వినియోగించే ప్రధానమైన వరి, పత్తి, మొక్కజొన్న పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. వీటికి తోడు కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్‌లో 10.48 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) యూరియా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరితే, గత సీజన్‌లో ఇచ్చిన విధంగానే 9.80 ఎల్‌ఎంటీ మాత్రమే కేటాయింపులు జరిపింది. గత యాసంగిలో పంపిణీ చేయగా మిగిలిన 1.92 ఎల్‌ఎంటీల యూరియాను వినియోగించుకోవాలని సూచించింది. కేటాయించిన యూరియాను ఏప్రిల్ నెల నుంచి మొదలుపెట్టి ప్రతినెలా రైల్వే రేక్‌ల ద్వారా రాష్ట్రాలకు కేంద్రం పంపిస్తుంది. కానీ తెలంగాణకు ఏప్రిల్ నుంచి ఈ ఆగస్టు వరకు ప్రతినెలా పంపే యూరియాలో కోత విధించింది. రాష్ట్రానికి ఇప్పటివరకు 8.30 ఎల్‌ఎంటీల యూరియా రావలసి ఉండగా, కేవలం 5.32 ఎల్‌ఎంటీ యూరియా (2.98 ఎల్‌ఎంటీల లోటు) మాత్రమే పంపింది. ఈ యూరియాకు ఓపెనింగ్ స్టాక్‌గా ఉన్న మిగులు యూరియా 1.92 ఎల్‌ఎంటీలు కలిపి సుమారు 7.20 ఎల్‌ఎంటీలు రాష్ట్రంలోని సొసైటీలు, మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేసింది. సెప్టెంబర్‌లో మరో లక్షన్నర మెట్రిక్ టన్నుల యూరియా రావలసి ఉండగా, ప్రస్తుతం లోటుగా ఉన్న 2.98 ఎల్‌ఎంటీలను పంపిస్తే తప్ప ఈ నెలలో రైతులకు యూరియా ఇవ్వడం సాధ్యం కాదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు.

**వానాకాలం సీజన్‌లో రాష్ట్రానికి యూరియా కేటాయింపులు - సరఫరా వివరాలు (లక్షల మెట్రిక్ టన్నుల్లో)**

| నెల | కేటాయింపు | సరఫరా | లోటు |
|---|---|---|---|
| ఏప్రిల్ | 1.70 | 1.21 | 0.49 |
| మే | 1.60 | 0.88 | 0.72 |
| జూన్ | 1.70 | 0.98 | 0.72 |
| జూలై | 1.60 | 1.43 | 0.17 |
| ఆగస్టు | 1.70 | 0.82 | 0.88 |
| మొత్తం | 8.30 | 5.32 | 2.98 |


### ప్రైవేట్ డీలర్ల ద్వారా పారిశ్రామిక అవసరాలకు!

45 కిలోల యూరియా బస్తాపై కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.1,900 సబ్సిడీ భరిస్తుంది. ఇంత పెద్ద మొత్తంలో సబ్సిడీ భారాన్ని భరిస్తూ రైతులకు సరఫరా అవుతున్న యూరియా పక్కదారి పడుతోందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. 25 శాతం యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లుగా కేంద్రమంత్రి జేపీ నడ్డా చెప్పినట్లు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. రాష్ట్రానికి సరఫరా అయ్యే సబ్సిడీ యూరియాను 50:50 ప్రాతిపదికన ప్రభుత్వ ఏజెన్సీలతో పాటు ప్రైవేటు డీలర్లు కూడా విక్రయిస్తారు. ఉదాహరణకు లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం పంపిస్తే అందులో 50 వేల మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు సరఫరా చేస్తారు. అయితే ప్రైవేటు వ్యాపారుల వద్ద నుంచి యూరియా పక్కదారి పడుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రంగుల కంపెనీలు, వార్నిష్, ప్లైవుడ్, యాడ్-బ్లూ ద్రావణం తయారీ పరిశ్రమల్లో యూరియాను వినియోగిస్తున్నట్లు ప్రభుత్వం అనుమానిస్తోంది. బీరు, గుడుంబా, కోళ్లు, పశువుల దాణా, చేపలు, రొయ్యల చెరువుల్లో సైతం యూరియాను వినియోగిస్తున్నట్లు సమాచారం.

### 50 వేల మెట్రిక్ టన్నుల సరఫరాకు కేంద్రం హామీ

రాష్ట్రంలో యూరియా కొరతపై ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీలు రెండు రోజులుగా ఆందోళన నిర్వహించారు. మంగళవారం నాటి ఆందోళనకు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ సంఘీభావం తెలిపారు. కాగా ఈ నేపథ్యంలో స్పందించిన కేంద్రం.. కర్ణాటక నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణకు పంపించనున్నట్లు తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. అయితే ఈ యూరియా రావడానికి మరో 10 రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. అయితే 50 వేల మెట్రిక్ టన్నులతో రైతుల యూరియా బాధలు ఏమాత్రం తీరవని చెబుతున్నారు.

### మా లైన్ వచ్చేసరికి అయిపోయిందన్నారు..



పంటకు కావలసిన యూరియాను కొందామని నాలుగు రోజులుగా పీఏసీఎస్ కార్యాలయానికి తిరుగుతూనే ఉన్నా. వర్షం వస్తుండటంతో చెప్పులను క్యూలో పెట్టినం. మా లైన్ వచ్చేసరికి యూరియా అయిపోయిందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కావలసినంత యూరియాను సరఫరా చేయాలి.

– చిన్న హనుమంతు, రైతు బాలకృష్ణాపూర్, ఆత్మకూరు, వనపర్తి

### 10 రోజులుగా తిరుగుతున్నా...



నేను 12 ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో పెసర, 2 ఎకరాల్లో కూరగాయలు వేశా. యూరియా కోసం పది రోజులుగా తిరుగుతున్నప్పటికీ కేవలం ఒక బస్తా మాత్రమే ఇస్తామంటున్నారు. సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చి గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడుతున్నప్పటికీ యూరియా మాత్రం అందటం లేదు.

– చింతల సైదులు, రైతు, రెడ్యాల గ్రామం, మహబూబాబాద్ మండలం

### యూపీ యూరియా అక్రమ విక్రయం. షాప్ లైసెన్స్ సస్పెన్షన్

నెల్లికుదురు: ఒకవైపు ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతుంటే మరోవైపు ఓ వ్యాపారి అక్రమంగా అమ్ముకున్నాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులగూడెం క్రాస్‌రోడ్డులోని శరత్ ఫెర్టిలైజర్ దుకాణం యజమాని అనుమతి లేకుండా యూపీ నుంచి తెచ్చిన 333 యూరియా బస్తాలు సోమవారం రాత్రి అధిక ధరలకు విక్రయించినట్లు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు మంగళవారం ఎరువుల షాపులు తనిఖీ చేశారు. సదరు యజమాని అక్రమంగా యూపీ యూరియా విక్రయించినట్లు రుజువైంది. దీంతో సదరు డీలర్ రిటైల్ ఎరువుల లైసెన్స్‌ను సస్పెండ్ చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు.





పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ ఎంపీలు

## తెలంగాణ రైతులపై కేంద్రం వివక్ష

- కేంద్రప్రభుత్వంపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆగ్రహం
- యూరియా కోసం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు కేటాయించిన యూరియా వాటాను తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని మంగళవారం పార్లమెంట్ లోపల, బయట కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలిపారు. పార్లమెంట్ మకర ద్వారం వద్ద తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, రామసహాయం రఘురామిరెడ్డి, కడియం కావ్య, బలరామ్ నాయక్, అనిల్‌కుమార్ యాదవ్, రఘువీర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ప్రియాంక గాంధీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగం హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. అనంతరం తెలంగాణ ఎంపీలు మాట్లాడుతూ... రాష్ట్రానికి రావాల్సిన యూరియాను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వారం రోజుల్లో 62 వేల మెట్రిక్ టన్నుల యూరియా**

వారం రోజుల్లో తెలంగాణకు 62 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తామని కేంద్రమంత్రి జేపీ నడ్డా హామీ ఇచ్చినట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. పార్లమెంటులో నిరసన అనంతరం కాంగ్రెస్ ఎంపీల ఫోరమ్ చైర్మన్ మల్లు రవి నేతృత్వంలో ఆరుగురు ఎంపీలు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన యూరియాను వెంటనే విడుదల చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. అనంతరం చామల మీడియాతో మాట్లాడుతూ.. ఒకటిరెండు రోజుల్లో రాష్ట్రానికి 14 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## జల వివాదాలపై కమిటీ ఏర్పాటులో కదలిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న అపరిష్కృత జల వివాదాలపై చర్చల కోసం ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటు విషయంలో కేంద్ర జలశక్తి శాఖ కసరత్తు ప్రారంభించింది. కమిటీలో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన అధికారుల పేర్ల ను ఇంకా ప్రతిపాదించలేదని, సత్వరంగా ప్రతిపాదించాలని కోరుతూ ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అగర్వాల్ ఈనెల 12న లేఖ రాశారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ గత నెల 16న ఢిల్లీలో తెలంగాణ, ఏపీ సీఎంలతో నిర్వహించిన సమావేశంలో కమిటీ ఏర్పాటుకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు. తెలంగాణ, ఏపీ నుంచి చెరో ఐదుగురు అధికారులతో పాటు కేంద్ర జలశక్తి శాఖ నుంచి మరో ఇద్దరు అధికారులు కలిపి మొత్తం 12 మందితో కమిటీ ఏర్పాటు చేయాలని అప్పట్లో నిర్ణయించగా, నెల రోజు లు గడుస్తున్నా ముందడుగు పడలేదు.

## మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి ఇంట్లో ఐటీ సోదాలు

- పన్ను ఎగవేత ఆరోపణలపై ఆదాయ పన్నుశాఖ సోదాలు
- డీఎస్ఆర్ గ్రూపుతో రంజిత్‌రెడ్డి లావాదేవీలపై ఆరా

సాక్షి, హైదరాబాద్: పన్ను ఎగవేత ఆరోపణలపై మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, డీఎస్ఆర్ రియల్ ఎస్టేట్ కంపెనీల గ్రూప్‌పై ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, బెంగళూరులో కలిపి మొత్తం 27 ప్రాంతాల్లో ఐటీ బృందాలు మంగళవారం ఉదయం నుంచి ఏకకాలంలో సోదాలు చేపట్టాయి. భద్రత నడుమ డీఎస్ఆర్ గ్రూప్ కార్యాలయాలు, కంపెనీలో కీలక వ్యక్తుల కార్యాలయాలు, ఇళ్లలో సోదాలు చేశాయి. డీఎస్ఆర్ గ్రూప్ చేపట్టిన ప్రాజెక్టుల్లో లెక్కల్లో చూపని నగదు లావాదేవీలను వెలికితీయడమే లక్ష్యంగా సోదాలు చేపట్టినట్లు తెలిసింది. ఎమ్మెల్యే కాలనీలోని రంజిత్‌రెడ్డి నివాసంతోపాటు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్ నగర్, సూరారంలో డీఎస్ఆర్ సంస్థ సీఈఓ సత్యనారాయణరెడ్డి, ఎండీ సుధాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ సోదాలు సాగాయి. డీఎస్ఆర్ స్కైవన్, డీఎస్ఆర్ వరల్డ్ వెంచర్స్ వంటి ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు చదరపు అడుగుకు రూ.12,000 నుంచి 13,000 ధరకు అమ్ముడవుతున్నా.. రిజిస్ట్రేషన్లు రూ.7,000 వద్ద మాత్రమే చూపినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. రిజిస్ట్రేషన్ విలువకు, నిజంగా వసూలు చేస్తున్న ధరకు ఉన్న వ్యత్యాసాన్ని సదరు సంస్థ నగదుగా సేకరిస్తున్నట్లు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. లెక్కల్లో చూపకుండా వసూలు చేస్తున్న ఈ నగదును దాచడానికి సంబంధించిన పలు డాక్యుమెంట్లను గుర్తించారు. అదేవిధంగా రంజిత్‌రెడ్డి డీఎస్ఆర్ ఐఆర్ స్పేస్‌లు, మల్టిపుల్ డీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థలతో సహా అనేక డీఎస్ఆర్ కంపెనీలతో సంబంధం కలిగి ఉన్నట్టు ఆధారాలు సేకరించారు. ఈ సోదాల్లో పలు కీలక పత్రాలు, పరికరాలు, ఖాతా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.

## పతంజలికి ఏఈవో టైర్-2 సర్టిఫికెట్

సాక్షి, హైదరాబాద్: పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ తమకు ప్రతిష్టాత్మక ఏఈవో (ఆథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్) టైర్-2 సర్టిఫికెట్ లభించినట్లు తెలిపింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దివరల్డ్ కస్టమ్స్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూసీవో), కేంద్ర ఆర్థిక శాఖ ఈమేరకు సర్టిఫికెట్‌ను అందించినట్లు వెల్లడించింది. ప్రపంచ వాణిజ్యంలో నిజాయితీ, పారదర్శకత, భద్రత వంటి అత్యున్నత ప్రమాణాలను పాటించినందుకు ఈ గుర్తింపు లభించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా పంతజలి సహ వ్యవస్థాపకుడు స్వామి రాందేవ్ మాట్లాడుతూ 'ఈ రోజు పతంజలి కుటుంబమే కాక ప్రతి ఒక్క భారతీయుడు గర్వించదగ్గది. టైర్-2 సర్టిఫికెట్ స్వదేశీ సే స్వాభిమాన్ అనే మా లక్ష్యాన్ని పెంచుతుంది. అంతర్జాతీయ స్థాయిలో మేక్ ఇన్ ఇండియా దార్శనికతకు మద్దతు ఇస్తుంది'అని తెలిపారు.

## కాంగ్రెస్ అసమర్థతతోనే యూరియా కొరత

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



వికారాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతోనే రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన జిల్లా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విఫలమయ్యాయని, ఈసారి తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని తెలిపారు. తెలంగాణలో తప్ప ఏ రాష్ట్రంలోనూ యూరియా కొరత లేదని, రైతుల అవసరాల మేరకు యూరియా తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దళారులు, కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా కొరతపై సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాత్రం ఒక్కసారి కూడా ఆపకుండా పీఎం సమ్మాన్ యోజన నిధులు మంజూరు చేస్తోందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు రాంచందర్‌రావు సూచించారు.



న్యూస్‌సీన్

"ఇనుములో ఓ హృదయం మొలిచెనే" అన్నది రోబో సినిమాలో ఓ పాట.
అదే పాట పదాలను కాస్త మారిస్తే 'నర రూప రోబో' ఒకటి పాడే పాటల్లో పదాలిలా ఉండొచ్చు... అవి... "ఐ యామ్ ఏ సూపర్ గాళ్.
'కనిపెంచే' రోబో గాళ్... కడుపున మోసే ప్రెగ్నెంట్ గాళ్!! "
ఈ పాటలూ, మాటలూ... అందులోని పదాల ప్రస్తావననే ఇప్పుడెందుకంటే మహిళలు తమ గర్భాన మొయ్యాల్సిన ప్రెగ్నెన్సీ బరువును ఇకపై రోబోలే కడుపున మోసే రోజులు త్వరలో రానున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా చైనా ఒక రోబోను రూపొందించింది. అవును... ఇనుములో హృదయానికి బదులు ఇప్పుడో గర్భసంచి నిజంగానే రూపొందింది. వచ్చే ఏడాదికి అందులో బిడ్డ ప్రసవమూ జరగనుందంటోంది చైనా. ఆ వివరాలేమిటో చూద్దాం.

# సీమంతానికి సిద్ధమవుతున్న ప్రెగ్నెంట్ 'రోబో'లు!!

గ్వాంగ్‌ఝూ నగరంలోని కైవా టెక్నాలజీస్ సంస్థ ఓ హ్యూమనాయిడ్ రోబోను రూపొందించింది. ఆ రోబో ప్రత్యేకత ఏమిటంటే... దాని కడుపున బిడ్డను మోసేలా ఓ కృత్రిమ గర్భసంచిని ఏర్పాటు చేశారు అక్కడి శాస్త్రవేత్తలు. ఇప్పుడీ 'ఆర్టిఫిషియల్ ఊంబ్' అమరి ఉన్న ఆ రోబో వచ్చే ఏడాదికి మార్కెట్లోకి రానుందని చెబుతున్నారు 'కైవా టెక్నాలజీస్' సంస్థ వ్యవస్థాపకుడు ఝాంగ్ క్వి ఫెంగ్. ఆయన చెబుతున్న ప్రకారం ఆ రోబో ధర దాదాపు లక్ష యువాన్ల కంటే తక్కువే. డాలర్లలో చెప్పాలంటే 13,900 డాలర్లు. అంటే మన భారత కరెన్సీలో అటు ఇటుగా దాదాపు రూ. 12 లక్షలు!

**అదెలాగంటే...**



ఇదెలా సాధ్యమని అనుకోడానికి ఇప్పుడు వీల్లేదు. మనకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే... ఇక్కడ నెలలు తక్కువగా పుట్టిన పిల్లలను కృత్రిమ గర్భంలాంటి ఇంక్యుబేటర్‌లో పెట్టి సాకినట్టే... ఆ రోబోకు ఓ కృత్రిమ ఇంక్యుబేటర్ అమరి ఉంటుంది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో రూపొందే ఆ ఇంక్యుబేటర్... బిడ్డ పెరుగుదలను బట్టి సమకూర్చాల్సిన సౌకర్యాలూ, అందించాల్సిన పోషకాలూ ఇవన్నీ అందిస్తుంది. అంతేకాదు... స్వాభావికంగా రూపొందించిన పిండాన్ని కృత్రిమంగా ఏర్పాటు చేసిన ఉమ్మనీటిలో (అమ్నియాటిక్ ఫ్లుయిడ్‌లో) ఉంచుతూ, ఓ పైపు ద్వారా కృత్రిమ పోషకాలతో పెంచుతూ... నెలలు నిండి బిడ్డ పూర్తి రూపం సంతరించుకోవడం (జెస్టేషన్) పూర్తయ్యాక ప్రసవం పూర్తి చేసి ఆ గడుసుపిండాన్ని మానవ మాతృమూర్తి చేతుల్లో పెడుతుందా రోబో గట్టి'పిండం'. అలా తన గర్భాన పెంచి తన కడుపు పంటను మానవ మహిళ చేతుల్లో ఉంచుతుందా 'యంత్రమాత'!!

ఈ విధంగా సరోగసీలో అమ్మల అవసరాల్ని తీర్చడమే కాదు... కడుపున బిడ్డ భారం మోయలేని అమ్మలకూ ఓ వరప్రసాదంలా మారనుందంటున్నారు ఝాంగ్ క్విఫెంగ్. ఈ కాన్సెప్టును ఈ ఏడాది బీజింగ్‌లో నిర్వహించిన ఓ కాన్ఫరెన్స్‌లోనే వెల్లడించారాయన.

''ఈ రోబో కేవలం ఓ లైఫ్ సైజ్ ఇంక్యుబేటర్ మాత్రమే కాదు. ఇది కేవలం హ్యూమనాయిడ్ రోబో మాత్రమే కాదు... కడుపున పెంచడం మొదలుకొని, కనేవరకూ... యంత్రగర్భంలోంచి ప్రసవం వరకు కడుపున పెరిగే సమయంలో ఏయే కార్యకలాపాలు జరుగుతాయో వాటన్నింటినీ నెరవేరుస్తూ చిన్నారి బిడ్డను పెంచే ఓ యాంత్రిక మమకారాల 'గర్భ'కోశం'' అంటూ వివరించారు ఝాంగ్ క్విఫెంగ్. ఇలా ఆయన తన కాన్సెప్టును వివరించారో లేదో ఈ తరహా రోబోల గర్భధారణల తాలూకు నైతిక అంశాలపై ప్రస్తుతం అక్కడ తీవ్ర చర్చ మొదలయ్యింది.

అయితే ప్రస్తుతానికి జవాబు దొరకాల్సిన అంశాలు ఇంకా కొన్ని ఉన్నాయంటున్నారు నిపుణులు. అవేమిటంటే... పిండాన్ని పెంచే కృత్రిమ గర్భమైతే రూపొందింది గానీ, వీర్యకణం, అండం తాలూకు ఫలదీకరణమంతా ఈ కృత్రిమ గర్భంలో జరుగుతుందా లేక టెస్ట్‌ట్యూబ్ బేబీలోలా బయట ఫలదీకరణ జరిపాక అందులో ప్రవేశపెడతారా, ప్రసవం తాలూకు తీరుతెన్నులేమిటి, ఈ తరహా గర్భం తాలూకు చట్టబద్ధత, నైతికత లాంటి అనేక అంశాలపై హాట్ హాట్ డిబేట్లు జరుగుతున్నాయి.

– యాసీన్

### అటు అమెరికాలోనూ...



చైనాలోని గర్భవతులైన యాంత్రిక రోబోల తీరుతెన్నులిలా ఉంటే... ప్రపంచపు మరో పక్కన అమెరికాలోని న్యూయార్క్ సిటీ మిడ్‌టౌన్‌లో 'కాయిడ్ (కే ఓ ఐ డీ)' అనే బ్రాండెడ్ రోబో వీధుల్లో తిరుగుతూ బర్గర్లూ, హ్యాంబర్గర్లు కొంటూ యంత్రమానవుల్లా సంచరిస్తోంది. దాన్ని చూస్తూ, నవ్వుతూ, భయపడుతూ, ఫొటోలూ తీసుకుంటున్న కొందరు రకరకాల కామెంట్లు చేస్తూ ఉన్నారు. ''దేవుడు చెప్పినట్టుగా సాతాన్ స్వైర విహారాలు చేసే కాలం వచ్చేసిందనీ'', ''మొదటి లైట్ బల్బ్‌నూ, మొదటి కారునూ నేను చూళ్లేదు గానీ... మొట్టమొదటి మానవ రోబోను చూస్తున్న అనుభూతిని నాకు సొంతం చేసిందీ కాయిడ్'' అంటూ పలుపలు విధాల కామెంట్స్ వినవస్తున్నాయి.

దీనికి భిన్నంగా పాజిటివ్ కామెంట్స్ వినవస్తున్నాయి. అవేమిటంటే... ''ఇదో అద్భుతం'' అని కొందరూ; ''కుక్కల బొచ్చు వల్ల అలర్జీలతో బాధపడే వారికి ఇవి వాచ్‌డాగ్స్‌లా, అసిస్టెంట్లుగా పనిచేస్తాయి'' అంటూ ఇంకొందరూ, ''మా ఇంట్లో పనిమనిషిలా వాడుకుంటా'' అంటూ మరికొందరు మరో వైపున మరో తరహా కామెంట్లు స్వైరవిహారం చేస్తున్నాయి. అన్నట్టు ఈ కాయిడ్ రోబో కూడా 'యూనీ ట్రీ' అనే చైనీస్ రోబోటిక్ సంస్థ రూపొందించగా లాంగ్ ఐలాండ్ బేస్డ్ రోబో స్టోర్ అనే స్టాన్‌ఫోర్డ్ సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఇది రూపొందిందంటున్నారు అక్కడి నిపుణులు.



న్యూస్ మేకర్

నవంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరగనున్న మిస్ యూనివర్స్ 2025 పోటీలో పాల్గొనబోతున్న భారతీయ సుందరిగా మనికా విశ్వకర్మ ఎంపికైంది. రాజస్తాన్‌కు చెందిన మనిక విశ్వకర్మ ప్రస్తుతం పొలిటికల్ సైన్స్ చదువుతోంది. క్లాసికల్ డాన్సర్‌గా ప్రతిభ చూపడమే కాదు 'న్యూరోనోవా' అనే సంస్థను స్థాపించి పుట్టుకతోనే న్యూరో సమస్యలతో బాధపడే చిన్నారులకు సాయం చేస్తోంది మనిక. ఆమె పరిచయం.

మనిక విశ్వకర్మ

# మిస్ యూనివర్స్ వేదికపై అందాల 'మణి'క

దాదాపు 100కు పైగా దేశాల సుందరీమణులు పాల్గొనే 'మిస్ యూనివర్స్' పోటీలలో 2025 సంవత్సరానికి భారతదేశం తరఫున పాల్గొనే ప్రతినిధిగా 22 సంవత్సరాల మనిక విశ్వకర్మ ఎంపికైంది. జైపూర్‌లో మంగళవారం తెల్లవారుజాము వరకూ సాగిన తుది ఎంపిక వేడుకలో మనిక విశ్వకర్మ 'మిస్ యూనివర్స్ ఇండియా 2025' కిరీటం దక్కించుకుంది. గత సంవత్సరం ఈ టైటిల్ గెలుచుకున్న రియా సిన్హా ఆమెకు కిరీటం తొడిగింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన తాన్యా శర్మ ఫస్ట్ రన్నర్ అప్‌గా, హర్యాణకు చెందిన మెహక్ ధింగ్రా రెండవ రన్నర్ అప్‌గా ఈ పోటీలో నిలిచారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల అందగత్తెలు ఈ పోటీలో పాల్గొనగా రాజస్తాన్‌కు చెందిన మనిక విజేతగా నిలిచింది. నవంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరగనున్న 74వ 'మిస్ యూనివర్స్' పోటీలలో మనిక తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గతంలో మిస్ యూనివర్స్ కిరీటాన్ని మన దేశం నుంచి సుస్మితాసేన్ (1994), లారా దత్తా (2000), హర్నాజ్ సంధు (2021) గెలుచుకున్నారు.



**స్త్రీ విద్య ముఖ్యమైనది**

మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత తుది ఎంపికలో జ్యూరీ అడిగిన ప్రశ్నకు మనిక ఇచ్చిన జవాబు అందరినీ ఆకట్టుకుంది. 'స్త్రీలకు విద్య అందించే అవకాశం ఒకవైపు, పేద కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన అందించే అవకాశం మరోవైపు నీకు ఉంటే దేనిని ఎంచుకుంటావ్' అనే ప్రశ్నకు మనిక 'నేను స్త్రీ విద్యనే ఎంచుకుంటాను. ఎందుకంటే స్త్రీలకు విద్య నేర్పించడం వల్ల ఆమె మాత్రమే మారదు... కుటుంబాలు... తద్వారా భవిష్యత్ తరాలు మారుతాయి' అని సమాధానం ఇచ్చింది.

**డాన్సర్, పెయింటర్**


రాజస్తాన్‌లోని గంగానగర్ అనే చిన్న పట్టణానికి చెందిన మనిక విశ్వకర్మ బాల్యం నుంచి క్లాసికల్ డాన్సర్. పెయింటర్ కూడా. ఆమెను లలిత కళా అకాడెమీ, జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్ సత్కరించాయి కూడా. పొలిటికల్ సైన్స్ స్టూడెంట్‌గా ఢిల్లీలో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే అందాల పోటీలో పాల్గొంది మనిక. ఒక సాధారణ నేపథ్యం నుంచి విజేతగా నిలిచింది. 'అందరూ ఈ సమయంలో తాము పడ్డ కష్టాల గురించి చెబుతారు. కాని నేను నాకు దొరికిన సపోర్ట్ గురించి చెబుతాను. మా అమ్మా నాన్నలు నన్ను ఎంతో సపోర్ట్ చేశారు. నాకు చదువు నేర్పిన గురువులది తర్వాతి స్థానం. నా స్నేహితులు ఎంతో ప్రోత్సహించారు. వీరందరూ లేకుంటే నేను ఇక్కడి వరకూ రాను' అని చెప్పిందామె.

**సామాజిక సేవలో...**

పుట్టుకతోనే న్యూరో సంబంధ సమస్యలతో పాల్గొనే చిన్నారుల కోసం 'న్యూరోనోవా' అనే సంస్థను స్థాపించింది మనిక. డౌన్ సిండ్రోమ్, ఏడీహెచ్‌డీ వంటి సమస్యలతో బాధ పడే చిన్నారులకు తగిన కౌన్సెలింగ్, సపోర్ట్ ఇచ్చే కార్యక్రమాలు చేస్తూ ఉంది. 'మిస్ యూనివర్స్ వంటి పోటీలు గుర్తింపును ఇవ్వడం మాత్రమే కాదు వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్దుతాయి. ఈ పోటీలలో సవాళ్లను ఎదుర్కొంటూ విజేత అయ్యాను. ఈ గుర్తింపుతో నా సామాజిక సేవను విస్తరిస్తాను. సమాజానికి ఏదో ఒకటి చేయడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత' అంది మనిక.



షకీర



కాంచన

సోషల్ మీడియా

## కాంచన షకీరా

సరదాగా చేసిందో, సీరియస్‌గా చేసిందో తెలియదుగానీ రాజస్థాన్‌కు చెందిన కాంచన అగర్వాల్ రాజస్థానీ సంప్రదాయ దుస్తుల్లో చేసిన డాన్స్ ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ప్రేక్షకులను ఆకట్టుకొని వైరల్‌గా మారింది. 'గ్లోబల్ ఐకాన్' ప్రియాంక చోప్రాకు కూడా కాంచన డ్యాన్స్ వీడియో బాగా నచ్చింది.

ఇంతకీ ఆమె ఏ పాటకు డ్యాన్స్ చేసింది? రాజస్థానీ జానపద గీతం, బాలీవుడ్ పాటకు కాదు... 'క్వీన్ ఆఫ్ లాటిన్ మ్యూజిక్'గా ప్రసిద్ధిగాంచిన షకీర 'డోన్ట్ లై' పాటకు డాన్స్ చేసింది. షకీర సిగ్నేచర్ హుక్ స్టెప్స్‌ను అచ్చంగా అనుకరించి 'ఆహా' అనిపించుకుంది.

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన కాంచన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 3.5 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.'ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత మంచి డాన్స్ వీడియోను చూడడం ఇదే తొలిసారి' అని ఒక యూజర్ ప్రశంసపూర్వకంగా స్పందించాడు.

మరో యూజర్ రెండు పేర్లనూ మిక్స్ చేసి 'కాంచనా షకీర' అని నామకరణం చేశాడు!

**• లీగల్**

## రెండవ భార్యకీ – తన పిల్లలకూ భర్త ఆస్తిలో, పెన్షన్‌లో హక్కు ఉంటుందా?

భార్య లేదా భర్త బతికి ఉండగా, చట్టరీత్యా విడాకులు తీసుకోకుండా చేసుకున్న రెండవ పెళ్లి చెల్లదు. ప్రస్తుతం ఉన్న చట్టాలలో (ముస్లింలకు, కొన్ని ప్రత్యేక మతాచారాలు వున్నవారికి తప్ప) అది నేరం కూడా. అందుకనే రెండవ భార్యకి భర్త ఆస్తిలో ఎటువంటి హక్కు ఉండదు. మొదటి భార్య సంతానానికి, రెండవ భార్య సంతానానికి మాత్రం ఆస్తిలో సమాన హక్కు ఉంటుంది. అయితే మొదటి భార్య చనిపోయిన తర్వాత, లేదా విడాకులు తీసుకున్న తర్వాత రెండోపెళ్లి చేసుకుంటే, ఆ రెండవ భార్యకి కూడా మొదటి భార్య సంతానం – రెండవ భార్య సంతానంతోపాటు ఆస్తిలో సమాన హక్కు ఉంటుంది. ఉదాహరణకు: చనిపోయిన మొదటి భార్యకి భర్తకి కలిపి ఇద్దరు సంతానం ఉన్నారు. అలాగే రెండవ భార్యకి ఇద్దరు సంతానం ఉన్నారు. ఎటువంటి వీలునామా రాయకుండా చనిపోయిన భర్త స్వార్జితంలో – పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఆస్తిలో 5 భాగాలు అవుతాయి. అందులో నాలుగు భాగాలు మొదటి – రెండవ భార్య సంతానానికి, ఒక భాగం రెండవ భార్యకి చెందుతాయి.

అయితే ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ – పదోన్నతి తర్వాత సంక్రమించే సర్వీస్ బెనిఫిట్స్ కి సంబంధించి మాత్రం చట్టం కొంత వేరుగా ఉంటుంది. సాధారణ పరిస్థితులలో, పైన తెలిపిన విధంగా చెల్లుబాటు కానీ పెళ్లి చేసుకున్న రెండవ భార్యకి పెన్షన్, సర్వీస్ బెనిఫిట్స్‌లో ఎటువంటి హక్కూ ఉండదు. అయితే అన్ని వేళలా అలా వుండదు. ఇటీవలే 2023లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పులో మొదటి భార్య బతికి ఉన్నప్పటికీ, చట్టరీత్యా విడాకులు తీసుకోనప్పటికీ రెండవ భార్యకి కూడా పెన్షన్ – సర్వీస్ బెనిఫిట్స్‌లో సమాన హక్కు కల్పించింది. మొదటి భార్య నుంచి విడాకులు కావాలంటూ చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగి డైవర్స్ కేసు ఫైల్ చేసి ఉండడం ఆ కేసులో గమనించదగ్గ అంశం. అంతేకాక ఫ్యామిలీ పెన్షన్ ఉద్దేశానికీ, మెయింటెనెన్స్ చట్టం వెనుక ఉన్న ఉద్దేశానికీ తేడా ఏమీ లేదని అంటూ, భర్త బతికివుండగా మొదటి భార్యకు రావలసివున్న మెయింటెనెన్స్ బకాయిలు కూడా తనకు ఇవ్వాలి అని కోర్టు పేర్కొంది. మొదటి భార్యకి, రెండవ భార్యకి పెన్షన్ సమానంగా రెండు భాగాలుగా పంచాలి అని కోర్టు తీర్పు వెలువరించింది. రైల్వే విభాగంలో మాత్రం పెన్షన్ రూల్స్‌లోని సెక్షన్ 75 ప్రకారం, మొదటి భార్యకి – రెండవ భార్యకి కూడా పెన్షన్‌లో సమాన హక్కు ఉంటుందని గతంలో పలు హైకోర్టులు పేర్కొన్నాయి కాబట్టి కేసు పూర్వాపరాలను బట్టి కొన్ని హక్కులు రెండవ భార్యకూ వర్తిస్తాయా లేదా అన్నది పూర్తిగా ఆయా కేసులోని ప్రత్యేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనేవారు చట్టాన్ని ఆశ్రయిస్తే తగిన ఉపశమనం దొరికే ఆస్కారం ఉంది.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

'వయసు పైబడడం అనేది సహజం... వచ్చే సమస్యలు కూడా సహజం' అని ఆరోగ్యాన్ని గాలికి వదిలేసేవారు కొందరు. 'వయసు పైబడడం అనేది సహజమే అయినా, తగిన జాగ్రత్తలు తీసుకోవడం, వ్యాయామాలు చేయడం తప్పనిసరి' అని ముందుకు వెళ్లేవారు కొందరు. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ రెండో కోవకు చెందిన వ్యక్తి.

తన ఆలోచనలను పర్సనల్ బ్లాగ్ ద్వారా ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటారు బిగ్ బి. 82 సంవత్సరాల అమితాబ్ తాజాగా వృద్ధాప్యానికి సంబంధించిన సవాళ్ల గురించి తన తాజా పోస్ట్‌లో రాశారు. ఇంట్లో 'హ్యాండిల్ బార్స్' అవసరం గురించి ప్రస్తావించారు.

వృద్ధుల కోసం బాత్‌రూమ్‌లో, ఇంట్లోని కొన్ని చోట్ల హ్యాండిల్ బార్స్ లేదా గ్రాబ్ బార్స్ ఏర్పాటు చేస్తారు.

'మీట్–అండ్–గ్రీట్ విత్ ఫ్యాన్స్'లో భాగంగా అభిమానులను కలుసుకున్న తరువాత తన దినచర్య గురించి రాశారు బిగ్ బి.

'శరీరం క్రమేణా సమతుల్యత కోల్పోతోంది' అని రాసిన బచ్చన్ తన ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెడుతున్నారు. యోగా, శ్వాస వ్యాయామాలు, మొబిలిటీ వ్యాయామాల ప్రాముఖ్యత గురించి తన పోస్ట్‌లో నొక్కి చెప్పారు.

'82 సంవత్సరాల వయసులోనూ ఇంత చురుగ్గా ఎలా ఉండగలుగుతున్నారు?' అనే ప్రశ్నకు సోషల్ మీడియాలో ఆయన పోస్ట్‌లే సమాధానం చెబుతాయి. సందర్భానుసారంగా ఉన్నత జీవన శైలికి సంబంధించిన అలవాట్ల గురించి ఎన్నో పోస్ట్‌లలో వివరించారు అమితాబ్.

ఎన్నో అనారోగ్య సమస్యలను అధిగమించి ఉత్సాహంగా ముందుకు వెళుతున్న సూపర్ స్టార్ నిజమైన పోరాట యోధుడు. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే వ్యక్తి.

సెలబ్రిటీ స్పేస్

## అయినా సరే... జాగ్రత్తలు తప్పనిసరి



**• కిచెన్ టిప్స్**



- బీట్‌రూట్ హల్వా చేసేటప్పుడు ముందుగా బీట్‌రూట్‌ను పాలలో ఉడికించుకుంటే మంచి రుచి వస్తుంది.
- దోసెపిండి త్వరగా పులియాలంటే కొంచెం కొబ్బరినీళ్లు కలపాలి.
- టొమాటోలు త్వరగా ఉడకాలంటే... ఉడికించేటప్పుడు చెంచాడు చక్కెర వేయాలి.
- కాకరకాయ వండేటప్పుడు రెండు పచ్చిమామిడి ముక్కలు వేస్తే చేదు లేకుండా ఉంటుంది.
- చపాతీ పిండిలో కాసింత ఉడికించిన బంగాళదుంప ముద్దను కలిపితే చపాతీలు మృదువుగా, రుచిగా ఉంటాయి.
- వంటగది దుర్వాసన.. వేస్తుంటే కమలాపండు తొక్కల్ని, లవంగాలతో కలిపి నీటిలో ఉడికిస్తే ఆ దుర్వాసన పోతుంది.

**బులియన్**
బంగారం 10 గ్రా.। వెండి కిలో; ఆగస్టు 19న ముగింపు రూ.లలో

| నగరం | బంగారం (24 క్యారెట్లు) | బంగారం (22 క్యారెట్లు) | వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,00,810 | 93,670 | 1,17,000 |
| విజయవాడ | 1,02,280 | 92,350 | 1,16,800 |
| విశాఖపట్నం | 1,00,750 | 92,350 | 1,26,000 |
| రాజమండ్రి | 1,02,280 | 95,120 | 1,16,800 |
| ప్రొద్దుటూరు | 1,00,500 | 92.460 | 1,16,500 |
| చెన్నై | 1,00,740 | 92,350 | .1,26,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



## జాతీయ క్రీడా పాలన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: దేశ క్రీడా పరిపాలన వ్యవస్థను సమూలంగా మార్చడంతో పాటు... క్రీడా రంగానికి మరింత చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జాతీయ క్రీడా పాలన చట్టం–2025' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. దీంతో బిల్లు చట్టంగా మారిందని... ఇది దేశ క్రీడారంగంలో విప్లవాత్మక సంస్కరణ అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. 'ఆగస్టు 18న జాతీయ క్రీడా పాలన చట్టం–2025కు రాష్ట్రపతి ఆమోదం లభించింది' అని కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గత నెల 23న ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా... ఈ నెల 11న ఆమోదం పొందింది. ఈ నెల 12న రాజ్యసభలో సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం లభించింది. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బిల్లుకు కొన్ని సవరణల అనంతరం ఉభయసభలు ఆమోదించాయి. దీంతో ప్రభుత్వ నిధులపై ఆధారపడే క్రీడా సంస్థలు మాత్రమే సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) పరిధిలోకి రానున్నాయి. మొదటి నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ వస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆర్టీఐ పరిధిలోకి రాదు.

# షఫాలీ వర్మకు దక్కని చోటు

- రేణుక, అమన్‌జోత్, యస్తిక పునరాగమనం
- అరుంధతి, శ్రీచరణి ఎంపిక
- వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి భారత మహిళల జట్టు ప్రకటన



ముంబై: భారత మహిళల క్రికెట్ జట్టు తొలి వరల్డ్ కప్ టైటిల్ వేటకు సిద్ధమైంది. సెప్టెంబర్ 30 నుంచి జరిగే ఈ మెగా టోర్నీలో పాల్గొనే మన టీమ్‌ను మంగళవారం సెలక్టర్లు ప్రకటించారు. 15 మంది సభ్యుల ఈ బృందానికి హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుంది. ఏడాది కాలంగా వన్డే జట్టులో స్థానం కోల్పోయి ఇటీవల మళ్లీ రాణిస్తున్న యువ బ్యాటర్ షఫాలీ వర్మకు వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కలేదు. గాయాల నుంచి కోలుకున్న పేసర్ రేణుకా సింగ్, ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్ టీమ్‌లోకి పునరాగమనం చేశారు. ఈ స్వల్ప మార్పులు మినహా ఎలాంటి సంచలన ఎంపికలు లేకుండానే టీమ్‌ను నీతూ డేవిడ్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించింది. భారత్, శ్రీలంక ఈ వరల్డ్ కప్‌కు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తుండగా... తొలి పోరులో ఈ రెండు జట్లే తలపడతాయి. గతంలో రెండుసార్లు 2005, 2017లో ఫైనల్లో ఓడిన భారత జట్టు 2022లో జరిగిన గత టోర్నీలో సెమీస్ చేరడంలో విఫలమైంది. ఈ వరల్డ్ కప్‌కు ముందు సన్నాహకంగా భారత జట్టు స్వదేశంలో ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు ఆడుతుంది. అమన్‌జోత్‌కు మరింత విశ్రాంతి కావాలని భావిస్తున్న సెలక్టర్లు ఆసీస్‌తో సిరీస్‌కు ఆమె స్థానంలో సయాలీని ఎంపిక చేశారు.

### ప్రతీక రావల్‌కే అవకాశం

గత కొంత కాలంగా నిలకడగా రాణిస్తూ వరుస విజయాలు సాధిస్తున్న జట్టుపైనే సెలక్టర్లు నమ్మకం ఉంచారు. ఓపెనర్‌గా స్మృతి మంధానకు తోడుగా ప్రతీక రావల్‌ను ఎంపిక చేశారు. ఈ స్థానం కోసం పోటీ పడిన షఫాలీ వర్మకు మరోసారి అవకాశం దక్కలేదు. సంవత్సరం క్రితం షఫాలీ చివరి వన్డే ఆడింది. అయితే ఇటీవల ఆమె ఆట మెరుగ్గా ఉండటంతో ఎంపికపై చర్చ సాగింది. కానీ ఆడిన 14 వన్డేల్లో 1 సెంచరీ, 5 హాఫ్ సెంచరీలతో సత్తా చాటిన ప్రతీకకే సెలక్టర్లు ఓటు వేశారు. షఫాలీ 'ఎ' జట్టు తరఫున బాగానే ఆడిందని, అయితే భవిష్యత్తులో ఆమెకు తగిన అవకాశాలు వస్తాయని నీతూ డేవిడ్ వెల్లడించింది. మూడో స్థానంలో హర్లీన్ డియోల్ చోటును నిలబెట్టుకోగా... నాలుగు, ఐదు స్థానంల్లో హర్మన్, జెమీమా స్థానాలు పదిలం. రిచా ఘోష్‌తో పాటు రెండో వికెట్ కీపర్‌గా యస్తిక భాటియాకు అవకాశం దక్కింది. సీనియర్లు దీప్తి శర్మ, రాధా యాదవ్, స్నేహ్ రాణాలతో పాటు శ్రీచరణితో కలిపి జట్టులో నలుగురు స్పిన్నర్ల బృందం ఉంది. గాయాలతో గత కొంత కాలంగా జట్టుకు దూరమైన పేసర్ రేణుకా సింగ్, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్ టీమ్‌లోకి మళ్లీ రాగా... క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి రూపంలో మరో ఇద్దరు పేసర్లు జట్టులో ఉన్నారు.

**భారత జట్టు వివరాలు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియా, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, రాధ యాదవ్, రేణుక ఠాకూర్, శ్రీచరణి, స్నేహ్ రాణా. **స్టాండ్‌బై:** సయాలీ సత్‌ఘరే, తేజల్ హసబ్నిస్, ప్రేమ రావత్, ప్రియా మిశ్రా, ఉమా ఛెత్రి, మిన్ను మణి.

## మనోళ్లు ఇద్దరు...

హైదరాబాద్‌కు చెందిన పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి వరల్డ్ కప్ టీమ్‌లోకి ఎంపికయ్యారు. గత ఏడాది వన్డేల్లో అరంగేట్రం చేసి 9 మ్యాచ్‌లలో 32.54 సగటుతో 11 వికెట్లు పడగొట్టిన అరుంధతికి ఇది తొలి వరల్డ్ కప్ కానుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి వన్డే ఆడి శ్రీచరణి అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టింది. 8 మ్యాచ్‌లలో ఆమె 44.55 సగటుతో 9 వికెట్లు తీసింది. శ్రీలంకతో జరిగిన ముక్కోణపు టోర్నీలో 5.39 ఎకానమీతో 6 వికెట్లు పడగొట్టి చరణి అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆమెకు కూడా ఇదే తొలి ప్రపంచ కప్ కావడం విశేషం.


అరుంధతి
శ్రీచరణి

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# వైస్ కెప్టెన్‌గా గిల్

## ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీకి భారత జట్టు ప్రకటన

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో బ్యాటర్‌గా అసాధారణ ప్రదర్శన కనబర్చడంతో పాటు నాయకుడిగా కూడా సత్తా చాటిన శుబ్‌మన్ గిల్ ఇప్పుడు టి20ల్లో కూడా పునరాగమనం చేశాడు. దాదాపు ఏడాది కాలంగా ఈ ఫార్మాట్‌కు దూరంగా ఉన్న గిల్‌ను ఇప్పుడు జట్టులోకి ఎంపిక చేయడంతో పాటు వైస్ కెప్టెన్సీ కూడా ఇచ్చి భవిష్యత్తులో అతడిని అన్ని ఫార్మాట్‌లలో సారథిగా చూడాలనుకుంటున్నట్లు బీసీసీఐ సందేశం ఇచ్చింది. వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత బుమ్రా మళ్లీ టి20ల్లో ఆడనుండగా... అనూహ్యంగా హర్షిత్ రాణా, జితేశ్ శర్మలకు చోటు దక్కింది. ఐపీఎల్‌లో అద్భుతంగా ఆడిన శ్రేయస్ అయ్యర్, ఫామ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్‌లను కూడా ఎంపిక చేయకుండా ఆసియా కప్ కోసం టీమిండియాను సెలక్టర్లు ప్రకటించారు.

- శ్రేయస్, జైస్వాల్‌లకు దక్కని చోటు
- బుమ్రా పునరాగమనం
- తిలక్ వర్మ చోటు పదిలం



ముంబై: ఆసియా కప్ టి20 టోర్నీలో పాల్గొనే భారత పురుషుల క్రికెట్ జట్టును అజిత్ అగార్కర్ నాయకత్వంలో సెలక్షన్ కమిటీ మంగళవారం ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని 15 మంది సభ్యుల జట్టుకు శుబ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. మరో ఐదుగురు ఆటగాళ్లను రిజర్వ్‌లుగా ఎంపిక చేశారు. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఆసియా కప్ టోర్నీ జరుగుతుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి–మార్చిలో భారత్‌లో జరిగే టి20 వరల్డ్ కప్‌కు ముందు టీమిండియా దాదాపు 20 మ్యాచ్‌లు ఆడనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుంటూ జట్టును ఎంపిక చేశారు.

### కీపర్‌గా జితేశ్‌కు చాన్స్...

శుబ్‌మన్ గిల్ ఏడాది క్రితం తన చివరి టి20 ఆడాడు. శ్రీలంకతో జరిగిన ఆ సిరీస్‌లో అతను వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. అయితే ఆ తర్వాత టెస్టులు, వన్డేల కారణంగా టి20లు ఆడలేదు. ఇప్పుడు తాజాగా ఇంగ్లండ్‌తో టెస్టుల్లో చూపించిన ఫామ్‌తో పాటు ఐపీఎల్‌లో కూడా రాణించడంతో సెలక్టర్లు అతడిని మళ్లీ జట్టులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే వన్డే జట్టుకు కూడా వైస్ కెప్టెన్‌గా ఉన్న అతను ముున్ముందు కెప్టెన్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దూకుడు మీదున్న అభిషేక్ శర్మతో కలిసి అతను ఓపెనింగ్ చేస్తాడు. గిల్ రాకతో తుది జట్టులో సంజు సామ్సన్‌కు చోటు దక్కడం కష్టమే. అందుకే ఫినిషింగ్‌కు తగిన వాడిగా భావిస్తూ వికెట్ కీపర్‌గా జితేశ్ శర్మను ఎంపిక చేశారు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మకు ఢోకా లేకుండా పోయింది. వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత టి20లు ఆడని బుమ్రా, కుల్దీప్ ఈ కీలక టోర్నీతో మళ్లీ బరిలోకి దిగుతున్నారు. ఇతర బౌలర్లు వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్ మరో చర్చకు తావు లేకుండా జట్టులో నిలిచారు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివమ్ దూబేల రూపంలో ముగ్గురు ఆల్‌రౌండర్లు జట్టులో ఉన్నారు.

> ఇంగ్లండ్‌లో మా అంచనాలకు మించి రాణించి గిల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. నాయకత్వ లక్షణాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గిల్, జైస్వాల్ లేకపోవడం వల్లే అభిషేక్ శర్మ, సామ్సన్ జట్టులోకి వచ్చారనే విషయం మర్చిపోవద్దు. అభిషేక్‌ను పక్కన పెట్టే పరిస్థితి లేదు కాబట్టి దురదృష్టవశాత్తూ జైస్వాల్‌కు స్థానం దక్కలేదు. బుమ్రాకు మళ్లీ విశ్రాంతినిచ్చే విషయంలో ఎలాంటి ప్రణాళికలు లేవు. ఐపీఎల్‌తో పాటు దేశవాళీలో రాణించడంతోనే జితేశ్‌ను ఎంపిక చేశాం. శ్రేయస్ విషయంలో అతని తప్పుగానీ, మా తప్పుగానీ లేదు. ఎవరి స్థానంలో అతడిని తీసుకుంటాం? తన అవకాశం కోసం అతను ఎదురు చూడాల్సిందే.
> – అజిత్ అగార్కర్, చీఫ్ సెలక్టర్



### హర్షిత్‌కు మరో అవకాశం

ఐపీఎల్‌లో 604 పరుగులు సాధించడంతో పాటు పంజాబ్‌ను ఫైనల్‌కు చేర్చిన శ్రేయస్ అయ్యర్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఈ ఫార్మాట్‌లో సెలక్టర్లు అతనిపై నమ్మకం ఉంచట్లేదు. అభిషేక్ మెరుపు బ్యాటింగ్ కారణంగా జైస్వాల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చింది. ఇప్పటికే ముగ్గురు స్పిన్నర్లు ఉండటంతో సుందర్‌ను కూడా ఎంపిక చేయకుండా స్పెషలిస్ట్ బ్యాటర్‌గా రింకూ సింగ్‌ను తీసుకున్నారు. పేసర్ హర్షిత్ రాణా ఎంపిక మాత్రం అనూహ్యం. ఏకైక టి20 ఆడిన అతను ఐపీఎల్‌లోనూ రాణించలేదు. అయితే ప్రసిధ్ కృష్ణతో పోలిస్తే కాస్త బ్యాటింగ్ చేయగలగడం అతనికి సానుకూలంగా మారింది.

**భారత టి20 జట్టు:** సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్, సామ్సన్, తిలక్, దూబే, హార్దిక్, జితేశ్, అక్షర్, రింకూ సింగ్, కుల్దీప్, హర్షిత్, బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి. **రిజర్వ్:** ప్రసిధ్ కృష్ణ, సుందర్, రియాన్ పరాగ్, జురేల్, యశస్వి జైస్వాల్.

# సాక్షి సినిమా

## నారాయణ మూర్తి అందమైన హీరో - బ్రహ్మానందం


● ఆర్. నారాయణ మూర్తి, బ్రహ్మానందం

''యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమాలో కొడుకు కోసం తండ్రి చేసిన త్యాగం, అలాగే తండ్రి కోసం కొడుకు చేసిన త్యాగం... ఇలాంటి భావోద్వేగాలను ఒక చోటకు తీసుకొచ్చి, మానవ భావోద్వేగాలతో ఈ సమాజం ఎలా ఆడుకుంటుందో చెప్పే ప్రయత్నం చేశారు నారాయణ మూర్తి'' అని ప్రముఖ నటుడు బ్రహ్మానందం అన్నారు. ఆర్. నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యూనివర్సిటీ పేపర్ లీక్' ఈ నెల 22న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించిన అనంతరం బ్రహ్మానందం మాట్లాడుతూ– ''మీ దృష్టిలో అందమైన హీరో ఎవరు?' అని ఎవరైనా నన్ను అడిగితే నారాయణ మూర్తి పేరు చెబుతాను. అందం అంటే... గ్లామర్, 6 ఫీట్స్ హైట్, కర్లింగ్ హెయిర్... వంటి అందం కాదు. మదర్ థెరిస్సాని 'మీకు అందంగా కనిపిస్తున్న వ్యక్తి ఎవరమ్మా?' అని అడిగితే.. ఎవరి మనస్సులో సేవాభావం, ఎవరి కళ్లల్లో దయా గుణం ఉంటాయో ఆ వ్యక్తి, ఆ జీవి అందంగా ఉంటుంది' అని చెప్పారు. నలభై ఏళ్లుగా నారాయణ మూర్తి నిరంతరం ప్రజలు, పేదవాళ్ల పక్షాన ఉంటూ సినిమాలు తీస్తున్నారు. ఇవాళ మన దేశం, మన విద్యా వ్యవస్థ ఎలా ఉంది? అనే అంశాలపై అధ్యయనం చేసి, 'యూనివర్సిటీ' తీశారు. డబ్బు కోసం కాకుండా ప్రజల కోసం నిజాయతీగా తీసిన 'యూనివర్సిటీ' సినిమాని చూసి, ఆదరిస్తే ఇంకా ఎన్నో మంచి సినిమాలు తీస్తాడు'' అన్నారు. ''బ్రహ్మానందంగారు మహా నటుడు, మహా జ్ఞాని. అన్నింటినీ మించి మాస్టరు. అందుకే నా 'యూనివర్సిటీ' లోగోని ఆయనతో ఆవిష్కరింపజేశాను. మా చిత్రాన్ని చూడండి... ఏమాత్రం బాగున్నా ఆదరించి, మరిన్ని సినిమాలు తీసే శక్తిని ప్రసాదించండి'' అని కోరారు ఆర్. నారాయణ మూర్తి.

## గుర్తుండిపోయే సినిమా అవుతుంది - విజయ్ డొంకాడ



''ప్రస్తుతం కథ నచ్చితేనే ప్రేక్షకులు సినిమా చూస్తున్నారు. 'పరదా' కథ కొత్తగా ఉండటంతో పాటు సన్నివేశాలు, పాత్రల ప్రవర్తన సరికొత్తగా ఉంటాయి. వైవిధ్యమైన సినిమా అయితే ప్రేక్షకులు చూస్తారనే దానికి మా 'పరదా' కరెక్టుగా సరిపోతుంది'' అన్నారు నిర్మాత విజయ్ డొంకాడ. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన చిత్రం 'పరదా'. దర్శనా రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదలకానుంది. ఈ సందర్భంగా విజయ్ డొంకాడ విలేకరులతో మాట్లాడుతూ– ''ప్రవీణ్ చెప్పిన 'పరదా' ఐడియా నాకు బాగా నచ్చింది. ఈ కథ విన్న వెంటనే అనుపమ ఓకే చెప్పారు. ఫస్ట్ కాపీ చూశాక తన కెరీర్‌లో 'పరదా' బెస్ట్ సినిమా అవుతుందని భావోద్వేగానికి గురయ్యారు. పరదా సంస్కృతిని ఫాలో అవుతున్న ఓ అమ్మాయికి ఊర్లో ఒక సమస్య వస్తుంది. అప్పుడు ఆ అమ్మాయి ఎలాంటి పరిష్కారం వెతుక్కుంది? అనేది కథ. 'పరదా' ఫీమేల్ సెంట్రిక్ సినిమా కాబట్టి సినిమాటోగ్రాఫర్‌గా మృదుల్‌గారి సెన్సిబిలిటీస్ కూడా చాలా హెల్ప్ అయ్యాయి. మా సినిమాని మలయాళంలో దుల్కర్ సల్మాన్‌గారి బ్యానర్‌పై రిలీజ్ చేస్తున్నాం. తప్పకుండా ఇది గుర్తుండిపోయే సినిమా అవుతుంది'' అని చెప్పారు.

## నలభై ఏళ్లకు...


● రజనీకాంత్, కమల్‌హాసన్

హీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఇరవై సినిమాలకు పైగా నటించారు. కానీ 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' (1979) సినిమా తర్వాత రజనీ–కమల్ స్క్రీన్ షేర్ చేసుకోలేదు. తాజాగా వీరిద్దరినీ కలిపి ఓ భారీ సినిమా చేసేందుకు దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ప్రయత్నాలు మొదలుపెట్టారట. అయితే లోకేశ్ నెక్ట్స్ సినిమాగా కార్తీతో 'ఖైదీ 2' తెరకెక్కాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రజనీ–కమల్ సినిమాని ఎప్పుడు ఆరంభిస్తారనే చర్చ జరుగుతోంది. మరి... నాలుగు దశాబ్దాల తర్వాత రజనీ–కమల్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? అనేది వేచి చూడాల్సిందే. ఇదిలా ఉంటే... లోకేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన రజనీకాంత్ 'కూలీ', కమల్‌హాసన్ 'విక్రమ్' సినిమాలు సూపర్ హిట్స్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

## కార్మికులను చులకనగా చూస్తే ఊరుకోం - వల్లభనేని అనిల్‌కుమార్

''తెలుగు చిత్ర పరిశ్రమలోని కార్మికుల ప్రతిభ వల్లే తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి వెళ్లగలిగింది. నిర్మాతలు బాగుండాలని కార్మికులందరూ కోరుకుంటారు. అయితే కార్మికులను చులకనగా చూస్తే ఊరుకునేది లేదు. కార్మికులను చిన్న చూపు చూసే నిర్మాతలకు ఈ సమ్మె హెచ్చరిక'' అని తెలుగు సినీ కార్మికుల సంఘం అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ తెలిపారు. కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలంటూ తెలుగు సినీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి షూటింగ్స్ బంద్ జరుగుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయం వద్ద 24 క్రాఫ్ట్స్‌కు చెందిన నాయకులు, సినీ కార్మికుల ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా వల్లభనేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ– ''చిరంజీవిగారితో సోమవారం సమావేశమై, మాకు న్యాయం చేస్తే సమ్మె సడలింపుకి ఓకే అని చెప్పాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారితో మా సమస్యలపై చర్చించగా, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని యూనియన్లకు జీతాలు పెంచి కొన్ని యూనియన్లకు పెంచమని అంటున్నారు. అందరికీ పెంచాల్సిందే. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే ఇండస్ట్రీలో పని చేస్తున్న 40 వేల కార్మికులందరూ ప్రభుత్వానికి అండగా ఉంటాం'' అని చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''ఇక్కడున్న వారిలో (కార్మికులు) మూడు నెలలు పని లేకపోయినా బతకగలిగినవాళ్లు ఇరవైశాతం మంది ఉన్నారు. ఒక్క రోజు పని లేకపోయినా బతకలేనివాళ్లు యాభై శాతం మంది ఉన్నారు. మా ప్రొడ్యూసర్ మిత్రులు కొందరు సినీ కార్మికులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే ఎక్కువగా జీతం వస్తోందంటున్నారు. నెలలో 30 రోజులు జీతం ఇస్తే వస్తుంది. 30 రోజులు పని ఇస్తే వేతనాలు పెంచవద్దు. నిజానికి నిర్మాతలకు కూడా కష్టాలు ఉన్నాయి. వాటి గురించి తర్వాత మాట్లాడదాం. ముందు మనకు వేతనాలు పెరగాలి. 16 రోజులుగా షూటింగ్స్ ఆపడం అన్యాయం. నిర్మాతలు బాగుండాలి. అలాగే మన కష్టాలను అర్థం చేసుకోవాలి. సినిమా తీయడం ఇప్పుడు కష్టంగా ఉంది. ఫెడరేషన్ నాయకులూ ఆలోచించి, మంచి నిర్ణయాలు తీసుకోవాలి. నా సపోర్ట్ ఉంటుంది'' అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కార్మికులు, కార్మిక సంఘాల నేతలు పాలాభిషేకం చేశారు.

**తెలుగు సినీ కార్మికుల సంఘం, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ప్రతినిధుల సమావేశం మంగళవారం ఫిల్మ్‌ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్‌తో ఫెడరేషన్ నాయకులు చర్చలు జరిపారు. కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ వీరశంకర్ కూడా హాజరయ్యారు. 24 క్రాఫ్ట్స్‌కి సంబంధించిన 13 యూనియన్‌లతో విడి విడిగా ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చర్చించింది. నేటి ఉదయం నిర్మాతలతో, సాయంత్రం ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరోసారి సమావేశం కానుంది.**


– సాక్షి, బంజారా హిల్స్

## ఏ మాయ చేశావే పిల్లా...


● చిన్ను, గీతికా రతన్

చిన్ను, గీతికా రతన్ జంటగా నటించిన హారర్, కామెడీ అండ్ లవ్ ఎంటర్‌టైనర్ మూవీ 'లవ్ యూ రా'. ప్రసాద్ ఏలూరి దర్శకత్వంలో సముద్రాల మంత్రయ్య బాబు, కొన్నిపాటి శ్రీనాథ్ ప్రజాపతి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈ చిత్రంలోని 'ఏ మాయ చేశావే పిల్లా', 'వాట్సప్ బేబీ', 'యూత్ అబ్బా', 'దైవాన్నే అడగాలా' పాటలను విడుదల చేశారు. చిన్ను మాట్లాడుతూ– ''లవ్ యూ రా'లో హారర్, కామెడీ, లవ్.. ఇలా ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఉన్నాయి'' అన్నారు. ''ఈ సినిమాను ఇంత దూరం తెచ్చిన నా టీమ్‌కి థ్యాంక్స్'' అని చెప్పారు ప్రసాద్ ఏలూరి. ''ఈ సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అన్నారు శ్రీనాథ్ ప్రజాపతి.

## సరికొత్త పెద్ది


● రామ్‌చరణ్

'పెద్ది' సినిమా కోసం రామ్‌చరణ్ సరికొత్తగా మేకోవర్ అవుతున్నారు. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ చిత్రంలో రామ్‌చరణ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఇప్పటికే 'పెద్ది' నుంచి రామ్‌చరణ్ ఫస్ట్ లుక్ విడుదలైన సంగతి తెలిసిందే. కాగా ఇప్పుడు 'పెద్ది' సినిమాలోని మరొక లుక్ కోసం రామ్‌చరణ్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారు. టాప్ సెలబ్రిటీ స్టైలిస్ట్ అలీం హకీం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, రామ్‌చరణ్‌ను సరికొత్త లుక్‌లో ప్రజెంట్ చేయనున్నారు. ''ఈ లుక్‌లో రామ్‌చరణ్ స్టైల్, స్వాగ్ వినూత్నంగా, ఆడియన్స్‌ను ఆశ్చర్యపరిచేలా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 27న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

## ఇది బెంచ్ మార్క్ మూవీ - శ్రీని గుబ్బల



''అర్జున్ చక్రవర్తి' నిర్మాతగా నా తొలి చిత్రం. కబడ్డీ నేపథ్యంలో ఇప్పటి వరకు కొన్ని కథలు వచ్చినా మా సినిమాలో చూపించినంత సీరియస్‌గా ఏ సినిమా రాలేదు. కచ్చితంగా ఒక బెంచ్ మార్క్ మూవీ అవుతుందని ఈ సినిమా చేశాం'' అని నిర్మాత శ్రీని గుబ్బల తెలిపారు. విజయ రామరాజు టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీని గుబ్బల విలేకరులతో మాట్లాడుతూ– ''నేను అమెరికా వెళ్లి 18 ఏళ్లవుతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నప్పటికీ క్రియేటివిటీ అంటే ఉన్న ఇష్టంతో ఇండస్ట్రీకొచ్చాను. విక్రాంత్ చెప్పిన 'అర్జున్ చక్రవర్తి' కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాం. నల్గొండలోని కబడ్డీ ప్లేయర్ నాగులయ్య (అర్జున్ అని కూడా పిలుస్తారు) జీవితంలోని వాస్తవ ఘటనలు 60 శాతం, 40 శాతం ఫిక్షన్‌తో ఈ సినిమా ఉంటుంది. అర్జున్ పాత్ర కోసం విజయ రామరాజు శారీరకంగా చాలా కష్టపడ్డారు. విక్రాంత్ ఈ సినిమాని అద్భుతంగా తీశారు. మా సినిమాని ఇండియాలోని మెట్రో నగరాలతో పాటు అమెరికా, యూకే, యూరప్, సౌతాఫ్రికాల్లోనూ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు.

## టైటిల్ కనెక్ట్ అయ్యేలా ఉంది - అనిల్ రావిపూడి


● అనిల్ రావిపూడి, శివాని, మౌళి

''లిటిల్ హార్ట్స్' మంచి టైటిల్. అందరికీ కనెక్ట్ అయ్యేలా టైటిల్ ఉంది'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి చెప్పారు. మౌళి తనుజ్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ సినిమాని నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ని అనిల్ రావిపూడి విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ బాగా నచ్చింది. మంచి కంటెంట్ థియేటర్స్‌లోకి రావాల్సిన అవసరం ఉంది. 'లిటిల్ హార్ట్స్' అందరికీ నచ్చుతుంది'' అని తెలిపారు. ''మా సినిమాని థియేటర్స్‌లో బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు సాయి మార్తాండ్. ''మా మూవీని థియేటర్స్‌లో తప్పకుండా చూడండి'' అన్నారు వంశీ నందిపాటి. బన్నీ వాసు మాట్లాడుతూ– ''ఇంటర్ చదివిన పిల్లలు ఉన్న ప్రతి పేరెంట్ చూడాల్సిన చిత్రమిది'' అని పేర్కొన్నారు.

# సాక్షి బిజినెస్

బుధవారం
20-8-2025

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 371 | 81,644 |
| నిఫ్టీ ▲ | 104 | 24,980 |

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 21,356 | ▽ | 273 |
| డోజోన్స్ | 44,902 | ▽ | 10 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 9,194 | △ | 36 |
| డాక్స్ | 24,441 | △ | 127 |
| షాంఘై | 3,727 | ▽ | 1 |
| నికాయ్ | 43,654 | ▽ | 168 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 86.85 | 87.87 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 116.50 | 119.46 |
| € | యూరో | ఎస్‌బీఐ | 100.50 | 103.23 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఎస్‌బీఐ | 59.00 | 60.51 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 56.28 | 58.53 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 65.42 | 69.08 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 22.30 | 23.80 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.78 | 24.03 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 11.23 | 13.06 |

## చాట్‌జీపీటీ గో ప్లాన్ @ రూ. 399



**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్ఏఐ భారత్‌లో 'చాట్‌జీపీటీ గో'కి సంబంధించి కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ప్రకటించింది. ఉచిత ప్లాన్‌తో పోలిస్తే 10 రెట్లు అధికంగా మెసేజీలు, ఇమేజ్‌ల జనరేషన్, ఫైల్ అప్‌లోడ్స్ పరిమితులతో ఈ ప్లాన్ నెలవారీగా రూ. 399గా ఉంటుంది. చాట్‌జీపీటీ అధునాతన సామర్థ్యాలను మరింత అందుబాటు ధరలో పొందాలనుకునే వారి కోసం 'చాట్‌జీపీటీ గో'ని డిజైన్ చేసినట్లు వివరించింది. యాక్సెస్ విషయంలో ప్రాధాన్యత, వేగవంతమైన పనితీరు, అధిక యూసేజీ పరిమితులు అందించే ప్రస్తుత చాట్‌జీపీటీ ప్లస్‌కి (నెలకు రూ. 1,999) ఈ కొత్త ప్లాన్ అదనంగా ఉంటుంది. అత్యంత అధునాతన మోడల్స్, మరింత కస్టమైజేషన్ కావాలనుకునే ప్రొఫెషనల్స్, సంస్థల కోసం చాట్‌జీపీటీ ప్రో (నెలకు రూ. 19,900)ని అందిస్తున్నట్లు ఓపెన్ఏఐ వివరించింది. యూపీఐ విధానంతో కూడా సబ్‌స్క్రిప్షన్‌కి చెల్లింపులు జరపవచ్చని చాట్‌జీపీటీ వీపీ నిక్ టర్లీ తెలిపారు. చాట్‌జీపీటీకి భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రెండో భారీ మార్కెట్‌గా ఉంది.

## విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ శిక్షణ



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** పన్నెండో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు టెక్ నైపుణ్యాల్లో శిక్షణతో పాటు తమ కంపెనీలో ఉద్యోగాన్ని కూడా కల్పించే విధంగా టెక్‌బీ పేరిట ప్రత్యేక ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బి.సుబ్బరామన్ తెలిపారు. దీని కింద ఆరు నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారు కంపెనీలో ఇంటర్న్‌షిప్‌తో పాటు ప్లేస్‌మెంట్ కూడా పొందవచ్చని చెప్పారు. ఉద్యోగంలో కొనసాగుతూనే ప్రముఖ విద్యా సంస్థల్లో బీఎస్సీ, ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ తదితర కోర్సులను చదవొచ్చని వివరించారు. ఇందు కోసం బిట్స్ పిలానీ, శాస్త్ర యూనివర్సిటీ మొదలైన వాటితో జట్టు కట్టినట్లు పేర్కొన్నారు. ఇటు తమ సంస్థలో ఉద్యోగంతో పాటు అటు ఉన్నత విద్యాభ్యాసం కూడా పూర్తి చేసేందుకు తోడ్పడేలా ఈ ప్రోగ్రాం ఉంటుందని చెప్పారు. దీని కింద ఐటీ శిక్షణకు రూ. 1.40 లక్షలు, ఐటీయేతర విధుల్లో శిక్షణకు రూ. 51 వేల ఫీజు ఉంటుంది. ఇంటర్న్‌షిప్‌లో ప్రతినెలా రూ. 10,000 స్టైఫండ్ లభిస్తుంది. విజయవాడ, మదురై తదితర నగరాల్లో శిక్షణా కేంద్రాలు ఉన్నాయి.

## పత్తి దిగుమతులపై సుంకాల ఊరట

### సెప్టెంబర్ 30 వరకు అమలు



**న్యూఢిల్లీ:** దేశీయంగా టెక్స్‌టైల్స్ పరిశ్రమకు కీలక వనరైన ముడి పత్తి దిగుమతులకు సంబంధించి సెప్టెంబర్ 30 వరకు సుంకాల నుంచి మినహాయింపునిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దీనిపై 11 శాతం సుంకాలతో పాటు వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సెస్సు కూడా వర్తిస్తోంది. ఆర్థిక శాఖ నోటిఫికేషన్ ప్రకారం ఈ మినహాయింపు ఆగస్టు 19 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. దీనితో భారత్‌కి పత్తిని ఎగుమతి చేసే రెండో అతిపెద్ద సరఫరాదారైన అమెరికాకు ప్రయోజనం చేకూరనుంది. ధరలను స్థిరీకరించడానికి, ముడి సరుకు లభ్యతను మెరుగుపర్చడానికి సుంకాల మినహాయింపు ఉపయోగపడుతుందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. దేశీయంగా పత్తి ధరలు తగ్గిపోయి, రైతులపై ప్రభావం పడకూడదనే ఉద్దేశంతో మినహాయింపులను ప్రభుత్వం 40 రోజులకే పరిమితం చేసినట్లు చెప్పారు. 2024 ఆర్థిక సంవత్సరంలో 579.2 మిలియన్ డాలర్లుగా ఉన్న పత్తి దిగుమతులు 2025 ఆర్థిక సంవత్సరంలో 107 శాతం ఎగిసి 1.20 బిలియన్ డాలర్లకు చేరాయి.

## రూ. 5,800 కోట్లతో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ

### ప్రకటించిన కేంద్ర మంత్రి సింధియా



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ సేవల దిగ్గజంగా ఎదిగే దిశగా ఇండియా పోస్ట్ రూ. 5,800 కోట్లతో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) ప్రాజెక్టును ఆవిష్కరించింది. ఏపీటీ ఆధారిత మౌలిక సదుపాయాలతో ఆధునిక లాజిస్టిక్స్ కంపెనీల్లాగా ఇండియా పోస్ట్‌కి సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని 'ఎక్స్'లో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పోస్ట్ చేశారు. డిజిటల్ లావాదేవీలను, ఏ బ్యాంకు కస్టమర్ల నుంచైనా యూపీఐ చెల్లింపులను స్వీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సాంకేతిక అంశాల కారణంగా పోస్టాఫీసు సర్వీసులను కొనుగోలు చేయాలన్నా, ఇతర చెల్లింపులు జరపాలన్నా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ఖాతాల నుంచి మాత్రమే సాధ్యపడేది. ఎక్కడైనా సర్వీసులు అందించేందుకు, రియల్ టైమ్‌లో నిర్ణయాలు తీసుకునేందుకు కొత్త టెక్నాలజీ ఉపయోగపడుతుందని సింధియా వివరించారు.

**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..**

| భారత కంపెనీలపై టారిఫ్‌ల ప్రభావం అంతంతే! | జీఎస్‌టీ తగ్గింపు.. వినియోగానికి పుష్ |
|---|---|

# ఏఐ స్టార్టప్‌లకు వీసీ నిధుల బూస్ట్!

- ఇన్‌ఫ్రా, డెవలపర్ టూల్స్ సంస్థలపై కన్ను
- పెట్టుబడులకు వెస్ట్‌బ్రిడ్జ్, ఎలివేషన్, లైట్‌స్పీడ్ సై
- జనవరి–జూలైలో రూ. 4,600 కోట్ల సమీకరణ

**దేశీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రవేశించే ప్రాథమికస్థాయి కంపెనీలకు వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థలు పెట్టుబడులు అందించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఏఐ అభివృద్ధి వ్యవస్థ (ఎకోసిస్టమ్)లో ఇటీవల పలు కొత్తతరహా స్టార్టప్‌లు ఊపిరి పోసుకుంటున్న నేపథ్యంలో వీసీ నిధులకు ప్రాధాన్యత ఏర్పడింది. వివరాలు చూద్దాం..**

**-సాక్షి, బిజినెస్ డెస్క్**



ప్రధానంగా ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలపర్ టూల్స్ విభాగాలలోని దేశీ కంపెనీలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వీసీ సంస్థలు క్యూ కడుతున్నాయి. పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్న సంస్థల జాబితాలో వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్, ఎలివేషన్ క్యాపిటల్, యాక్సెల్, లైట్‌స్పీడ్, ప్రోజస్, నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ తదితరాలు చేరాయి. దీంతో ఏఐలో మౌలిక, డెవలపర్ విభాగాలపై దృష్టిపెట్టిన కంపెనీలు ఎంటర్‌ప్రైజ్‌లుగా అభివృద్ధి చెందేందుకు వీసీ నిధులు తోడ్పాటునివ్వనున్నాయి. వెరసి ఏజెంటిక్ ప్లాట్‌ఫామ్స్‌కు జోష్ లభించనుంది. తద్వారా స్వతంత్ర ఏఐ ఏజెంట్ల అభివృద్ధికి వీలు చిక్కనుంది. అంటే వివిధ టాస్క్‌లను స్వతంత్రంగా నిర్వహించగల సామర్థ్యమున్న సాఫ్ట్‌వేర్ ఆధారిత టూల్స్ ఊపిరిపోసుకోనున్నాయి. ఇవి సంబంధిత ఆర్గనైజేషన్లలో క్లిష్టతరహా పనులను చక్కబెట్టడంతోపాటు.. విభిన్న వ్యవస్థలతో సమీకృతంకాగలవని పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి. వీటికి ప్రత్యేకించిన సర్వీసులను పూర్తి చేయడంపై ఆయా ప్లాట్‌ఫామ్స్ దృష్టి పెడతాయని తెలియజేశాయి. ఒకే టాస్క్‌కు పరిమితమయ్యే సంప్రదాయ ఏఐ టూల్స్‌తో పోలిస్తే వీటి పరిధి విస్తారంగా ఉంటుందని వివరించాయి. పలు కార్యకలాపాలను ఆటోమేషన్‌తో అనుసంధానించవచ్చని తెలియజేశాయి.

### కొత్త తరహా టూల్స్

ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఇంటిగ్రేషన్, డెవలప్‌మెంట్ అండ్ ఆపరేషన్స్ (డెవ్‌ఆప్స్) ఆటోమేషన్, భారీస్థాయి ఎడాప్షన్ ప్లాట్‌ఫామ్స్‌పై దృష్టిపెట్టిన స్టార్టప్‌లకు ప్రాధాన్యత ఏర్పడుతోంది. ఫలితంగా ఆయా స్టార్టప్‌లలో పెట్టుబడులకు వీసీ సంస్థలు ముందుకొస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఆధునిక, సరికొత్త మోడళ్లు ఊపిరిపోసుకున్న ప్రతిసారీ ప్లాట్‌ఫామ్స్ మారిపోతుంటాయని ఎలివేషన్ క్యాపిటల్ ఏఐ పార్ట్‌నర్ కృష్ణ మెహ్రా తెలియజేశారు. దీంతో పూర్తిస్థాయిలో సరికొత్త అవకాశాలకు తెరలేస్తుంటుందని తెలియజేశారు. ఇలాంటి సందర్భాలు(సైకిల్స్) ఆయా స్టార్టప్‌ల వ్యవస్థాపకులకు అవకాశాలను కల్పిస్తాయని, తద్వారా ప్రపంచస్థాయిలో పోటీపడగల సంస్థలుగా తీర్చిదిద్దేందుకు వీలు చిక్కుతుందని వివరించారు. వెరసి ఈ కేలండర్ ఏడాది(2025) జనవరి నుంచి జూలైవరకూ దేశీ జెన్ఏఐ స్టార్టప్‌లు 52.4 కోట్ల డాలర్లు(సుమారు రూ. 4,600 కోట్లు) అందుకున్నట్లు వెంచర్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది.


**పెట్టుబడుల తీరిదీ..**

సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఎలివేషన్ క్యాపిటల్ గత రెండేళ్లలో 15–20 ఏఐ పెట్టుబడులను చేపట్టడం గమనార్హం! ఇక ఎంటర్‌ప్రైజెస్‌లు కనెక్ట్ అయ్యేందుకు, తమ సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు సహకరించే యూనిఫైయాప్స్ వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ నుంచి 2–2.5 కోట్ల డాలర్లు(సుమారు రూ. 200 కోట్లు) సమీకరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 2023లో ఏర్పాటైన ఈ సంస్థలో ఎలివేషన్ సైతం ఇన్వెస్ట్ చేసింది. అప్లికేషన్ల బిల్డింగ్, టెస్టింగ్, డిప్లాయింగ్ చేపట్టే ఎమర్జెంట్ ఏఐ.. లైట్‌స్పీడ్ వెంచర్ తదితర సంస్థల నుంచి 2 కోట్ల డాలర్లు సమకూర్చుకుంది. కేవలం రెండు నెలల్లోనే ఈ సంస్థ కోటి డాలర్ల(రూ.87 కోట్లు) వార్షిక రికరింగ్ టర్నోవర్ సాధించడం విశేషం! ఈ బాటలో లైట్‌స్పీడ్ తదితర సంస్థల నుంచి ఏజెంటిక్ స్టార్టప్.. కంపోజియో 2.5 కోట్ల డాలర్లు సమీకరించింది. ఎంటర్‌ప్రైజ్ ఏపీఐ ఇంటిగ్రేషన్స్ ఆటోమేట్ చేసే రీఫోల్డ్ ఏఐ.. ఎనియాక్ వెంచర్స్, టైడల్ వెంచర్స్ తదితరాల నుంచి 6.5 మిలియన్ డాలర్లు(రూ.56 కోట్లు) సీడ్‌ఫండ్‌గా అందుకుంది. ప్రోజస్,యాక్సెల్, ఎక్సీడ్ వెంచర్స్ నుంచి సాఫ్ట్‌వేర్ ప్రొడక్టివిటీ ప్లాట్‌ఫామ్.. కోడ్‌కర్మ 2.5 మి. డాలర్లు(రూ.21 కోట్లు) పొందింది.

## నాలుగోరోజూ రయ్..

### సెన్సెక్స్ 371 పాయింట్లు ప్లస్

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో జీఎస్‌టీ సంస్కరణల ఆశావహ దృక్పథం కొనసాగింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా బెంచ్‌మార్క్ సూచీలు నాలుగోరోజూ లాభాలు గడించాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ (3%), టాటా మోటార్స్ (3.5%), ఎయిర్‌టెల్ (2.75%) షేర్లు రాణించి సూచీలను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ 371 పాయింట్లు పెరిగి 81,644 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104 పాయింట్లు బలపడి 24,980 వద్ద నిలిచింది.



- బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ షేరు లిస్టింగ్‌లో గట్టెక్కింది. ఇష్యూ ధర (రూ.517)తో పోలిస్తే బీఎస్‌ఈలో 1.58% డిస్కౌంట్‌తో రూ.509 వద్ద లిస్టయ్యింది. అయితే ఇంట్రాడేలో 9% ఎగసి రూ.564 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 6% లాభంతో రూ.546 వద్ద ముగిసింది.
- ట్రంప్ టారిఫ్ విధింపుతో టెక్స్‌టైల్ రంగంలో వచ్చే నష్టాలు భర్తీ చేసేందుకు కేంద్రం పత్తి దిగుమతులపై ఉన్న 11% కస్టమ్స్ డ్యూటీని తాత్కాలింగా తొలగించింది. దీంతో టెక్స్‌టైల్ షేర్లు వర్ధమాన్ టెక్స్‌టైల్స్ 9%, రేమాండ్ లైఫ్‌స్టైల్ 8%, వెల్‌స్పన్ లివింగ్ 6%, అరవింద్ లిమిటెడ్, గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ 3% లాభపడ్డాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 26 పైసలు బలపడి 87.13 వద్ద ముగిసింది.

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

**నేటి భవిత ఈ పేపర్‌లో..**
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జీఎస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

### జాబ్ పాయింట్

## ఎల్ఐసీలో 350 అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) ..అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 350.
» **అర్హత:** పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి
» **వయసు:** 01.08.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.88,635 నుంచి 1,69,025.
» **ఎంపిక విధానం:** ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2025.
» **పరీక్ష తేదీలు:** ప్రిలిమినరీ పరీక్ష: 03.10.2025, మెయిన్స్ పరీక్ష: 08.11.2025.
» **వెబ్‌సైట్:** https://licindia.in

## ఎల్ఐసీలో 491 ఏఈ/ఏఏవో స్పెషలిస్ట్ పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్(ఏఏవో-స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 491.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)-81,ఏఈ(సివిల్)-50, ఏఈ(ఎలక్ట్రికల్)-31. అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఏవో-స్పెషలిస్ట్)-410. ఏఏవో(సీఏ)-30, ఏఏవో(సీఎస్)-10,ఏఏవో(యాక్చూరియల్)-30, ఏఏవో (ఇన్సూరెన్స్ స్పెషలిస్ట్)-310, ఏఏవో(లీగల్)-30.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, లా డిగ్రీ, సీఏ, ఐసీఏఐ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత పోస్టుకు ఉద్యోగానుభవం, ఐసీఎస్ఐ మెంబర్ అయి ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి ఏఈ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.ఏఏవో సీఏ, లీగల్ పోస్టులకు 21 నుంచి 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.88,635 నుంచి రూ.1,69,025+ఇతర అలవెన్సులు.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.



» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2025.
» **ప్రిలిమినరీ పరీక్ష:** 03.10.2025.
» **మెయిన్ పరీక్ష:** 08.11.2025.
» **వెబ్‌సైట్:** https://licindia.in

## ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీలో 976 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 976.
» **పోస్టుల వివరాలు:** జూనియర్. -ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్)-11, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్-సివిల్)-199, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్-ఎలక్ట్రికల్)-208, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్)-527, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఐటీ)-31.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ(ఆర్కిటెక్చర్/సివిల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27.09.2025నాటికి 27 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.aai.aero

## సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమిలో అడ్మినిస్ట్రేటర్ పోస్టులు

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమి(ఎస్‌వీపీఎన్‌పీఏ) ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.04.2025 నాటికి 64 ఏళ్లు మించ కూడదు.
» **వేతనం:** నెలకు రూ.45,384.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ డైరెక్టర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమి, శివరామ్‌పల్లి, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.svpnpa.gov.in

## ఎయిమ్స్ జమ్మూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) జమ్మూ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **విభాగాలు:** కార్డియాలజీ, సీటీవీఎస్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, యూరాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్(ఐఎంసీ) గుర్తించిన సంస్థ నుంచి ఎంబీబీఎస్, ఎంసీహెచ్, ఎండీ/ఎంహెచ్ఏ, డీఎంలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 50 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, అకడమిక్ బ్లాక్, ఎయిమ్స్, విజయపూర్, జమ్మూ-181134 చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.08.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.08.2025.
» **ఇంటర్వ్యూ తేది:** త్వరలో ప్రకటిస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** అకడమిక్ బ్లాక్, ఆరో ఫ్లోర్, ఎయిమ్స్, విజయపూర్, జమ్మూ.
» **వెబ్‌సైట్:** www.aiimsjammu.edu.in

# అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొలువు

**ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా కంపెనీ.. ద న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసీఎల్).. 550 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్(జనరలిస్టులు, స్పెషలిస్టులు) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.90వేలకు పైగా వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎన్ఐఏసీఎల్ ఏఓ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష ప్యాట్రన్, సిలబస్-ప్రిపరేషన్ తదితర వివరాలు..**

» ఎన్ఐఏసీఎల్ 550 ఏవో పోస్టులకు నోటిఫికేషన్
» ప్రారంభంలోనే నెలకు రూ.90వేలకు పైగా వేతనం

- **పోస్టు పేరు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జనరలిస్టులు అండ్ స్పెషలిస్టులు-స్కేల్ 1).
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 550
- **పోస్టుల వివరాలు:** రిస్క్ ఇంజనీర్స్-50 పోస్టులు, ఆటోమొబైల్ ఇంజనీర్స్-75 పోస్టులు, లీగల్ స్పెషలిస్టులు-50 పోస్టులు, అకౌంట్స్ స్పెషలిస్టులు-25 పోస్టులు, ఏవో(హెల్త్)-50 పోస్టులు, ఐటీ స్పెషలిస్టులు-25 పోస్టులు , బిజినెస్ అనలిస్టులు-75 పోస్టులు, కంపెనీ సెక్రటరీ-2 పోస్టులు, యాక్చూరియల్ స్పెషలిస్టులు-5 పోస్టులు, జనరలిస్టులు-193 పోస్టులు ఉన్నాయి.

### అర్హతలు

- జనరలిస్ట్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్/పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు సాధించాలి.
- స్పెషలిస్ట్ పోస్టులకు పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్/ఎంబీఏ, ఎంబీబీఎస్ లేదా బీడీఎస్/ఎండీఎస్ లేదా బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు సాధించాలి.

### వయసు

01.08.2025 నాటికి వయసు 21-30 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు లభిస్తుంది.

### వేతనం

నెలకు వేతన శ్రేణి రూ.50,925-రూ.96,765 లభిస్తుంది. అన్నీ కలుపుకొని మెట్రో నగరాల్లో ప్రారంభంలోనే నెలకు రూ.90వేల వేతనం అందుతుంది.

### ఎంపిక ప్రక్రియ


ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేపడతారు.

### వంద మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియ తొలిదశలో వంద మార్కులకు ఆబ్జెక్టివ్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో మూడు విభాగాల నుంచి మల్టిపుల్ ఛాయిస్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు- 30 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు-35 మార్కులకు అడుగుతారు. ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం పరీక్ష వ్యవధి ఒక గంట ఉంటుంది. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీ మీడియంలో ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కును తగ్గిస్తారు. ఈ పరీక్షలోని ప్రతి విభాగంలో కనీసం మార్కులతోపాటు మొత్తంగా నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఒక్కో పోస్టుకు 15 మందిని చొప్పున మెయిన్‌కు అనుమతిస్తారు.

### మెయిన్ పరీక్ష ఇలా

- మెయిన్ పరీక్ష జనరలిస్ట్ పోస్టులు, స్పెషలిస్ట్ పోస్టులకు వేర్వేరుగా ఉంటుంది.
- మెయిన్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పద్ధతిలో జరుగుతుంది.
- జనరలిస్ట్ పోస్టులకు సంబంధించిన పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 50 ప్రశ్నలు -50 మార్కులకు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు- 50 మార్కులకు, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- స్పెషలిస్ట్ పోస్టుల సంబంధించిన పరీక్షలో ఐదు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు అడుగుతారు. టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు- 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు- 40 మార్కులకు, సంబంధిత స్పెషలిస్ట్ విభాగంపై 40 ప్రశ్నలు -40 మార్కులకు అడుగుతారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కును తగ్గిస్తారు.
- **డిస్క్రిప్టివ్ టెస్ట్:** ఆబ్జెక్టివ్ పరీక్ష ముగిసిన తర్వాత డిస్క్రిప్టివ్ పరీక్ష ఉంటుంది. ఈ పరీక్ష ఇంగ్లిష్ భాష ప్రావీణ్యంపై 30 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో లెటర్ రైటింగ్ 10 మార్కులకు. ఎస్సే 20 మార్కులకు అడుగుతారు. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు.




### తుది ఎంపిక ఇలా

మెయిన్ పరీక్షలోని ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులతోపాటు మొత్తంగా కటాఫ్ సాధించిన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇలా షార్ట్‌లిస్ట్ జాబితాలో నిలిచిన అభ్యర్థుల డిస్క్రిప్టివ్ టెస్టును మాత్రమే మూల్యాంకనం చేస్తారు. మెయిన్ ఆబ్జెక్టివ్ టెస్టులో ప్రతిభతోపాటు డిస్క్రిప్టివ్ టెస్టులోనూ అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. డిస్క్రిప్టివ్ టెస్టు అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో సాధించిన స్కోర్‌ను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.

మెయిన్ ఆబ్జెక్టివ్ టెస్టుతోపాటు ఇంటర్వ్యూ మార్కులను మాత్రమే తుది జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకోసం మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులను 75:25 నిష్పత్తిలో వెయిటేజీ కల్పించి విజేతలను ప్రకటిస్తారు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 07.08.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.08.2025
- **ఫేజ్ 1 ఆన్‌లైన్ పరీక్ష:** 14.09.2025
- **ఫేజ్ 2 ఆన్‌లైన్ పరీక్ష:** 29.10.2025
- **వెబ్‌సైట్:** https://www.newindia.co.in

## యాపిలా.. మజాకా.. జస్ట్ 1,000 కోట్లు!



బెంగళూరు: యాపిల్ ఫోన్ల రేట్లే కాదు.. యాపిల్ ఆఫీసుల రెంట్లు, లీజులు కూడా ఓ రేంజులో ఉంటాయి. తాజాగా బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్ నుంచి యాపిల్ పదేళ్లపాటు లీజుకు తీసుకున్నట్లు పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. ఎంబసీ జెనిత్ భవనంలోని మొత్తం 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకూ) యాపిల్ కార్యాలయం పనిచేస్తుంది. దీని రెంట్, పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలుపుకుని పదేళ్లకు రూ.వెయ్యి కోట్లకు పైనే చెల్లించనుంది. 2025 ఏప్రిల్ 3 నుంచి ఈ లీజు అమల్లోకి వచ్చింది. ఒప్పందంలో భాగంగా సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.31.57 కోట్లను యాపిల్ ఇప్పటికే చెల్లించింది.

## ఖతర్నాక్ ఖాకీపై ఇంటెలిజెన్స్ ఆరా!

సాక్షి, హైదరాబాద్: 'కీలక కమిషనరేట్‌లో ఖతర్నాక్ ఖాకీ..!' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనం పోలీస్‌శాఖలో చర్చకు దారి తీసింది. సదరు అధికారి అవినీతి వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. మరోవైపు ఖతర్నాక్ ఖాకీపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తోంది. ఇప్పటికే ఇంటెలిజెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎక్కడెక్కడ సెటిల్‌మెంట్లకు పాల్పడ్డారు..?, అక్రమార్జనలో సదరు అధికారితో అంటకాగిన క్షేత్రస్థాయి అధికారులెవరు? ఎవరి వాటాలెంత? ఈ అధికారుల బాధితులెవరు? తదితర అంశాలపై ఇంటెలిజెన్స్ వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. బినామీ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు తెలిసింది. కాగా, మాదాపూర్ పరిధిలో వెయ్యి గజాల స్థలం కబ్జా వ్యవహారంపై ఈ కథనంలో ప్రస్తావించడంతో.. సదరు నేత మంగళవారం నేరుగా పోలీసులతో భేటీ అయి చర్చించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వివిధ జోన్లపై దృష్టిపెట్టినట్టు సమాచారం.

# దక్షిణ మహిళా రైల్వే

**5 కీలక విభాగాలకు అతివలే అధిపతులు**

పద్మజ
హేమ సునీత
అరోమా సింగ్ ఠాకూర్
నిర్మలా నరసింహన్
ఇటీ పాండే



సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే ఓ అరుదైన ఘనతను సాధించింది. జోన్ పరిధిలో 11 ప్రధాన విభాగాలుండగా, వాటిల్లో ఐదు విభాగాలకు మహిళలే అధిపతులయ్యారు. ఇటీవలి వరకు మూడు విభాగాలకు వారు నేతృత్వం వహిస్తూ రాగా, తాజాగా జరిగిన బదిలీల్లో మరో రెండు విభాగాలను కూడా వారికే అప్పగించారు. కీలక ఐదు విభాగాలను మహిళలే పర్యవేక్షిస్తుండటం పట్ల దక్షిణ మధ్య రైల్వే జనరల్‌మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి కీలక లక్ష్యాలనైనా సాధించే సత్తా మహిళలకుందని, జోన్ పరిధిలో కీలక విభాగాలను సమర్థంగా పర్యవేక్షిస్తున్నారన్నారు.

### ఆపరేషన్స్: కె. పద్మజ

**రైళ్ల రాకపోకలు, వాటి సమయపాలన, ట్రాఫిక్ నిర్వహణ, ఇతర విభాగాలతో సమన్వయం, రోలింగ్ స్టాక్ నిర్వహణ వంటి కీలక అంశాలు రైల్వేలో ఆపరేషన్స్ విభాగ పరిధిలోకే వస్తాయి.**

ఈ విభాగ నిర్వహణ కత్తిమీద సామే. ఈ సంవత్సరం జూలై వరకు సరుకు రవాణా ద్వారా దక్షిణ మధ్య రైల్వే రూ.4,601 కోట్ల ఆదాయం సాధించింది. 49 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి కొత్త రికార్డు సృష్టించింది. పండుగలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో 1,117 ప్రత్యేక రైళ్లు నడిపింది. దీనికి ప్రస్తుతం 1991 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి కే.పద్మజ అధిపతిగా వ్యవహరిస్తున్నారు. 2025 జనవరిలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు.

### వాణిజ్య విభాగం: ఇటీ పాండే

**ఆపరేషన్స్ తర్వాత అంత ప్రాధాన్యం ఉన్న విభాగమిది. టికెట్ అమ్మకాలు, రిజర్వేషన్, స్టేషన్ నిర్వహణ, సరుకు రవాణా, మార్కెటింగ్, ఆదాయ వనరుల పెంపు వంటివి దీని పరిధిలో ఉంటాయి.**

ఈ విభాగానికి ఈ నెల రెండో తేదీన 1998 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి ఇటీ పాండే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె 'రైల్ మంత్రి రాజభాష రజత్ పథక్ (2025), మంత్రిత్వ శాఖ పురస్కారం (2007), జీఎం అవార్డులు (రెండుసార్లు), విమెన్ ఎచీవర్స్ (2016) లాంటి అనేక పురస్కారాలు పొందారు. 'రైడింగ్ ది ఫ్రైట్ ట్రైన్' అనే పుస్తకం రాశారు. అంతర్జాతీయస్థాయిలో కామ్ రోడ్స్ మారథాన్ (88 కి.మీ.)ను పూర్తి చేసిన ఏకైక మహిళా సివిల్ సర్వెంట్‌గానూ గుర్తింపు పొందారు.

### భద్రతా విభాగం: అరోమా సింగ్ ఠాకూర్

**రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత చాలా కీలకం. అసాంఘిక శక్తులు, ఆకతాయిలు మొదలు ఉగ్రవాదుల వరకు రైల్వేపై దాడులు చేయటం సహజం. ట్రాక్‌పై అడ్డుగా ఇనుప చువ్వలను ఉంచి రైళ్లు పట్టాలు తప్పేలా చేసే కుట్రలు తరచూ జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నిర్వీర్యం చేయటం సహా స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికులు క్షేమంగా ఉండేలా, భద్రంగా గమ్యం చేరేలా ఆర్‌పీఎఫ్ సిబ్బంది పహారాలో ఉంటారు.**

ఈ మొత్తాన్ని పర్యవేక్షించే కీలక బాధ్యతను ప్రస్తుతం 1993 బ్యాచ్ ఐఆర్‌పీఎఫ్‌ఎస్ అధికారి అరోమాసింగ్ ఠాకూర్ పర్యవేక్షిస్తున్నారు. 2023 జూలైలో ఆమె ఐజీ కమ్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్యూరిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె నేతృత్వంలో 'ఆపరేషన్ యాత్రి సురక్ష', 'ఆపరేషన్ అమానత్', 'ఆపరేషన్ నన్హే ఫరిస్తే', 'ఆపరేషన్ సతర్క్' వంటి ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయి. మహిళల భద్రతకు 'ఉమన్ శక్తి టీమ్‌లు', 'మెరి సాహిలీ', 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు' ప్రారంభించారు.

### వైద్య విభాగం: డా. నిర్మలానరసింహన్

రైల్వేలో ప్రత్యేక ఆస్పత్రులు ఉంటాయి. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఇవి వైద్య సేవలందిస్తాయి. ఇవి కాకుండా ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే ప్రత్యేక మొబైల్ ఆస్పత్రులు ఆయా ప్రాంతాలకు చేరుకుని వైద్యం అందిస్తాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 8 ప్రధాన ఆస్పత్రులు, 40 హెల్త్ యూనిట్లు ఉన్నాయి. లాలాగూడలోని 380 పడకల కేంద్ర రైల్వే ఆస్పత్రి ఉంది. ఈ విభాగానికి 1989 బ్యాచ్ ఐఆర్‌హెచ్‌ఎస్ అధికారి డా.నిర్మలానరసింహన్ డిసెంబర్‌లో ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

### ఆర్థిక విభాగం: హేమ సునీత

అతి పెద్ద నెట్‌వర్క్ అయిన రైల్వేలో ఆర్థిక అంశాల పర్యవేక్షణ కూడా చాలా కీలకం. ఆర్థికపరమైన పొరపాట్లు, అక్రమాలకు తావు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఈ విభాగానికి 1993 ఐఆర్‌ఏఎస్ అధికారి హేమసునీత గత ఏప్రిల్ నుంచి ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. లండన్, పారిస్, మలేషియా, సింగపూర్‌లలో ఆర్థిక అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో కోర్సులు చేసి, శిక్షణ పొందారు. ఆమె పీపీపీ, ఇంటర్నేషనల్ టాక్స్, అక్రూవల్ అకౌంటింగ్‌లలో ప్రావీణ్యం పొందారు.




మంత్రి పొంగులేటి నుంచి అవార్డులు అందుకుంటున్న 'సాక్షి' ఫొటోగ్రాఫర్లు సతీశ్, బాలస్వామి, రాజేశ్‌రెడ్డి. చిత్రంలో పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

## కాలాన్ని బంధించే శక్తి ఫొటోగ్రాఫర్లకే ఉంది: పొంగులేటి

**ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ప్రదర్శనను ప్రారంభించిన మంత్రి**

సాక్షి, హైదరాబాద్: మరిచిపోలేని జ్ఞాపకాలను.. మధురానుభూతులను అందించేది ఫొటోగ్రఫీ అని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాలాన్ని బంధించే శక్తి ఒక్క ఫొటోగ్రాఫర్లకే ఉందని ప్రశంసించారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించిన ఫొటో ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఫొటోగ్రఫీ పోటీల్లో గెలిచిన వారికి బహుమతి, నగదు పురస్కారం అందించారు. బెస్ట్ పిక్చర్ కాన్సులేట్ అవార్డు విజేతలుగా సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్లు గడిగె బాలస్వామి, నోముల రాజేశ్‌రెడ్డి, కుక్కల సతీశ్ నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఒక్క ఫొటో వేయి భావాలను తెలుపుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి తగిన చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫొటో జర్నలిస్టులని అన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సాక్షి ఫొటో జర్నలిస్టుకు అవార్డు

నల్లగొండ: ప్రముఖ ఫొటోగ్రాఫర్లు ఎస్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబుల స్మారకార్థం.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సబ్జెక్ట్, కంపోజిషన్, టెక్నికల్, లైటింగ్ అంశాలపై ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో నల్లగొండకు చెందిన సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్టు కంది భజరంగ్ ప్రసాద్ తీసిన ఛాయా సోమేశ్వరాలయం ఫొటో.. ఉత్తమ ఛాయాచిత్రం అవార్డుకు ఎంపికైంది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ కార్యదర్శి, ఫొటో జెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఫౌండర్ కానాల సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. అవార్డులను త్వరలో అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## నీట్ పీజీలో 1,28,116 మంది అర్హత

- 276– 235 మధ్య వివిధ వర్గాల కటాఫ్ మార్కులు.. ఫలితాలు విడుదల చేసిన ఎన్‌బీఈఎంఎస్

సాక్షి, హైదరాబాద్: నీట్ పీజీ–2025 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 3న నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను రెండువారాల్లోనే విడుదల చేశారు. ఈ పరీక్ష కోసం 2,42,493 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 2,30,114 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 1,28,116 మంది అర్హత సాధించినట్లు ఎన్‌బీఈఎంఎస్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో కలిపి పీజీ మెడికల్ సీట్లు 74,306 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఫలితాలను '[illegible]'లో చూసుకోవచ్చు. వెబ్‌సైట్ హోమ్‌పేజీలో ఉన్న నీట్ పీజీ -2025 రిజల్ట్స్ లింక్ ద్వారా ఫలితాల పీడీఎఫ్ డౌన్లోడ్ చేసుకుని, కంట్రోల్ +ఎఫ్ కమాండ్స్ ద్వారా తమ రోల్ నంబర్‌ను తేలిగ్గా వెతుక్కోవచ్చు. వ్యక్తిగత స్కోర్ కార్డులు ఈ నెల 29 నుంచి అదే వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని ఎన్‌బీఈఎంఎస్ తెలిపింది. ఈ స్కోర్ కార్డులు ఆరు నెలలపాటు అందుబాటులో ఉంటాయి.

**కటాఫ్ మార్కులు 276 నుంచి 235 వరకు**

నీట్ పీజీ పరీక్షను 800 మార్కులకు నిర్వహించారు. ఇందులో వివిధ వర్గాల కటాఫ్ మార్కులను ఎన్‌బీఈఎంఎస్ నిర్ణయించింది. జనరల్, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 276 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించారు. జనరల్ పీడబ్ల్యూడీ (దివ్యాంగులు) వర్గానికి 255 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలోని పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 235 మార్కులు అర్హతగా నిర్ణయించారు. ఫలితాలు విడుదల కావటంతో త్వరలోనే నీట్ పీజీ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ)తో పాటు వివిధ రాష్ట్రాల కౌన్సెలింగ్ అథారిటీల ద్వారా ఈ ప్రక్రియ సాగనుంది.

## రివార్డు పాయింట్స్ రీడీమ్ పేరిట సైబర్ మోసాలు

**అప్రమత్తంగా ఉండాలన్న టీజీ సీఎస్‌బీ**

సాక్షి, హైదరాబాద్: క్రెడిట్, డెబిట్ కార్డు రివార్డ్ పాయింట్స్ రీడీమ్ పేరుతో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) హెచ్చరించింది. ఈ తరహా కేసులు ఇటీవల ఎక్కువైనట్టు టీజీసీఎస్‌బీ గుర్తించింది. యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా పేర్లతో నకిలీ లింకులు పంపించి వేల రూపాయలు కొల్లగొట్టినట్లుగా ఫిర్యాదులు అందినట్టు టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరగాళ్లు రివార్డ్ పాయింట్స్ పేరుతో ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్‌సైట్ల లింకులను పంపిస్తున్నారని, ఈ లింకులు క్లిక్ చేసినా యాప్ ఇన్‌స్టాల్ చేసినా బ్యాంక్ అకౌంట్లను హ్యాక్ చేస్తున్నట్టు తెలిపారు. అనుమానాస్పద కాల్స్, ఎస్ఎంఎస్‌లు వస్తే వెంటనే బ్యాంకులను నేరుగా సంప్రదించాలన్నారు. మోసానికి గురైతే హెల్ప్‌లైన్ నంబర్ 1930, వాట్సాప్ 8712672222, cybercrime.gov.in ద్వారా రిపోర్ట్ చేయాలని శిఖాగోయల్ పేర్కొన్నారు.

## హలో నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్నా..

**ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు యాదాద్రి భువనగిరి కలెక్టర్ ఫోన్**



సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వివరిస్తున్న రావుల అక్షయ

భువనగిరి టౌన్: 'హలో నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్నా.. గతంలో మీ స్కూల్‌లో చదువుకున్న అక్షయ అనే విద్యార్థినికి గంటలోపు సర్టిఫికెట్స్ ఇవ్వాలి' అని కలెక్టర్ హనుమంతరావు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని సాధన హైస్కూల్ ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడేనికి చెందిన రావుల అక్షయ సాధన ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి వరకు చదువుకుంది. 9వ తరగతి బస్వాపురం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో చేరింది. ప్రస్తుతం అక్షయ పదో తరగతి చదువుతోంది. అక్షయ రెండేళ్లుగా ప్రైవేట్ స్కూల్ చుట్టూ తిరుగుతోంది. మొత్తం ఫీజు చెల్లిస్తే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వబోమని ప్రిన్సిపాల్ చెప్పడంతో విద్యార్థిని తల్లి రూ.10 వేలు చెల్లించింది. ఈ మొత్తాన్ని యాజమాన్యం బుక్స్, యూనిఫామ్ కింద జమ చేసుకుని, ఫీజు చెల్లించాలని డిమాండ్ చేసింది. దీంతో గత్యంతరం లేక కలెక్టర్‌ను కలిసేందుకు మంగళవారం అక్షయ తన తల్లితోపాటు కలెక్టరేట్‌కు వచ్చి తన గోడును వెల్లబోసుకుంది. కలెక్టర్ వెంటనే స్పందించి ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేశారు.

## కార్మిక శాఖ అధికారులకు బీఐఎస్ శిక్షణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శ్రామిక విభాగం ఉన్నతాధికారులకు భారతీయ ప్రమాణాల బ్యూరో, హైదరాబాద్ శాఖ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. పని ప్రదేశాల్లో అనుసరించాల్సిన నియమాలు, పాటించాల్సిన భారతీయ ప్రమాణాలు, పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై బీఐఎస్ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో భద్రత చట్టపరమైన అవసరం మాత్రమే కాదని, ప్రతీ కార్మికుడు, పారిశ్రామికవేత్తల బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు, లేబర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కమిషనర్లు జి.సునీత, శ్యామ్ సుందర్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్‌తో పాటు అన్ని జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, అదనపు కమిషనర్లు పాల్గొన్నారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 



## ఆ'వరి'ంచిన అందాలు

సిద్దిపేట పట్టణ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ కట్ట కింద.. వానాకాలం సాగులో భాగంగా ఇక్కడి రైతులు వరినాట్లు వేశారు. వర్షాలు కురుస్తుండటంతో వరి పచ్చగా, చెట్లు పచ్చగా కనువిందు చేస్తున్నాయి. ఒక పక్క గోదావరి జలాలు.. కట్ట కింద పచ్చటి ప్రకృతి ఆహ్లాదం పంచుతున్నాయి.

- సాక్షి, సిద్దిపేట



## నీటి ముత్యాలు

నీటిలో పుట్టినా నీటిని అంటిపెట్టుకోని విశిష్టత తామరాకుది.. అందుకే 'తామరాకు మీద నీటిబొట్టులా' సామెత కూడా ఉంది. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట ఊర చెరువులో తామరాకులపై రాలిన చినుకులు ఇలా ముత్యాలను తలపిస్తూ మెరిసిపోయాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

# సాంకేతిక లోపమా? స్వయంకృతాపరాధమా?

### అధిక లోడ్‌తోనే లీకేజీలా? ● నాణ్యత, పర్యవేక్షణ లోపంపైనా అనుమానాలు

**గోదావరిఖని/ఫెర్టిలైజర్ సిటీ:** పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్‌లో అత్యంత ప్రమాదకర అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తరచూ మరమ్మతులు చోటుచేసుకోవడంతో సాంకేతిక లోపమా.., లేక స్వయంకృతాపరాధమా? అనే చర్చ సాగుతోంది. మేలో నిర్వహించిన వార్షిక మరమ్మతుల్లో హై టెంపరేచర్ రిఫార్మర్(హెచ్‌టీఆర్)లో లోపాలను గుర్తించారు. ట్యూబ్‌లకు మరమ్మతులు చేసి, లోడ్ తగ్గించి యూరియా ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో లోడ్ అధికం కావడంతో.. పైపుల్లో క్రాక్‌లు ఏర్పడి, వెల్డింగ్‌లు ఊడిపోవడం లాంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. తాజాగా హెచ్‌టీఆర్ లోపాలతో ప్లాంట్ షట్‌డౌన్ చేశారు.

### కొనసాగుతున్న హెచ్‌టీఆర్ మరమ్మతులు

గత మేలో హెచ్‌టీఆర్‌లో మరమ్మతులు పూర్తిచేసి ప్లాంట్‌ను ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చారు. యూరియా ఉత్పత్తి కొనసాగుతుండగానే మళ్లీ సమస్యలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత జూలైలో.. ఇన్‌కొనాల్ ట్యూబ్‌ల్లో లీకేజీ, ఎల్‌బో వద్ద క్రాక్‌లు ఏర్పడ్డాయని గుర్తించారు. ఫ్లగ్స్ వద్ద కూడా క్రాక్స్ వచ్చినట్లు తెలుస్తోంది. మళ్లీ హెచ్‌టీఆర్‌లో మరమ్మతులు పూర్తిచేశారు. అప్పటి అంచనాల ప్రకారం .. 70 నుంచి 80 శాతం ఉత్పత్తి లోడ్‌లోనే పనిచేస్తుందని సాంకేతిక అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే, అధిక లోడ్‌తో ట్యూబ్‌ల్లో మళ్లీ క్రాక్స్ రావడం, వెల్డింగ్ ఊడిపోయినట్లు చెబుతున్నారు.

### అసలేమిటీ హెచ్‌టీఆర్?

గ్యాస్ ఆధారిత ఆర్ఎఫ్‌సీఎల్‌లో హెచ్‌టీఆర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే.. గుండెకాయలా పనిచేస్తుంది. యూరియా, అమ్మోనియా తయారీలో అత్యంత కీలకమైన యూనిట్ ఇది. సహజవాయువు (నేచురల్ గ్యాస్)ను హైటెంపరేచర్‌తో రీఫార్మ్ చేసి సింథసిస్ గ్యాస్(హెచ్‌టూ+ఎన్‌టూ) ఉత్పత్తి చేస్తుంది. ఇందులో వెయ్యి డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉంటుందని అంటున్నారు. అమ్మోనియా యూనిట్ పనితీరు హెచ్‌టీఆర్‌పైనే ఆధారపడి ఉంటుందంటున్నారు. ఇందులో సమస్యలు వస్తే గ్యాస్ ఉత్పత్తి తగ్గి, యూరియా ఉత్పత్తి పడిపోతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డెన్మార్క్ నుంచి హీట్ టెంపరేచర్ రీఫార్మర్(హెచ్‌టీఆర్)ను దిగుమతి చేసుకున్నారు. అత్యంత అదునాతనమైన సాంకేతికతతో మిగతా ప్లాంట్ల కన్నా రెట్టింపు స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు వీలుగా.. దీన్ని సుమారు రూ.100 కోట్లతో కొనుగోలు చేశారు.



ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్

### ఓవర్ లోడ్‌తోనే ప్రమాదం?

హెచ్‌టీఆర్ ట్యూబ్‌లు దెబ్బ తినడంతోనే మరమ్మతులు చేసి ఉత్పత్తి తగ్గించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ప్రొడక్షన్, టెక్నికల్ విభాగాల మధ్య సమన్వయం కొరవడుతోందని, దీంతోనే సమస్యలు వచ్చినట్లు తెలుస్తోంది. ఉత్పత్తి తగ్గిస్తే ఉత్పత్తి నిలిచిపోదని, పెంచితేనే హెచ్‌టీఆర్‌పై లోడ్‌పడి పైపుల్లో లీకేజీ, వెల్డింగ్‌లు ఊడిపోతున్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలోనే ప్రస్తుతం నిరంతరం మరమ్మతులు చేస్తున్నారు. అయితే, ఈనెల 22న ప్లాంట్‌ను ఉత్పత్తి దశలోకి తేవాలని అంచనా వేశారు.

### ప్రమాదకరంగా అమ్మోనియం ప్లాంట్

యూరియా, అమ్మోనియా ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే హెచ్‌టీఆర్‌లో లోపాలు అత్యంత ప్రమాదకరమని అంటున్నారు. గ్యాస్ లీకైతే.. ఉద్యోగులతో పాటు సమీప గ్రామాలకు కూడా ప్రమాదం వస్తుందని చెబుతున్నారు. ఇటీవల ప్లాంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కూడా ఇదే విషయంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఒత్తిడి పెంచుతున్న ఎంపీ, ఎమ్మెల్యే..

కాగా, ఎమ్మెల్యే ఠాకూర్ ఇటీవల ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సంఘాల్‌ను కలిసి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఢిల్లీలోని కేంద్ర ఎరువులు, రసాయనాల చైర్మన్‌ను కలిసి యూరియా ఉత్పత్తికి ఆటంకం ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలున్నా.. యూరియా కేటాయింపులపై దృష్టి సారించడం లేదని ఎద్దేవా చేశారు. స్థానికంగానే కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య కోరారు.

## భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించండి

### ఆలయ భూమిపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: 50 ఏళ్ల కిందట రోడ్డు ప్రాజెక్టు కోసం తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 60 ఎకరాల భూమికి సంబంధించి 4 నెలల్లో భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 60 ఎకరాలను తీసుకుని ఏళ్లు గడుస్తున్నా పరిహారం చెల్లించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆలయ ఈవో హైకోర్టును ఆశ్రయించారు. 1975లో అన్నపురెడ్డిపల్లి నుంచి చాపరాలపల్లి మధ్య రహదారి కోసం ఈ భూమిని తీసుకున్నారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఇదే అంశంపై 2007లో సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారని, 2022లో డివిజన్ బెంచ్ దాన్ని సమర్థించినప్పటికీ పరిహారం చెల్లించకపోవడాన్ని న్యాయమూర్తి తప్పుబట్టారు. తమ ఆదేశాలను అమలు చేయకపోవడం ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. న్యాయస్థానం ఆదేశాలను ప్రభుత్వ అధికారులు పాటించాల్సిందేనని, అది రాజ్యాంగబద్ధమని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. 4 వారాల్లో భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

## ఉద్యోగాలపై శ్వేతపత్రం ప్రకటించాలి

### బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ తన పాలనలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లపై శ్వేత పత్రం ప్రకటించాలని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దమ్ముంటే రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ లైబ్రరీకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల గురించి చెప్పాలని కోరారు. శ్రీనివాస్ మంగళవారం తెలంగాణ భవన్‌లో.. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు సత్య, తుంగ బాలు, జంగయ్య, దశరథ్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్ రావు, అవినాశ్‌తో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. విద్యార్థులకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఉస్మానియా యూనివర్సిటీలో అడుగుపెట్టాలని కోరారు. సీఎం ఇచ్చిన హామీలపై ప్రశ్నించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంతమందిని అరెస్టు చేస్తారో చూస్తామని శ్రీనివాస్ సవాల్ చేశారు.



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ, కుటుంబసభ్యులు







శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, హీరో ప్రియదర్శి



తిరుమలలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా జైస్వాల్ తదితరులు



శ్రీవారిని దర్శించుకున్న సినీ నటి ఆమని



## పోలీసుల సమక్షంలో ఎరువుల పంపిణీ

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో మంగళవారం పోలీసుల సమక్షంలో యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేయాల్సి వచ్చింది. సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో యూరియా బస్తాలు అందిస్తామని చెప్పడంతో.. మండెపల్లికి చెందిన రైతులు సోమవారం రాత్రి నుంచే తమ వంతుగా పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టారు. తీరా 250 బ్యాగులు మాత్రమే ఉన్నాయని.. ఒక్కొక్కరికి ఒక బస్తా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. ఒక్కొక్కరికి ఒక్కో బస్తా ఇవ్వడంతో నిరాశతో వెనుదిరిగారు

- తంగళ్లపల్లి(సిరిసిల్ల)

**కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1, 2 పంప్‌హౌజ్‌ల ద్వారా జరుగుతున్న నీటి పంపింగ్ వివరాలు**

| పంప్‌హౌస్ | స్థాపిత సామర్థ్యం | మొత్తం పంపులు (మెగావాట్లలో) | ప్రస్తుత లోడ్ (మెగావాట్లలో) | నడుస్తున్న పంపులు | ఎత్తిపోస్తున్న నీళ్లు (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|---|
| నంది | 893 | 7 | 115 | 1 | 3150 |
| గాయత్రి | 973 | 7 | 125 | 1 | 3150 |
| అన్నపూర్ణ | 424 | 4 | 104 | 1 | 3200 |
| రంగనాయకసాగర్ | 537.76 | 4 | 127 | 1 | 3300 |
| మల్లన్నసాగర్ | 344 | 8 | 72 | 2 | 2534 |
| కొంపోచమ్మసాగర్-1 | 162 | 6 | 0 | 0 | 0 |
| కొండపోచమ్మసాగర్-2 | 204- | 6 | 25 | 1 | 1346 (కొద్ది సేపటికే ఆపేశారు) |

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఒక్క ఓబీసీ దొరకలేదా?: కాసం




సాక్షి, హైదరాబాద్: ప్రతిరోజూ బీసీల జపం చేసే కాంగ్రెస్‌కు ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో మాత్రం దేశంలో ఎక్కడా ఒక్క ఓబీసీ అభ్యర్థి కూడా దొరక్కపోవడం ఆ పార్టీ దుస్థితిని బయటపెట్టిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. కులగణన చేశామని గొప్పలతో ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారే కానీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని నిలబెట్టలేకపోవడం కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ఎత్తి చూపుతోందన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ సీనియర్ నేత వి.హన్మంతరావు పేరు కూడా గుర్తుకు రాలేదా? బీసీ అభ్యర్థిని నిలబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థులే లేరా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ తానే ఓబీసీల ఉద్ధారకుడినని చెప్పుకుంటున్నాడని, రేవంత్‌రెడ్డి తెలంగాణనే రోల్ మోడల్ అని అంటున్నారని కానీ వీరివి మాయమాటలేనని అన్నారు. బీజేపీ మాత్రం అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించిందన్నారు.

## పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ప్రశ్నోత్తరాలు

### ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనను అంగీకరించలేదు


**లోక్‌సభలో ఎంపీ చామలకు కేంద్రం సమాధానం**



**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభ్యర్థన వచ్చిందని, అయితే దానికి అంగీకరించలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మంగళవారం లోక్‌సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపీలోని పెవేగిలోని ఇండియాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ (ఐఐఓపీఆర్) తెలంగాణ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల ఆయిల్ పామ్ పెంపకం దారులకు అన్ని రకాల అవసరాలు తీర్చుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద 2025-26 ఏడాదికి 50 వేల హెక్టార్ల అదనపు విస్తరణ లక్ష్యాలను ఆమోదించినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు.

### పరికిబండలో రూ.1,775 కోట్లతో ఎంఎంఎల్‌పీ పార్కు


**ఎంపీ బలరామ్ నాయక్‌కు కేంద్రం సమాధానం**



రాష్ట్రంలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు (ఎంఎంఎల్‌పీ) అభివృద్ధి కోసం తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (టీజీటీపీఎస్) ద్వారా మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలంలోని పరికిబండలో సుమారు 300 ఎకరాల భూమిని గుర్తించినట్టు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో ఎంపీ బలరామ్‌నాయక్ అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు అంచనా వ్యయం సుమారు రూ.1,775 కోట్లుగా ఉందన్నారు. కాగా.. స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్ఈజెడ్) ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

### పెద్దపల్లిలో రూ.48.79 కోట్ల పీఎం కిసాన్ పంపిణీ

**ఎంపీ వంశీకృష్ణకు కేంద్రం సమాధానం**



ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద పెద్దపల్లి జిల్లాలోని లబ్ధిదారులకు రూ.48.79 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆగస్టు 4, 2025 నాటికి వివిధ వాయిదాల్లో ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా అందజేసినట్లు తెలిపారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం 20 విడతల్లో మొత్తం 3.90 లక్షల కోట్లకు పైగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

# ఒళ్లంతా ముళ్లు.. ముచ్చన్నెల పూలు!





ప్రకృతి అందాలతో మనసుకు సాంత్వన చేకూరుతుంది. కాంక్రీటు వనాలైన నగరాల్లో అడుగడుగునా కాలుష్యం నిండుకుంటోంది. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం అక్కున చేర్చుకుంటుంది. కొండ ప్రాంతాల్లో అరుదుగా కనిపించే కొన్ని మొక్కలను చూస్తే వాటి అందానికి అలా నిల్చుండిపోవాల్సిందే. కర్నూలు నగర శివారులోని మీదివేముల గ్రామ సమీపంలో నల్ల జమ్మి చెట్లకు ఒళ్లంతా ముళ్లున్నా.. ఆకట్టుకునే పూలతో అందాలను విరజిమ్ముతోంది. ఒకే చెట్టుకు రెండు రకాల పూలు మూడు రంగుల్లో ఆ దారిన వెళ్లే వారిని ఆగి చూసెళ్లమని ఆహ్వానిస్తుండటం విశేషం. రాజస్తాన్‌లోని అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కనిపించే ఈ చెట్టు.. జిల్లాలో అరుదుగా కొండ ప్రాంతాల్లో కనువిందు చేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

# జలపాతం కనువిందు



ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మగుడి జలపాతం చూపరులను కనువిందు చేస్తోంది. భారీ వర్షాలతో జలపాతం ఉరకలు వేస్తూ కనువిందు చేస్తూ ఉండడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

– బుట్టాయగూడెం

## క్లుప్తంగా...

### కేంద్ర మాజీ మంత్రి సతీమణి కన్నుమూత



దుగ్గిరాల: రాజ్యసభ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన దివంగత వెనిగళ్ల సత్యనారాయణ సతీమణి నాగేశ్వరమ్మ(94) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆమె పార్థీవదేహాన్ని మంగళవారం ప్రజల సందర్శనార్థం దుగ్గిరాలలోని స్వగృహంలో ఉంచారు. ఆమెకు ఒక కుమారుడు, ఆరుగురు కుమార్తెలు. నాగేశ్వరమ్మ అంత్యక్రియలు మంగళవారం దుగ్గిరాల హిందూ శ్మశాన వాటికలో ముగిశాయి. శాసన మండలి మాజీ సభ్యురాలు నన్నపనేని రాజకుమారి పలు పార్టీలకు చెందిన నాయకులు, మండల అధికారులు, సర్పంచ్‌లు ఆమెకు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

### 340 మినీ అంగన్‌వాడీల విలీనం

**ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

సాక్షి, అమరావతి: పది మందిలోపు లబ్ధిదారులున్నారనే పేరుతో రాష్ట్రంలో 340 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ సెంటర్‌లలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కిలోమీటరు లోపు దూరంలోని మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాల్లో కలుపుతున్నట్టు పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో 4,687 మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేయడంతో వాటిలో పనిచేసే వర్కర్లలో పదోతరగతి విద్యార్హతున్న వారికి నెలకు రూ.11,500 గౌరవ వేతనం ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి మిగిలిన మినీ అంగన్‌వాడీలను కూడా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

### ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా సోమసుందర్

తాడేపల్లిగూడెం: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ)సెక్రటరీ జనరల్‌గా రాష్ట్రానికి చెందిన దూసనపూడి సోమసుందర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అధ్యక్షునిగా పంజాబ్, చండీగఢ్ జర్నలిస్టుల యూనియన్ నుంచి బల్విందర్ సింగ్ జమ్మూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి మహేష్‌కుమార్ సిన్హా ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన సోమసుందర్ ఉమ్మడి ఏపీలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షునిగా రెండు పర్యాయాలు పనిచేశారు.

# పిడుగు గుట్టు.. ఇలా పసిగట్టు

## ‘దామిని లైట్నింగ్’ యాప్‌తో ముందస్తు సమాచారం



- పిడుగుపడే 7–25 నిమిషాల్లోపు మొబైల్‌కు హెచ్చరికలు
- యాప్‌లో మూడు రంగుల ద్వారా సంకేతాలు
- పూణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ రూపకల్పన
- జాగ్రత్తలు పాటిస్తే బయటపడొచ్చంటున్న నిపుణులు




బెల్లంకొండ : వర్షం మొదలయ్యే ముందు తరచూ మన ఫోన్లకు విపత్తుల శాఖ నుంచి ‘మీ ప్రాంతంలో పిడుగులు పడే అవకాశం ఉంది’.. అంటూ మెసేజ్‌లు రావడం గమనిస్తుంటాం. పిడుగు ఎప్పుడు పడుతుందో.. ఎలా పడుతుందో ఎవరికీ తెలీని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవిస్తుంది. ఇక ఇంట్లోని గృహోపకరణాలు కూడా కాలిపోతుంటాయి. పిడుగులో ఉండే కాంతి ప్రభావంవల్ల నష్టం భారీగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీచేస్తూనే ఉంటుంది. అయితే, ఈ పిడుగు ప్రమాదాన్ని అరగంట ముందే గుర్తించేందుకు ‘దామిని లైట్నింగ్’ మొబైల్ యాప్ ఉంది. పూణే కేంద్రంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం) దీన్ని రూపొందించింది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో 83 చోట్ల ప్రత్యేక సెన్సార్లను అమర్చింది.

### ఎలా ఉపయోగించాలంటే..

ముందుగా ఫోన్లో గూగుల్ ప్లేస్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్‌లోకి వెళ్లి.. దామిని లైటింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత పేరు, మొబైల్ నంబరు, అడ్రస్, పిన్‌కోడ్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లొకేషన్ తెలుసుకునేందుకు యాప్‌కు అనుమతివ్వాలి. మీ ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉందో లేదో తెలుసుకునేందుకు వీలుగా మూడు రంగులను చూపిస్తుంది. వాటి ఆధారంగా మీరున్నచోట ప్రమాదాన్ని ముందే హెచ్చరిస్తుంది.



### రంగుల సంకేతం ఇలా..

**ఎరుపు రంగు :** మీరున్న ప్రాంతంలో మరో ఏడు నిమిషాల్లో పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుంది.

**పసుపు రంగు :** మరో 10-15 నిమిషాల్లో పిడుగుపడే అవకాశముంటే సర్కిల్ పసుపు రంగులోకి మారుతుంది.

**నీలం రంగు :** 15-25 నిమిషాల్లో పిడుగుపడే అవకాశముంటే ఆ సర్కిల్ నీలం రంగులోకి మారిపోతుంది.

### ‘కాపర్’తో పిడుగుకు చెక్..

ఇంటి పరిసరాల్లో కాపర్ ఎర్త్ వైర్ ఏర్పాటుతో పిడుగుపాటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. ఇంటి ఆవరణలో కొంత ఎత్తయిన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైర్‌ను అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటుచేయడం ద్వారా దాదాపుగా కిలోమీటర్ దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఏర్పాటుచేసే సమయంలో ఉప్పు, కర్ర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన పైప్/ఇనుప రాడ్డును భూమి లోపలికి పాతడంవల్ల ప్రమాదాలకు నివారించవచ్చు.

### ఇలా జాగ్రత్త పడండి..

- వర్షంపడే సందర్భంలో చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తైన చెట్టు కింద అస్సలు ఉండకూడదు.
- ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.
- పిడుగులుపడే సమయంలో లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది.
- వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, సెల్‌ఫోన్లు, కెమెరాలు దగ్గర లేకుండా చూసుకోవాలి. ఫోన్ల నుంచి వచ్చే సిగ్నల్ పిడుగుపడే అవకాశాన్ని ఎక్కువ చేస్తుంది.
- పిడుగులవల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్లు తొలగించాలి.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

### అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలకు దూరం..

వర్షం పడుతున్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉంటే మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే ‘దామిని లైట్నింగ్’ యాప్ ఉపయోగించి పిడుగు ఎక్కడ పడుతుందో.. ఏ సమయంలో పడుతుందో తెలుసుకోవచ్చు. తద్వారా ప్రమాదానికి గురికాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్, బెల్లంకొండ

# సాక్షిపై అక్కసు.. పత్రిక ప్రతులు దహనం

తాడికొండ: తాడికొండ ఎమ్మెల్యే కార్యాలయం వేదికగా అవినీతి జరుగుతుందని టీడీపీ కార్యకర్తలే చెబితే అన్ని పత్రికలు రాసిన కథనాలను పక్కనబెట్టి ఒక్క సాక్షి పత్రికపైనే అక్కసు వెళ్లగక్కుతూ రాజధానిలో నిరసనలు తెలియజేయడం పట్ల సొంత పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. తాము ఆరోపించింది షాడో అవినీతిపై అయితే ఒక్క సాక్షిలోనే తప్పుడు కథనం రాశారని, మిగిలిన పత్రికల్లో వచ్చిన కథనాలపై నోరెత్తకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుళ్ళూరులో అసలు ఈ విషయానికి సంబంధమే లేని కొందరు యువకులతో నిరసన చేశారు. అలాగే సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. దీనికి తోడు తుళ్లూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్‌లలో రాజధాని ముంపునకు గురైందని రాసిన సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. కాగా నీరుకొండ, కృష్ణాయపాలెం, నేలపాడు, శాఖమూరు, పెదపరిమి పలు ప్రాంతాల్లో ఇప్పటికీ వరద నీరు తాండవిస్తుండగా ముంపు లేదంటూ బుకాయించడం గమనార్హం.

## జల వివాదాలపై కమిటీ ఏర్పాటులో కదలిక

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంలో తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న అపరిష్కృత వివాదాలపై చర్చల కోసం ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటుపై కేంద్ర జలశక్తి శాఖ కసరత్తు ప్రారంభించింది. కమిటీలో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన అధికారుల పేర్లను ఇంకా ప్రతిపాదించలేదని, సత్వరమే ప్రతిపాదించాలని కోరుతూ జల వనరుల శాఖ స్పెషల్ సీఎస్ జి.సాయిప్రసాద్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అగర్వాల్ ఈ నెల 12న లేఖ రాశారు. కేంద్ర జల్ శక్తి మంత్రి పాటిల్ గత నెల 16న రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశంలో జల వివాదాలపై చర్చించేందుకు కమిటీ ఏర్పాటుకు అంగీకారం తెలిపిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు. ఏపీ నుంచి ఐదుగురు, తెలంగాణ నుంచి ఇద్దరు, కేంద్ర జల్ శక్తి శాఖ నుంచి ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని అప్పట్లో నిర్ణయించగా, ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన అధికారుల పేర్లను ప్రతిపాదించాలని జల్ శక్తి శాఖ లేఖ రాయడం గమనార్హం.

## ఆలస్యం లేకుండా పరిశ్రమలకు అనుమతులివ్వాలి

- వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంలో ఆలస్యం చేయకూడదని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ఆదేశించారు. మంగళగిరిలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ప్రతి కంపెనీ ప్రతినిధులతో నిరంతరం మాట్లాడి గ్రౌండ్ అయ్యేవిధంగా పనిచేయాలన్నారు. ఇందుకు తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో సమస్యలను పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే భూమి కేటాయించి ఇంకా మొదలు పెట్టని ప్రాజెక్టులపై ఒకటికి రెండుసార్లు మాట్లాడాలనీ, అప్పటికీ కదలిక లేకపోతే భూ కేటాయింపు రద్దు చేయాలన్నారు. పరిశ్రమల కోసం తీసుకున్న భూముల్లో ఇతర కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ఎన్‌ఆర్‌ఐల భూములకే రక్షణ లేదు

- రాజకీయ అండతో దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు లేవా?
- తిరుపతిలో టీడీపీ నేత ఆక్రమణలపై ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న డాక్టర్ సునీత

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి ప్రభుత్వంలో ఎన్‌ఆర్‌ఐలకు చెందిన భూములు, స్థలాలకు రక్షణ కరువైందని డాక్టర్ సునీత ఆరోపించారు. ఆక్రమించిన భూముల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బెదిరింపులకు దిగుతున్నట్లు ఆధారాలతో బయటపెట్టారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. 2003లో తిరుపతి నగర పరిధిలోని కైకాల చెరువు వద్ద వేసిన ప్రగతి నగర్ వెంచర్‌లో సర్వే నంబర్ 1లో రూ.కోట్లు విలువచేసే ఏడు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన పత్రాలను మీడియాకు విడుదల చేశారు. కొంత కాలం తరువాత ఈ ప్లాట్లు తమవేనంటూ టీడీపీ నేత, బాలాజీ టింబర్ డిపో అధినేత కంచి రాము ఇబ్బంది పెడుతున్నారని వెల్లడించారు. ప్లాట్లకు దారి లేకుండా ప్రహరీ, తాత్కాలిక షెడ్లు నిర్మించినట్లు వివరించారు. ఆ తరువాత సర్వే నంబర్ 1/1బి పేరుతో రికార్డులు సృష్టించుకున్నట్లు ఆరోపించారు. టీడీపీ నేత రాము సృష్టించిన సర్వే నంబర్ బోగస్ అని రెవెన్యూ అధికారులే చెబుతున్నారన్నారు. ఎన్‌ఆర్‌ఐలకు చెందిన భూములకు రక్షణ కల్పిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రగల్భాలు పలికినా.. ఆచరణకు నోచుకోలేదని చెప్పారు. తమకు సంబంధించిన స్థలంతో పాటు పరిసర ప్రాంతంలోని అనేకమంది టీడీపీ నేతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. అయినా ప్రభుత్వం నిందితుడిపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆ సర్కిల్... సెప‘రేటు’



- కొవ్వూరు డివిజన్‌లోని ఓ సీఐ తీరుపై విమర్శల వెల్లువ
- లంచాలు తీసుకుని బాధితులపైనే కేసులు కడుతున్న వైనం
- రిసార్టుకు వస్తే సమస్య పరిష్కారిస్తానంటూ మహిళలకు వేధింపులు
- గోదావరి తీరంలోని రిసార్ట్‌లో శృంగార కార్యకలాపాలు
- ఆయన పరిధిలో పోస్టింగ్ వద్దంటూ ఎస్‌ఐల గగ్గోలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తూర్పు గోదావరి జిల్లాలో సివిల్ పోలీసుల దందాలు పెరిగిపోతున్నాయి. కొవ్వూరు డివిజన్ పరిధిలో అయితే కొన్ని పోలీస్ స్టేషన్‌లు పూర్తిగా గతి తప్పాయి. కొందరు పోలీసు అధికారులు బాధితులను పీడించుకుతింటున్నారు. ఒక సీఐ అయితే ఏకంగా కాసులు ఇస్తేనే కేసులు ఉంటాయని బహిరంగంగా చెబుతున్నారు. ఆ సీఐ డబ్బులు తీసుకుని ఫిర్యాదు చేసిన వ్యక్తిపైనే కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారని తెలుస్తోంది. మరో వ్యక్తి ఫిర్యాదు చేస్తే, అవతల వారి నుంచి సొమ్ము తీసుకొని బలవంతంగా సెటిల్ చేశారని సమాచారం. ఆయన వారాంతాల్లో ఒక రిసార్ట్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, సర్కిల్ పరిధిలోని ఇసుక మాఫియా, మద్యం షాపుల నుంచి మామూళ్లు మస్తుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతానికి చివరిలో ఉన్న ఈ నియోజకవర్గంలో నాలుగు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గంలోని ఐదు ఇసుక రీచ్‌ల నుంచి ప్రతి నెలా పోలీస్ స్టేషన్‌కు రూ.30వేలు చొప్పున సీఐకి మామూళ్లు వెళుతున్నాయని ప్రచారం జరుగుతోంది. మద్యం షాపుల నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున సీఐ వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఆ సీఐ పనితీరు నచ్చని ఇద్దరు ఎస్‌ఐలు విధుల్లో చేరిన మూడు నెలల్లోనే బదిలీపై వెళ్లారని సమాచారం.

### సొమ్ము ఇచ్చుకో... పేకాట ఆడుకో...

ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు బహిరంగంగా పేకాట శిబిరాలు నిర్వహిస్తుండగా, వారి నుంచి సదరు సీఐ మామూళ్లు తీసుకుని కళ్లు మూసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెల్టాలో భారీగా పేకాట శిబిరాలు నిర్వహిస్తుంటే కాపలాగా పోలీసులే వ్యవహరిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. ఇంటెలిజెన్స్ సిబ్బంది పేకాట శిబిరాలపై దాడులకు సిద్ధమైతే, వెంటనే ఆ సమాచారం నిర్వాహకులకు ఇస్తున్నారని, పారిపోయేందుకు సూచనలు కూడా పోలీసులే చెబుతున్నారని తెలుస్తోంది. ఎప్పుడైనా అవసరమైతే అనామకులకు కొంత సొమ్ము ఇచ్చి వారిపై కేసులు నమోదు చేస్తున్నారని సమాచారం. రోడ్డు ప్రమాదాలు, ఇళ్ల వద్ద గొడవలు వంటివాటిని కూడా సెటిల్‌మెంట్ పేరుతో ఆ సీఐ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### రిసార్ట్‌లో రాసలీలలు

కేసుల విషయమై వచ్చే కొందరు మహిళలను ఆ సీఐ లొంగదీసుకుని రాసలీలలు సాగిస్తున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి ఒక మహిళా హోంగార్డు సహకారం అందిస్తున్నట్టు సమాచారం. గోదావరి తీరంలో వెలసిన ఒక రిసార్ట్‌లో లేదా ఆ మహిళా హోంగార్డు ఇంట్లో ఈ వ్యవహారాలు నిస్సిగ్గుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సీఐ దందాలపై ఉన్నతాధికారులకు నివేదికలు వెళ్లినా పట్టించుకోవడం లేదని, ఎక్కడ తాము ఇరుక్కుపోతామోనని సర్కిల్‌లోని ఎస్‌ఐలు, సిబ్బంది భయపడుతున్నట్లు సమాచారం.

# పీ4 అమలు చేస్తే వార్డెన్‌లకు 6 మార్కులు

- అత్యధిక మార్కులు వస్తే బదిలీలు, పదోన్నతుల్లో ప్రాధాన్యం
- ఆదరణ 3లో మత్స్యకారులకు ప్రాధాన్యత
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి

సాక్షి, అమరావతి: బీసీ సంక్షేమ హాస్టళ్ల పనితీరుకు మార్కులు వేయనున్నామని, అత్యధిక మార్కులు సాధించిన హాస్టళ్ల వార్డెన్లకు బదిలీలు, పదోన్నతుల్లో ప్రాముఖ్యతనిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. రాష్ట్రంలో బీసీ సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆమె మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బాగా పనిచేసే హాస్టళ్లకు 100 మార్కులు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రతి ఏటా యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు(ఏసీఆర్) ద్వారా హాస్టల్ వార్డెన్ల పనితీరును రాష్ట్ర కార్యాలయానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల హాజరుకు 10 మార్కులు, విద్యార్థుల ప్రతిభకు 20, ఉత్తీర్ణత శాతానికి 20, సక్రమంగా మెనూ అమలు చేస్తే 10, పీ–4 మోడల్ అమలుకు 6, హాస్టళ్లలో ఎటువంటి ఘటనలూ చోటుచేసుకోకపోతే 5, నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనానికి 5, పేరెంట్స్ మీటింగ్స్‌కు 4, వైద్య శిబిరాల ఏర్పాటుకు 4, రికార్డుల నిర్వహణ, సకాలంలో బిల్లుల అందజేతకు 4, విద్యార్థులతో నూతన ఆవిష్కరణలకు 4, విమర్శలు లేకుండా పనిచేసిన వార్డెన్‌లకు 2మార్కులు చొప్పున కేటాయించనున్నట్లు వివరించారు. ఆదరణ 3.0 పథకం అమల్లో మత్స్యకారులకు ప్రాధాన్యత ఇచ్చి ఆధునిక పరికరాలు అందజేస్తామని సవిత చెప్పారు.

# బీహెచ్‌ఈఎల్‌ను సందర్శించిన ఏపీజెన్‌కో ఎండీ

**లోయర్ సీలేరు, పోలవరం ప్రాజెక్టుల పరికరాల తయారీ పరిశీలన**

సాక్షి, అమరావతి: హరిద్వార్‌లోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ప్లాంట్‌ను ఇటీవల సందర్శించినట్లు ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధర్ బాబు మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని లోయర్ సీలేరు, పోలవరం ప్రాజెక్టుల కోసం రోటర్ బ్లేడ్ కాస్టింగ్, ఫోర్జింగ్ పరికరాలను భెల్ తయారు చేస్తోంది. ఆ పరికరాల తయారీ, మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. సీలేరు, పోలవరం ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేసి ప్రారంభించడం ద్వారా రాష్ట్ర విద్యుత్ రంగం మరింత బలపడుతుందని ఆయన అన్నారు. 210 మెగావాట్ల నుంచి 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్ల వరకు టర్బైన్లు, జనరేటర్ల తయారీపై సమీక్షించారు. ఏపీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వచ్చిన 800 మెగావాట్ల జనరేటర్ రోటర్లు, హెచ్‌పీ/ఐపీ టర్బైన్ల ప్రధాన మరమ్మతు పనులను యూనిట్‌లో పరిశీలించారు. ఈ పర్యటనలో బెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజన్ కుమార్ పాల్గొన్నారు.

సాగుబడి

మఖ కార్తె: ఆగస్ట్ 30 వరకు



# దేశీ వరి @ జీఐ

మన దేశంలో 23 దేశీ వంగడాలకు జీఐ గుర్తింపు!

పది వేల సంవత్సరాల నాటి సుసంపన్న వ్యవసాయ వారసత్వ సంపద గల ప్రపంచ జీవవైవిధ్య కేంద్రాల్లో ఒక ముఖ్యమైనది భారతదేశం. ఈ అపురూప పాత పంటలకు అవి పుట్టి పెరిగిన స్థానిక ప్రాంతంతో అవినాభావ సంబంధం ఉంటుంది. అక్కడి వాతావరణం, నేలల స్వభావం, ప్రజల ప్రాధాన్యతలు.. వీటన్నిటితో కూడిన ప్రత్యేక రుచి, రంగు, వాసన, పోషకాలు, ఔషధ గుణాలతో ఈ స్థానికత ముడిపడి ఉంటుంది. అటువంటి అద్భుతమైన దేశీ వరి వంగడాలను అనాదిగా ఏటేటా సాగు చేస్తూ, వాటిని పరిరక్షిస్తూ వస్తున్నది రైతులు, ఆదివాసులు. కొత్త వంగడాలు వెల్లువైన ఈ ఆధునిక కాలంలో వీటిని కాలగర్భంలో కలసిపోకుండా కాపాడుకునే పని కూడా పాత పంటల విలువ తెలిసిన వీరే తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. ఇటువంటి పాత పంటలను కాపాడుకోవటానికి ఒకానొక మార్గం వాటికి స్థానికతను ఆధారసహితంగా నిరూపించి తగిన చట్టపరమైన గుర్తింపు ఇవ్వటం. దాన్నే జాగ్రఫికల్ ఇండికేషన్(జీఐ) అంటాం. జీఐకి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని గత వారం ఇదే సాగుబడి ప్లస్ పేజీలో చదువుకున్నాం. ఈ రోజు మన దేశంలో జీఐ గుర్తింపు పొందిన కొన్ని వారసత్వ దేశీ వరి రకాల విశిష్టతల గురించి తెలుసుకుందాం. ఈ విశిష్టమైన దేశీ వరి వంగడాల ఔషధ గుణాలు, పోషకాలు సమృద్ధిగా మనం పొందుకోవాలంటే రసాయన రహిత పద్ధతుల్లో సాగు చెయ్యటం తప్పని సరి!

దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పాత వరి రకాల ప్రత్యేకతను మరింతగా రక్షించడానికి, ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం మరిన్ని వరి రకాలకు జీఐ గుర్తింపు ఇవ్వటానికి ప్రయత్నిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయ సమాజపు పురాతన సాంప్రదాయ విజ్ఞానాన్ని కాపాడటం, ప్రపంచ వ్యవసాయ రంగంలో భారత్ స్థానాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

1. **పొక్కలి:** జీఐ ట్యాగ్ పొందిన మొట్టమొదటి ఆసియా వరి రకం. కేరళ తీరప్రాంత జిల్లాల్లో నీటితో ఎక్కువ కాలం నిండి ఉండే చిత్తడి ప్రాంత పొలాల్లో పెరిగే సామర్థ్యం పొక్కలి రకానికి ఉంది. సేంద్రియ పద్ధతుల్లో దీన్ని సాగు చేస్తున్నారు.

2. **బాస్మతి:** పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతులు విస్తృతంగా పండిస్తున్న బాస్మతి వరి బియ్యాన్ని దేశ విదేశాల్లో ప్రజలు ఇష్టపడి తింటుంటారు. జీఐ ట్యాగ్ పొందిన వరి రకాల్లో ఎక్కువ ప్రజాదరణకు నోచుకుంటున్నది బాస్మతి మాత్రమే అని చెప్పొచ్చు. సుగంధం వెదజల్లే పొడవైన గింజ కలిగిన బియ్యం. వండినప్పుడు దాని సువాసన, పొడవాటి మెత్తటి ఆకృతికి ప్రసిద్ధి చెందింది.

3. **కాలానమక్:** 'బుద్ధ బియ్యం' అని కూడా దీనికి మరో పేరుంది. ఈ పురాతన, సుగంధ రకం పుట్టిల్లు ఉత్తరప్రదేశ్. దీన్ని శతాబ్దాలుగా హిమాలయ తారై ప్రాంతంలో సాగు చేస్తున్నారనే నమ్మిక ఉంది. దీని ప్రత్యేక సువాసన బుద్ధుని బహుమతిగా చెబుతారు.

4. **గోవింద్‌భోగ్:** పశ్చిమ బెంగాల్‌కు చెందిన అద్భుత వరి రకం. చిన్న గింజ. మీగడ–తీపి సుగంధ బియ్యం. ఖరీఫ్ సీజన్‌లో పండిస్తారు. దీన్ని సాంప్రదాయకంగా శ్రీకృష్ణుడికి నైవేద్యం కోసం ఈ బియ్యాన్ని వాడతారు.

5. **జోహా:** అస్సాంలో, ముఖ్యంగా గారో హిల్స్‌లో, పండించే జోహా బియ్యం తీపి వాసనకు, రుచికి, మృదువైన ఆకృతికి ప్రసిద్ధి. ఇందులో అమైనో ఆమ్లాలు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి.

6. **చక్-హావో:** మణిపూర్‌కు చెందిన సువాసనతో కూడిన నల్ల బియ్యం. జిగటగా ఉంటాయి. వండినప్పుడు ఊదా రంగులోకి మారతాయి. ఇది గ్లూటెన్, విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజాలతో సమృద్ధమై ఉంటుంది. మణిపురి ఇళ్లలో చక్-హావో బియ్యానికి లభించే సాంస్కృతిక ప్రాముఖ్యత దాని విశిష్టతను చాటుతుంది.

7. **నవర:** కేరళకు చెందిన ప్రసిద్ధినొందిన సాంప్రదాయ వరి రకం. ఔషధ గుణాల పుట్ట. వండుకొని తినటంతో పాటు ఆయుర్వేద చికిత్సలలోనూ దీన్ని ఉపయోగిస్తున్నారు.

8. **వయనాడ్ జీరకశాల, వయనాడ్ గంధకశాల:** ఇవి కేరళలోని వయనాడ్ ప్రాంతం నుంచి వచ్చిన రెండు విభిన్న బియ్యం రకాలు. ప్రత్యేకమైన వాసన, రుచికి ప్రసిద్ధి చెందాయి.



9. **పాలక్కడన్ మట్ట:** 'రోజ్ మట్ట' బియ్యం అని కూడా పిలుస్తారు. కేరళలోని పాలక్కడ్ ప్రాంతంలో పండిస్తారు. ఈ బియ్యానికి ఉండే ఒక రకమైన 'మట్టి రుచి' ప్రత్యేకమైనది. అలాగే, దాని పోషకాలతో పాటు అధిక పీచు పదార్థం వల్ల ప్రసిద్ధి చెందింది.

10. **అంబెమోహర్:** మహారాష్ట్రలో పుట్టిన ఈ చిన్న బియ్యపు గింజలకు విలక్షణమైన మామిడి పువ్వుల మాదిరి సువాసన ఉంటుంది. సున్నితమైన ఆకృతి కూడా ఆకట్టుకుంటుంది.

11. **అజరా ఘన్సాల్:** మహారాష్ట్రలో, ముఖ్యంగా అజరా జిల్లాలో, పండించే ఈ బియ్యం దాని తీపి వాసన, ప్రత్యేకమైన రుచికి ప్రసిద్ధి చెందాయి. సువాసన, అందమైన సన్నని తనానికి సూచికగా దీనికి 'ఘన్సాల్' అని పేరొచ్చింది.

12. **కతర్ని:** బీహార్‌కు చెందిన కతర్ని ధాన్యపు గింజ చాలా చిన్నది. వండిన అన్నం రుచి, వాసన ప్రత్యేకమైనవి. తీపి, మృదుత్వం, సువాసనతో కూడిన కతర్ని చెయురా (అటుకుల)కు కూడా ప్రసిద్ధి చెందింది.

13. **తులైపంజి:** పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరొక సుగంధ బియ్యం రకం తులైపంజి. జిగట లేని, ప్రకాశవంతమైన, సన్నని ధాన్యపు రకం ఇది. చాలా కాలం పాటు సువాసనను నిలుపుకుంటుంది.

14. **కైపాడ్:** కేరళకు చెందిన మరో వరి రకం. తీర ప్రాంతాల్లో ఉప్పునీటితో పండించడానికి అనుగుణంగా ఉండే రకం ఇది.

15. **బాలాఘాట్ చిన్నోర్:** మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ రకానికి జీఐ గుర్తింపు ఉంది.

16. **జీరాఫూల్:** ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుగంధ బియ్యపు రకం.

17. **బోకా చౌల్:** ఒక విలక్షణమైన అస్సాం వరి రకం. దీన్ని ఉడికించకుండానే నీటిలో నానబెట్టి తినవచ్చు. వేడి నీటిలో ఉడికిస్తే వెంటనే, చల్ల నీటిలో నానబెడితే కొంచెం ఆలస్యంగా తినటానికి సిద్ధమవుతుంది.

18. **అండమాన్ కరెన్ ముస్లీ:** అండమాన్, నికోబార్ దీవులకు చెందిన ఈ వరి రకానికి ఇటీవలే జీఐ ట్యాగ్ పొందింది.

19. **కోరాపుట్ కలజీర:** ఇటీవలే జీఐ ట్యాగ్ పొందిన ఒడిశా సుగంధ వరి రకం.

20. **కలోనునియా:** ఇటీవలే జీఐ ట్యాగ్ పొందిన పశ్చిమ బెంగాల్ సుగంధ వరి రకం.

21. **మార్చా బియ్యం :** బీహార్‌కు చెందిన సుగంధ వరి రకం. ఇటీవలే జీఐ ట్యాగ్ పొందింది.

22. **ఉత్తరాఖండ్ లాల్ చావల్:** ఉత్తరాఖండ్‌కు చెందిన ఎర్ర బియ్యపు గింజ రకం.

23. **ఆదమ్చిని:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన చిన్న గింజ సుగంధ వరి రకం ఇది.

## దేశీ వరి రకాల్లో ఔషధ గుణాలు!

మైసూరులో సేవ్ అవర్ రైస్, సహజ సమృద్ధ తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన దేశీ వరి మేళాలో ఔషధ విలువలున్న చాలా రకాల బియ్యం రకాలను ప్రదర్శించారు. బియ్యాన్ని, విత్తనాలను కూడా విక్రయించారు. వారు చెప్పిన ఔషధ గుణాలు ఇవి...

| | |
|---|---|
| దయానా | తీవ్రమైన మధుమేహం ఉన్న వారికి ఉపయోగకరం. |
| నవర | 'ఇండియన్ వయాగ్రా'. నపుంసకత్వాన్ని అధిగమించడంలో సహాయపడుతుంది. |
| మాపిళ్లై సాంబా | శక్తిని పెంచే గుణం కలిగినది. కొత్త అల్లుళ్లకు తినిపించే ప్రత్యేక రకం బియ్యం. |
| గంధసాలే | బిర్యానీ, పులావు కోసం సువాసనగల బియ్యం. |
| సిద్ధసన్న | రోజువారీగా అన్నం వండుకొని తినటానికి అనుకూలం. |
| దొడ్డా బైరా నెల్లు | పెరుగ అన్నానికి ఈ బియ్యం బాగుంటాయి. కజ్జాయ (తీపి వడలు), దోసెలు, ఇడ్లీకు అనువైన రకం. |
| రాజముడి | రోజువారీ భోజనం కోసం బాగుంటాయి. |
| దొడ్డిగా | బియ్యపు పిండితో రొట్టె, పెరుగు అన్నం చేసుకోవటానికి ఉత్తమమైనది. |
| బర్మా బ్లాక్ | పాయసానికి అనువైన సుగంధ వరి రకం. |

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

## పొలాల్లో మురుగు కాలువలు ముఖ్యం

- భారీవర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుండి మురుగు నీటిని వీలైనంత వరకు త్వరగా పొలం నుండి తీసివేయాలి.
- వచ్చే ఐదు రోజుల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, అనేక చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఆరుతడి పంటల్లో ఆఖరి అంతర కృషి తరువాత ప్రతీ 2 మీటర్లకు ఒక గొడ్డు చాలు వేసుకోవాలి.
- నీటి ముంపునకు గురైన వర్షాధార పంటల్లో వర్షాలు ఆగిన తరువాత వీలైనంత త్వరగా అంతర కృషి చేసుకోవాలి.

## పశువులు జాగ్రత్త

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కోళ్లలో కొక్కెర తెగులు సోకటానికి అనుకూలం. వీటి నివారణకు, టీకాలు వేయించాలి.
- గొర్రెల్లో చిటుకు, పీపీఆర్ సోకే వీలుంది
- ఆవులు, గేదేల్లో గొంతువాపు వ్యాధి సోకడానికి అనుకూలం. టీకాలు వేయించాలి
- గొర్రెల్లో నట్టల నివారణకు డీవార్మింగ్ చెయ్యాలి.



# అతి భారీ వర్షాలతో జాగ్రత్త!

రాష్ట్ర రైతాంగానికి వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

తేది: 20.08.2025 (బుధవారం) నుండి 24.08.2025 (ఆదివారం) వరకు

ఈ నెల 20 నుంచి 24 తేదీల మధ్యకాలంలో తెలంగాణలోని రెండు జిల్లాల్లో అతి భారీ వర్షాలు, ఆరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాజేంద్రనగర్‌లోని పీజేటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ వాతావరణ పరిశోధన విభాగం అధిపతి డాక్టర్ పి.లీలా రాణి తెలిపారు. బుధవారం నుంచి వచ్చే ఆదివారం వరకు ఉపయోగపడే వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను రైతాంగానికి ఆమె సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటికుంటలకు దూరంగా ఉండాలి. అదేవిధంగా రైతులు చెట్ల కింద నిలబడ కూడదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదని ఆమె సూచిస్తున్నారు.

**గత మూడు రోజుల వాతావరణం:**
గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో కొన్ని చోట్ల భారీ, అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, అనేక చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 31 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయి.

**వచ్చే ఐదు రోజుల వాతావరణ విశ్లేషణ:**
హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం. 20, 21 తేదీల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. 21 నుంచి 24వ తేదీ ఉదయం వరకు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 24 నుంచి 34 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

**అత్యంత భారీ వర్షాల హెచ్చరిక:**
**20వ తేదీ:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు తెలంగాణ అన్ని జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది.

**21వ తేదీ:** జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.
ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులు (గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది.

**22వ తేదీ:** ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలలో అక్కడక్కడా కురిసే అవకాశం ఉంది.

**23వ తేదీ:** ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది.

**24వ తేదీ:** ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా కురిసే అవకాశం ఉంది.

# భారత కంపెనీలపై టారిఫ్‌ల ప్రభావం అంతంతే!

- వాణిజ్య ఒప్పందం కుదిరితే సానుకూలం
- ఫిచ్ రేటింగ్స్ అంచనా
- దీర్ఘకాలానికి ఢోకా లేదన్న ఎస్అండ్‌పీ




న్యూఢిల్లీ: యూఎస్ టారిఫ్‌లతో భారత కార్పొరేట్ కంపెనీలకు ప్రత్యక్ష సంబంధం తక్కువేనని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. కాకపోతే ప్రస్తుతం మినహాయింపు పరిధిలో ఉన్న ఫార్మాస్యూటికల్స్, తదితర రంగాలపై భవిష్యత్తులో ఆ వెసులుబాటు తొలగిస్తే ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. భారత ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లను ప్రస్తుతం యూఎస్ అమలు చేస్తోంది. ఈ నెల 27 నుంచి మరో 25 శాతం టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు మాత్రం మినహాయింపులు ఉన్నాయి. 50 శాతంతో ఆసియాలో భారత్‌పైనే అధిక టారిఫ్‌లు అమలు కానున్నట్టు ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే ఈ రిస్క్‌లు తగ్గుతాయని పేర్కొంది. రష్యా చమురును భారత ఆయిల్ కంపెనీలు 30–40 శాతం తక్కువ రేటుకు దిగుమతి చేసుకుంటుండడం వాటి లాభాలకు మద్దతుగా నిలుస్తున్నట్టు వివరించింది. భారత ఐటీ కంపెనీలపై టారిఫ్‌ల కారణంగా ప్రత్యక్ష ప్రభావం తక్కువేనని తెల్పింది. అలాగే, దేశీ మార్కెట్‌పై ప్రధానంగా ఆధారపడే ఆయిల్, గ్యాస్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఇంజనీరింగ్, నిర్మాణ రంగం, టెలికం, యుటిలిటీలపై ప్రభావం ఉండదని తెలిపింది. అమెరికా అధిక టారిఫ్‌లు అలాగే కొనసాగితే భారత వృద్ధి రేటు 2025–26లో 6.5 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేసింది.

**దీర్ఘకాలిక వృద్ధిని టారిఫ్‌లు అడ్డుకోవు**

భారత ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై యూఎస్ టారిఫ్‌లు ప్రభావం చూపించకపోవచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ మరోసారి పునరుద్ఘాటించింది. కొన్ని రోజుల క్రితం కూడా ఇదే విధమైన అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. భారత రేటింగ్‌ను సైతం బీబీబీ మైనస్ నుంచి బీబీబీ స్టెబుల్‌కు అప్‌గ్రేడ్ కూడా చేసింది. ''రానున్న కాలంలో వృద్ధి అవకాశాలు బలోపేతం అవుతాయి. వృద్ధి సగటు 6.8 శాతానికి చేరుతుంది. మౌలిక సదుపాయాలు, అనుసంధానత పెరిగితే, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలకు ఉన్న అవరోధాలు తొలగిపోతాయి. దీంతో భారత్ దీర్ఘకాలిక వృద్ధి మరింత బలపడుతుంది''అని ఎస్అండ్‌పీ తన తాజా నివేదికలో వివరించింది. భారత్ ప్రపంచంలో అత్యుత్తమ పనితీరు చూపిస్తున్న ఆర్థిక వ్యవస్థలో ఒకటని పేర్కొంది. గత 3–4 ఏళ్లలో ప్రాంతీయంగా ఇతర దేశాలతో పోల్చి చూస్తే భారత్ మెరుగైన వృద్ధిని నమోదు చేసినట్టు గుర్తు చేసింది. భారత వృద్ధిలో 85 శాతం దేశీయ అంశాలపైనే ఆధారపడి ఉంటుందని, ఎగుమతుల రూపంలో సమకూరేది 15 శాతమేనని తెలిపింది. స్వీయ వినియోగంపై అధికంగా ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ కావడం సానుకూల అంశంగా పేర్కొంది. స్వల్పకాలంలో వ్యాపార విశ్వాసంపై ప్రభావం పడినప్పటికీ సానుకూల వృద్ధి పథం, సానుకూల వ్యాపార వాతావరణం అన్నవి.. మధ్య కాలం, దీర్ఘకాలంలో వృద్ధిని నిర్ణయిస్తాయని అభిప్రాయపడింది. ''భారత జీడీపీలో అమెరికా ఎగుమతుల పాత్ర ఒక శాతమే. టారిఫ్‌లు అధికంగా విధించినప్పటికీ దీర్ఘకాలంలో వృద్ధి అవకాశాలను ప్రభావితం చేస్తాయని అనుకోవడం లేదు''అని వివరించింది.

## క్యూ1 జీడీపీ 6.7 శాతం

- రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా
- మద్దతుగా అధిక మూలధన వ్యయాలు




న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్/క్యూ1) 6.7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.5 శాతంగా ఉంది. ప్రభుత్వం వైపు నుంచి అధిక మూలధన వ్యయాలు, ఎగుమతులు వృద్ధి రేటుకి మద్దతుగా నిలుస్తాయని ఇక్రా తెలిపింది. జూన్ త్రైమాసికానికి జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనా. క్యూ1 జీడీపీ గణాంకాలు ఈ నెల 29న విడుదల కానున్నాయి. ''ప్రభుత్వం వైపు నుంచి బలమైన మూలధన, రెవెన్యూ వ్యయాలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాలకు ఎగుమతులు పుంజుకున్నాయి. వినియోగం పుంజుకుంటుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో క్యూ1లో ఆర్థిక వృద్ధి 6.7 శాతానికి చేరుకోవచ్చు''అని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితినాయర్ పేర్కొన్నారు. ఎగుమతులు, ప్రైవేటు మూలధన వ్యయాలపై టారిఫ్‌ల పరమైన అనిశ్చితులు కొనసాగుతుండడంతో తదుపరి త్రైమాసికాల్లో వృద్ధి రేటు నిదానించే అవకాశం లేకపోలేదని ఇక్రా పేర్కొంది. క్యూ1లో కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయాలు 52 శాతం పెరిగి రూ.2.8 లక్షల కోట్లుగా ఉంటే, రూ.5.8 లక్షల కోట్లకు సంబంధించి కొత్త ప్రాజెక్టులను ప్రకటించడాన్ని ఇక్రా గుర్తు చేసింది.

## ఎయిరిండియా ఐవోసీ హరిత ఇంధనం



న్యూఢిల్లీ: విమానయాన దిగ్గజం ఎయిరిండియాకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) పర్యావరణహిత ఏవియేషన్ ఇంధనం (ఎస్ఏఎఫ్) సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. వాడేసిన వంట నూనె నుంచి ఎస్ఏఎఫ్ ఉత్పత్తి ఈ ఏడాది డిసెంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు ఐవోసీ చైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ తెలిపారు. పానిపట్‌లోని రిఫైనరీలో ఏటా 35,000 టన్నుల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయనున్నట్లు వివరించారు. ఐటీసీ, హల్దీరామ్స్ లాంటి హోటళ్లు, రెస్టారెంట్ చెయిన్స్ నుంచి నూనెను సమీకరించనున్నట్లు పేర్కొన్నారు. విమాన రవాణా వల్ల వచ్చే ఉద్గారాలను తగ్గించేందుకు పెట్రోలియయేతర ముడివనరుల నుంచి ప్రత్యామ్నాయ ఇంధనమైన ఎస్ఏఎఫ్‌ను తయారు చేస్తారు. లభ్యతను బట్టి సాధారణంగా వినియోగించే విమాన ఇంధనం (ఏటీఎఫ్)లో 50 శాతం వరకు దీన్ని కలపవచ్చు.

## అల్ట్రాటెక్ 200 ఎంటీపీఏ సామర్థ్యం

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే అధిగమిస్తాం
- కంపెనీ చైర్మన్ కుమార మంగళం బిర్లా



న్యూఢిల్లీ: అల్ట్రాటెక్ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 200 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి (ఎంటీపీఏ) సామర్థ్యాన్ని అధిగమిస్తుందని కంపెనీ చైర్మన్ కుమార మంగళం బిర్లా ప్రకటించారు. దీంతో చైనా వెలుపల ప్రపంచంలోనే అతిపెద్ద సిమెంట్ విక్రయ కంపెనీగా అవతరిస్తుందన్నారు. కంపెనీ వార్షిక సమావేశంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో జీడీపీ 7.4 వృద్ధి రేటు సాధించడం వెనుక నిర్మాణరంగం, తయారీ రంగం కీలక పాత్ర ఉన్నట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ 6.5 శాతం వృద్ధి రేటుతో ప్రపంచంలో వేగంగా ప్రగతి సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్నట్టు గుర్తు చేశారు. ఇక ముందూ బలమైన వృద్ధిని కొనసాగిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇందులో 16.3 ఎంటీపీఏ సామర్థ్యాన్ని సొంతంగా ఏర్పాటు చేసుకోగా, ఇండియా సిమెంట్స్, కేశోరామ్ సిమెంట్స్ కొనుగోళ్ల రూపంలో 26.3 ఎంటీపీఏ సామర్థ్యం సమకూర్చుకున్నట్టు కుమార మంగళం బిర్లా తెలిపారు. దీంతో 2025 మార్చి నాటికి మొత్తం సామర్థ్యం 188.8 ఎంటీపీఏకు చేరుకున్నట్టు చెప్పారు. ఇక ఈ ఏడాది జూన్ క్వార్టర్‌లో 3.5 ఎంటీపీఏ గ్రే సిమెంట్ సామర్థ్యం తోడు కావడంతో ఇది 192.26 ఎంటీపీఏకు చేరుకున్నట్టు తెలిపారు.

**నిర్మాణ రంగం నుంచి డిమాండ్**

గతిశక్తి తదితర మౌలిక రంగ ప్రాజెక్టులు, ఇళ్ల పథకాలకు ప్రభుత్వం అధిక కేటాయింపులు చేస్తుండడంతో నిర్మాణ రంగం బలమైన పనితీరు చూపించనున్నట్టు కుమార మంగళం తెలిపారు. ప్రస్తుతం కంపెనీ నిర్వహణలో 34 ఇంటిగ్రేటెడ్ యూనిట్లు, 30 గ్రైండింగ్ యూనిట్లు, 9 బల్క్ టెర్మినళ్లు ఉన్నాయని వివరిస్తూ.. ఈ స్థాయి సామర్థ్యంతో దేశ డిమాండ్ అవసరాలను తీర్చగలమని చెప్పారు.

## మొబైల్ ఫోన్లను 5% జీఎస్‌టీ శ్లాబ్‌లో చేర్చాలి

**కేంద్రానికి ఐసీఈఏ విజ్ఞప్తి**



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్లు, పరికరాలను, నిత్యావసర ఉత్పత్తుల కోసం ఉద్దేశించిన 5 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లో చేర్చాలని కేంద్రానికి ఇండియా సెల్యూలార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం అమలు చేస్తున్న 18 శాతం జీఎస్‌టీ తిరోగమన విధానమని పేర్కొంది. నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లను రెండింటికి తగ్గించేలా కేంద్రం ప్రతిపాదనలు చేసిన నేపథ్యంలో ఐసీఈఏ విజ్ఞప్తి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం మొబైల్ ఫోన్లనేవి విలాస వస్తువులుగా గాకుండా విద్య, వైద్యం, ఆర్థిక సమ్మిళితత్వం, గవర్నెన్స్‌కి సంబంధించి అత్యవసర డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలకంగా మారాయని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్రు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్ వ్యవస్థను 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలన్న లక్ష్యానికి అనుగుణంగా మొబైల్స్‌ను అయిదు శాతం జీఎస్‌టీలో చేర్చాలని కోరారు.

జీఎస్‌టీ ప్రవేశపెట్టడానికి ముందు చాలా రాష్ట్రాలు మొబైల్ ఫోన్లను నిత్యావసర ఉత్పత్తులుగా గుర్తించి, వాటిపై 5 శాతం వ్యాట్ (విలువ ఆధారిత పన్ను) మాత్రమే విధించాయని మహీంద్రూ చెప్పారు. అయితే, జీఎస్‌టీని ప్రవేశపెట్టాక, ముందు 12 శాతం శ్లాబ్‌లో ఉంచి ఆ తర్వాత 2020లో 18 శాతానికి మార్చారని, దీనితో అందుబాటు ధరల్లో మొబైల్స్ లభ్యతపైనా, అమ్మకాల పరిమాణంపైనా ప్రతికూల ప్రభావం పడిందని చెప్పారు. మొబైల్స్ వార్షిక వినియోగం 30 కోట్ల యూనిట్ల నుంచి 22 కోట్లకు తగ్గిపోయిందని వివరించారు. కాబట్టి వీటిని అయిదు శాతం శ్లాబ్‌లోకి చేర్చడాన్ని మినహాయింపుగా భావించరాదని, కరెక్షన్‌గా పరిగణించాలని మహీంద్రు చెప్పారు. 2015 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా రూ. 18,900 కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 5.45 లక్షల కోట్లకు చేరింది.

## రామ్‌కో సిమెంట్స్ లక్ష్యం.. రూ. 2,000 కోట్ల ఆదాయం

**హార్డ్ వర్కర్ బ్రాండ్ ఆవిష్కరణ**




చెన్నై: సిమెంట్ తయారీ దిగ్గజం రామ్‌కో సిమెంట్స్ వచ్చే 4–5 ఏళ్లలో రూ. 2,000 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు తోడ్పడేలా హార్డ్ వర్కర్ బ్రాండ్ పేరిట నిర్మాణ రంగంలో ఉపయోగించే 20 రసాయన ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఈ ఏడాది ఆఖరు నాటికి మొత్తం 100కు పైగా ప్రోడక్టులను ప్రవేశపెట్టనున్నట్లు రామ్‌కో గ్రూప్ డైరెక్టర్ అభినవ్ రాజా చెప్పారు. దేశీయంగా కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ మార్కెట్ రూ. 25,000 కోట్లుగా ఉండగా 2030 నాటికి రూ. 40,000 కోట్లకు చేరుతుందని అంచనాలు ఉన్నట్లు వివరించారు. మరోవైపు, గత ఆర్థిక సంవత్సరంలో రామ్కో గ్రూప్ మొత్తం ఆదాయం రూ. 8,500 కోట్లుగా ఉండగా, కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ విభాగం వాటా రూ. 210 కోట్లుగా నమోదైనట్లు రామ్కో సిమెంట్స్ సీఈవో ఏవీ ధర్మకృష్ణన్ తెలిపారు. వచ్చే నాలుగైదేళ్లలో గ్రూప్ ఆదాయం రూ. 14,000–15,000 కోట్లకు చేరినప్పుడు నిర్మాణ రంగ రసాయనాల విభాగం 10 రెట్లు వృద్ధి చెందుతుందని వివరించారు. ప్రస్తుతం తూర్పు, దక్షిణాది రాష్ట్రాల్లో లభిస్తున్న హార్డ్ వర్కర్ ఉత్పత్తులు వచ్చే 2–3 ఏళ్లలో దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు.

## సైయెంట్ డైరెక్టర్లుగా మదన్, రమేష్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ సైయెంట్ డైరెక్టర్లుగా డెలాయిట్ ఇండియా మాజీ చైర్మన్ పీఆర్ రమేష్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ మదన్ పిల్లుట్ల నియమితులయ్యారు.


మదన్ పిల్లుట్ల


పీఆర్ రమేష్

రమేష్‌కి సెబీ, ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ తదితర నియంత్రణ సంస్థలు, పరిశ్రమ వర్గాలతో కలిసి పని చేసిన సుదీర్ఘానుభవం ఉంది. ఆయన ప్రస్తుతం ఎయిరిండియా, సిప్లా తదితర సంస్థల బోర్డుల్లో కూడా ఉన్నారు. అటు మదన్ పిల్లుట్ల దాదాపు 22 ఏళ్ల పాటు లండన్ బిజినెస్ స్కూల్‌కి డిప్యూటీ డీన్‌గా, గవర్నింగ్ బాడీ సభ్యుడిగా పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు.

## జీఎస్‌టీ తగ్గింపు.. వినియోగానికి పుష్

- ఆదాయ నష్టం రూ.85,000 కోట్లు
- పెరిగే వినియోగం రూ.1.98 లక్షల కోట్లు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి




న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో రెండే పన్ను శ్లాబులతో కూడిన ప్రతిపాదిత సంస్కరణలతో ఆదాయ నష్టం ఏర్పడినప్పటికీ.. అంతిమంగా వినియోగానికి, జీడీపీకి ఊతమిస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగం అంచనా వేసింది. జీఎస్‌టీ 5, 12, 18, 28 శాతం శ్లాబులు ఉండగా.. 5, 18 శాతంతోపాటు లగ్జరీ, సిన్ (పొగాకు తదితర) గూడ్స్‌పై 40 శాతం పన్నును కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. దీనిపై మంత్రుల బృందం అధ్యయనం తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు. రేట్ల తగ్గింపు ఫలితంగా ఆదాయం రూ.85,000 కోట్లు తగ్గుతుందని, అదే సమయంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్లు పెరుగుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. అంతేకాదు జీడీపీ 0.6 శాతం పెరుగుతుందని పేర్కొంది. జీఎస్‌టీ ఆరంభంలో సగటు రేటు 14.4 శాతంగా ఉంటే, 2019 సెప్టెంబర్ నాటికి 11.6 శాతానికి తగ్గిందని.. అది ఇప్పుడు 9.5 శాతానికి దిగిరావచ్చని తెలిపింది. పెరిగే వినియోగం ద్రవ్యోల్బణాన్ని ఎగిసేలా చేయదని వివరించింది. నిత్యావసరాలైన ఆహారం, వస్త్రాలపై 12 శాతం రేటు కాస్తా 5 శాతానికి దిగొస్తుందని.. ఈ విభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం 10–15 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని తెలిపింది. సేవలకు సంబంధించి ద్రవ్యోల్బణం 5–10 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని అంచనా కట్టింది. దీంతో మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) 0.20–0.25 శాతం తగ్గుతుందని తెలిపింది.

**జీడీపీ 1.6 శాతం పెరగొచ్చు..**

బడ్జెట్‌లో కల్పించిన ఆదాయపన్ను ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుని చూస్తే మొత్తం మీద వినియోగం 5.31 లక్షల కోట్లు పెరుగుతుందని.. దీని ఫలితంగా జీడీపీ వృద్ధి 1.6 శాతం అధికమవుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది.

## టయోటా కామ్రీ నుంచి హైబ్రిడ్ ఎలక్ట్రిక్ స్ప్రింట్ ఎడిషన్


- ఎక్స్ షోరూం ధర రూ.48.50 లక్షలు
- హైబ్రిడ్ బ్యాటరీపై 8ఏళ్ల వారంటీ



బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్స్ తన ప్రీమియం హైబ్రిడ్ సెడాన్ క్రామీలో కొత్త హైబ్రిడ్ ఎలక్ట్రిక్ స్ప్రింట్ ఎడిషన్ ను విడుదల చేసింది. అయిదు స్పోర్టియర్ రంగుల్లో లభించే ఈ వేరియంట్ ఎక్స్–షోరూం ధర రూ.48.50 లక్షలుగా ఉంది. డ్యూయల్–టోన్ ఎక్స్‌టీరియర్, మ్యాట్ బ్లాక్ అప్‌గ్రేడ్, ప్రత్యేక స్పోర్ట్స్ కిట్‌లు ఈ ప్రీమియం సెడాన్‌కు అదనపు ఆకర్షణను తెచ్చిపెట్టాయి. ఇంటీరియర్‌లో కూడా అనేక మార్పులు చేశారు. అప్‌డేట్ చేసిన 8.0 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 7.0 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వైర్‌లెస్ ఛార్జర్, హెడ్స్–అప్ డిస్‌ప్లే డ్జస్టబుల్ డ్రైవర్ సీటు ఇందులో ఉన్నాయి. డ్యుయల్–జోన్ ఆటో క్లైమేట్ కంట్రోల్, పనోరమిక్ సన్‌రూఫ్ వంటివి ఉన్నాయి. టయోటా సేఫ్టీ సెన్స్ 3.0 అనే అడాస్ సూట్‌తో వస్తుంది. ప్రీ–కొలిషన్ సిస్టమ్, లేన్ ట్రేసింగ్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, ఆటోమేటిక్ హై బీమ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ సెడాన్‌లో 9 ఎయిర్‌బ్యాగ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్, 360–డిగ్రీ పనోరమిక్ వ్యూ మోనిటర్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. 2.5 లీటర్ డైనమిక్ ఫోర్స్ పెట్రోల్ ఇంజిన్‌తో పవర్ఫుల్ లిథియం–అయాన్ బ్యాటరీ సపోర్ట్‌తో వస్తుంది. ఈ–సీవీటీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో జత చేయబడిన ఈ ఇంజిన్ సుమారు 230 బీహెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. టయోటా అయిదవ తరం హైబ్రిడ్ టెక్నాలజీ కలిగిన ఈ కారు లీటర్‌కు 25.49 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. ఎకో, నార్మల్, స్పోర్ట్ అనే మూడు డ్రైవ్ మోడ్‌లు కూడా ఉన్నాయి. హైబ్రిడ్ బ్యాటరీపై ఎనిమిదేళ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వారంటీని అందిస్తోంది.

## ఈ కామర్స్, టెక్ స్టార్టప్‌లలో ఫ్రెషర్లకు అవకాశాలు

- 88 శాతం కంపెనీలు సానుకూలం
- టీమ్‌లీజ్ 'కెరీర్ అవుట్‌లుక్ నివేదిక' వెల్లడి



ముంబై: ఈ–కామర్స్, టెక్నాలజీ స్టార్టప్‌ల్లో ఫ్రెషర్లకు అవకాశాలు తలుపుతట్టనున్నాయి. ఈ ఏడాది ద్వితీయ ఆరు నెలల్లో (జూలై–డిసెంబర్/హెచ్‌2) ఫ్రెషర్లను అధికంగా నియమించుకునేందుకు కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నిర్వహించిన 'కెరీర్ అవుట్‌లుక్ రిపోర్ట్' సర్వేలో.. ఈ–కామర్స్, టెక్ స్టార్టప్‌ల్లో 88 శాతం కంపెనీలు నియామకాల ఉద్దేశ్యాన్ని వ్యక్తం చేశాయి. వీటి తర్వాత రిటైల్ రంగంలో 87 శాతం, తయారీ రంగంలో 82 శాతం కంపెనీలు నియామకాల పట్ల సానుకూల ధోరణితో ఉన్నాయి. యువ నిపుణులకు ఉన్న బలమైన డిమాండ్‌ను ఇది సూచిస్తున్నట్టు టీమ్‌లీజ్ తెలిపింది. ఈ కామర్స్, టెక్నాలజీ రంగాల్లో చురుకైన వృద్ధి ఫ్రెషర్లకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తున్నట్టు తన నివేదికలో పేర్కొంది. డిగ్రీ అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాలు పెరుగుతుండడం, ప్రత్యక్ష నైపుణ్య ఆధారిత అధ్యయన మార్గాల డిమాండ్‌ను తెలియజేస్తున్నట్టు టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకుడు, సీఈవో శంతను రూంజ్ తెలిపారు. వివిధ రంగాల్లోని 1,065 కంపెనీలను మే నుంచి జూలై మధ్య ప్రశ్నించి ఈ వివరాలను టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ విడుదల చేసింది. అయితే, ఫ్రెషర్ల నియామక ఉద్దేశ్యం కంపెనీల్లో బలంగానే ఉన్నప్పటికీ.. క్రితం ఏడాది ద్వితీయ ఆరు నెలల కాలంతో పోల్చి చూస్తే కాస్తంత తగ్గడం గమనార్హం. 2024 ద్వితీయ ఆరు నెలల్లో 74 శాతంగా ఉంటే, ఈ ఏడాది ద్వితీయ ఆరు నెలలకు ఇది 70 శాతంగా ఉంది. ఏఐ రాకతో మానవ వనరుల పునర్‌వ్యవస్థీకరణ, అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు, కీలక విభాగాల్లో అనుభవజ్ఞులైన నిపుణులను కాపాడుకోవడంపై కంపెనీలు దృష్టి పెట్టడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది.

**అధిక వృద్ధి రంగాల్లో అవకాశాలు**

అధిక వృద్ధిని నమోదు చేస్తున్న రంగాల్లో ఫ్రెషర్లకు అవకాశాలు బలంగానే ఉన్నట్టు టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక తెలిపింది. డిగ్రీ అప్రెంటిస్‌షిప్‌లకు తయారీలో 37 శాతం, ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాలో 29 శాతం, ఐటీలో 18 శాతం చొప్పున డిమాండ్ ఉన్నట్టు వెల్లడించింది. బెంగళూరులోని కంపెనీల్లో 37 శాతం, చెన్నైలో 30 శాతం, పుణెలో 26 శాతం చొప్పున కంపెనీలు అప్రెంటిస్‌షిప్‌ల నియామకాలకు సానుకూలంగా ఉన్నాయి. పెద్ద సంస్థలతో పోల్చి చూసినప్పుడు చిన్న కంపెనీలు ఫ్రెషర్ల నియామకంపై అధిక ఆసక్తితో ఉండడం గమనార్హం.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-8-2025

| | |
|---|---|
| విశాఖ | 520–00 |
| చిత్తూరు | 553–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 520–00 |
| విజయవాడ | 525–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 495–00 |
| వరంగల్ | 497–00 |
| రిటైల్ ధర | 5.55 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TATAMOTORS | 700.5 | 3.62 |
| ADANIPORTS | 1,370.00 | 3.22 |
| RELIANCE | 1,421.00 | 2.84 |
| HEROMOTOCO | 5,116.80 | 2.66 |
| BAJAJ-AUTO | 8,771.00 | 2.12 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| DRREDDY | 1,245.00 | -1.4 |
| CIPLA | 1,547.20 | -1.15 |
| HINDALCO | 706.8 | -1.03 |
| BAJAJFINSV | 1,973.90 | -0.98 |
| M&M | 3,357.00 | -0.77 |


### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,208 |
| ఎన్ఎస్ఈ | 87,635 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,28,860 |
| ఎఫ్ఐఐ | - 634 |
| డీఐఐ | + 2,261 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 61.76 | $ 62.70 |
| బ్రెంట్ | 65.81 | $ 66.60 |

సాక్షి ప్లస్
బుధవారం। 20-8-2025



# గుకేశ్‌కు ప్రజ్ఞానంద షాక్

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్ మాస్టర్ సంచలన ఫలితంతో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రజ్ఞానంద 36 ఎత్తుల్లో భారత్‌కే చెందిన క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌ను ఓడించాడు. ఈ ఫలితంతో ప్రజ్ఞానంద ప్రపంచ చెస్ లైవ్ రేటింగ్స్‌లో మూడో స్థానానికి చేరుకోవడం విశేషం. క్వీన్స్ గాంబిట్ పద్ధతిలో మొదలైన ఈ గేమ్‌లో ప్రజ్ఞానంద ఎత్తులకు సమాధానం ఇచ్చేందుకు గుకేశ్ తీవ్రంగా ఆలోచించాల్సి వచ్చింది. ఒకదశలో సమయాభావంవల్ల గుకేశ్ దీటైన ఎత్తులు వేయలేకపోయాడు. చివరకు 36 ఎత్తులు ముగిశాక గుకేశ్ ఓటమిని అంగీకరించాడు. 10 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. మరోవైపు లెవోన్ అరోనియన్ (అమెరికా) 41 ఎత్తుల్లో నొదిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందగా... సో వెస్లీ (అమెరికా)-సామ్ సెవియాన్ (అమెరికా) మధ్య గేమ్ 56 ఎత్తుల్లో... అలీరెజా ఫిరుజా (ఫ్రాన్స్)-మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్) గేమ్ 58 ఎత్తుల్లో... ఫాబియానో కరువానా (అమెరికా)-జాన్ క్రిస్టాఫ్ దూడా (పోలాండ్) గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి.



# సుమిత్‌కు రజత పతకం

సమోకోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల బోణీ కొట్టింది. పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ సుమిత్ మలిక్ ఫైనల్లో ఓడిపోయి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో సుమిత్ 5-8 పాయింట్ల తేడాతో రష్యాకు చెందిన మగోమెద్ ఒజ్దామిరోవ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. రష్యాకు చెందిన రెజ్లర్లు ఈ టోర్నీలో వ్యక్తిగత తటస్థ అథ్లెట్లుగా ఈ టోర్నీలో బరిలోకి దిగారు. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా క్రీడాకారులపై నిషేధం కొనసాగుతోంది. ఫలితంగా అంతర్జాతీయ టోర్నీల్లో ఆ దేశాల క్రీడాకారులు తటస్థ అథ్లెట్లుగా పోటీపడుతున్నారు. మరోవైపు భారత్‌కే చెందిన అమిత్‌కు (79 కేజీలు) నిరాశ ఎదురైంది. కాంస్య పతక బౌట్‌లో అమిత్ 6-9 పాయింట్ల తేడాతో దావిత్ టెచ్‌టెచెలాషివిలి (జార్జియా) చేతిలో ఓడిపోయాడు.

### ఫైనల్లో తపస్య, సృష్టి

మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. తపస్య (57 కేజీలు), సృష్టి (68 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం రజత పతకాలను గెల్చుకోనున్నారు. మంగళవారం జరిగిన సెమీఫైనల్స్‌లో తపస్య 4-3 పాయింట్ల తేడాతో సావాకా ఉచిదా (జపాన్)పై, సృష్టి 7-3 పాయింట్ల తేడాతో లౌరా కోలెర్ (జర్మనీ)పై విజయం సాధించారు. నేడు జరిగే ఫైనల్స్‌లో ఫెలిసిటాస్ దొమయెవా (నార్వే)తో తపస్య; రే హోషినో (జపాన్)తో సృష్టి తలపడతారు.

# పాకిస్తాన్ స్థానంలో బంగ్లాదేశ్

## ఆసియాకప్ హాకీ టోర్నీ షెడ్యూల్ విడుదల



రాజ్‌గిర్: ఈ నెల 29 నుంచి భారత్ వేదికగా జరగనున్న ఆసియాకప్ పురుషుల హాకీ టోర్నీలో... పాకిస్తాన్, ఒమన్ జట్ల స్థానాలను బంగ్లాదేశ్, కజకిస్తాన్ భర్తీ చేయనున్నాయి. టోర్నీకి సంబంధించిన 'డ్రా' మంగళవారం విడుదలైంది. పూల్ 'ఎ' నుంచి చైనా, జపాన్, కజకిస్తాన్‌తో కలిసి ఆతిథ్య భారత్ బరిలోకి దిగనుంది. పూల్ 'బి' నుంచి డిఫెండింగ్ చాంపియన్ కొరియా, మలేసియా, చైనీస్ తైపీ, బంగ్లాదేశ్ పోటీ పడనున్నాయి. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో మలేసియాతో బంగ్లాదేశ్ తలపడుతుంది. అనంతరం కొరియాతో చైనీస్ తైపీ, చైనాతో భారత్ మ్యాచ్‌లు ఆడనున్నాయి. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన రెండు జట్లు 'సూపర్-4' దశకు చేరుకోనున్నాయి. సెప్టెంబర్ 3 నుంచి 6 వరకు 'సూపర్-4' మ్యాచ్‌లు జరుగుతాయి. అందులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య సెప్టెంబర్ 7న ఫైనల్ నిర్వహించనున్నారు. ఇందులో విజేతగా నిలిచిన జట్టు... వచ్చే ఏడాది బెల్జియం-నెదర్లాండ్స్‌లో జరిగే ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించనుంది.

# పృథ్వీ షా సెంచరీ

చెన్నై: భారత ఆటగాడు పృథ్వీ షా (141 బంతుల్లో 111; 15 ఫోర్లు, 1 సిక్స్) బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్ అరంగేట్ర పోరులో సెంచరీతో రాణించాడు. ఈ టోర్నీలో మహారాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పృథ్వీ షా... ఛత్తీస్‌గఢ్‌తో మ్యాచ్‌లో 'శత'క్కొట్టాడు. ఛత్తీస్‌గఢ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ కాగా... అనంతరం మహారాష్ట్ర జట్టు 73 ఓవర్లలో 217 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ప్రారంభించిన పృథ్వీ షా సెంచరీతో ఒంటరి పోరాటం చేయగా... అతడికి సహచరుల నుంచి తోడ్పాటు లభించలేదు. రుతురాజ్ గైక్వాడ్ (1) విఫలమయ్యాడు. వికెట్ కీపర్ సౌరభ్ (50 నాటౌట్; 5 ఫోర్లు) అండతో పృథ్వీ షా జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఛత్తీస్‌గఢ్ ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది.



# కేశవ్ కమాల్

- ఐదు వికెట్లతో మెరిసిన స్పిన్నర్
- తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా గెలుపు
- రాణించిన మార్క్‌రమ్, బవుమా
- మార్ష్, హెడ్ పోరాటం వృథా



కెయిన్స్: ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా టి20 సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా జట్టు వన్డే సిరీస్‌లో గెలుపు బోణీ కొట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 98 పరుగుల తేడాతో గెలిచి 1-0తో ముందంజ వేసింది. ఎడంచేతి వాటం స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (5/33) తన వన్డే కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో దక్షిణాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ అనంతరం కంగారూ, సఫారీ జట్ల మధ్య ఇదే తొలి వన్డే కాగా... ఆ మ్యాచ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా జట్టు... ఇప్పుడు విజయంతో బదులు తీర్చుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (81 బంతుల్లో 82; 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65; 5 ఫోర్లు), మాథ్యూ బ్రీజ్కె (56 బంతుల్లో 57; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలు సాధించారు. రికెల్టన్ (33; 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. 40.5 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88; 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), ఆరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27; 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్... ఏడో వికెట్‌కు డ్వార్షుయ్ (52 బంతుల్లో 33; 3 ఫోర్లు)తో కలిసి 71 పరుగులు జోడించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేశవ్ మహరాజ్ (5/33) మాయాజాలానికి ఆసీస్ టాపార్డర్ పెవిలియన్‌కు వరుస కట్టింది. వన్డేల్లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన కేశవ్ వరుసగా... లబుషేన్, గ్రీన్, ఇన్‌గ్లిస్, కేరీ, హార్డీ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ఒక దశలో 60/0తో పటిష్ట స్థితిలో ఉన్న ఆసీస్ జట్టు... 29 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయి 89/6తో నిలిచింది. మార్ష్ పోరాడినా ఫలితం లేకపోయింది.

# బాబర్, రిజ్వాన్‌లకు 'డిమోషన్'




లాహోర్: ఇటీవలి కాలంలో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న పాకిస్తాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్, వన్డే కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్‌కు ఆ దేశ బోర్డు మరో షాక్ ఇచ్చింది. వచ్చే నెలలో జరగనున్న ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌కు ఈ ఇద్దరినీ ఎంపిక చేయని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)... తాజాగా సెంట్రల్ కాంట్రాక్టుల్లోనూ 'బి' కేటగిరీకి పరిమితం చేసింది. 2025-26 ఏడాదికి గానూ పీసీబీ మంగళవారం సెంట్రల్ కాంట్రాక్టుల జాబితాను విడుదల చేసింది. ఇందులో మొత్తం 30 మంది ప్లేయర్లకు అవకాశం కల్పించిన పీసీబీ... 'ఎ' కేటగిరీని ఖాళీగా వదిలేసింది. 'బి', 'సి', 'డి' కేటగిరీల్లో పదేసి మంది ప్లేయర్లతో జాబితా విడుదల చేసింది. 'ఈ కాంట్రాక్టులు ఈ ఏడాది జూలై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు వర్తిస్తాయి. ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా వీటిని కేటాయించాం. 'ఎ' కేటగిరీకి ఎవరూ ఎంపిక కాలేదు' అని పీసీబీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఒక్కో కేటగిరీకి ఎంత మొత్తం చెల్లిస్తున్న విషయాన్ని మాత్రం పీసీబీ వెల్లడించలేదు. గతేడాది టి20 ప్రపంచకప్‌తో పాటు... ఈ ఏడాది ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ, బంగ్లాదేశ్‌తో సిరీస్, వెస్టిండీస్‌తో సిరీస్‌లలో పెద్దగా ప్రభావం చూపని కారణంగా బాబర్, రిజ్వాన్‌ను 'ఎ' కేటగిరీ నుంచి 'బి'కి పరిమితం చేశారు. ఇక గతేడాది 'సి' కేటగిరీలో ఉన్న టి20 కెప్టెన్ ఆఘా సల్మాన్ తాజాగా 'బి' కేటగిరీలో చోటు దక్కించుకున్నాడు. సయీమ్ అయూబ్, హారీస్ రవూఫ్ కూడా ప్రమోషన్ దక్కించుకున్నారు. గతేడాది 27 మందికి సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కగా... ఈ సారి ఆ సంఖ్యను 30కి పెంచారు.

**పాకిస్తాన్ సెంట్రల్ కాంట్రాక్ట్ పొందిన ప్లేయర్లు:** 'బి' కేటగిరీ: అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్, హారీస్ రవూఫ్, హసన్ అలీ, రిజ్వాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ ఆఘా, షాదాబ్, షాహీన్ అఫ్రిది. 'సి' కేటగిరీ: షఫీక్, ఫహీమ్, హసన్ నవాజ్, మొహమ్మద్ హారిస్, మొహమ్మద్ నవాజ్, నసీమ్ షా, నోమన్ అలీ, సాహిబ్‌జాదా ఫర్హాన్, సాజిద్, సాద్ షకీల్. 'డి' కేటగిరీ: అహ్మద్, హుసేన్ తలత్, ఖుర్రమ్ షహజాద్, ఖుష్‌దిల్ షా, మొహమ్మద్ అబ్బాస్, అబ్బాస్ అఫ్రిది, వసీమ్, సల్మాన్ మీర్జా, షాన్ మసూద్, సూఫియాన్ ముఖీమ్.

# స్వియాటెక్ సాధించె...

## తొలిసారి సిన్సినాటి ఓపెన్ టైటిల్ నెగ్గిన పోలాండ్ స్టార్



సిన్సినాటి (ఒహాయో): ఎట్టకేలకు ఏడో ప్రయత్నంలో పోలాండ్ టెన్నిస్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో అనుకున్నది సాధించింది. గతంలో ఆరుసార్లు ఈ టోర్నీలో ఆడిన స్వియాటెక్ సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయింది. అయితే ఏడో ప్రయత్నంలో మాత్రం స్వియాటెక్ చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో స్వియాటెక్ 7-5, 6-4తో ప్రపంచ ఏడో ర్యాంకర్ జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై గెలిచింది. 1 గంట 49 నిమిషాలపాటు జరిగిన ఈ తుదిపోరులో స్వియాటెక్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. స్వియాటెక్ కెరీర్‌లో ఇది 24వ సింగిల్స్ టైటిల్‌కాగా... ఈ ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిల్ తర్వాత రెండోది. విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు 7,52,275 డాలర్ల (రూ. 6 కోట్ల 54 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు, రన్నరప్ పావోలినికి 3,91,600 డాలర్ల (రూ. 3 కోట్ల 40 లక్షలు ) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## విజేత అల్‌కరాజ్



సిన్సినాటి ఓపెన్ ఏటీపీ-1000 టోర్నీలో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)తో జరిగిన ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 5-0తో గెలిచాడు. తొలి సెట్‌లో 0-5తో వెనుకబడిన దశలో అనారోగ్యం కారణంగా సినెర్ మ్యాచ్ నుంచి వైదొలిగాడు. టైటిల్ నెగ్గిన అల్‌కరాజ్‌కు 11,24,380 డాలర్ల (రూ. 9 కోట్ల 78 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సినెర్‌కు 5,97,890 డాలర్ల (రూ. 5 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఓవరాల్‌గా ఈ ఏడాది అల్‌కరాజ్‌కిది ఆరో టైటిల్ కాగా, కెరీర్‌లో 22వది కావడం విశేషం.

# సెమీస్‌లో సారా ఎరాని-వావసోరి జోడీ



న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో మంగళవారం మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్ మొదలైంది. డిఫెండింగ్ చాంపియన్ జోడీ సారా ఎరాని-ఆండ్రియా వావసోరి (ఇటలీ) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ముందుగా తొలి రౌండ్‌లో ఎరాని-వావసోరి ద్వయం 4-2, 4-2తో రెండో సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్)-టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) జంటపై గెలుపొంది క్వార్టర్ ఫైనల్ చేరింది. ఆ వెంటనే జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఎరాని-వావసోరి జోడీ 4-1, 5-4 (7/5)తో ముకోవా (చెక్ రిపబ్లిక్)-రుబ్లెవ్ (రష్యా) జంటను ఓడించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను 4-1తో నెగ్గిన ఇటలీ జోడీ రెండో సెట్‌ను టైబ్రేక్‌లో దక్కించుకుంది. రెండో సెట్‌లో స్కోరు 4-4తో సమం కావడంతో టైబ్రేక్‌ను నిర్వహించారు. టైబ్రేక్‌లో ముందుగా ఏడు పాయింట్లు గెలిచిన ఎరాని-వావసోరి జంట విజయాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు స్వియాటెక్ (పోలాండ్)-కాస్పర్ రూడ్ (నార్వే) జోడీ కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్-రూడ్ జంట 4-1, 4-2తో కేటీ మెక్‌నాలీ (అమెరికా)-ముసెట్టి (ఇటలీ) జోడీపై గెలిచింది. అంతకుముందు తొలి రౌండ్‌లో స్వియాటెక్-రూడ్ 4-1, 4-2తోనే మాడిసన్ కీస్-ఫ్రాన్సిస్కో టియాఫో (అమెరికా)లపై... కేటీ మెక్‌లానీ-ముసెట్టి 5-3, 4-2తో ఒసాకా (జపాన్)-మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)లపై గెలిచారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ముకోవా-రుబ్లెవ్ 4-2, 5-4 (7/4)తో వీనస్ విలియమ్స్-రీలీ ఒపెల్కా (అమెరికా)లపై నెగ్గారు.

# మను గురికి రెండు కాంస్యాలు



షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత స్టార్ మనూ భాకర్ వ్యక్తిగత విభాగంతోపాటు టీమ్ విభాగంలో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో మను 219.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. మనూ భాకర్, సురుచి సింగ్, పలక్‌లతో కూడిన భారత జట్టు 1730 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. మను 583 పాయింట్లు, సురుచి 574 పాయింట్లు, పలక్ 573 పాయింట్లు సాధించారు. ఇదే వేదికపై జరుగుతున్న ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో రష్మిక 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. ఫైనల్లో రష్మిక 241.9 పాయింట్లు స్కోరు చేసింది. రష్మిక, వన్షిక, మోహిని సింగ్‌లతో కూడిన భారత జట్టు 1720 పాయింట్లతో పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

# శ్రీజ పరాజయం



మాల్మో (స్వీడన్): యూరోప్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. తెలంగాణ అమ్మాయి, భారత నంబర్‌వన్ ఆకుల శ్రీజ రెండో రౌండ్‌లో నిష్క్రమించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ శ్రీజ 9-11, 8-11, 11-6, 2-11తో ప్రపంచ 7వ ర్యాంకర్ జు యులింగ్ (మకావ్) చేతిలో ఓటమి పాలైంది. 27 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీజ మొత్తం 30 పాయింట్లు సాధించగా... అందులో తన సర్వీస్‌లో 13 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 17 పాయింట్లు సంపాదించింది. రెండో రౌండ్‌లో ఓడిన శ్రీజకు 6,000 డాలర్ల (రూ. 5 లక్షల 22 వేలు)తోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# బోపన్న జోడీ శుభారంభం



న్యూఢిల్లీ: విన్‌స్టన్-సాలెమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో భారత స్టార్ రోహన్ బోపన్న క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అమెరికాలోని నార్త్ కరోలినాలో ఈ టోర్నీ జరుగుతోంది. డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న (భారత్)-రొమైన్ అర్నియోడో (మొనాకో) ద్వయం 6-1, 6-1తో లూసియానో దర్దెరి (ఇటలీ)-అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. 42 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న-అర్నియోడో ఆరు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో క్వాలిఫయర్, ప్రపంచ 352వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ సురేశ్ (భారత్) పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సురేశ్ 3-6, 3-6తో ప్రపంచ 74వ ర్యాంకర్ మరియానో నవోని (అర్జెంటీనా) చేతిలో ఓటమి పాలయ్యాడు. సురేశ్‌కు 4,260 డాలర్ల (రూ. 3 లక్షల 70 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



హిమాచల్‌ప్రదేశ్‌లో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం కులు జిల్లాలోని లాగ్ లోయలో దెబ్బతిన్న ఇనుప వంతెన



హాంకాంగ్‌లో కౌలూన్ బేలోని రిచ్‌ల్యాండ్ గార్డెన్స్ ప్రాంతంలో చుట్టూ ఆకాశహర్మ్యాల మధ్యన ఉన్న టెన్నిస్ కోర్టు. డ్రోన్‌తో తీసిన ఫొటో.



దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతంలో ఉన్న మయూర్ విహార్ వాసుల తాత్కాలిక బస కోసం రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన టెంట్లివి

# అబాబిల్.. హీరోస్ ఆఫ్ కిష్త్వాడ్

**కిష్త్వాడ్:** జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వాడ్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ వల్ల చేసిన విధ్వంసం అందరికీ తెలిసిందే. ఒక్కసారిగా వచ్చిన వరదలతో పర్వతాల నుంచి భారీ బండరాళ్లు కొట్టుకొచ్చాయి. పెద్ద పెద్ద నికోఫర్ చెట్లు కూలిపోయాయి. ఇళ్లన్నీ మట్టి దిబ్బలతో కప్పుకుపోయాయి. ఒక స్పెషల్ పోలీసు ఆఫీసర్ సహా 60 మంది దుర్మరణం చెందారు. ఇప్పటికీ 80 మందికిపైగా జాడ దొరకడం లేదు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో అక్కడ మేమున్నాం అంటోంది 'అబాబిల్' గ్రూప్. చీనాబ్ లోయలో ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర సహాయం అందించడంలో ముందుంటుంది. ఈ బృందంలో 250 మంది వలంటీర్లు ఉన్నారు. వీళ్లందరినీ కలిపేది వాట్సాప్. ఆపద ఎలాంటిదైనా సరే.. చిన్న సందేశం దూరంలోనే ఉంటారు. ఒక్క మెసేజ్ పెడితే చాలు.. ప్రమాద స్థలానికి చేరుకుంటారు. వీరికి కులం, మతంతో సంబంధం లేదు. ఆపదలో ఉన్నవారిని కాపాడటమే లక్ష్యం. హిందూ–ముస్లిం విభజన రాజకీయాలను, విద్వేష మాటలను పక్కన పెట్టి.. పనుల ద్వారా తామేంటో నిరూపిస్తున్నారు. కిష్త్వాడ్ క్లౌడ్ బరస్ట్ వినగానే.. 45 మంది వలంటీర్లు, తొమ్మిది అంబులెన్స్‌లతో అక్కడికి చేరుకున్నారు. సైన్యంతోపాటు కలిసి పనిచేశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యల్లో పాల్గొన్నారు. శిథిలాలను తొలగించడంలో సాయపడ్డారు.

## ప్రమాదాలు సర్వసాధారణం..

'చీనాబ్ లోయలో కొండచరియలు విరిగిపడటం, మంటలు, ప్రమాదాలు సర్వసాధారణం. అధికారులు, సైన్యం, ఇతర సహాయక సిబ్బంది చేరుకోవడానికి సమయం పట్టొచ్చు. మేం స్థానికులు. ఆ ప్రాంతం గురించి బాగా తెలిసిన మనుషులం. వారు వచ్చేదాక ఆగకుండా ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు మా బృందం ఏర్పడింది. ఏదైనా ప్రకృతి వైపరీత్యం లేదా ప్రమాదం జరిగినప్పుడు.. ప్రతిస్పందించడానికి మేం ఎల్లప్పుడూ ముందుంటాం' అని చెబుతున్నారు. అబాబిల్ వలంటీర్ బుర్హాన్ మీర్. అబాబిల్ అరబిక్ పదం. ఇది పక్షుల సమూహాన్ని సూచిస్తుంది. మక్కాలోని కాబాను రక్షించిన పక్షులను వర్ణించడానికి ఇస్లామిక్ సంప్రదాయంలో దీనిని ప్రత్యేకంగా ఉపయోగిస్తారు.

# రాజకీయ వివాదాలను బయట పరిష్కరించుకోండి

## జార్ఖండ్ డీజీపీ నియామకంలో ధిక్కార పిటిషన్‌పై సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నియామకానికి సంబంధించిన ధిక్కార పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. రాజకీయ వివాదాలను పరిష్కరించడానికి కోర్టులను ఉపయోగించలేమని, వాటిని కోర్టు బయట పరిష్కరించుకోవాలని నొక్కి చెప్పింది. ధిక్కార పిటిషన్లను రాజకీయ ప్రత్యర్థులు దాఖలు చేసినట్లుగా కనిపిస్తోందని విచారణ ధర్మాసనానికి నాయకత్వం వహించిన భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకుడు బాబులాల్ మరాండి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించడానికి ఆయన నిరాకరించారు. 'మీ వివాదాలను ఓటర్ల ముందు పరిష్కరించుకోండి. కోర్టులను రాజకీయాల కోసం ఉపయోగించుకోవడాన్ని మేం అనుమతించలేం. రాజకీయ వివాదాలను పరిష్కరించడానికి ధిక్కార పిటిషన్‌లను వినియోగించుకోనివ్వం' అని స్పష్టం చేశారు. అధికారిని చట్టవిరుద్ధంగా నియమించారనిపిస్తే.. సంబంధిత వ్యక్తి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ) లేదా హైకోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం సూచించింది. డీజీపీ నియామకాల ప్రక్రియకు సంబంధించిన విస్తృత అంశంలో భాగంగా ఈ విచారణ జరిగింది. దీనిపై కోర్టు గతంలో వివరణాత్మక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు నిషేధాలు విధించినప్పటికీ, రాష్ట్రాలు తాత్కాలిక డీజీపీలను నియమించడం ద్వారా నిబంధనలను దాటవేస్తూనే ఉన్నాయని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. రాష్ట్రాలను ఉదహరిస్తూ ఎంపిక ప్రక్రియను సవరించాలని కోరారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ కనీసం ఏడు రాష్ట్రాలు ప్రస్తుతం యాక్టింగ్ డిజిపిలను కలిగి ఉన్నాయని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కూడా ఎత్తి చూపారు. మునుపటి ఆదేశాలను పాటించడాన్ని పర్యవేక్షించడానికి ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేయమని హైకోర్టులను కోరవచ్చని ధర్మాసనం సూచించింది.

# రష్యా వెళ్లిన జై శంకర్

**న్యూఢిల్లీ:** రష్యాలో మూడు రోజుల పర్యటనకు గాను మన విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం మాస్కోకు బయలుదేరారు. రష్యాతో కొనసాగుతున్న చిరకాల మైత్రిని మరింత దృఢతరం చేయడమే ఈ పర్యటన లక్ష్యమని విదేశాంగ శాఖ తెలిపింది. రష్యా నుంచి ముడి చమురు కొంటుందనే సాకుతో భారత్ ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్‌లను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు కొంతమేర దెబ్బతిన్న నేపథ్యంలో జై శంకర్ చేపట్టిన ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం జరిగే వాణిజ్య, ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక సహకార రష్యా–చైనా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ 26వ సెషన్‌కు ఆయన సహాధ్యక్షత వహిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమంలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రధానమంత్రి డెనిస్ మంతురోవ్ సహాధ్యక్షత వహిస్తారంది. వీరిద్దరూ ఈ ఏడాది చివర్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ చేపట్టే భారత పర్యటనకు అవసరమైన కార్యాచరణను రూపొందిస్తారని చెప్పారు. జై శంకర్ అనంతరం రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తోనూ భేటీ అవుతారు. రష్యా– ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం, అందుకు సంబంధించి ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన చర్యలపై వీరిద్దరూ చర్చలు జరుపుతారు. ఇతర ద్వైపాక్షిక అంశాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలనూ చర్చిస్తారు. ఇంధన రంగంలో రెండు దేశాల సంబంధాలు కూడా ప్రస్తావనకు వస్తాయని విదేశాంగ శాఖ తెలిపింది.

# కాంగోలో తిరుగుబాటుదార్ల ఘాతుకం


## 52 మంది పౌరుల ఊచకోత

**కిన్షాసా:** ఇస్లామిక్ ఉగ్ర సంస్థ ఐఎస్ అండతో చెలరేగుతున్న తిరుగుబాటుదార్లు కాంగోలో రక్తపాతం సృష్టిస్తున్నారు. ఈ నెలలో కనీసం 52 మందిని వారు పొట్టనబెట్టుకున్నారని అక్కడున్న ఐరాస శాంతి పరిరక్షక మిషన్(మొనుస్కో) తెలిపింది. ఈ దారుణానికి బాధ్యులంటూ కాంగో ఆర్మీ, రువాండా అండ ఉన్న ఎం23 రెబల్ గ్రూపు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ బురద చల్లుకుంటున్నాయి. ఈ రెండు పక్షాలు ఈ నెల 18వ తేదీన శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉండగా ఎలాంటి ముందడుగు పడలేదు. అల్లైడ్ డెమోక్రాటిక్ ఫోర్సెస్(ఏడీఎఫ్) రెబల్స్ ఈ నెల 9–16వ తేదీల మధ్యలో కివు ప్రావిన్స్‌లోని బెని, లుబెరో ప్రాంతాలపై వరుస దాడులకు దిగారని మొనుస్కో తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని పేర్కొంది. రెబల్స్ ఇళ్లను తగులబెట్టడం, వాహనాలతోపాటు ఇతర ఆస్తులను ధ్వంసం చేయడం, మహిళల్ని కిడ్నాప్ చేయడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ఖనిజ నిల్వలు పుష్కలంగా ఉండటంతో భూభాగం, వనరుల కోసం కాంగోలో సాయుధ ముఠాలు తరచూ హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నాయి. గత నెలలో ఇటురి ప్రావిన్స్‌లోని కొమాండ నగరంలోని చర్చిపై దాడి చేసిన రెబల్స్ మహిళలు, చిన్నారులు సహా 40 మందిని చంపారు.

# చర్చి తరలిపోతోందిలా..!

## స్వీడన్‌లో పురాతన చర్చి మరో చోట ఏర్పాటు

**కిరునా:** అందమైన ఓ పురాతన చర్చి అలా రోడ్డుపై మెల్లగా ముందుకు వెళ్తుందంటే చూసే ఎవరికైనా ఆశ్చర్యం కలగకమానదు. స్వీడన్ ప్రభుత్వం అటువంటి బృహత్ కార్యక్రమానికి నడుం బిగించింది. కిరునా నగరంలో 113 ఏళ్ల క్రితం కలపతో నిర్మించిన 'కిరునా కిర్కా'ను ఐదు కిలోమీటర్ల దూరంలో మరో చోట ఏర్పాటు చేయనుంది. నగరంలోని కొన్ని భవనాలతోపాటు ప్రజలకు సైతం పునరావాసం కల్పిస్తోంది. ఇదంతా ఆ నగరం చుట్టుపక్కలున్న ఇనుప ఖనిజం కోసం కావడం గమనార్హం.



### ఎంతో ఇష్టమైన నిర్మాణం

స్వీడన్ ప్రభుత్వ ఎల్‌కేఏబీ కంపెనీ కిరునా చుట్టుపక్కల ప్రాంతంలో ప్రపంచంలోనే అతిపెద్దదైన ఇనుప ఖనిజం గనిని నిర్వహిస్తోంది. కిరునాలో గని తవ్వకాలు 1910లో మొదలు పెట్టిన ఎల్‌కేఏబీ కంపెనీయే అక్కడి గుట్టపై 1912లో ఈ లూథరన్ చర్చిని పూర్తిగా కలపతో నిర్మించింది. స్వీడన్ వాసులకు ఇది ఎంతో ఇష్టమైంది కిరునా చర్చి. 2001లో ప్రభుత్వం చేపట్టిన ఓ సర్వేలో 1950కి ముందున్న వాటిలో అత్యుత్తమ కలప నిర్మాణంగా స్వీడన్ ప్రజలు కిరునా చర్చికి ఓటేశారు.

### నగరానికి పునరావాసం

లోతులో చేపడుతున్న గని తవ్వకాలతో ఇప్పటికే నగరంలోని కొన్ని ఇళ్లు, నిర్మాణాలు పగుళ్లు వచ్చాయి. ఖనిజం కోసం 1,365 మీటర్ల లోతులో తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నందున నివాసాలు, నిర్మాణాలకు ప్రమాదం ఉందని కంపెనీ అంచనా వేసింది. దీంతో, నగరాన్ని తరలించేందుకు 2004 నుంచే 30 ఏళ్ల ప్రణాళికను సిద్ధం చేసింది. నగరంలోని 3వేల ఇళ్లతోపాటు 6 వేల మందికి అక్కడికి 5 కిలోమీటర్ల దూరంలోని మరో ప్రాంతంలో పునరావాసం కల్పించింది. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ, వాణిజ్య నిర్మాణాలను కూల్చి వేశారు. సుమారు 25 భవనాలను పునాదుల నుంచి పైకి లేపి, ప్రత్యేక వాహనాల్లో కొత్త నగరంలోకి తరలించారు. అందమైన పురాతన కిరునా చర్చి సహా మరో 16 భవనాలను తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### భారీ ట్రాలర్‌పైన ఎర్రని చర్చి

సుమారు 40 మీటర్ల వెడల్పు, 672 మెట్రిక్ టన్నుల బరువైన కిరునా చర్చిని తరలించేందుకు ప్రత్యేకంగా ట్రయిలర్‌ను నిర్మించారు. దీనిపైకి ఎరుపు రంగులో ఉన్న చర్చి నిర్మాణాన్ని తరలించారు. ట్రాలీ ప్రయాణించే మార్గంలోని రోడ్డు వెడల్పును 9 మీటర్ల నుంచి ఏకంగా 24 మీటర్లకు పెంచారు. ఒక వంతెనను సైతం నేలమట్టం చేశారు. 12 గంటలు పట్టే చర్చి ప్రయాణం మంగళవారం మొదలై బుధవారంతో ముగియనుంది. మధ్యలో రెండుసార్లు మాత్రం టీ విరామం కోసం ఆపుతారు. గంటకు అర కిలోమీటర్ నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల వేగం వరకు ట్రాలీ ప్రయాణించనుంది. చర్చి తరలింపు సందర్భంగా కిరునాలో భారీ సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్వీడన్ రాజు కార్ల్ గుస్తావ్ సైతం హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. కొత్త నగరంలో 2026 చివరికల్లా ఈ చర్చిని తిరిగి తెరవనున్నారు. చర్చి తరలింపునకు అయ్యే ఖర్చు వివరాలను మాత్రం మైనింగ్ కంపెనీ వెల్లడించలేదు. యూరప్‌లో ఉత్పత్తయ్యే ఇనుప ఖనిజంలో 80 శాతం వరకు కిరునాలోనే ఎల్‌కేఏబీ తవ్వి తీస్తోంది. భవిష్యత్తులో దీనిని మరింతగా విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తోంది.

# ప్రేమించడం నేరమా?: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** ప్రేమించడం నేరం ఎలా అవుతుందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముస్లిం బాలికల కనీస పెళ్లి వయసుకు సంబంధించిన వ్యవహారంలో బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం తోసిపుచ్చింది. పంజాబ్‌లో 21 ఏళ్ల ముస్లిం యువకుడు, 16 ఏళ్ల ముస్లిం బాలిక ప్రేమ వివాహం చేసుకున్నారు. ముస్లిం పర్సనల్ లా ప్రకారం ఆ వివాహం చెల్లుతుందని పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఉత్తర్వు జారీ చేసింది. రజస్వల అయిన తర్వాత లేదా 15 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత ముస్లిం బాలిక పెళ్లి చేసుకోవచ్చని వెల్లడించింది. దీన్ని సవాల్ చేస్తూ ఎన్‌సీపీసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఉత్తర్వును వ్యతిరేకిస్తూ జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సైతం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.బి.నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. బాలిక, యువకుడి మధ్య అంగీకారంతోనే పెళ్లి జరిగిందని గుర్తుచేసింది. సమాజంలోని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపింది. బాలబాలికలు ఒకచోట కలిసి చదువుకుంటున్నప్పుడు వారి మధ్య ఆకర్షణ ఏర్పడడం సహజమేనని పేర్కొంది. వారి మధ్య ప్రేమను నేరంగా పరిగణించడం సరైంది కాదని తేల్చిచెప్పింది. ఎన్‌సీడబ్ల్యూ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది.

# పెండింగ్ బిల్లుల సంగతేమిటి?

- రాష్ట్రపతి రిఫరెన్స్‌పై విచారణ ప్రారంభించిన సుప్రీంకోర్టు
- చట్టప్రకారమే తమ నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ:** రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదించిన బిల్లులు గవర్నర్ల వద్ద సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంటున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. 2020 నుంచి తమిళనాడు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల సంగతి ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని, అటార్నీ జనరల్‌ను ప్రశ్నించింది. శాసనసభల్లో ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలియజేసే విషయంలో రాష్ట్రపతి/గవర్నర్లకు కోర్టులు నిర్దిష్ట గడువు విధించవచ్చా? కోర్టులకు ఆ అధికారం ఉందా? అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టుకు ఆమె సూచించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ ప్రారంభించింది. రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు విధింపుపై.. తమిళనాడు కేసులో ఏప్రిల్ 8న ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం కాకుండా, చట్టప్రకారమే తమ అభిప్రాయం వెల్లడిస్తామని పేర్కొంది. శాసనసభలు పంపించిన బిల్లులపై రాష్ట్రపతి/గవర్నర్లు మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రపతి రిఫరెన్స్‌పై నిర్ణయం తీసుకొనే విషయంలో తమకు సహకరించాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి సూచించింది. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు సమ్మతి పొందినట్లు పరిగణిస్తూ ఆదేశాలిచ్చేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద కోర్టులకు ప్లీనరీ అధికారం ఉండదని ఆర్.వెంకటరమణి స్పష్టంచేశారు. రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు నిర్దేశించే అధికారం కోర్టులకు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సైతం వాదనలు వినిపించారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయన్నారు. ఒక వ్యవస్థ అధికారాల్లో మరో వ్యవస్థ జోక్యం చేసుకోవడం చెల్లదన్నారు. మరోవైపు రాష్ట్రపతి ముర్ము అభ్యంతరాలపై ధర్మాసనం విచారణ చేపట్టడాన్ని తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు వ్యతిరేకించాయి. రెండు రాష్ట్రాల వాదనను ధర్మాసనం తిరస్కరించింది. రాష్ట్రపతి స్వయంగా చొరవ తీసుకొని, స్పష్టత కోరడంలో తప్పేముందని ప్రశ్నించింది. రాష్ట్రపతి రిఫరెన్స్‌పై బుధవారం సైతం సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగనున్నాయి.

# పోక్సో చట్టం.. అందరికీ సమానమే!

## స్త్రీ, పురుషులనే వివక్ష లేదు

- లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్ష అనుభవించాల్సిందే
- కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

**బెంగళూరు:** లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ(పోక్సో) చట్టం–2012 కేవలం బాలికలకే కాకుండా బాలురకు సైతం సమానంగా రక్షణ కల్పిస్తున్నట్లు కర్ణాటక హైకోర్టు స్పష్టంచేశారు. పురుషులతోపాటు మహిళలు సైతం లైంగిక నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, దోషులెవరైనా సరే ఈ చట్టం కింద శిక్ష అనుభవించాలని తేల్చిచెప్పింది. పోక్సో చట్టం పురుషులకు, మహిళలకు సమానంగా వర్తిస్తుందని తెలియజేసింది. కర్ణాటకలో 48 ఏళ్ల ఉపాధ్యాయురాలు తన ఇంటికి పొరుగున ఉండే 13 ఏళ్ల బాలుడిని లైంగికంగా వేధించినట్లు పోక్సో చట్టం కింద కేసు నమోదయ్యింది. తనపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ఇటీవల విచారణ చేపట్టారు. కేసు కొట్టివేసేందుకు నిరాకరించారు. పోక్సో చట్టం లింగ వివక్ష చూపదని పేర్కొన్నారు. నిందితులు పురుషులా? లేక మహిళలా? అనేది అనవసరమని, నేరం జరిగిందా? లేదా? అనేదే ముఖ్యమని ఉద్ఘాటించారు. పోక్సో చట్టానికి 2019లో చేసిన సవరణ ప్రకారం.. ఈ చట్టం లింగ పరంగా తటస్థంగా మారినట్లు తెలిపారు. ఈ చట్టంలోని సెక్షన్ కింద ఉన్న 'పర్సన్' అనే దానికి అర్థం పురుషులు మాత్రమే అని కాదని స్పష్టతనిచ్చారు. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలితే పురుషులైనా, మహిళలైనా శిక్షార్హులేనని న్యాయమూర్తి వివరించారు.

లైంగిక నేరాలను కేవలం పురుషులకే అంటగట్టలేమని జస్టిస్ నాగప్రసన్న తెలిపారు. 2007 నాటి ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. లైంగిక వేధింపులకు గురవుతున్నవారిలో 54.4 శాతం మంది బాలురు, 45.6 శాతం మంది బాలికలు ఉంటున్నారని వెల్లడించారు. ఐపీసీలోని అత్యాచార చట్టం తరహాలోనే పోక్సో చట్టంలోనూ పురుషులను మాత్రమే నిందితులుగా గుర్తించాలన్న నిందితురాలి తరఫు లాయర్ వాదనలను న్యాయమూర్తి తిరస్కరించారు. పోక్సో ప్రకారం 'లైంగిక వేధింపులు' అనే దానికి విస్తృతమైన అర్థం ఉందన్నారు. ఇది ఐపీసీలోని 'అత్యాచారం' లాంటిది కాదని చెప్పారు. 13 ఏళ్ల బాలుడు ఒక మహిళతో లైంగిక సంబంధం పెట్టుకోలేడని, అతడికి అంత సామర్థ్యం ఉండదన్న వాదనను కూడా న్యాయమూర్తి తిప్పికొట్టారు. బాధితుడికి కలిగిన మానసిక క్షోభ సంగతి ఏమిటని ప్రశ్నించారు. ఈ దర్యాప్తును ట్రయల్ కోర్టుకు అప్పగించారు. సాక్ష్యాధారాల ప్రకారం నిందితురాలిపై దర్యాప్తు కొనసాగించి, శిక్షించాలని ఆదేశించారు.

# కో పైలట్ బలవంతంగా టాయిలెట్‌లోకి వచ్చాడు

## ఇండిగో ప్రయాణికురాలి ఫిర్యాదు

**ముంబై:** ఇండిగో విమాన ప్రయాణికురాలు చేసిన ఫిర్యాదు తీవ్ర కలకలం రేపుతోంది. విమానం టాయిటెల్ సీటుపై తాను కూర్చుని ఉండగానే కో పైలట్ అందులోకి బలవంతంగా ప్రవేశించాడని ఆరోపించారు. ఆగస్టు 8వ తేదీ రాత్రి విమానం టేకాఫ్ తీసుకోకమునుపే ఇలా జరిగిందని ఆమె తెలిపారు. బంగారం వ్యాపార సంస్థ 'సేఫ్ గోల్డ్'సహ వ్యవస్థాపకురాలు రియా ఛటర్జీ ఇందుకు సంబంధించి తనకు కలిగిన ఇబ్బందికరమైన అనుభవాన్ని లింక్డ్ ఇన్‌లో షేర్ చేశారు. కో పైలట్ చర్య తనకు షాక్ కలిగించిందని పేర్కొన్నారు. 'లావెట్రీ లోపలికెళ్లి లాక్ చేసుకున్నాక, తలుపుపై తట్టిన శబ్దం వినిపించగా బదులిచ్చా. ఆ వెంటనే మరోసారి తలుపు చప్పుడు వినిపించగా మరింత బిగ్గరగా బదులిచ్చా. అయినప్పటికీ కో పైలట్ బలవంతంగా తలుపు నెట్టుకుని లోపలికి వచ్చాడు. తనను చూసి, ఓహ్ అనుకుంటూ డోరు మూసి వెళ్లిపోయాడు' అని వివరించారు. ఇది తెలిసిన మహిళా సిబ్బంది సారీతో సర్ది చెప్పేందుకు ప్రయత్నించారన్నారు. మరో గత్యంతరం లేక నా సీటులోకి వెళ్లి కూర్చున్నానని ఛటర్జీ తెలిపారు. ఘటనపై ఇండిగో యాజమాన్యానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారెవరూ తనతో నేరుగా మాట్లాడలేదని ఆరోపించారు. అయితే, ఈ ఘటనపై పరిహారం కావాలని కోరుకోవడం లేదని స్పష్టం చేశారు.

# రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

## ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

**నవాదా:** ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి కృషి చేస్తామన్నారు. ఇండియా కూటమికి నాయకత్వ సమస్య ఒక చిక్కుముడిగా ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి అభ్యర్థిగా మల్లికార్జున్ ఖర్గేకు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మద్దతు తెలిపారు. ఈ విభేదాల మధ్యే ప్రధాని అభ్యర్థిని తేల్చకుండానే 2024 లోక్‌సభ ఎన్నికలకు వెళ్లింది. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడానికి పనిచేస్తామంటూ తేజస్వీ వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. బిహార్‌లోని నవాడాలో జరిగిన 'ఓటర్ అధికార్'ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో రాహుల్ పక్కనే ఉండటం గమనార్హం. ర్యాలీలో తేజస్వీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓట్లను దొంగిలించి ప్రజలను మోసం చేయడానికి ఎన్నికల కమిషన్, బీజేపీ భాగస్వామ్యమయ్యాయని ఆరోపించారు. బతికున్నవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి వారు చనిపోయినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటిస్తోందని, బీజేపీ ఆదేశానుసారం పనిచేస్తోందని మండిపడ్డారు. 'బీజేపీ ఓటు హక్కును లాక్కోవాలని చూస్తోంది. మేము బీహారీలం. మేం ఎన్నికలను ఖైనీ (పొగాకు నమలడం) లాగా చూస్తాం. నలిపి పారవేస్తాం'అని వ్యాఖ్యానించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగుతున్న వేళ తేజస్వీ ఈ ఆరోపణలు చేశారు.

# సీసీఎస్‌లో మరో రెండు భవనాలు

## టెండర్లకు సీపీడబ్ల్యూడీ ఆహ్వానం

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కొత్తగా రెండు భవనాల నిర్మాణానికి గాను సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్(సీపీడబ్ల్యూడీ) టెండర్లను ఆహ్వానించింది. ఈ రెండు భవనాలను ప్రస్తుతం మౌలానా ఆజాద్ రోడ్డులో ఉన్న ఉద్యోగ్ భవన్, నిర్మాణ్ భవన్‌ల స్థానంలో నిర్మించనున్నారు. రూ.3,116.37 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ నిర్మాణాలు 21 నెలల్లో పూర్తి కావాల్సి ఉంది. ఆరోగ్యం, వాణిజ్యం, ఎంఎస్ఎంఈ, గృహ విభాగాలను నిర్వహించే ఉద్యోగ్ భవన్, నిర్మాణ్ భవన్‌లను వేరే చోటుకు తరలించడం ఇప్పటికే మొదలైంది. ఇది ముగిశాక ఈ భవనాలను కూల్చి, 3 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్నారు.

# ఎంపిక పరీక్షలన్నిటికీ ఫీజు రూ.100

## బిహార్ ప్రభుత్వం నిర్ణయం

**పట్నా:** బిహార్ ప్రభుత్వ ఉద్యోగ ప్రాథమిక పరీక్షలన్నింటికీ ఫీజును రూ.100 మాత్రమే వసూలు చేయాలని సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వం మంగళవారం నిర్ణయించింది. అదేవిధంగా, ప్రాథమిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, మెయిన్ ఎగ్జామ్స్‌కు హాజరయ్యే అభ్యర్థుల నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయరాదని కూడా నిర్ణయించింది. మరికొద్ది నెలల్లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, బిహార్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బిహార్ టెక్నికల్ సర్వీస్ కమిషన్ వంటివి ఉద్యోగాలకు ఎంపిక పరీక్షలను నిర్వహిస్తుంటాయి.

# 'సిందూర్'పై ఎన్‌సీఈఆర్‌టీ మాడ్యూల్

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌పై మూడు నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రత్యేక మాడ్యూల్‌ను అందజేయాలని ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయించింది. ఇది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, పహల్గాం ఉగ్ర ఘాతుకంలో ప్రాణాలు కోల్పోయిన వారి గౌరవార్థం, శాంతిని కాపాడేందుకు చేపట్టిన కార్యక్రమమని ఎన్‌సీఈఆర్‌టీ పేర్కొంది. ఈ మాడ్యూల్‌ను విద్యార్థులకు అదనంగా అందజేస్తామంది. ఆపరేషన్ సిందూర్‌పై రూపొందించే రెండు మాడ్యూళ్లలో 'ఆపరేషన్ సిందూర్– ఎ సాగా ఆఫ్ వేలర్'ను 3–8వ తరగతులకు, ఆపరేషన్ సిందూర్–ఎ మిషన్ ఆఫ్ ఆనర్ అండ్ బ్రేవరీ'ని 9–12వ తరగతులకు అందజేస్తామంది.

# భారత స్వాతంత్ర్య ముసాయిదాను ఎప్పుడు ప్రవేశపెట్టారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

## భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం

### సి.ఆర్. ఫార్ములా (1944) (సి. రాజగోపాలాచారి సూత్రం)

ముస్లిం లీగ్ సహకారం కోసం, మతసమస్యల పరిష్కారం కోసం 1944 మార్చిలో గాంధీజీ ఆమోదంతో కాంగ్రెస్ తరఫున సి.రాజగోపాలాచారి ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. స్వయం నిర్ణయాధికార హక్కు కోసం పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయాలనే ముస్లిం లీగ్ కోరికను ఆయన అంగీకరించారు. కాంగ్రెస్‌కు కావాల్సిన స్వతంత్ర సాధన, దాని కోసం ముస్లింల సహకారాన్ని పొందేందుకు ఎంత నష్టాన్నైనా భరించటానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ముస్లిం లీగ్ మాత్రం దేశ స్వాతంత్ర్యం గురించి పట్టించుకోకుండా, ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చి, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దేశ విభజనకు అంగీకరించాలని కాంగ్రెస్‌ను కోరింది.

### వేవెల్ ప్రణాళిక (1945)

భారత వైస్రాయ్, గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ నాటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో చర్చించి కొన్ని ప్రతిపాదనలు చేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశంలోని ప్రధాన మతాలకు సంబంధించిన వారికి సముచిత ప్రాతినిధ్యం కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిని విస్తరించడం.
- భారతదేశంలోని బ్రిటిష్ వారి ప్రయోజనాలు కాపాడేందుకు హైకమిషనర్‌ను నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో ముఖ్య సైన్యాధికారిగా భారతీయుడిని నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరించడం. దీని కోసం వైస్రాయి 1945 జూలైలో సిమ్లాలో ఒక సమావేశాన్ని నిర్వహించారు. కానీ కాంగ్రెస్ అవిభాజ్య భారత దేశం (యునైటెడ్ ఇండియా) కోసం పట్టు బట్టింది. ముస్లిం లీగ్ మాత్రం దేశ విభజనను సమర్థించింది.

### కేబినెట్ మిషన్ (1946) (కేబినెట్ రాయబారం)

బ్రిటన్ ప్రధాని అట్లీ.. 1946 మార్చిలో పార్లమెంటులో భారతదేశానికి అధికార బదిలీకి సంబంధించి ఒక చరిత్రాత్మక ప్రకటన చేశారు. 'అల్ప సంఖ్యాకుల హక్కులపై మాకు అవగాహన ఉంది. అల్పసంఖ్యాకులు నిర్భయంగా జీవించాలి. అయి తే అధిక సంఖ్యాకుల పురోగతిని కాదనే అల్ప సంఖ్యాక వర్గాన్ని కూడా మనం అనుమతించలేం' అని పేర్కొన్నారు. అందులో భాగంగా బ్రిటన్‌లో కేబి నెట్ మంత్రులైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్, లార్డ్ పెథిక్ లారెన్స్ సభ్యులుగా మంత్రుల బృందం భారత పర్యటన ప్రారంభించింది. ఈ బృందానికి సర్ పెథిక్ లారెన్స్ నేతృత్వం వహించారు. 1946 మే 16న వీరు తమ ప్రణాళికను వెల్లడించారు.

ముఖ్యాంశాలు

- బ్రిటిష్ పాలిత భారతదేశం, స్వదేశీ సంస్థానాలు, ఇండియన్ యూనియన్ అనే రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది. ఆ యూనియన్ విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్ లాంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను నిర్వహిస్తుంది.
- కేంద్ర ప్రభుత్వ పరిధిలో లేని పాలనాంశాలపై శాసనాధికారం రాష్ట్రాలకు సంక్రమిస్తుంది.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు ఏర్పడుతాయి. పరిపాలనా నిర్వహణ కోసం 14 మంది సభ్యులతో కూడిన ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుంది.
- పాకిస్తాన్ అనే మరొక దేశం ఏర్పడే భావన ఆచరణ సాధ్యం కాదు.
- రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది.

### తాత్కాలిక ప్రభుత్వం (1946)

బ్రిటిష్ ప్రభుత్వం 1946 ఆగస్టు 24న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రకటించింది. దీనికి అనుగుణంగా 1946 సెప్టెంబర్ 2న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రారంభంలో సందేహించిన ముస్లిం లీగ్, 1946 అక్టోబర్ 29న తాత్కాలిక ప్రభుత్వంలో చేరింది. కాంగ్రెస్ తరఫున వల్లభాయ్ పటేల్, రాజేంద్ర ప్రసాద్, అరుణా అసఫ్ అలీ, రాజగోపాలాచారి, జగ్జీవన్‌రామ్ లాంటి ప్రముఖులు, ముస్లిం లీగ్ తరఫున లియాఖత్ అలీఖాన్, జె.ఎన్.మండల్, గజ్నేఫర్ అలీఖాన్ లాంటి నాయకులు మంత్రులుగా, జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా వ్యవహరించారు.

### అట్లీ ప్రకటన (1947)

1947 ఫిబ్రవరి 20న కామన్స్ సభలో మాట్లాడుతూ 1948 జూన్ నాటికి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి వైదొలుగుతుందని ప్రకటించారు. దీన్నే అట్లీ ప్రకటన అంటారు. ఈ ప్రకటనను బ్రిటిష్‌వారు జారీచేసిన వాటిలో అత్యుత్తమమైందిగా మహాత్మాగాంధీ వర్ణించారు.

### మౌంట్‌బాటన్ ప్రణాళిక (1947)

భారతదేశ రాజ ప్రతినిధి, గవర్నర్ జనరల్ గా నియమితుడైన మౌంట్‌బాటన్ దేశంలోని రాజకీయ ప్రముఖులతో సంప్రదింపులు జరిపి, సమైక్య భారతదేశ ప్రాతిపదికన కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీల మధ్య అంగీకారం కుదర్చడం సాధ్యం కాదనీ, దేశ విభజన ఒక్కటే పరిష్కారంగా భావించి ప్రణాళిక తయారు చేశారు.



ముఖ్యాంశాలు

- ఇండియన్ యూనియన్‌ను భారత్, పాకిస్తాన్ అనే రెండు రాజ్యాలుగా విభజిస్తారు.
- 1948 జూన్‌కు బదులుగా 1947 ఆగస్టు 15 న రెండు దేశాలుగా విడిపోతాయి.
- అసోం భారత్‌లో అంతర్భాగంగా ఉండగా బెంగాల్, పంజాబ్‌లను మత ప్రాతిపదికన విభజించారు. అయితే ముస్లింలు అధికంగా ఉండే సిల్హట్ (బెంగాల్) జిల్లా విషయంలో మాత్రం అది తూర్పు బెంగాల్‌లో లేదా అసోంలో చేరడమా అనే విషయం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా జరుగుతుంది.
- బెలూచిస్థాన్ వాయవ్య ప్రాంతాలు భారత్ లేదా పాకిస్తాన్‌లో కానీ చేరే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.
- పంజాబ్, బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను విభజించే విషయంలో రెండు సరిహద్దు సంఘాలను నియమించారు.
- బ్రిటన్ ఆధ్వర్యంలోని కామన్‌వెల్త్ కూటమిలో చేరే విషయంలో భారత్, పాకిస్తాన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

### భారత స్వాతంత్ర్య చట్టం (1947)

భారతదేశ వ్యవహారాల నిర్వహణ, నియంత్రణ కోసం రూపొందించిన చివరి చట్టం ఇదే. బ్రిటన్ ప్రధాని క్లిమెంట్ అట్లీ ఆధ్వర్యంలో భారత గవర్నర్ జనరల్ లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్ సలహా మేరకు 1947 జూలై 4న బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వాతంత్ర్య ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై బ్రిటిష్ రాణి 1947 జూలై 18 న సంతకం చేసింది. ఇది 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది.

ముఖ్యాంశాలు

- ఇండియా, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడతాయి. వీటికోసం వేర్వేరు రాజ్యాంగ పరిషత్తులు కూడా ఏర్పాటవుతాయి.
- స్వదేశీ సంస్థానాలపై బ్రిటిష్ సార్వభౌమాధికారంతోపాటు భారత వ్యవహారాల కార్యదర్శి పదవి కూడా రద్దవుతుంది.
- బ్రిటిష్ రాజు లేదా రాణికి ఉన్న భారత చక్రవర్తి అనే బిరుదు రద్దవుతుంది.
- వైస్రాయ్ పదవి రద్దు అవుతుంది.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా పనిచేసి చట్టాలను రూపొందిస్తుంది.
- గవర్నర్ జనరల్, రాష్ట్ర గవర్నర్లు రాజ్యాంగ పరమైన అధిపతులుగా వ్యవహరిస్తారు.
- లార్డ్ మౌంట్‌బాటన్ మొదటి గవర్నర్ జనరల్‌గా నియమితులయ్యారు.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. 1833 చార్టర్ చట్టం ప్రకారం ప్రవేశపెట్టిన అంశాల్లో కింది వాటిలో సరికానిది?
ఎ) ఈస్టిండియా కంపెనీ వాణిజ్య కార్యకలాపాల రద్దు
బి) కౌన్సిల్‌లోని ఉన్నతాధికారిని గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియాగా మార్చడం
సి) కౌన్సిల్‌లో న్యాయ చట్టాలను చేసే అధికారం గవర్నర్ జనరల్ ఇచ్చింది
డి) గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లోని న్యాయమండలికి మొదటిసారిగా భారతీయుడిని నియమించారు

2. కింది వాటిలో సరైంది?
ఎ) బ్రిటన్ తరహాలో భారతదేశంలో రెగ్యులర్ పోలీసు దళాన్ని ఏర్పాటు చేసిన మొదటి గవర్నర్ జనరల్ వారెన్‌హేస్టింగ్స్
బి) రెగ్యులేటింగ్ చట్టం-1773 ద్వారా కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పాటు ప్రతిపాదన
సి) ఎ, బి డి) ఏదీకాదు

3. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
ఎ) రెండు బి) మూడు
సి) అయిదు డి) ఆరు

4. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
ఎ) వాట్సన్ బి) రాబర్డ్ క్లైవ్
సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్

5. భారతదేశ పాలన బ్రిటిష్ చక్రవర్తి పరిధిలోకి వచ్చినట్లు విక్టోరియా రాణి ప్రకటన చేసిన రోజు?
ఎ) 1858 నవంబర్ 1 బి) 1857 నవంబర్ 1
సి) 1859 డిసెంబర్ 1 డి) 1857 డిసెంబర్ 1

6. భారత ప్రభుత్వ చట్టం-1919లోని ప్రధాన అంశం/ అంశాలు?
ఎ) రాష్ట్రాల కార్యనిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
బి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారాల నిర్వచనం
సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికార సంక్రమణం
డి) పైవన్నీ

7. పాలనలో భారతీయులకు భాగస్వామ్యం కల్పించటానికి ఉద్దేశించిన మొదటి బ్రిటిష్ చట్టం?
ఎ) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం- 1861
బి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం-1862
సి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం- 1909
డి) భారత ప్రభుత్వ చట్టం- 1919

8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజిన్ లేని యంత్రం' గా నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
ఎ) కేబినెట్ మిషన్
బి) మౌంట్‌బాటన్ ప్రణాళిక
సి) వేవెల్ ప్రణాళిక
డి) భారత ప్రభుత్వ చట్టం-1935

సమాధానాలు

1) డి 2) సి 3) బి 4) బి
5) ఎ 6) డి 7) ఎ 8) డి

### మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
ఎ) అమెరికా రాజ్యాంగం
బి) బ్రిటిష్ రాజ్యాంగం సి) ఐరిష్ రాజ్యాంగం
డి) భారత ప్రభుత్వ చట్టం

2. జతపరచండి.
1) పోర్ట్ ఫోలియో పద్ధతి
2) సివిల్ సర్వీసులు
3) మత నియోజక వర్గాలు
4) భారత న్యాయ సంస్కరణలు
ఎ) లార్డ్ మెకాలే
బి) లార్డ్ కార్న్ వాలిస్
సి) లార్డ్ కానింగ్
డి) లార్డ్ మింటో
ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

3. కాలక్రమం ప్రకారం కింది వాటిని గుర్తించండి?
1) ప్రత్యేక నియోజకవర్గాలు
2) శాసన అధికారాల బదలాయింపు
3) ద్విసభా విధానం
4) డొమినియన్ ప్రతిపత్తి
ఎ) 1, 2, 3, 4, బి) 2, 1, 3, 4
సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 4

4. ప్రభుత్వానికి ఉండే అధికారం దేనికి ఉదాహరణ?
ఎ) సంప్రదాయ అధికారం
బి) సమ్మోహనాధికారం
సి) చట్టబద్ధ, హేతుబద్ధ అధికారం
డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) ఎ 3) ఎ 4) సి

# 'చందన వృక్షం' శాస్త్రీయ నామం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

### మాదిరి ప్రశ్నలు

1. భూమిపై ఉన్న వృక్షాలన్నీ నశిస్తే జీవులన్నీ మరణిస్తాయి. కారణం? (సివిల్స్, 1988)
1) కార్బన్ డై ఆక్సైడ్ లేకపోవడం
2) ఆక్సిజన్ లేకపోవడం
3) 1, 2 4) ఏదీకాదు

2. మడ వృక్షాలు (మంగ్రూవ్ అడవులు) అంటే? (గ్రూప్-1, 1999)
1) నీటి మొక్కలు
2) ఉప్పునీటి వృక్షాలు
3) పండ్లనిచ్చే వృక్షాలు 4) ఆల్గే

3. హైడ్రోపోనిక్స్ అంటే ఏమిటి? (సివిల్స్, 2000)
1) ధ్వని తరంగాలతో నీటిని శుద్ధిచేయడం
2) వాతావరణం, నీరు అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
3) మృత్తిక అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
4) తడి గాలిని పంపి మొక్కలను పెంచే పద్ధతి

4. హెర్బేరియం అనేది ఒక.. ? (ఎఫ్ఆర్‌వో, 2005)
1) ఎండు ఔషధ మొక్కల సంకలనం
2) వివిధ ఔషధ మొక్కల తోట
3) విత్తనాలను నిల్వచేసే సంస్థ
4) ఎండు మొక్కల నమూనాలను భద్రపరిచే సంస్థ

5. కాఫీలో కలిపే చికోరి పొడర్‌ను మొక్క ఏ భాగం నుంచి గ్రహిస్తారు? (గ్రూప్-1, 2010)
1) కాండం 2) వేరు
3) ఆకులు 4) విత్తనాలు

6. 'రాడిష్' అనేది ఒక ..? (ఏఈఈ, 2009)
1) బల్బ్ 2) మొక్కజొన్న
3) మార్పుచేసిన వేరు
4) ట్యూబర్

7. వేరు బుడిపెలు ఉన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తే నేలలో స్థాపితమయ్యే మూలకం ఏది? (వీడీవో, 1992)
1) కాల్షియం 2) పొటాషియం
3) భాస్వరం 4) నత్రజని

8. అల్లం అనేది ఒక ..? (గ్రూప్-1, 2003, గ్రూప్-4, 1996)
1) కండ కలిగిన వేరు
2) కండ కలిగిన కాండం
3) నిల్వచేసే వేరు
4) ఉపవాయుగత కాండం

9. 'జెనెటిక్స్' అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
1) హ్యూగో డీవ్రీస్ 2) మెండల్
3) బేట్‌సన్ 4) సట్టన్-జొహెన్‌సన్

10. ఆకుల ద్వారా జరిగే ట్రాన్పిరేషన్ ప్రక్రియలో పాల్గొనే నిర్మాణాలేవి? (గ్రూప్-2, 2003)
1) క్యూటికిల్ 2) లెంటిసెల్స్
3) స్టొమాట 4) హైడథోడ్స్

11. కుంకుమపువ్వును మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-1, 1999)
1) ఎండిన రక్షక పత్రాలు
2) ఎండిన పూమొగ్గలు
3) కీలాగ్రం 4) ఆకర్షణ పత్రాలు

12. కింద పేర్కొన్న పత్రరంధ్రాల ద్వారా నీరు బిందువుల రూపంలో స్రవితమవుతుంది. ఆ నిర్మాణాలను ఏమంటారు? (సివిల్స్, 1996)
1) లెంటిసెల్స్ 2) ఫయలోపోర్
3) హైడథోడ్స్ 4) స్టొమాట

13. పీచర్ ప్లాంట్‌లోని ఏ భాగం పీచర్‌గా మార్పు చెందుతుంది? (సివిల్స్, 2007; ఎఫ్ఆర్‌వో, 2009)
1) కాండం 2) ఆకు
3) స్టిప్యూల్స్ 4) పిటియోల్

14. కింది వాటిలో మాంసాహార మొక్క ఏది? (సివిల్స్, 1996)
1) నెపంథిస్ 2) డ్రాసిరా
3) డయోనియా 4) పైవన్నీ

15. జీవితకాలంలో కొన్ని మొక్కలు ఒకేసారి పుష్పిస్తాయి. వాటిని ఏమని పిలుస్తారు? (గ్రూప్-4, 2010)
1) మోనోకార్పిక్ 2) మోనోగామస్
3) మోనోజెనిక్ 4) మోనోమార్ఫిక్

16. అతిపెద్ద పుష్పం ఏది? (గ్రూప్-4, 2010)
1) క్రైసాంథిమమ్ 2) రఫ్లీషియా
3) సన్‌ఫ్లవర్ 4) జిన్నియా

17. ఆపిల్‌లో తినే భాగం ఏది? (గ్రూప్-4, 1998)
1) కార్పెల్ 2) థాలమస్
3) పెడిసిల్ 4) ఎండోకార్ప్

18. పప్పుధాన్యాల్లో ప్రధానంగా ఉండే పోషక విలువలేవి? (ఏఈఈ, 2009)
1) పిండి పదార్థాలు 2) విటమిన్లు
3) కొవ్వులు 4) మాంసకృత్తులు

19. సుగంధద్రవ్యంగా ఉపయోగపడే లవంగం అనేది ఒక..? (డీఎల్, 2012)
1) వేరు 2) ఫలం
3) ఎండిన విప్పారని పూమొగ్గ
4) కాండం

20. 'చందన వృక్షం' శాస్త్రీయ నామం? (గ్రూప్-4, 2002)
1) సాంటాలమ్ ఆల్బం
2) షోరియా రొబెస్టా
3) సిడ్రస్ డియోడరా
4) పైనస్ రాక్స్‌బర్గై

21. 'మార్ఫిన్'ను మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2003)
1) పుష్పం 2) ఆకు
3) పండు/కాయ లేటెక్స్ 4) కాండం

22. వృక్ష కణం, జంతు కణానికి మధ్య తేడా? (వాటర్‌వర్క్స్ మేనేజర్, 2008)
1) కేంద్రకం 2) ప్లాస్మాత్వచం
3) క్లోరోప్లాస్ట్ 4) మైటోకాండ్రియా

23. సూక్ష్మదర్శిని ద్వారా కణాన్ని పరిశీలించిన తొలి శాస్త్రవేత్త ఎవరు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2000)
1) రాబర్ట్ హుక్ 2) ఎ.వి. లీవెన్‌హుక్
3) టి. ష్వాన్ 4) ఎం.జె. ష్లైడన్

24. కింది వాటిలో ప్రోకారియోటిక్ (కేంద్రక పూర్వ) కణం కానిది?
1) క్లోరెల్లా 2) ఈస్ట్
3) క్షయ బ్యాక్టీరియా 4) 1, 2

25. వాణిజ్యపరంగా 'కార్క్' అనేది ఏ వృక్షం నుంచి తీసిన బెండు?
1) ఎల్మ్ 2) విల్లో
3) ఆర్కిడ్ 4) ఓక్

26. 'ప్రతి జీవి దేహం కణాలతో నిర్మితమవుతుంది. జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం కణం' అని కణ సిద్ధాంతాన్ని వివరించినవారు? (సివిల్స్, 1998)
1) లూయీపాశ్చర్
2) రాబర్ట్ హుక్ 3) ష్లైడన్-ష్వాన్
4) లీవెన్‌హుక్

27. జన్యువు (Gene) అంటే? (గ్రూప్-1, 1988)
1) ప్రోటీన్‌లోని అమైనో ఆమ్లం
2) ఆర్ఎన్ఏలో కొంత భాగం
3) డీఎన్ఏ ముక్క
4) సహలగ్న సముదాయం

28. అంతర్లీనంగా దాగి ఉండే లక్షణాన్ని ఏమంటారు? (గ్రూప్-4, 1989)
1) డామినెంట్ 2) $F_1$ జనరేషన్
3) రెసిసివ్ 4) పైవేవీకాదు

29. హరగోవింద్ ఖురానా చేసిన పరిశోధన ఏమిటి? (పాలిటెక్నిక్ లెక్చరర్, 2011)
1) నూతన కణాల గుర్తింపు
2) ప్రయోగశాలలో కృత్రిమ జన్యువు సృష్టి
3) మొక్కల్లో పరివర్తన
4) జన్యు మార్పిడి

30. 'జన్యువు' అని పేరు పెట్టినవారెవరు?
1) బేట్‌సన్ 2) మెండల్
3) జొహెన్‌సన్ 4) క్రిక్-వాట్సన్

31. జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలిసారిగా శాస్త్రీయంగా ప్రతిపాదించినవారు? (గ్రూప్-1, 1987-88)
1) లామార్క్ 2) డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్

32. 'ది ఆరిజన్ ఆఫ్ స్పీసీస్' గ్రంథకర్త? (గ్రూప్-1, 2003)
1) లామార్క్ 2) చార్లెస్ డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్

33. సముద్రంలో ఏర్పడిన, కిరణజన్య సంయోగ క్రియ జరిపే మొదటి జీవులేవి? (గ్రూప్-2, 2002)
1) శైవలాలు 2) సయనో బ్యాక్టీరియా
3) శిలీంధ్రాలు 4) మొక్కలు

34. ఉత్పరివర్తన పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు? (సివిల్స్, 2006)
1) డార్విన్ 2) లామార్క్
3) మెండల్ 4) హ్యూగో డీవ్రీస్

35. 'ప్రోటీన్ల కర్మాగారాలు' అని వేటిని పిలుస్తారు?
1) పెరాక్సీజోమ్‌లు 2) రైబోజోమ్స్
3) హరితరేణువు 4) మైటోకాండ్రియా

36. మానవుడి శుక్రకణంలోని క్రోమోజోమ్‌ల సంఖ్య?
1) 46 2) 44+XX
3) 22 4) 23

37. కొబ్బరి అంకురచ్ఛద స్థితి?
1) ఏక స్థితికం 2) ద్వయ స్థితికం
3) త్రయ స్థితికం 4) బహు స్థితికం

38. సమ విభజనను పరిశీలించడానికి అనువైన స్థానం ఏది?
1) కాండం 2) ఉల్లి వేరుకొన
3) మొగ్గ
4) పుష్పంలోని పరాగకోశం

39. డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నమూనాను ప్రతిపాదించినవారు?
1) ష్లైడన్ - ష్వాన్ 2) క్రిక్-వాట్సన్
3) బెంధమ్-హుకర్
4) ఎంగ్లర్ ప్రాంటల్

40. అంటుకట్టడం, గాయాలు మానడంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
1) ద్విదావిచ్ఛిత్తి 2) బహుదావిచ్ఛిత్తి
3) సమ విభజన
4) క్షయకరణ విభజన

41. పాకిటీన్ ఉపదశ దేనిలో ఉంటుంది?
1) సమ విభజన
2) క్షయకరణ విభజన
3) అసమ విభజన 4) ఏదీకాదు

42. కిరణజన్య సంయోగక్రియ ఏ కాంతిలో ఎక్కువగా జరుగుతుంది?
1) నీలి కాంతి 2) సూర్య కాంతి
3) అరుణ కాంతి
4) అతినీలలోహిత కాంతి

43. క్లోరోఫిల్ అణువులో ఏ మూలకం ఉంటుంది? (గ్రూప్-1, 1999)
1) ఇనుము 2) మెగ్నీషియం
3) కోబాల్ట్ 4) కాల్షియం

44. మానవ నిర్మిత ధాన్యపు మొక్క (Man made cereal)?
1) ఓట్స్ 2) రెపానో బ్రాసికా
3) ట్రిటికేల్ 4) షర్బతి సానోరా

45. నీటిలో కరిగే వర్ణద్రవ్యాలు?
1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్
3) జాంతోఫిల్స్ 4) ఫైకోబిలిన్లు

46. శిలీంధ్రం నుంచి రూపొందించిన ఫైటోహార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
3) సైటోకైనిన్ 4) ఇథిలీన్

47. అగ్రాధిక్యతకు కారణమైన హార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
3) సైటోకైనిన్ 4) ఇథిలీన్

48. కింది వాటిలో జిబ్బరెల్లిన్ల చర్య ఏది?
1) మొక్కల పొడవు పెంచుతుంది
2) అన్ని రకాల మొక్కల పొడవు పెంచుతుంది
3) పొట్టి మొక్కల పొడవు మాత్రమే పెంచుతుంది
4) పొడవు మొక్కల పొడవు పెంచుతుంది

49. విత్తన రహిత ఫలాలు ఏర్పడటానికి దోహదపడే హార్మోన్ ఏది?
1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) సైటోకైనిన్
3) ఆక్సిన్ 4) జిబ్బరెల్లిన్లు

50. ఫ్రూట్ రైపనింగ్ హార్మోన్ ఏది?
1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలీన్
3) సైటోకైనిన్ 4) జిబ్బరెల్లిన్

51. వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
3) ఇథిలీన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం

52. కణ విభజనను ప్రోత్సహించే హార్మోన్?
1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం

53. సుప్తావస్థను కలుగజేసే హార్మోన్ ఏది?
1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం

54. మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం? (ఏఈ, 2009)
1) మెలనిన్ 2) టానిన్
3) క్లోరోఫిల్ 4) బ్యాక్టీరియా

55. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ప్రధాన సమ్మేళనం ఏది? (ఏఈ, 2009)
1) సల్ఫర్ 2) సోడియం
3) కార్బన్ 4) నైట్రోజన్

56. క్వినైన్ దేని నుంచి లభిస్తుంది? (గ్రూప్-2, 2002)
1) మల్బరీ 2) కోకో
3) సింకోనా 4) యూకలిప్టస్

57. 'ద్వి ఫలదీకరణం' ఏ మొక్కల ముఖ్య లక్షణం? (ఎంపీడీవో, 1997)
1) శైవలాలు 2) బ్రయోఫైటా
3) వివృత బీజాలు 4) ఆవృత బీజాలు

58. లిట్మస్ పేపర్ తయారీకి ఉపయోగించే మొక్క ఏది?
1) శైవలాలు 2) శిలీంధ్రం
3) లైకేన్లు 4) ఫెర్న్

59. పిండి పదార్థాలను గుర్తించే రసాయనం?
1) కోబాల్ట్ క్లోరైడ్ 2) అయోడిన్
3) సోడియం హైడ్రాక్సైడ్
4) కాపర్ సల్ఫేట్

60. పాక్షిక స్వయం ప్రతిపత్తి ఉన్న కణాంగం?
1) హరిత రేణువు 2) మైటోకాండ్రియా
3) రైబోజోమ్స్ 4) 1, 2

61. జీవ పరిణామంలో ప్రకృతి ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త? (వీడీవో, 1988)
1) లామార్క్ 2) డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్

62. జీవుల్లో వంశపారంపర్య లక్షణాలు కలిగించేది ఏది? (గ్రూప్-2, 1991)
1) ఆర్ఎన్ఏ 2) ఏటీపీ
3) డీఎన్ఏ 4) హిమోగ్లోబిన్

63. క్రోమోజోమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? (గ్రూప్-4, 1996)
1) డార్విన్ 2) మెండల్
3) సట్టన్-బవేరి 4) లామార్క్

64. శిశువు లింగ నిర్ధారణ ఎవరిపై ఆధారపడి ఉంటుంది?
1) తల్లి 2) తండ్రి
3) తల్లి, తండ్రి 4) పూర్వీకులు

65. డీఎన్ఏలోని క్రియాత్మక ప్రమాణం?
1) సిస్ట్రాన్ 2) రేకాన్
3) మ్యూటాన్ 4) ఏదీకాదు

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 4; 5) 2;
6) 3; 7) 4; 8) 2; 9) 3; 10) 3;
11) 3; 12) 3; 13) 2; 14) 4; 15) 1;
16) 2; 17) 2; 18) 4; 19) 3; 20) 1;
21) 3; 22) 3; 23) 1; 24) 4; 25) 4;
26) 3; 27) 3; 28) 3; 29) 2; 30) 3;
31) 2; 32) 2; 33) 2; 34) 4; 35) 2;
36) 4; 37) 3; 38) 2; 39) 2; 40) 3;
41) 2; 42) 3; 43) 2; 44) 3; 45) 4;
46) 2; 47) 1; 48) 3; 49) 4; 50) 2;
51) 2; 52) 2; 53) 4; 54) 3; 55) 4;
56) 3; 57) 4; 58) 3; 59) 2; 60) 4;
61) 2; 62) 3; 63) 3; 64) 2; 65) 1.

# ‘ఉత్తర రామాయణం’ రచించింది ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### తెలంగాణ హిస్టరీ

## కాకతీయ యుగం

1. ‘కేయూర బాహు చరిత్ర’ను రాసినవారు?
   1) మంచన 2) శివదేవయ్య
   3) శేషాద్రిరమణ కవులు
   4) గంగాధర కవి
2. సంస్కృతంలో ‘యయాతి చరిత్ర, ఉషారాగోదయం’ అనే నాటకాలు రాసిందెవరు?
   1) శివదేవయ్య 2) మంచన
   3) గంగాధర కవి 4) ప్రతాపరుద్రుడు
3. ‘రంగనాథ రామాయణం’ గ్రంథ రచయిత?
   1) గోన గన్నారెడ్డి 2) గోన బుద్ధారెడ్డి
   3) ప్రతాపరుద్రుడు 4) విశ్వనాథుడు
4. తొలి పురాణ అనువాద కవి ఎవరు?
   1) విశ్వనాథుడు 2) గోన బుద్ధారెడ్డి
   3) మారన 4) మంచన
5. కింది వారిలో ‘మార్కండేయ పురాణం’ను ఎవరు అంకితం తీసుకున్నారు?
   1) జాయప్ప కవి 2) గన్నయ నాయకుడు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
6. తెలుగులో తొలి మహాపురాణం ఏది?
   1) మనుచరిత్ర 2) వాయు పురాణం
   3) రంగనాథ రామాయణం
   4) మార్కండేయ పురాణం
7. కింది వాటిలో అనేక కావ్యాలకు ఆధారమైన గ్రంథం ఏది?
   1) మనుచరిత్ర
   2) మార్కండేయ పురాణం
   3) నాట్యశాస్త్రం
   4) రంగనాథ రామాయణం
8. సంస్కృతంలో అలంకార గ్రంథం రాసిన తొలి ప్రసిద్ధ తెలుగు కవి?
   1) విద్యానాథుడు 2) మారన
   3) మంచన 4) విశ్వనాథుడు
9. ‘ప్రతాపరుద్ర యశోభూషణం’ గ్రంథ రచయిత ఎవరు?
   1) రామరాజ భూషణుడు
   2) విద్యానాథుడు
   3) అల్లసాని పెద్దన 4) మారన
10. ‘నరసభూపాలీయం’ దేని అనువాద రచన?
    1) నాట్యశాస్త్రం 2) ధ్వన్యాలోకం
    3) ప్రతాపరుద్ర యశోభూషణం
    4) మార్కండేయ పురాణం
11. వరంగల్ కోట తోరణ ద్వారం మీద శ్లోకాలను లిఖించిన కవి?
    1) విద్యానాథుడు 2) నరసింహుడు
    3) శరభాంకుడు 4) మల్లినాథసూరి
12. ‘కాకతీయ చరిత్ర’, ‘మలయవతి’ అనే గ్రంథాలను రాసిందెవరు?
    1) నరసింహుడు 2) విద్యానాథుడు
    3) మల్లినాథసూరి 4) శరభాంకుడు
13. ‘సౌగంధికాపహరణం’ అనే సంస్కృత వ్యాయోగం రచయిత?
    1) విద్యానాథుడు 2) నరసింహుడు
    3) శరభాంకుడు 4) విశ్వనాథుడు
14. తెలుగులో తొలి జంట కవులెవరు?
    1) కాచభూపతి, విట్టలరాజు
    2) కాచభూపతి, విద్యానాథుడు
    3) విద్యానాథుడు, విశ్వనాథుడు
    4) శరభాంకుడు, నరసింహుడు
15. ‘ఉత్తర రామాయణం’ రచించింది ఎవరు?
    1) కాచభూపతి, విట్టలరాజు
    2) శరభాంకుడు, నరసింహుడు
    3) కాచభూపతి, విద్యానాథుడు
    4) విద్యానాథుడు, విశ్వనాథుడు
16. తెలుగులో తొలి కవయిత్రి ఎవరు?
    1) మొల్ల 2) గంగాదేవి
    3) కుప్పాంబిక 4) మైలాంబిక
17. ముగ్గురు కాకతీయ రాజుల వద్ద మంత్రిగా పనిచేసింది ఎవరు?
    1) గోన బుద్ధారెడ్డి 2) శివదేవయ్య
    3) గణపనారాధ్యుడు 4) శరభాంకుడు
18. ‘శివదేవధీమణి’ శతకకర్త?
    1) శరభాంకుడు 2) గోన బుద్ధారెడ్డి
    3) గణపతారాధ్యుడు 4) శివదేవయ్య
19. తెలుగులో వచ్చిన మొదటి చంపూ రామాయణం?
    1) ఉత్తర రామాయణం
    2) భాస్కర రామాయణం
    3) మొల్ల రామాయణం
    4) రంగనాథ రామాయణం
20. ‘హుళక్కి భాస్కరుడు’ ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) రుద్రదేవుడు 2) రుద్రమదేవి
    3) గణపతిదేవుడు 4) ప్రతాపరుద్రుడు
21. ‘భాస్కర రామాయణం’ను పూర్తి చేసిన వారెవరు?
    1) మల్లికార్జునభట్టు 2) అయ్యలార్యుడు
    3) రుద్రదేవుడు 4) శివదేవయ్య
22. సంస్కృతంలో ‘ప్రేమాభిరామం’ కావ్యాన్ని రాసింది ఎవరు?
    1) మల్లికార్జున భట్టు
    2) అయ్యలార్యుడు
    3) రావిపాటి త్రిపురాంతకుడు
    4) శివదేవయ్య
23. ‘విద్యారణ్య స్వామి’ జన్మస్థలం?
    1) ధర్మపురి 2) ఓరుగల్లు
    3) కొలనుపాక 4) పానగల్లు
24. కింది వారిలో శ్రీనాథ మహాకవి స్తుతించిన కవి ఎవరు?
    1) మల్లికార్జునభట్టు
    2) రావిపాటి త్రిపురాంతకుడు
    3) సాయణ 4) శివదేవయ్య
25. ‘సంగీతసారం’ అనే సంగీత శాస్త్ర గ్రంథ రచయిత?
    1) మల్లికార్జునభట్టు
    2) రావిపాటి త్రిపురాంతకుడు
    3) సాయణ 4) విద్యారణ్య స్వామి

### సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 3; 5) 2;
6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3;
11) 2; 12) 1; 13) 4; 14) 1; 15) 1;
16) 3; 17) 2; 18) 4; 19) 2; 20) 4;
21) 2; 22) 3; 23) 1; 24) 2; 25) 4

## కుతుబ్‌షాహీ యుగం

1. సుల్తాన్ కులీ కుతుబ్‌షా ఏ బహమనీ సుల్తాన్ వద్ద సేనాపతిగా పనిచేశాడు?
   1) అహ్మద్‌షా 2) మహమూద్‌షా
   3) హుమాయున్
   4) మొదటి మహమ్మద్‌షా
2. కులీ కుతుబ్‌షా గోల్కొండ జాగీర్‌దారుగా ఎప్పుడు నియమితులయ్యారు?
   1) క్రీ.శ. 1476 2) క్రీ.శ. 1486
   3) క్రీ.శ. 1493 4) క్రీ.శ. 1496
3. కులీ కుతుబ్‌షాకు ‘కుతుబ్ ఉల్‌ముల్క్’ బిరుదు ఇచ్చిన బహమనీ సుల్తాన్?
   1) హుమాయున్
   2) మొదటి మహమ్మద్‌షా
   3) మహమూద్ షా 4) అహ్మద్‌షా
4. స్వతంత్ర గోల్కొండ రాజ్య స్థాపన ఎప్పుడు జరిగింది?
   1) 1515 2) 1518 3) 1520 4) 1521
5. గోల్కొండ రాజ్య స్థాపకుడెవరు?
   1) ఇబ్రహీం కుతుబ్‌షా
   2) జంషీద్ కుతుబ్‌షా
   3) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
   4) అబుల్ హసన్ తానీషా
6. గోల్కొండను ఎవరి కాలంలో నిర్మించారు?
   1) కాకతీయులు 2) యాదవ రాజులు
   3) కుతుబ్‌షాహీలు 4) అసఫ్‌జాహీలు
7. ‘మంగళారం’ అని పూర్వం ఏ ప్రాంతాన్ని పిలిచేవారు?
   1) భువనగిరి 2) గోల్కొండ
   3) నల్లగొండ 4) సికింద్రాబాద్
8. ‘చిత్రభారతం’లో ఎవరికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
   1) కులీ కుతుబ్‌షా
   2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) షితాబ్‌ఖాన్
9. ఎనుములపల్లి పెద్దనామాత్యుడు ఎవరి మంత్రి?
   1) కులీ కుతుబ్‌షా 2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) షితాబ్‌ఖాన్
10. చరిగొండ ధర్మన్న ఎవరి ఆశ్రితుడు?
    1) ఎనుములపల్లి పెద్దనామాత్యుడు
    2) మహమూద్‌షా
    3) ఇబ్రహీం కుతుబ్‌షా 4) షితాబ్‌ఖాన్
11. ‘చిత్రభారతం’ను రాసింది ఎవరు?
    1) ఎనుముపల్లి పెదనామాత్యుడు
    2) చరిగొండ ధర్మన్న
    3) ఇబ్రహీం కుతుబ్‌షా
    4) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
12. కులీ కుతుబ్‌షాను హత్య చేసిన అతడి కుమారుడి పేరు?
    1) జంషీద్ కుతుబ్‌షా
    2) హైదర్ కుతుబ్‌షా
    3) అబ్దుల్ కలీం 4) దౌలత్‌కుతుబ్ షా
13. వారసత్వ తగాదాలతో పారిపోయి విజయనగర రాజుల శరణార్థిగా ఉన్న సుల్తాన్?
    1) జంషీద్ కుతుబ్‌షా
    2) అబ్దుల్లా కుతుబ్‌షా
    3) ఇబ్రహీం కుతుబ్‌షా
    4) హైదర్ కుతుబ్‌షా
14. హుస్సేన్‌సాగర్ చెరువును నిర్మించిన పాలకుడు ఎవరు?
    1) ఇబ్రహీం కుతుబ్‌షా
    2) కులీ కుతుబ్‌షా
    3) హైదర్ కుతుబ్‌షా
    4) జంషీద్ కుతుబ్‌షా
15. ఇబ్రహీం కుతుబ్‌షా రాజమండ్రి, కొండవీడును ఆక్రమించిన సంవత్సరాలు వరుసగా?
    1) 1571, 1579 2) 1575, 1579
    3) 1571, 1581 4) 1579, 1585
16. ‘పురానాపూల్’ను నిర్మించింది ఎవరు?
    1) షాజహాన్ 2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) హైదర్ 4) జంషీద్
17. ఇబ్రహీం కుతుబ్‌షా ‘పురానాపూల్’ను ఎక్కడ నిర్మించాడు?
    1) హుస్సేన్‌సాగర్ 2) ఇబ్రహీంపట్నం చెరువు
    3) మూసీనది 4) గండిపేట చెరువు
18. హుస్సేన్‌సాగర్‌ను, ఇబ్రహీంపట్నం చెరువును నిర్మించినవారు?
    1) అబుల్‌హసన్ తానీషా
    2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) అబ్దుల్లా కుతుబ్‌షా
19. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్‌లను నిర్మించిన వారెవరు?
    1) అబుల్ హసన్ తానీషా
    2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) అబ్దుల్లా కుతుబ్‌షా
20. భిక్షాటకులకు ప్రత్యేకంగా లంగర్‌హౌస్‌ను నిర్మించిన పాలకుడు?
    1) అబుల్ హసన్ తానీషా
    2) అబ్దుల్లా కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) ఇబ్రహీం కుతుబ్‌షా
21. ‘మల్కిభరాముడు’ అనే బిరుదున్న చక్రవర్తి ఎవరు?
    1) షాజహాన్ 2) ఇబ్రహీం కుతుబ్‌షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    4) హైదర్ కుతుబ్‌షా

### సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 2;
5) 3; 6) 1; 7) 2; 8) 4;
9) 4; 10) 1; 11) 2; 12) 1;
13) 3; 14) 1; 15) 1; 16) 2;
17) 3; 18) 2; 19) 2; 20) 4;
21) 2.

## శాతవాహన అనంతర యుగం

1. తెలంగాణలో లభిస్తున్న తొలి సంస్కృత శాసనం ఏది?
   1) చైతన్యపురి శాసనం
   2) గోరంట్ల తామ్రశాసనం
   3) ఏలేశ్వర శాసనం
   4) ఇంద్రపాలనగర తామ్రశాసనం
2. తెలంగాణలో లభిస్తున్న తొలి ప్రాకృత శాసనం ఏది?
   1) గోరంట్ల తామ్రశాసనం
   2) చైతన్యపురి శాసనం
   3) ఇంద్రపాలనగర తామ్రశాసనం
   4) ఏలేశ్వర శాసనం
3. తెలంగాణలో గోవిందవర్మ వేయించిన తొలి సంస్కృత శాసన కాలం?
   1) క్రీ.శ. 425 2) క్రీ.శ. 430
   3) క్రీ.శ. 435 4) క్రీ.శ. 440
4. తెలంగాణ ప్రాంతంలో వచ్చిన మొదటి సంస్కృత లక్షణ గ్రంథం ఏది?
   1) జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి
   2) కవిజనాశ్రయం
   3) ఉదయాదిత్యాలంకారం
   4) గోకర్ణ ఛందస్సు
5. ‘జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి’ రాసిందెవరు?
   1) ఇంద్రభట్టారక వర్మ
   2) మంచన భట్టారకుడు
   3) గోవిందవర్మ
   4) నాలుగో మాధవ వర్మ
6. విష్ణుకుండినుల రాజ భాష ఏది?
   1) సంస్కృతం 2) ప్రాకృతం
   3) తెలుగు 4) పైశాచీ
7. ‘విజయరాజ్య సంవత్సరంబుళ్’ అనే తెలుగు పదమున్న శాసనం ఏది?
   1) గోరంట్ల తామ్రశాసనం
   2) ఇంద్రపాలనగర తామ్రశాసనం
   3) చిక్కుళ్ల శాసనం
   4) చైతన్యపురి శాసనం
8. చిక్కుళ్ల శాసనాన్ని వేయించినవారు?
   1) నాలుగో మాధవవర్మ
   2) విక్రమేంద్ర భట్టారిక వర్మ
   3) గోవిందవర్మ
   4) రెండో మాధవవర్మ
9. ఎవరి కాలం నుంచి శాసనాల్లో తెలుగు పదాలు కనిపిస్తున్నాయి?
   1) వాకాటకులు 2) రాష్ట్రకూటులు
   3) విష్ణుకుండినులు 4) ఇక్ష్వాకులు
10. ఏ రాజుల పాలనా కాలం నాటికి ‘సంస్కృతం’ పూర్తిగా రాజ భాష అయింది?
    1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
    3) వాకాటకులు 4) విష్ణుకుండినులు
11. ఇక్ష్వాకులు ఏ మతానికి చెందినవారు?
    1) బౌద్ధం 2) శైవం
    3) జైనం 4) వైదికం
12. ఇక్ష్వాకుల మిత్రులైన ‘అభీరులు’ ఏ మతాభిమానులు?
    1) శైవం 2) బౌద్ధం
    3) జైనం 4) వైష్ణవం
13. బుద్ధుడిని దేవతామూర్తిగా కింది వాటిలో ఏ అవతారంగా కూడా కొలిచారు?
    1) శివుడు 2) విష్ణుమూర్తి
    3) బ్రహ్మ 4) శ్రీకృష్ణుడు
14. ఆంధ్రదేశంలో ‘హిందూ గుహాలయాలను’ మొదట నిర్మించినవారు ఎవరు?
    1) విష్ణుకుండినులు 2) శాతవాహనులు
    3) ఇక్ష్వాకులు 4) వాకాటకులు
15. శాసనాల ఆధారంగా ఇక్ష్వాక రాజుల సంఖ్య?
    1) 7 2) 4
    3) 6 4) 8

### సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1;
5) 4; 6) 1; 7) 3; 8) 2;
9) 3; 10) 4; 11) 2; 12) 4;
13) 2;14) 1; 15) 2

# Primary memory is used by the:

## Model Questions

1. Block on buffer caches is used:
   1) To improve disk performance
   2) To speed up main memory read operation
   3) To handle interrupts
   4) To increase capacity of main memory
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting
   1) Primary keys and their relationships to instances
   2) Entity classes and their relationships to primary keys
   3) Entity classes and their relationships
   4) Primary keys and their relationships
   5) None of the above
3. A hexadigit can be represented by
   1) Three binary (consecutive) bits
   2) Sixteen binary (consecutive) bits
   3) Eight binary (consecutive) bits
   4) Four binary (consecutive) bits
   5) None of the above
4. If a previously saved file is edited ___?
   1) The file must be saved again to store the changes
   2) The changes will automatically be saved in the file
   3) The file will only have to be saved again if it is more than one page in length
   4) Its name must be changed
   5) It cannot be saved again
5. What do we call the HTML codes written in a text editor to make web pages?
   1) Roots 2) HTML tags
   3) Source elements
   4) Source code
   5) None of these
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page 2) Document
   3) Section 4) Page Setup
   5) None
7. Which key is used to indent a paragraph in MS word?
   1) Shift 2) Esc 3) Ctrl
   4) Tab 5) None of these
8. In a ring topology, the computer in possession of the______ can transmit data
   1) Packet 2) Data
   3) Token 4) Access method
   5) None of these
9. When you save to _______, your data will remain undamaged even when the computer is turned off.
   1) RAM 2) Motherboard
   3) Auxiliary storage
   4) Primary storage device
   5) None of these
10. A device operating at the physical layer is ________
    1) Bridge 2) Repeater
    3) Router 4) All of the above
    5) None of these
11. What type of computer could be found in a digital watch?
    1) Embedded computer
    2) Super computer
    3) Mainframe computer
    4) Notebook computer
    5) None of these
12. HTTP in URL stands for
    1) Hyper Text to Point
    2) Hyperlink for Tiny Protocol
    3) Highlighted Text through Pictures
    4) Hyper Text Transfer Protocol
    5) None of the above
13. Memory allocation at the dynamic time is known as
    1) Static memory allocation
    2) Demanding 3) Paging
    4) Run time memory allocation
    5) None of the above
14. Network components are connected to the identical cable in the _____ topology
    1) Star 2) Bus 3) Ring
    4) Mesh 5) Mixed

## BANK EXAMS

### COMPUTER AWARENESS

15. A mobile phone number, a date of birth and a customer name are all examples of
    1) A record 2) Data
    3) A file 4) A database
    5) None of these
16. In Excel, _______ contains one or more worksheets.
    1) Template 2) Workbook
    3) Active cell 4) Label
    5) None of these
17. Cyberspace is being governed by a system of law and regulation called?
    1) Civil Law 2) Criminal Law
    3) Cyber Law 4) Electronic Law
    5) Cyber Authority
18. Primary memory is used by the:
    1) CPU 2) Input device
    3) User 4) All of these
    5) None of these
19. In Ms- Word, what combination of keys do you press to delete an entire word?
    1) Ctrl + Del 2) Alt + Del
    3) Shift + Backspace
    4) Shift + Alt + Del
    5) None of these
20. Specialized programs that allow particular input or output devices to communicate with the rest of the computer system are called ____.
    1) Operating systems
    2) Device drivers
    3) Utilities
    4) Language translators
    5) Connectors
21. ROM and memory differ with respect to which of the following characteristics?
    1) Price 2) Reliability
    3) Speed 4) All of these
    5) None of these
22. The group of processors combined together to create a program is referred to as
    1) Multi-programming
    2) Multiprocessing
    3) Multitasking
    4) Thrashing 5) None of these
23. Which device is used to access your computer from another computer or for talk over phone?
    1) CD-ROM Drive 2) Modem
    3) RAM 4) Hard Drive
    5) None of these
24. System software does all of the following except
    1) Add graphics and pictures to files.
    2) Coordinate instructions between application software and the computer's hardware devices.
    3) Help manage system resources.
    4) Help run the computer.
    5) None of these
25. What are .bas, .doc and .htm examples of?
    1) Databases 2) Extensions
    3) Domains 4) Protocols
    5) None of these
26. When data changes in multiple lists and all lists are not updated, this causes:
    1) Data redundancy
    2) Information overload
    3) Duplicate data
    4) Data inconsistency
    5) Data repetition
27. Which of the following is not true?
    1) Chatting is like e-mail
    2) Chatting can be done with a single person
    3) Chatting can involve multiple persons
    4) Chatting is an electronic dialogue
    5) None of these
28. _______ is the process of dividing the disk into tracks and sectors.
    1) Tracking 2) Allotting
    3) Crashing 4) Formatting
    5) None of these
29. The computer abbreviation of KiB usually means-
    1) Key Block 2) kibi byte
    3) Kilobyte 4) Kernel Boot
    5) None of these
30. Hardware used to translate words, sounds, images, and actions that people understand into a form that the system unit can process is known as _____
    1) Device drives
    2) Device readers
    3) Input devices
    4) Output devices
    5) None of these
31. The mouse ______ usually appears in the shape of an arrow.
    1) Indicator 2) Marker
    3) Meter 4) Pointer
    5) None of these
32. A tool used to find a synonym or antonym for a particular word
    1) Dictionary 2) Summary
    3) Thesaurus 4) Spell check
    5) None of the above
33. Which of the following protocols is used by Internet mail?
    1) HTTP 2) TCP/IP 3) FTP
    4) HTMP 5) None of these
34. A scripting language similar to HTML and which runs only on a browser is
    1) FORTRAN 2) BASIC
    3) FOXPRO 4) Java script
    5) None of these
35. Generally, you access the Recycle Bin through an icon located-
    1) On the first visible screen
    2) On the hard drive
    3) On the shortcut menu
    4) In the Properties dialog box
    5) None of these
36. The first Computers were programmed using _______
    1) Assembly Language
    2) Machine Language
    3) Source Code 4) Object code
    5) Spaghetti code
37. The programs which are as permanent as hardware and stored in ROM is known as
    1) Hardware 2) Software
    3) Firmware 4) ROM ware
    5) None of these
38. Which computer memory is used for storing programs and data currently being processed by the CPU?
    1) Mass memory
    2) Internal memory
    3) Non-volatile memory
    4) PROM 5) None of these
39. The world's first truly cross-platform programming language is called _________
    1) C++ 2) Java
    3) Visual Basic.NET
    4) Smalltalk 5) None of these
40. _______ software allows the user to speak into the computer rather than type in text.
    1) Speech recognition
    2) Chat 3) Message
    4) All of the above
    5) None of these
41. The _______ folder retains copies of mail that you have in progress but are not yet ready to send.
    1) Drafts 2) Outbox
    3) Address Book 4) Sent Items
    5) None of these
42. Which of the following programming language is used to create programs like applets?
    1) COBOL 2) C Language
    3) Java 4) BASIC
    5) None of these

### Key

1) 1; 2) 2; 3) 4; 4) 1;
5) 4; 6) 4; 7) 4; 8) 3;
9) 3; 10) 2; 11) 1; 12) 4;
13) 4; 14) 2; 15) 1; 16) 2;
17) 3; 18) 1; 19) 5; 20) 2;
21) 4; 22) 2; 23) 2; 24) 1;
25) 2; 26) 4; 27) 1; 28) 4;
29) 2; 30) 3; 31) 4; 32) 3;
33) 1; 34) 4; 35) 1; 36) 2;
37) 3; 38) 2; 39) 2; 40) 1;
41) 1; 42) 3;